అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
శుక్రవారం 28-02-2025
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 11 సంచిక : 58
Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar
14 పేజీలు వెల : 6.50

బాధితులకు అండగా సీపీఐ(ఎం)
న్యాయం కోసమే ఇక్కడకు వచ్చాం
క్యాబినెట్‌లో అల్లర్ల బాధ్యులకు చోటు
ఐదేండ్లయినా అందని పరిహారం :
సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బృందా కరత్
ఈశాన్య ఢిల్లీ అలర్ల బాధితులకు
సంఘీభావంగా సమావేశం
3లో..





15 శాతం సీట్లకు 4 కేటగిరీల వారు అర్హులు
స్థానికులకే 85 శాతం ప్రవేశాలు
ఇంజినీరింగ్, వృత్తి కోర్సుల ప్రవేశాలపై ప్రభుత్వ నిర్ణయం
సవరణ మార్గదర్శకాలు విడుదల
7లో..



ప్చ్‌...!
సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో
భారత్ వెనుకంజ
9 అంశాలలో పనితీరు నిరాశాజనకం
వివరాలు 3లో..



వక్ఫ్ బిల్లు సవరణలకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం
నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో
వక్ఫ్ బిల్లు పరిశీలనకు ఏర్పాటైన జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) సూచించిన సవరణలకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీంతో మార్చి 10న ప్రారంభం కానున్న రెండో విడత బడ్జెట్ ...7లో

ప్రపంచంతోనే పోటీ
తెలంగాణ రైజింగ్‌ను ఎవరూ ఆపలేరు
ఒక ట్రిలియన్ డాలర్ల జీడీపీయే మా సర్కార్ లక్ష్యం : సీఎం రేవంత్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
తెలంగాణ శరవేగంగా అభివృద్ధి చెందుతున్నదని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి తెలిపారు. తమ పోటీ భారతదేశంలోని మెట్రో నగరాలతో కాదనీ, ప్రపంచంతోనే పోటీ అని స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని ఒక ట్రిలియన్ డాలర్ల జీడీపీగా మారుస్తానని సీఎం ధీమా వ్యక్తం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో హెచ్‌సీఎల్ టెక్ కొత్త క్యాంపస్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే తెలంగాణ, హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని చెప్పారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఒక సంవత్సరంలోపునే దేశ, విదేశాల నుంచి అత్యధిక పెట్టుబడులు వచ్చాయనీ, ఉద్యోగాల కల్పనలో నెంబర్‌వన్‌గా నిలిచినట్టు ప్రకటించారు.

తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల జీడీపీ రాష్ట్రంగా మారుస్తానని గతంలో తాను చెప్పినప్పుడు అది సాధ్యం కాదని కొంత మంది సందేహాలు వ్యక్తం చేశారని గుర్తుచేశారు. రెండుసార్లు దావోస్ పర్యటనల్లో రూ.41,000 కోట్లు, రూ.1.78 లక్షల కోట్ల ఎంవోయూలపై సంతకాలు చేసుకున్న తరువాత ఇప్పుడు అది సాధ్యమని వారే నమ్ముతున్నారని తెలిపారు. తెలంగాణ ఎదుగుదలను ఎవరూ ఆపలేరన్నారు. తమ పోటీ ముంబయి, ఢిల్లీ, బెంగుళూరు, చెన్నైతో కాదని తానంటే కొంతమంది అది పెద్ద కలనే అవుతుందన్నారని చెప్పారు. ఈవీ అడాప్షన్‌లో హైదరాబాద్‌ను నంబర్ వన్‌గా చేశామని గుర్తుచేశారు. రాష్ట్రాన్ని డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ, లైఫ్ సైన్సెస్, బయో టెక్నాలజీ, స్కిల్స్, మ్యానుఫ్యాక్చరింగ్, అగ్రి ప్రాసెసింగ్ హబ్‌గా మారుస్తున్నట్టు వెల్లడించారు. ఇవి చేశాక హైదరాబాద్ రైజింగ్ ఆగదు అని ప్రజలు అనుకుంటున్నారని తెలిపారు. తెలంగాణ ఎదుగుతోందని ప్రపంచమే అంగీకరిస్తోందన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద లైఫ్ సైన్సెస్ కంపెనీల్లో ఒకటైన అమెజాన్ ప్రారంభం, ప్రపంచంలోని అత్యుత్తమ సమావేశాల్లో ...13లో



కొత్తగా ఐదు వేల ఉద్యోగాలు
మంత్రి శ్రీధర్ బాబు

హెచ్‌సీఎల్ టెక్ కొత్త క్యాంపస్ రాకతో కొత్తగా ఐదు వేల మందికి ఉద్యోగాలు వస్తాయని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు తెలిపారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం కలిగిన పని చేయగలిగిన వారిని తయారు చేసేలా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. నైపుణ్య మానవ వనరుల కోసం తెలంగాణ వైపు చూసేలా చేయడమే తమ లక్ష్యమన్నారు. స్కిల్ యూనివర్సిటీ నిర్వహణలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ కూడా భాగస్వామ్యం కావాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఒక ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్నది అంత తేలికైన విషయం కాదనీ, అయితే చిత్తశుద్ధితో కృషి చేసి తాము ఆ లక్ష్యాన్ని చేరుకుంటామని తెలిపారు. సాంప్రదాయబద్ధంగా కాకుండా ప్రస్తుత సవాళ్లను ఎదుర్కొనేలా కొత్తగా ఆలోచించాలని ఐటీ పరిశ్రమలకు శ్రీధర్ బాబు సూచించారు. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల(జీసీసీ)ను గ్లోబల్ వాల్యూ సెంటర్లుగా మార్చి, వాటిలో రాష్ట్ర యువత అధిక సంఖ్యలో ఉద్యోగావకాశాలు దక్కించుకునేలా వారిని తీర్చి దిద్దుతాం. ఏఐ, మెషీన్ లెర్నింగ్, ...13లో

ఎమ్మార్ ప్రాపర్టీస్ వివాదాలను పరిష్కరించండి
అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
వివరాలు 13లో..

మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో పోలింగ్ ప్రశాంతం
నల్లగొండ-ఖమ్మం-వరంగల్ టీచర్స్ స్థానానికి 93.55శాతం



కరీంనగర్-ఆదిలాబాద్-నిజామాబాద్-మెదక్ గ్రాడ్యుయేట్ స్థానానికి 70.42శాతం
టీచర్స్ స్థానానికి 91.90శాతం నమోదైన పోలింగ్
ఖమ్మంలో బీజేపీ నేతల గలాటా
మార్చి 3న కౌంటింగ్
ఆరు ఫిర్యాదులు : రాష్ట్ర ఎన్నికల సంఘం
వివరాలు 3లో... 7లో

మూడు ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. ఉమ్మడి నల్లగొండ-ఖమ్మం-వరంగల్ జిల్లాల టీచర్స్ నియోజకవర్గ ఎన్నికలో 93.55శాతం, ఉమ్మడి కరీంనగర్-ఆదిలాబాద్- నిజామాబాద్-మెదక్ జిల్లాల నియోజకవర్గ గ్రాడ్యుయేట్ స్థానానికి 70.42శాతం, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానానికి 91.90శాతం పోలింగ్ నమోదైంది. ఎన్నికల్లో పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీలు, ఇతర ప్రజాప్రతినిధులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మూడు స్థానాల్లో పోటీలో ఉన్న అభ్యర్థులు పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. ఖమ్మంలో బీజేపీ నేతలు గొడవలు సృష్టించేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. అదేవిధంగా, ఆదిలాబాద్, కరీంనగర్ కేంద్రాల్లో చెదురుముదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. బ్యాలెట్ బాక్సులను నల్లగొండ, కరీంనగర్ కేంద్రాలకు తరలించి, భద్రపరిచారు. మార్చి 3వ తేదీన ఓట్ల కౌంటింగ్ నిర్వహించనున్నారు. ఫలితం తేలాలంటే రెండు మూడ్రోజులు పడుతుందని, మొత్తంగా ఆరు ఫిర్యాదులు అందాయని రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపింది.



హిందీ వల్లే ప్రాంతీయ భాషలు కనుమరుగు
ఉనికే లేకుండా పోయిన 25 భాషలు : తమిళనాడు సీఎం స్టాలిన్ వ్యాఖ్యలు
వివరాలు 7లో..

ఆడాళ్లూ..మీకు జోహార్లు
ఒకవైపు ఇంటి పని..మరోవైపు ఉద్యోగం
ఎక్కువ సమయాన్ని వెచ్చిస్తున్న మహిళలు
ఎంప్లాయిమెంట్‌లో 25 శాతానికి పెరిగిన భాగస్వామ్యం
ఇంట్లోవారి కోసం రోజుకు 289 నిమిషాలు
88 నిమిషాలకే పరిమితమైన పురుషులు : జాతీయ గణాంకాల కార్యాలయ సర్వే



న్యూఢిల్లీ : ప్రస్తుతం దేశంలో అన్ని రంగాల్లోనూ మహిళలు తమ ప్రతిభను చాటుతున్నారు. సమాజంలో వారికి ఎన్ని అడ్డంకులున్నా.. అటు ఇంటి పనులను, ఇటు ఉద్యోగ బాధ్యతలను చూసుకుంటున్నారు. ఉద్యోగం, సంబంధిత కార్యకలాపాలలో పురుషులతో పాటు మహిళల భాగస్వామ్యమూ పెరిగింది. ఇందుకు ఎక్కువ సమయాన్నే ...13లో

పదేండ్లు..రూ.11,812.98 కోట్లు
దశాబ్ద కాలంలో దేశం కోల్పోయిన ఆదాయం
రాజకీయ విరాళాలకు పన్ను మినహాయింపులతో ఖజానాకు భారీగా గండి
పార్టీలకు వ్యక్తులు, హెచ్‌యూఎఫ్ డొనేషన్లే అధికం
మినహాయింపులు కోరని కార్పొరేట్లు
పారదర్శకత లోపించిందంటున్న పరిశోధకులు



న్యూఢిల్లీ : రాజకీయ పార్టీలకు విరాళాలు అందజేసిన వారు పన్ను మినహాయింపులు కోరుతుండడంతో గత దశాబ్ద కాలంలో దేశ ఖజానా రూ.11,812.98 కోట్ల ఆదాయాన్ని కోల్పోయింది. 2015-24 మధ్య కాలంలో రాజకీయ విరాళాల విషయంలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. గతంలో రాజకీయ పార్టీలకు కార్పొరేట్ సంస్థలు భారీగా విరాళాలు సమకూర్చేవి. కానీ గత దశాబ్ద కాలంలో ఆ సంస్థల కంటే వ్యక్తులు, అవిభక్త హిందూ కుటుంబాలు (హెచ్‌యూఎఫ్‌లు) అందజేసిన విరాళాలే అధికంగా ఉన్నాయని కామన్వెల్త్ హ్యూమన్ రైట్స్ ఇనిషియేటివ్ సంస్థకు చెందిన సీనియర్ పరిశోధకుడు వెంకటేశ్ నాయక్ జరిపిన అధ్యయనంలో తేలింది. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ పత్రాలు, అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) నుంచి తీసుకున్న ఎన్నికల కమిషన్ ఫైలింగ్స్-ఆడిట్లను అధ్యయనం చేసి ఆయన ...13లో



అసమర్థ సీఎం రేవంత్‌రెడ్డి
తప్పులు కప్పిపుచ్చుకునేందుకే బీఆర్ఎస్‌పై నిందలు : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
వివరాలు 7లో..

అదే ఉత్కంఠ
కార్మికుల్ని కాపాడటానికి ఎడతెగని ప్రయత్నాలు
- వారి భద్రతపై ఆందోళన
- ఆరురోజులుగా కొలిక్కిరాని సహాయక చర్యలు
- టీబీఎంను తొలగిస్తేనే వాస్తవ పరిస్థితి తెలిసే అవకాశం



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్
శ్రీశైలం ఎడమగట్టు కాలువ(ఎస్ఎల్‌బీసీ) టన్నెల్ ప్రమాద ఘటన ఇంకా ఉత్కంఠను రేకెత్తిస్తూనే ఉంది. అది జరిగి ఆరు రోజులవుతున్నా పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదు. టన్నెల్ పైకప్పు కూలిన నేపథ్యంలో ఎనిమిది మంది కార్మికుల ప్రాణాలు గాల్లో దీపమయ్యాయి. లోపలికి కనీసం ఆహారం, తాగునీటిని పంపే అవకాశం లేకుండా పోయింది. వారంతా బతికి ఉన్నారో ? లేదో ? కూడా తెలియని పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం సహాయక చర్యలను నిర్విరామంగా కొనసాగిస్తున్నది. 11 సర్కారీ ఏజెన్సీలతో దాదాపు 400 మంది అధికారులు, ఉద్యోగులు, ఇంజినీర్లు, ఇతర సిబ్బంది సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. ప్రధానంగా ఆర్మీ, నేవీ, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, హైడ్రా, జీఎస్ఐ, ఎన్‌జీఆర్ఐ, సాగునీటిపారుదల శాఖతోపాటు ప్రయివేటు ఇంజినీరింగ్ కంపెనీలు టన్నెల్ ప్రమాద ఘటనను సుఖాంతం చేసేందుకు ప్రయత్నిస్తున్నా కొలిక్కి రావడం లేదు. మట్టిదిబ్బలు, నీటిఊట, బురదను తొలగిస్తే తప్ప ముందుకుపోయే పరిస్థితులు కనిపించడం లేదు. టీబీఎం లోపల సహాయక చర్యలు చేపట్టడం శక్తికిమించిన పని అవుతున్నది. ఆపరేషన్ మార్కోస్ అమల్లోకి వచ్చి ఒకరోజు గడిచింది. ప్రాజెక్టులు, పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగినప్పుడు అత్యంత నైపుణ్యంగా వ్యవహరించి బాధితులను బయటకు తీసుకొచ్చే మెరైన్ కమెండోలు, బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్(బీఆర్‌వో) సైనికులు మంగళవారం ఆపరేషన్ మార్కోస్‌ను చేపట్టారు. సొరంగం లోపల 14 కిలోమీటర్ సమీపం వరకు వారు వెళ్లారు. సొరంగం మధ్యలో టీబీఎంను కట్ చేసి అంతమేర మళ్లీ వెనక్కి బయటకు తేవాలి. ఇలా చేసుకుంటూ పోతే సహాయక చర్యల ఫలితం రావడానికి మరిన్ని రోజులు పడుతుందని టన్నెల్ లోపలికి వెళ్లిన డిజాస్టర్ మేనేజ్‌మెంటు శాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు. చిమ్మచీకటి కారణంగా లోపలికి పోవడమే గగనమవుతున్న తరుణంలో బాధితులను బయటకు తేవడం ఆషామాషి కాదని అంటున్నారు. టీబీఎం ఆవల పరిస్థితి ఎలా ఉందో ఇప్పుడే చెప్పడం కష్టమని కూడా అభిప్రాయ పడుతున్నారు. 144 గంటల తర్వాత మట్టి ఎంత తీసినా ఇంకా పడుతుండటం, నీళ్లు ఎత్తిపోసిన కొద్దీ ఇంకా ఊరుతుండటం, బురద ఎప్పటికప్పుడు పెరుగుతున్న నేపథ్యంలో పరిస్థితి ఆశాజనకంగా లేదనే వ్యాఖ్యానాలు సహాయక చర్యల పర్యవేక్షకుల నుంచి వస్తున్నాయి. ముగ్గురు ...7లో



రెండ్రోజుల్లో ఆపరేషన్ పూర్తి
పదేండ్ల కాలంలో ఏ అనుమతులు తీసుకొని పనులు చేశారు ?
పవర్ హౌజ్ సందర్శనకు వెళితే రేవంత్ రెడ్డిని అరెస్టు చేయలేదా..
మేము ప్రజాస్వామ్యబద్ధంగా ముందుకెళ్తున్నాం :
మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి
6లో..
ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంపై ఆశలు వదులుకుంటున్న అధికారులు
బోరింగ్ మిషన్ కటింగ్ ప్రారంభం

ఎస్ఎల్‌బీసీ వద్ద ఉద్రిక్తత..
హరీశ్‌రావును అడ్డుకున్న పోలీసులు
నిరసనగా రోడ్డుపై బైటాయింపు
అనంతరం టన్నెల్ పరిశీలనకు అధికారుల అనుమతి
7లో..
వారమైనా తట్టెడు మట్టి తీయలే ..
ప్రమాద స్థలాన్ని పర్యాటక కేంద్రంగా మార్చుకున్న మంత్రులు :
మాజీ మంత్రులు హరీశ్‌రావు, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శ





స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలి
బడ్జెట్‌లో విద్యారంగానికి ప్రాధాన్యత ఇవ్వాలి
ఎస్ఎఫ్ఐ హెచ్‌సీయూ కమిటీ డిమాండ్
యూనివర్సిటీ ఎదుట నిరసన
విద్యార్థి సంఘం నాయకులను అరెస్టు చేసిన పోలీసులు
13లో..

తాగునీటికే తొలి ప్రాధాన్యం
తెలుగు రాష్ట్రాలకు కేఆర్ఎంబీ ఆదేశం
పంటలకు జాగ్రత్తగా వాడుకోవాలని సూచన



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్
తాగునీటికే తొలి ప్రాధాన్యమివ్వాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) తెలుగు రాష్ట్రాలను ఆదేశించింది. రాష్ట్రాల్లో ఉన్న పంటలను దృష్టిలో పెట్టుకుని శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో ఉన్న నీటిని జాగ్రత్తగా వాడుకోవాలని సూచించింది. గురువారం హైదరాబాద్‌లోని జలసౌధలో చైర్మెన్ అతుల్‌జైన్ అధ్యక్షతన ప్రత్యేకంగా కేఆర్ఎంబీ సమావేశమైంది. దీనికి రెండు రాష్ట్రాల అధికారులు హాజరయ్యారు. తెలంగాణ నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్సీ జీ అనిల్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ఈఎన్సీ వెంకటేశ్వరరావు, ఇరు రాష్ట్రాల ఇంజినీర్లు సమావేశానికి వచ్చారు. రెండు జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీటిని వినియోగించుకునే విషయమై సమావేశంలో చర్చించారు. మే నెలాఖరు వరకు తమకు 63 టీఎంసీలు కావాలనీ తెలంగాణ, 55 టీఎంసీలు కావాలని ఆంధ్రప్రదేశ్ తాజాగా బుధవారం నాటి చీఫ్ ఇంజినీర్ల సమావేశం అనంతరం నివేదికలు సమర్పించాయి. ప్రస్తుతం రెండు రిజర్వాయర్లల్లో కనీస వినియోగమట్టానికి ఎగువన 60 టీఎంసీలకుపైగా నీరు ఉంది. ఉన్న కొద్దిపాటి నీటిని జాగ్రత్తగా వాడుకోవాలని బోర్డు రెండు ...13లో

అదనపు చెల్లింపులు జరిగాయి

కాళేశ్వరం విచారణలో మాజీ ఈఎన్సీ మురళీధర్

తాజా, మాజీ అధికారులను క్రాస్ చేసిన జస్టిస్ పీసీ ఘోష్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించి నిర్మాణ సంస్థలకు అదనపు పనులకు 60శాతం చెల్లింపులను అడ్వాన్స్‌గా చెల్లించేందుకు అప్పటి సీఎం (కేసీఆర్) ఆమోదించారనీ, అందుకు అనుగుణంగా హైపవర్ కమిటీ మీటింగ్ మినిట్స్‌లోనూ పేర్కొన్నారని రిటైర్డ్ ఈఎన్సీ జనరల్ సి మురళీధర్ చెప్పారు. బ్యారేజీల నిర్మాణానికి సంబంధించి కొనుగోళ్లకు ఆ నిధులను వాడుకునేందుకు అవకాశం కల్పించారని తెలిపారు. అదనపు పనులకు అయిన అదనపు ఖర్చులను రీయింబర్స్ చేసుకోవడానికీ అవకాశం ఇచ్చారన్నారు. అటవీ భూముల్లో చెట్ల తొలగింపునకు యంత్రాలను సమకూర్చుకునేందుకు, ఇతర అవసరాలకు ఆ నిధులను వాడుకునేలా అనుమతి ఇచ్చారని గుర్తుచేశారు. అంతేగాకుండా బ్యారేజీల వద్ద ముంపు సమస్యను పరిష్కరించడానికి ఫ్లడ్ బ్యాంకులపై అధ్యయనం చేయాలని సీఎం ఆదేశించారని పేర్కొన్నారు. గురువారం ఆయన కాళేశ్వరం జ్యుడీషియల్ కమిషన్ ఎదుట విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా హైపవర్ కమిటీ మీటింగ్‌కు సంబంధించిన మినిట్స్‌లోని 13, 15 క్లాజులను మురళీధర్ చదివి వినిపించారు. మురళీధర్‌తో పాటు రిటైర్డ్ ఈఎన్సీలు నల్లా వెంకటేశ్వర్లు, నరేందర్‌రెడ్డి, ఈఎన్సీ హరిరామ్‌లనూ గురువారం ఓపెన్ కోర్టులో జ్యుడీషియల్ కమిషన్ చైర్మెన్ జస్టిస్ పీసీ ఘోష్ విచారించారు.

బ్యారేజీలకు ఎంత ఖర్చైంది..?

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు ఎంత ఖర్చయిందని కమిషన్.. మురళీధర్‌ను ప్రశ్నించగా.. రూ.8 వేల కోట్ల నుంచి రూ.9 వేల కోట్ల వరకు ఖర్చు అయిందని చెప్పారు. అయితే, వ్యాప్కోస్ డీపీఆర్‌ను చూపించిన జస్టిస్ పీసీ ఘోష్.. రూ.13,559 కోట్ల అంచనాలతో డీపీఆర్ ఇచ్చారని పేర్కొన్నారు. 2017 డిసెంబర్ 9న సీఎం అధ్యక్షతన జరిగిన మీటింగ్‌లో ఏజెన్సీలతో ఒప్పందం నిబంధనలను మార్చారా అని ప్రశ్నించగా.. అవునని మురళీధర్ సమాధానమిచ్చారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణానికి స్థలాన్ని మార్చడానికి ముందు వ్యాప్కోస్‌తో చర్చించారా అని మురళీధర్‌ను కమిషన్ ప్రశ్నించగా.. అవునని అంగీకరిస్తూ, అందుకు సంబంధించిన డాక్యుమెంట్లు మాత్రం లేవన్నారు. అయితే, దీనిపై వ్యాప్కోస్‌కు ఎలాంటి కమ్యూనికేషన్ ఇవ్వలేదని మురళీధర్‌కు కమిషన్ చురకలు అంటించింది. అదనపు పనులు అంటే ఏంటి అని కమిషన్ ప్రశ్నించగా.. ప్రాజెక్టును పూర్తి చేసేందుకు అవసరమయ్యే ఎక్స్‌ట్రా పనులని ఆయన బదులిచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై పూర్తిస్థాయి విచారణను వ్యాప్కోస్‌కు అప్పగించాలని ఎవరు ఆదేశించారని కమిషన్ ప్రశ్నించింది. నామినేషన్ పద్ధతిలో వ్యాప్కోస్‌కు అప్పగించేందుకు సీఎం నుంచి ఆమోదం తీసుకోవాల్సిందిగా ముఖ్యకార్యదర్శికి తానే లేఖ రాశానని గుర్తుచేశారు.

డిజైన్లు లేట్ అవుతుంటే మీరేం చేశారు..?

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల డిజైన్లు, డ్రాయింగ్‌లు ఆలస్యమవుతున్నా మీరు ఏం చేస్తున్నారని రిటైర్డ్ ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లును కమిషన్ ప్రశ్నించింది. సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీవో) సీఈ డిజైన్లను ఆలస్యం చేస్తుండడం వల్లే సమస్యలు ఉత్పన్నమయ్యాయని అఫిడవిట్‌లో పేర్కొన్నారు కదా.. మరి, డిజైన్లను త్వరగా ఇవ్వాలని సీడీవో సీఈకి లేఖ ఏమైనా రాశారా అని ప్రశ్నించింది. రాశానని వెంకటేశ్వర్లు చెప్పడంతో.. అసలు ఏ లెటర్ కూడా మీరు రాయలేదంటూ కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ తర్వాత రిటైర్డ్ ఈఎన్సీ కూడా తాను ఏ లేఖా రాయలేదని అంగీకరించారు. డిజైన్లు లేట్ అవుతుండడం పట్ల నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి హైపవర్ కమిటీ, ఈఎన్సీలకు లెటర్ ఏమైనా రాశారా అని ప్రశ్నించగా.. లేదని బదులిచ్చారు. బ్యారేజీల నిర్మాణ స్థలాల్లో 2డీ, 3డీ మోడల్ స్టడీస్ కండక్ట్ చేయాలని 2016 అక్టోబర్ 18న టీఎస్ఈఆర్ఎల్‌కు లేఖ రాశారు కదా.. మరి, ఆ తర్వాత ఈఆర్ఎల్‌కు ఈ విషయంపై మరోసారి ఏమైనా లేఖ రాశారా అని ప్రశ్నించగా.. లేదన్నారు. అసలు బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయాలని ఎవరు ఆదేశించారని కమిషన్ ప్రశ్నించింది. నాటి సీఎం, ఇరిగేషన్ శాఖ మంత్రులే ఆదేశించారని వివరణ ఇచ్చారు. అప్పట్లో ముఖ్యమంత్రే ఇరిగేషన్ శాఖ మంత్రిగా కూడా ఉన్నారని తెలిపారు.

పనులు లేట్ అయితే పెనాల్టీలు వేయరా..

బ్యారేజీల పనులను ఆలస్యం చేసిన నిర్మాణ సంస్థలకు ఎప్పుడైనా పెనాల్టీని వేశారా అని వెంకటేశ్వర్లును కమిషన్ ప్రశ్నించగా.. అలాంటిదేమీ లేదని ఆయన బదులిచ్చారు. పనులు ఆలస్యం చేస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం, పెనాల్టీ వేయకపోవడం ఏజెన్సీలకు లబ్ధి చేకూర్చడమవ్వదా అని కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. బ్యారేజీల నిర్మాణానికి స్థలాలను ఇచ్చే ముందు ఏదైనా అగ్రిమెంట్ గానీ చేసుకున్నారా అని ప్రశ్నించగా.. దానికి ప్రత్యేకంగా ఎలాంటి అగ్రిమెంట్ అవసరం లేదని ఆయన సమాధానమిచ్చారు. ప్రాజెక్టు సీఈగా.. ఆ ప్రాజెక్టు పర్యవేక్షణ, ఓ అండ్ ఎం మీ బాధ్యత కాదా అని కమిషన్ ప్రశ్నించింది. అయితే, ఆ బాధ్యత తనది కాదనీ, పనులు అప్పగించాక నిర్మాణ సంస్థలే చూసుకోవాలని ఆయన చెప్పారు. వ్యాప్కోస్ డీపీఆర్‌కు రూ.649 కోట్లు ఖర్చయినట్టు చెబుతున్నారు కదా.. నిజమేనా అని కమిషన్ ప్రశ్నించగా.. రూ.19 కోట్లే ఖర్చయిందని వెంకటేశ్వర్లు సమాధానమిచ్చారు. అసలు వ్యాప్కోస్ ఇచ్చిన డీపీఆర్‌ను ఏనాడూ పరిగణనలోకి తీసుకోలేదని కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది.

మీకింకా టైమ్ ఇవ్వను..

కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి ఏర్పాటైన ఎక్స్‌పర్ట్ కమిటీకి ఏవైనా లేఖలు రాశారా అని ఈఎన్సీ హరిరాంను కమిషన్ ప్రశ్నించింది. అసలు ఎక్స్‌పర్ట్ కమిటీని ఏర్పాటు చేశారన్న విషయం మీకు తెలియదా? అని నిలదీసింది. బ్యారేజీల నిర్మాణానికి సంబంధించి 2015 జనవరి 31న సీడబ్ల్యూసీకి ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు అథారిటీ నుంచి, 2015 మార్చి 4న సీడబ్ల్యూసీ నుంచి ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు అథారిటీకి లేఖలు రాశారా అని ప్రశ్నించింది. ఆ ప్రశ్నలకు తనకు గుర్తు లేదనీ, మూడు రోజులు సమయమిస్తే జీవో 28ను పరిశీలించి సమాధానం చెబుతానని హరిరామ్ చెప్పారు. అయితే, ఇకపై ఎలాంటి సమయమూ ఇచ్చేది లేదనీ, మీరు ఎలాంటి కమ్యూనికేషన్ చేయలేదని కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంతో కాళేశ్వరం కార్పొరేషన్‌కు ఏ విధంగానూ సంబంధం లేదా అని కమిషన్ ప్రశ్నించగా.. ఎలాంటి సంబంధం లేదని హరిరామ్ బదులిచ్చారు. రెవెన్యూ జనరేషన్ కోసం కాళేశ్వరం కార్పొరేషన్‌తో ఇండస్ట్రీలు ఒప్పందాలు చేసుకున్నాయా అని ప్రశ్నించగా.. దానికి సంబంధించిన రికార్డులేవీ లేవన్నారు. కాగా, వ్యాప్కోస్ డీపీఆర్ లో కేవలం సాధారణ డ్రాయింగ్‌లు మాత్రమే ఇచ్చిందనీ, డిటెయిల్డ్ డిజైన్స్ అండ్ డ్రాయింగ్స్ ఇవ్వలేదని రిటైర్డ్ ఈఎన్సీ నరేందర్ రెడ్డి తెలిపారు. వ్యాప్కోస్ ఇచ్చిన డిజైన్లపై కాళేశ్వరం ప్రాజెక్టు సీఈ 2015 జులై 17న మీకు లేఖ రాశారా.. దానికి మీరు జవాబు ఇచ్చారా అని కమిషన్ ప్రశ్నించగా.. తొలుత గుర్తులేదనీ, ఆ తర్వాత తాను సమాధానం ఇచ్చానని అంటూ రెండు రకాలుగా సమాధానం చెప్పడం గమనార్హం.

అక్రమ డబ్బులు దుబాయ్‌కి తరలించిందెవరు?

- కేంద్ర, రాష్ట్ర దర్యాప్తు సంస్థలతో దర్యాప్తు చేయించాలి : మహబూబ్ నగర్ : ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అక్రమ డబ్బులు దుబాయ్‌కి తరలించిందెవరనేది తేల్చేందుకు కేంద్ర, రాష్ట్ర దర్యాప్తు సంస్థలతో దర్యాప్తు చేయించాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. దుబాయ్‌లో మరణించిన కేదార్ డ్రగ్స్ కేసులో దొరికారనీ, అతనితో పాటు డ్రగ్స్ కేసులో ఉన్న వ్యక్తులెవరో తెలియాలని అన్నారు. గత ప్రభుత్వంలో బినామీలుగా ఉన్న వారు ఇప్పుడు ఎక్కడ ఉన్నారో బహిర్గతం కావాలని ఆకాంక్షించారు. రూ.వేల కోట్లు తరలిపోతుంటే రాష్ట్రంలో విచారణ సంస్థలు ఏం చేస్తున్నాయి? అని ప్రశ్నించారు. సినీ ప్రముఖులు సంపాదించిన దానిలో కొంత తెలంగాణ విద్యానిధికి కేటాయించాలని కోరారు.

కేంద్రం నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి

దమ్ముంటే చర్చకు రండి : ఎంపీ ఈటల రాజేందర్

బీఆర్ఎస్ పాలన అవినీతిపై సీబీఐ విచారణ ఎందుకు కోరట్లేదు : ఏలేటి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గ్రామాల్లో సీసీరోడ్లు, లైట్లు, శ్మశానవాటికల లాంటి అభివృద్ధి పనులన్నీ కేంద్ర ప్రభుత్వ నిధులతోనే జరుగుతున్నాయనీ, దీనిపై దమ్ముంటే చర్చకు రావాలని కాంగ్రెస్ నేతలకు ఎంపీ ఈటల రాజేందర్ సవాల్ విసిరారు. గురువారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో గవర్నమెంట్ పనుల టెండర్లు తీసుకోవడమంటే ఉరేసుకోవడమే అన్నట్టుగా పరిస్థితి ఉందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మూసేసిన రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ కోసం 25 ఏండ్లు కొట్లాడామనీ, బీజేపీ ప్రభుత్వ హయాంలో తెరుచుకున్నదని తెలిపారు. చేతిలో పని ఉన్నా చేసే దమ్ము లేని స్థితిలో రేవంత్‌రెడ్డి ఉన్నారనీ, అలాంటి వ్యక్తి కిషన్‌రెడ్డి మీద విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వమిచ్చే మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వకుండా పనులు ఎలా ముందుకెళ్తాయని ప్రశ్నించారు. చర్లపల్లి రైల్వే టెర్మినల్ దగ్గర బస్‌స్టాప్ కట్టలేని దుస్థితిలో రాష్ట్ర సర్కారు ఉందని విమర్శించారు.

కాచిగూడ, సికింద్రాబాద్, నాంపల్లి రైల్వే స్టేషన్‌లలో జరుగుతున్న అభివృద్ధి పనులు చూసి రావాలని సీఎం రేవంత్‌రెడ్డికి సూచించారు. ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్, కాంగ్రెస్ చీకటి ఒప్పందం చేసుకున్నప్పటికీ మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థులు గెలువబోతున్నారని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతిపై సీబీఐ విచారణ ఎందుకు కోరడం లేదని ప్రశ్నించారు. ఎస్ఎల్‌బీసీ సొరంగంలో 8 మంది ప్రాణాలతో కొట్టుమిట్టాడుతుంటే కప్పం కట్టడానికి రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనకు వెళ్లారని ఆరోపించారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. మున్సిపాలిటీలకు రాష్ట్ర ప్రభుత్వం ఒక్క పైసా ఇవ్వడం లేదన్నారు. ప్రతి మున్సిపాల్టీ పాలన కూడా అమృత్ పథకం కింద వస్తున్న నిధులతోనే నడుస్తున్నదని చెప్పారు.

ఛ్ఛ...! సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో భారత్ వెనుకంజ

9 అంశాలలో పనితీరు నిరాశాజనకం

దేశంలో ఉత్తరాఖండ్ టాప్...బీహార్ లాస్ట్



న్యూఢిల్లీ : ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (ఎస్‌డీఎస్‌లు) సాధనలో భారత్ పనితీరు ఏమంత ఆశాజనకంగా లేదు. లక్ష్యాల సాధనలో పురోగతి నెమ్మదిస్తోంది. మొత్తం 167 దేశాల పనితీరును విశ్లేషించగా భారత్ 109వ స్థానంలో నిలిచింది. ఇది భారత్‌కే కాకుండా ప్రపంచ దేశాలకు కూడా ఆందోళన కలిగించే విషయమని బుధవారం విడుదలైన నివేదిక తెలిపింది. గత సంవత్సరంతో పోలిస్తే మన దేశం తన ర్యాంకును మూడు స్థానాలు మెరుగుపరచుకోవడం కొంత ఊరట కలిగించే అంశం. సుస్థిర అభివృద్ధి నివేదిక, 2024కు సంబంధించిన నీతి ఆయోగ్ నివేదిక ఆధారంగా సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సీఎస్ఈ) ఈ నివేదికను ప్రచురించింది.

ప్రణాళికా సంఘం మాజీ డిప్యూటీ ఛైర్మన్ మాంటెక్ సింగ్ అహ్లువాలియా, నీతి ఆయోగ్ మజీ సీఈఓ షెర్పా అమితాబ్ కాంత్, సీఎస్ఈ డైరెక్టర్ జనరల్ సునీతా నారాయణ్ సంయుక్తంగా నివేదికను ప్రచురించారు. 'ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశంగా, 140 కోట్ల మంది ప్రజలు నివసిస్తున్న దేశంగా చూస్తే ఎస్‌డీసీలో భారత్ పనితీరు అంత బాగా లేదు. ఇది ఈ ప్రపంచానికి కూడా మంచి పరిణామం కాదు. అయితే 2019-2022 మధ్య భారత్ పనితీరు అంతర్జాతీయ ధోరణుల కంటే వెనుకబడి ఉంది. 2023లో మెరుగుదల కన్పించినప్పటికీ 2024 ర్యాంకింగ్ ఆందోళనకంగానే ఉంది' అని ఆ నివేదిక ఎత్తిచూపింది. 2030 నాటికి 16 సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు ఐరాస సభ్య దేశాలన్నీ అంగీకరించాయి. ప్రజల జీవన నాణ్యతను మెరుగుపరచేందుకు ఈ లక్ష్యాలను ఉద్దేశించారు.

అయితే అభివృద్ధి లక్ష్యాల సాధనలో భారత్ వెనుకబడి పోయింది. సమ్మిళిత ప్రపంచ స్కోరు 67 శాతం ఉండగా మన దేశం 63.9 శాతం స్కోరు మాత్రమే సాధించింది. మొత్తం 16 సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను ఐరాస నిర్దేశించగా వాటిలో తొమ్మిదింటిలో భారత్ స్కోరు ప్రపంచ సగటు కంటే తక్కువగా ఉంది. జీరో ఆకలి, మంచి ఆరోగ్యం- బాగోగులు, లింగ సమానత్వం, స్వచ్ఛమైన నీరు- పారిశుధ్యం, పరిశ్రమ- ఆవిష్కరణ- మౌలిక సదుపాయాలు, అసమానతల తగ్గింపు, సుస్థిర నగరాలు-సమూహాలు, భూమిపై జీవనం, శాంతి- న్యాయం- బలమైన సంస్థలు...ఈ అంశాలలో మన దేశం పనితీరు నిరాశ కలిగిస్తోంది. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల ఛార్టులో దేశంలో ఉత్తరాఖండ్ (79.2 శాతం స్కోరు) మొదటి స్థానంలో నిలిచింది. తమిళనాడు (77.4), కేరళ (77), పశ్చిమ బెంగాల్ (72.1) తర్వాతి స్థానాలలో ఉన్నాయి. బెంగాల్ 13వ ర్యాంక్, గుజరాత్ 16వ ర్యాంక్, మహారాష్ట్ర 17వ ర్యాంక్, ఉత్తరప్రదేశ్ 21వ ర్యాంక్ సాధించగా 56.9 శాతం స్కోరుతో బీహార్ చివరి స్థానంలో నిలిచింది.

బాధితులకు అండగా సీపీఐ(ఎం)

బాధితులకు పూర్తిగా అందని పరిహారం : సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బృందా కరత్



న్యూఢిల్లీ : ఈశాన్య ఢిల్లీలో మతహింస చెలరేగి చేదు జ్ఞాపకాలను మిగిల్చి ఐదేండ్లు పూర్తయిన సందర్భంగా బాధితుల పక్షాన సీపీఐ(ఎం) మద్దతుగా నిలిచింది. బాధితులకు సంఘీభావం ప్రకటించటం.. న్యాయం కోసం గట్టిగా డిమాండ్ చేసే ఉద్దేశంతో ముస్తఫాబాద్‌లో సీపీఐ(ఎం) ఢిల్లీ బహిరంగ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకరత్ పాల్గొని మాట్లాడారు. "ఐదేండ్ల క్రితంనాటి గాయాలను రీఓపెన్ చేయాలని మేము అనుకోవటం లేదు. బాధితులకు సంఘీభావంగా నిలిచి, న్యాయం జరగాలని గట్టిగా డిమాండ్ చేయటానికి ఇక్కడకు వచ్చాం. ఈ హింసకు కారణమైనవారు ఈ రోజు క్యాబినెట్‌లో కూర్చున్నారు. బాధితులు మాత్రం ఇంకా న్యాయం కోసం ఎదురు చూస్తున్నారు. నాడు సీపీఐ(ఎం) మీతో నిలబడింది. నేడూ నిలబడుతుంది" అని ఆమె అన్నారు.

"ఇది ఒక హింస కాదు, ఏకపక్ష దాడి. 76 శాతం మరణాలు మైనారిటీ వర్గం నుంచే ఉన్నాయి. ఆస్తి నష్టంలోనూ 60 శాతం వారిదే. 751 ఎఫ్ఐఆర్‌ల ప్రకారం.. దాడులకు కారణమైనవారి అరెస్టులు ఎక్కువగా జరగలేదు. బాధితులనే అరెస్ట్ చేశారు. పరిహారం పూర్తిగా అందించలేదు. పరిహారానికి ఉద్దేశించిన ప్రమాణాలలో లోపాలున్నాయి" అని బృందా కరత్ ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రధాని మోడీ డిగ్రీ వివాదం

డీయూ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్



న్యూఢిల్లీ : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బ్యాచిలర్ డిగ్రీకి సంబంధించిన సమాచారాన్ని బహిర్గతం చేయాలనే కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ) ఆదేశాలను సవాల్ చేస్తూ ఢిల్లీ విశ్వవిద్యాలయం (డీయూ) దాఖలు చేసిన పిటీషన్‌పై తీర్పును ఢిల్లీ హైకోర్టు గురువారం రిజర్వ్ చేసింది. 'వాదనలు విన్నాం. తీర్పును రిజర్వ్ చేశాం' అని జడ్జి సచిన్ దత్తా ఇరు పార్టీలకు తెలిపారు.

సమాచార హక్కు చట్టంకింద నీరజ్ అనే వ్యక్తి దాఖలు చేసిన దరఖాస్తు ప్రకారం ఢిల్లీ యూనివర్సిటీలో 1978లో బీఏ పరీక్ష ఉత్తీర్ణులైన అందరి రికార్డులు తనిఖీ చేయడానికి సీఐసీ 2016 డిసెంబర్ 21న అనుమతి ఇచ్చింది. ఇదే ఏడాదిలో మోడీ డిగ్రీ ఉత్తీర్ణులయ్యారు. అయితే ఈ అనుమతిని వ్యతిరేకిస్తూ ఢిల్లీ హైకోర్టును యూనివర్సిటీ ఆశ్రయించింది. దీంతో ఈ ఉత్తర్వులపై హైకోర్టు 2017 జనవరి 23న స్టే విధించింది. ఎలాంటి ప్రజాప్రయోజనం లేకుండా కేవలం ఆసక్తితో ఆర్టీఐ చట్టం కింద ప్రయివేటు సమాచారాన్ని కోరే హక్కులేదని డీయూ వాదిస్తుంది. 1978 బీఏ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులందరీ రికార్డులను కోరుతూ ప్రధానమంత్రి, ఆర్టీఐను 'జోక్'గా మార్చివేసారని యూనివర్సిటీ పేర్కొంది. డీయూ తరపున గురువారం విచారణకు హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ 'కోర్టుకు రికార్డులను చూపించడంలో విశ్వ విద్యాలయానికి ఎటువంటి అభ్యంతరం లేదు' అని తెలిపారు. సీఐసీ ఉత్తర్వులను కొట్టివేయాల్సిన అవసరం ఉందని చెప్పారు.

26/11 ఉగ్రదాడి విచారణ రికార్డులివ్వండి

ముంబయి కోర్టును కోరిన ఢిల్లీ కోర్టు

న్యూఢిల్లీ : 26/11 ఉగ్రదాడి కేసుకు సంబంధించిన విచారణ రికార్డులు ఇవ్వాలని ముంబయిలోని స్థానిక కోర్టును ఢిల్లీ కోర్టు కోరింది. ఢిల్లీలోని పాటియాల హౌస్ కోర్టు జిల్లా జడ్జి విమల్ కుమార్ యాదవ్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కేసును విచారిస్తున్న ఎన్ఐఏ విజ్ఞప్తి మేరకు జడ్జి ఈ ఆదేశాలు జారీ చేశారు. ఈ ఉగ్రదాడి ప్రధాన సూత్రధారి తహవ్వూర్ హుస్సైన్ రానాను భారత్‌కు అప్పగించడానికి ఈ నెల ప్రారంభంలో అమెరికా అంగీకరించిన నేపథ్యంలో ఈ పరిణామం జరగడం విశేషం. కాగా, ఈ కేసు విచారణ రెండు నగరాల్లో ఏకకాలంలో నిర్వహిస్తున్నందున గతంలో ఈ రికార్డులను ముంబయి కోర్టుకు పంపించారు.

నిధులు విడుదల చేయక ఎస్‌ఎల్‌బీసీ పనుల్లో జాప్యం

• కేసీఆర్ ప్రభుత్వంలో పదేండ్లు నిర్లక్ష్యం : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి



నవతెలంగాణ-మిర్యాలగూడ

పాలకవర్గాలు నిధులు విడుదల చేయకపోవడం వల్లే ఎస్‌ఎల్‌బీసీ నిర్మాణంలో తీవ్ర కాలయాపన జరిగిందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో గురువారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా ఉద్యమాల ఫలితంగా ఉమ్మడి ఏపీలో అప్పటి సీఎం రాజశేఖరరెడ్డి కాలంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలకు సాగు, తాగునీరు అందించేందుకు 2004-05లో సర్వే జరిపి రూ.2వేల కోట్ల అంచనాతో ఎస్‌ఎల్‌బీసీ పథకాన్ని రూపొందించి 2006లో ప్రారంభించారని గుర్తు చేశారు. ఐదారేండ్ల లోపు ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ నిధులు విడుదల చేయకపోవడంతో నిర్మాణ పనులు ముందుకు సాగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 43 కిలోమీటర్ల సొరంగ మార్గంలో మరొక ఎనిమిది కిలోమీటర్ల మేర పూర్తి చేయాల్సి ఉండగా.. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లుగా ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి పనులు ప్రారంభించినప్పటికీ అధికారుల ముందు చూపు లేకపోవడంతో ప్రమాదం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. పదేండ్లుగా పనులు చేయకపోవడంతో సొరంగ మార్గంలో నీటి ఊట పరిణామాన్ని అంచనా వేయకపోవడం, మట్టిపొరల సామర్థ్యాన్ని పరీక్షించకపోవడంతో ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. జిల్లాలో 550 గ్రామాలకు తాగునీరు, 4 లక్షలా 30 వేల ఎకరాలకు సాగునీరు అందించే ఎస్‌ఎల్‌బీసీని ప్రభుత్వం చిత్తశుద్ధితో పూర్తి చేయాలని కోరారు.

గత పాలకుల నిర్లక్ష్యం వల్ల నల్లగొండ జిల్లాలోని సుమారు 550 గ్రామాలకు సురక్షిత తాగు, సాగు నీరు అందకపోగా లిఫ్ట్‌లకు విద్యుత్ బిల్లుల భారంతోపాటు ఎనిమిది మంది కార్మికుల ప్రాణాలను పణంగా పెట్టాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణంలో చిత్తశుద్ధి వహించకపోగా.. అప్పటి సీఎం వ్యంగ్యంగా మాట్లాడారని గుర్తు చేశారు. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ప్రాజెక్టు పనులకు నిధులు విడుదల చేయడం సంతోషదాయకం అయినప్పటికీ ప్రమాద సంఘటన దురదృష్టకరమన్నారు.

సొరంగ నిర్మాణ పనులకు వేసవికాలం అనుకూలంగా ఉంటుందని, ప్రభుత్వ పర్యవేక్షణలో ప్రాజెక్టు పెండింగ్ పనులు పూర్తి చేసి నల్లగొండ జిల్లా ప్రజలకు సాగు, తాగు నీరు అందుబాటులోకి తేవాలని కోరారు. సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, వన్‌టౌన్ కార్యదర్శి డా.మల్లు గౌతమ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

చిట్టీల పేరుతో రూ.120 కోట్లు మోసం !

• బాధితులకు న్యాయవాది ఫోన్ !

ఉడాయించిన తండ్రీకొడుకు

వడ్డీ వ్యాపారాలతో నష్టం



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

వారిద్దరు తండ్రీకొడుకులు. హైదరాబాద్ ఎస్సార్‌నగర్‌లోని రవీందర్ నగర్ కాలనీలో ఉంటూ మేస్త్రీ పని చేశారు. ఆ తర్వాత చుట్టుపక్కల పరిచయాలతో చిట్టీలు వేస్తూ, అధిక వడ్డీలు ఇస్తామని చెప్పి అనేకమంది వద్ద డబ్బులు వసూలు చేశారు. అనంతరం సుమారు రూ.120 కోట్లు కుచ్చుటోపీ పెట్టి ఉడాయించారు. రెండ్రోజులుగా బాధితులు లబోదిబోమంటూ నిందితుల ఇంటి చుట్టూ తిరుగుతున్నారు. ఇందుకు సంబంధించి పలువురు బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..

పుల్లయ్య, అతని కుమారుడు రామాంజనేయులు 20 సంవత్సరాలుగా ఎస్సార్ నగర్‌లోని రవీందర్‌నగర్ కాలనీలో ఉంటున్నారు. రూ.3 కోట్ల విలువైన జీ ప్లస్ ఫోర్‌లో నివాసమున్నారు. వారు మొదట మేస్త్రీ పనిచేసి, ఆ తర్వాత బిల్డర్‌గా పనిచేస్తూ చిట్టీలు వేస్తూ కాలనీలో అందరితో పరిచయం చేసుకొని నమ్మకం కలిగించారు. సుమారు 1500 మంది అతని వద్ద చిట్టీలు వేస్తున్నారు. లక్ష రూపాయల నుంచి రూ.50 లక్షల వరకు చిట్టీలు వేస్తూ సభ్యులను చేర్చుకొని, అదే విధంగా వడ్డీ వ్యాపారం కూడా చేయసాగారు. అయితే, కొందరికీ చిట్టీలు అయిపోయినా వారికి తండ్రి కొడుకులు తిరిగి డబ్బులు ఇవ్వకుండా తిరిగి కొత్త చిట్టిలో సభ్యత్వం చేర్చుకొని ప్రతినెలా చిట్టి డబ్బులు తీసుకునేవారు. ఇదిలా ఉండగా ఈ నెల 23న తండ్రీకొడుకులు హైదరాబాద్ విడిచి పారిపోయారు. దాంతో రెండ్రోజులుగా వారి ఇంటి ముందు బాధితులు ఆందోళనకు దిగారు. చిట్టీలు వేసిన వారిలో జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తూ.. ఇండ్లల్లో పని చేస్తున్నవారు సుమారు 1000 మంది వరకు ఉన్నారని తెలిసింది. వారు ఇంత మోసం చేస్తారని తాము ఎప్పుడూ ఊహించలేదని, పిల్లల చదువులకు, పెండ్లీలకు ఇతర అవసరాలకు ఉపయోగపడతాయని పూర్తిగా నమ్మి వారి వద్దే డబ్బులు ఉంచామని అనేకమంది మహిళలు ఏడుస్తూ మీడియా ముందు వారి బాధను వెలిబుచ్చారు. బాధితులు ఏం చేయాలో తెలియక నిందితుని ఇంటి ముందు ఏడుస్తూ కూర్చుంటున్నారు. నిందితుల ఇంటిపై, కారుపై లోన్ ఉన్నట్టు బాధితులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా, గురువారం నిందితుల స్వగ్రామమైన కర్నూలు జిల్లా, అనంతపురం, మంత్రాలయం నుంచి సుమారు 28 మంది అతని ఇంటి వద్దకు వచ్చి ఆందోళన చేపట్టారు. వారు కూడా రూ.10 లక్షలు, రూ.20 లక్షలు, రూ. 30 లక్షల చిట్టీలు వేశామని, పేమెంట్ ఆన్‌లైన్ ద్వారా ప్రతినెలా పంపిస్తున్నామని తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఎస్ఆర్ నగర్ పోలీస్ స్టేషన్‌కు బాధితులు వెళ్లగా, కోటి రూపాయల్లోపు వరకే తమ పరిధిలో కేసులు తీసుకుంటామని, రూ.120 కోట్లు కనుక సీసీఎస్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలని చెబుతున్నారని బాధితులు వాపోయారు. అయితే, నిందితుల తరఫు లాయర్ కొంతమంది బాధితులకు ఫోన్లు చేసి, పుల్లయ్య రామాంజనేయులు వడ్డీ వ్యాపారాలు చేసి నష్టపోయారని, దివాలా పిటిషన్ కోర్టులో వేశారని, అతని వద్ద చిట్టీలు పాడుకున్నవారు తిరిగి కట్టలేదని, అందుకే పారిపోయారని తెలిపినట్టు పలువురు చెబున్నారు. ఎలాగైనా నిందితులను అరెస్టు చేసి తమకు న్యాయం చేయాలని బాధితులు వేడుకుంటున్నారు. అయితే సీసీఎస్‌లో ఇంత వరకు బాధితులు ఫిర్యాదు చేయలేదని సమాచారం.

మార్చిలో బంగ్లాదేశ్‌లో పర్యటించనున్న ఐరాస చీఫ్



ఐరాస : ఐక్యరాజ్యసమితి అధ్యక్షుడు ఆంటోనియో గుటెరస్ మార్చి 13-16తేదీల మధ్య బంగ్లాదేశ్‌లో పర్యటించనున్నారు. గుటెరస్ సలహాదారు కార్యాలయం బుధవారం విడుదల చేసిన ఒక లేఖలో ప్రకటించింది. నిర్వాసితులైన రోహింగ్యాలకు బంగ్లాదేశ్‌లో ఆతిథ్యమివ్వడానికి అంతర్జాతీయ సమాజాన్ని సంఘటితపరచడాన్ని యూఎన్ కొనసాగిస్తుందని హామీ ఇచ్చారు. బంగ్లాదేశ్‌తో యూఎన్ సంఘీభావాన్ని, యూనస్ ప్రభుత్వానికి మద్దతును పునరుద్ఘాటించారు.

బలగాలను ఉపసంహరించం : ఇజ్రాయిల్

టెల్ అవీవ్ : ఫిలడెల్ఫియా కారిడార్ నుంచి తమ బలగాలను ఉపసంహరించుకునేది లేదని ఇజ్రాయిల్ అధికారి ఒకరు గురువారం తెలిపారు. హమాస్ అక్రమ ఆయుధాల రవాణాను నిరోధించడానికి ఈప్రాంతంలో సైన్యాన్ని కొనసాగించాల్సి వుందని ఆ అధికారి పేర్కొన్నారు. ఈజిప్ట్ సరిహద్దుగా కలిగిన గాజాలోని వ్యూహాత్మక భూభాగాన్ని ఫిలదెల్ఫియా కారిడార్‌గా వ్యవహరిస్తారు. హమాస్‌తో జరిగిన మొదటి దశ కాల్పుల విరమణ ఒప్పందం ప్రకారం..ఇజ్రాయిల్ బలగాలు తప్పనిసరిగా ఈభూభాగాన్ని ఖాళీ చేయాల్సి వుంది. శనివారం నుంచి బలగాల ఉపసంహరణను ప్రారంభించి ఎనిమిది రోజుల్లో పూర్తి చేయాల్సి వుంది. తమ ఆధీనంలో ఉన్న మిగిలిన బందీలను విడిచిపెట్టేందుకు కాల్పుల విరమణ ఒప్పందానికి కట్టుబడి ఉండటం, చర్చలు జరపడం ఒక్కటే మార్గమని హమాస్ పేర్కొంది. ఫిలదెల్ఫియా కారిడార్ నుంచి బలగాలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఈజిప్ట్ కూడా హెచ్చరించింది.

ఎమ్మెల్సీ ఎన్నిక ప్రశాంతం

• నల్లగొండ టీచర్ స్థానానికి 93.55 శాతం పోలింగ్

• అర్ధరాత్రి నల్లగొండకు చేరుకున్న బ్యాలెట్ బాక్సులు



నవతెలంగాణ-నల్లగొండ, వరంగల్, ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధులు

ఉమ్మడి వరంగల్- ఖమ్మం- నల్లగొండ జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ 93.55 శాతంగా నమోదైందని కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి తెలిపారు. మూడు ఉమ్మడి జిల్లాల్లోని 12 జిల్లాల్లో, మండలాల్లో 200 కేంద్రాల్లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకు ఎన్నిక జరిగింది. మొత్తం ఓటర్లు 25797 మంది ఉండగా, 24133 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 19 మంది అభ్యర్థులు ఈ ఎన్నికల బరిలో ఉన్నారు. వీరిలో స్వతంత్ర అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి, మరో ఒకరిద్దరు స్వతంత్ర అభ్యర్థుల మధ్యనే కీలక పోరు ఉంటుందనే చర్చ సాగుతోంది. ఈ ఎన్నికల కోసం మొత్తం రెండు వేల మందికిపైగా పోలీస్ సిబ్బందిని వినియోగించారు. ప్రాధాన్యత క్రమంలో ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. బ్యాలెట్ పెట్టెల్లో నిక్షిప్తమైన ఓటర్ తీర్పు మార్చి 3వ తేదీన బహిర్గతమవుతుంది. నల్లగొండ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మీడియా ప్రతినిధుల తో మాట్లాడుతూ.. కలెక్టర్ కార్యాలయంలో వెబ్‌కాస్టింగ్ ద్వారా అన్ని జిల్లాల పోలింగ్ కేంద్రాల పోలింగ్ సరళిని సాంకేతికంగా పర్యవేక్షించినట్టు చెప్పారు. తనతో పాటు అదనపు కలెక్టర్, ఏఆర్ఓ, మిర్యాలగూడ సబ్ కలెక్టర్, అన్ని జిల్లాల కలెక్టర్లు, ఏఆర్ఓలు, ఇతర సిబ్బంది పూర్తిగా సహకారం అందించి సమన్వయంతో పని చేశారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సంబంధించి నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలో ఆర్జాలబావి వద్ద ఉన్న గోదాములో అన్ని ఏర్పాట్లూ చేసినట్టు తెలిపారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద ఎస్కార్ట్ బందోబస్తు ఉంటుందని, మార్చి 3న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ జరగనుందని చెప్పారు.

పోలింగ్ జరిగింది ఇలా..

వరంగల్ -ఖమ్మం- నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్‌లో భాగంగా నియోజకవర్గ వ్యాప్తంగా ఉదయం 10 గంటలకు 16.78శాతం ఓట్లు నమోదు కాగా, మధ్యాహ్నం 12 గంటలకు 48.68 శాతం, 2 గంటలకు 76.33 శాతం, పోలింగ్ ముగిసే 4 గంటల సమయానికి 93.55 శాతం ఓట్లు నమోదయ్యాయి. మొత్తం 200పోలింగ్ కేంద్రాలలో 25797 ఓటర్లకు గాను 24133 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. మొత్తం 93.55 శాతం పోలింగ్ నమోదైంది. యాదాద్రి భువనగిరి జిల్లాలో అత్యధికంగా 96.54శాతం పోలింగ్ నమోదైంది. అత్యల్పంగా హనుమకొండ జిల్లాలో 91.66 శాతం నమోదైంది.

జిల్లాల వారీగా నమోదైన పోలింగ్

జిల్లా	మొత్తం ఓటర్లు	ఓటేసినవారు	శాతం
సిద్దిపేట	166	156	93.98
జనగాం	1002	945	94.31
హనుమకొండ	5215	4780	91.66
వరంగల్	2352	2214	94.13
మహబూబాబాద్	1663	1571	94.47
భూపాలపల్లి	329	308	93.62
ములుగు	628	583	92.83
భద్రాద్రి	2022	1859	91.94
ఖమ్మం	4089	3804	93.03
యాదాద్రి భువనగిరి	984	950	96.54
సూర్యాపేట	2664	2530	94.97
నల్లగొండ	4683	4033	94.66

నల్లగొండకు చేరుకున్న బ్యాలెట్ బాక్సులు

వరంగల్- ఖమ్మం- నల్లగొండ ఉమ్మడి జిల్లాల నుంచి బ్యాలెట్ బాక్సులను అర్ధరాత్రి వరకు నల్లగొండలో ఉన్న స్ట్రాంగ్ రూమ్‌కు కట్టుదిట్టమైన భద్రత మధ్య ఆర్టీసీ బస్సుల్లో తరలించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో భద్రపరిచారు. స్ట్రాంగ్ రూముల వద్ద భారీ భద్రత ఏర్పాటు చేసినట్టు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాల పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు.

పోలింగ్ సంతృప్తికరం : టీఎస్ యూటీఎఫ్ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 93.4 శాతం పోలింగ్ నమోదయింది. కాగా, టీఎస్ యూటీఎఫ్ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి.. ఉమ్మడి వరంగల్ జిల్లాలో అత్యధిక ఓటర్లు ఉండటంతో ఇక్కడ ఫోకస్ పెట్టినట్టు తెలుస్తోంది. హన్మకొండ, వరంగల్ నగరాల్లోని అన్ని పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ ఎన్నికల్లో టీఎస్ యూటీఎఫ్ గెలుపు ఖాయమని నర్సిరెడ్డి అన్నారు. వరంగల్ రంగసాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఇస్లామియా జూనియర్ కాలేజ్ పోలింగ్ బూత్ వద్ద ఓటింగ్ సరళిని పరిశీలించారు. అదే విధంగా, హన్మకొండలోని కాకతీయ డిగ్రీ కళాశాలలో నాలుగు పోలింగ్ కేంద్రాలను, ప్రభుత్వ న్యాయ కళాశాలలో పోలింగ్‌ను పరిశీలించారు. పోలింగ్ సరళిపై ప్రిసైడింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు పోలింగ్ కేంద్రాల్లో ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ సంతృప్తికరంగా ఉందని తెలిపారు. ఉపాధ్యాయుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటాలు చేశానని, ఆ నమ్మకంతోనే ఉపాధ్యాయులందరూ తనకే ఓటు వేసి గెలిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఖమ్మంలో బీజేపీ గలాటా

ఖమ్మం-వరంగల్-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గం ఎన్నికలు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రశాంతంగా ముగిశాయి. ఖమ్మంలో బీజేపీ శ్రేణులు చేసిన రాద్ధాంతం మినహా ఎక్కడా ఓ చిన్న ఘటన కూడా చోటుచేసుకోలేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 92శాతంపైగా పోలింగ్ నమోదైంది. ఖమ్మం రిక్కాబజార్ హైస్కూల్‌లో జిల్లా కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్‌తో పాటు పోలీసు కమిషనర్ సునీల్‌దత్ సందర్శించారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ప్రధాని మోడీ ఫెక్సీ ఏర్పాటు, పోలీసులతో వాగ్వాదం తదితర ఘటనలు జరిగాయి. బీజేపీ నేత గల్లా సత్యనారాయణ తన అనుచరులతో ఏర్పాటు చేసిన శిబిరం నుంచి చేసిన కొన్ని చర్యలు వివాదానికి దారితీశాయి. బీజేపీ చర్యలను టీచర్లు ఖండించారు. ఈ ఘటనలపై సీపీ సునీల్‌దత్ ఆదేశాల మేరకు ఖమ్మం టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసినట్టు తెలిసింది. స్వతంత్ర అభ్యర్థి పూల రవీందర్ పలు పోలింగ్ స్టేషన్‌లను సందర్శించారు. మరో స్వతంత్ర అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి తరపున సీపీఐ(ఎం), సీఐటీయూ శ్రేణులు ఓటర్ల సహాయక చర్యల్లో భాగమయ్యారు. బీజేపీ అభ్యర్థి సరోత్తమ్‌రెడ్డికి ఖమ్మంలో ఏమాత్రం ఆదరణ లేకున్నా ఏదో ఒక రకంగా ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసి లబ్ది పొందాలనే విఫలయత్నాలకు ఆ పార్టీ శ్రేణులు యత్నించాయనే ఆరోపణలు వచ్చాయి.

సంపాదకీయం

మాట మార్చుతున్న ట్రంప్!



జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే డోనాల్డ్ ట్రంప్ మాటలు మారుతున్నాయి, అలాంటి వారు మడమతిప్పటమే తరువాయి. సహజంగానే వ్యాపారి అయిన ఆ పెద్దమనిషి తనదైన శైలిలో అందరితో బేరసారాలాడుతున్నాడు, బిస్కెట్లు వేస్తున్నాడు. ఏది లాభసాటిగా ఉంటే దాన్నే అనుసరిస్తాడు. అధికారాన్ని చేపట్టిన నెల రోజుల తరువాత బుధవారం నాడు తొలిసారిగా ట్రంప్ మంత్రివర్గ తొలి సమావేశాన్ని ఏర్పాటుచేశాడు. ఖనిజాల మీద ఒప్పందం కుదుర్చుకున్నప్పటికీ ఉక్రెయిన్ భద్రత గురించి సాధారణం కంటే ఎక్కువగా ఎలాంటి హామీలు ఇవ్వటం లేదని ట్రంప్ చెప్పాడు. అంతేకాదు, శాంతి ఒప్పందం కుదరాలంటే పుతిన్ కొన్ని రాయితీలకు అంగీకరించాల్సి ఉంటుందని కూడా చెప్పాడు. ఒకవైపు

> ఒకవైపు చైనా మీద ఇక యుద్ధమే శరణ్యం అన్నట్లుగా సుంకాలు విధించేందుకు పూనుకున్నట్లు చెబుతున్న ట్రంప్ బుధవారం నాడు చైనాలో అంతర్భాగం - తిరుగుబాటు రాష్ట్రంగా ఉన్న తైవాన్ రక్షణ గురించి వ్యాఖ్యానించేందుకు నిరాకరించాడు. చైనా నేతతో తనకు మంచి సంబంధం ఉందని, చైనా పెట్టుబడులను కోరుతున్నట్లు చెప్పాడు. నిజానికి ఇది చైనాకు బిస్కెట్ వేయటం తప్ప మరొకటి కాదు.


స్తంభింపచేసిన నిధులపై ఆంక్షలను ఎత్తివేస్తూ ఆయుధాలు కొనుగోలు చేసేందుకు తైవాన్‌కు అవకాశం కల్పించిన ట్రంప్ దాని రక్షణ గురించి అడగ్గా వ్యాఖ్యానించేందుకు నిరాకరించటమే కాదు, చైనా పెట్టుబడులను అమెరికాకు ఆహ్వానిస్తున్నట్లు చెప్పాడు. ఇది అమెరికా వైఖరికి భిన్నంగా ఉంది.

అందించిన మిలిటరీ, ఆర్థిక సాయాన్ని తీర్చే స్థితిలో ఉక్రెయిన్ లేనందున అక్కడ ఉన్న 500 బిలియన్ డాలర్ల విలువగల విలువైన ఖనిజాలు, సహజ సంపదలున్న ప్రాంతాలను తమకు అప్పగించాలని అమెరికా డిమాండ్ చేసినట్లు వార్తలు వచ్చాయి. తీరా ఇప్పుడు వాటిని వెలికి తీసేందుకు రెండు దేశాలు కలసి ఒక సంస్థను ఏర్పాటుచేసి తద్వారా వచ్చే రాబడిలో సగాన్ని దాని ద్వారా ఉక్రెయిన్ రక్షణ, పునర్నిర్మాణానికి ఖర్చు చేయాలని అంగీకరించినట్లు చెబుతున్నారు. అమెరికా ఇచ్చిన సాయానికి అది ఖనిజాలను స్వాధీనం చేసుకుంటే తామిచ్చినదాని సంగతేమిటనే ప్రశ్న నాటోలోని ఐరోపా ధనిక దేశాల నుంచి రావటం అనివార్యం. అందువలన ఉమ్మడి సంస్థ పేరుతో అమెరికా పెత్తనంలోకి వెళ్లేట్లుగా చూస్తున్నట్లు కనిపిస్తోంది. ఇప్పటికే ఒకటి స్పష్టమైంది. గత మూడు సంవత్సరాలుగా ఉక్రెయిన్ ప్రతి ఘటనలో రష్యాకు తగిలిన ఎదురుదెబ్బలు, ఓటమి అంటూ పశ్చిమదేశాలు, వాటి కనుసన్నలలో నడిచే మీడియా వండివార్చిన కట్టుకథలు, కృత్రిమ వీడియోలు వాస్తవం కాదని, ఉక్రెయిన్ ఓడిపోవటం తప్ప మరొకటి జరగదని తేలిపోయింది. నైవేద్యంగా పెట్టిన వాటిని దేవుడు తినడని పూజారికి తెలిసినంతగా భక్తులకు తెలియదు. అలాగే ప్రతిదాన్ని డాలర్ల లాభాలతో కొలిచే ట్రంప్‌కు ఉక్రెయిన్ మీద పెట్టే ప్రతి డాలరునూ రాబట్టుకోవటం కష్టమని, అందువల్లనే ఖనిజాల ఒప్పందం అని కూడా చెబుతున్నారు. విజయం సాధించినట్లు పుతిన్ చెప్పుకోవచ్చు గానీ అది ఉక్రెయిన్‌లో గెలిచో మరొక దానితోనో కాదని ట్రంప్ యంత్రాంగ చర్యలతో అనే కొత్త పల్లవిని పశ్చిమ దేశాల విశ్లేషకులు ఎత్తుకున్నారు. శుక్రవారం నాడు జెలెన్‌స్కీ వాషింగ్టన్ వెళతాడని, ఒప్పందం మీద సంతకాలు చేస్తాడని వచ్చిన వార్తలు కార్యరూపం దాలిస్తే ఒప్పంద అంశాలు వెల్లడైన తరువాత మాత్రమే ఒక స్పష్టత వస్తుంది.

ఒకవైపు చైనా మీద ఇక యుద్ధమే శరణ్యం అన్నట్లుగా సుంకాలు విధించేందుకు పూనుకున్నట్లు చెబుతున్న ట్రంప్ బుధవారం నాడు చైనాలో అంతర్భాగం - తిరుగుబాటు రాష్ట్రంగా ఉన్న తైవాన్ రక్షణ గురించి వ్యాఖ్యానించేందుకు నిరాకరించాడు. చైనా నేతతో తనకు మంచి సంబంధం ఉందని, చైనా పెట్టుబడులను కోరుతున్నట్లు చెప్పాడు. నిజానికి ఇది చైనాకు బిస్కెట్ వేయటం తప్ప మరొకటి కాదు. తైవాన్‌కు 87 కోట్ల డాలర్ల మిలిటరీ సాయంతో సహా 530 కోట్ల డాలర్లను ఇచ్చేందుకు గతంలో నిర్ణయించిన అమెరికా ఆ నిర్ణయాన్ని స్తంభింపచేసింది. తాజాగా నిధుల విడుదలకు నిర్ణయించింది. అలాంటపుడు బలవంతంగా తైవాన్ స్వాధీనానికి చైనాను అనుమతిస్తారా అన్న ప్రశ్నకు మాట్లాడేందుకు నిరాకరించినంత మాత్రాన వైఖరిని మార్చుకున్నట్లు కాదు. ఉక్రెయిన్ మీద ట్రంప్ మాటలను చూస్తుంటే తైవాన్‌ను కూడా వదిలించుకుంటారా అన్నది జనాభిప్రాయంగా ఉందని, ఇలా అయితే అమెరికా వాగ్దానాలను ఎవరూ నమ్మరని న్యూయార్క్ టైమ్స్ పత్రిక వాపోయింది. ఖనిజాల ఒప్పందంతో ట్రంప్‌ను సంతుష్టీకరించేందుకు ఉక్రెయిన్ ఎలా చూస్తున్నదో తైవాన్ కూడా అమెరికా నుంచి ఏడు నుంచి పది బిలియన్ డాలర్ల విలువగల ఆయుధాలను కొనుగోలు చేస్తామని లీకులు వదిలింది. కొద్ది రోజులుగా ట్రంప్ చెబుతున్న మాటలు, చేస్తున్న ప్రకటనలకు తేడా ఉంది. అందుకే అవి ఏ విధంగా మారతాయి, ఎలాంటి పర్యవసానాలకు దారితీస్తాయన్నది ఊహించటం కష్టం.

---

28 ఫిబ్రవరి : నేషనల్ సైన్స్ డే



డాక్టర్ దేవరాజు మహారాజు

భారత రత్న, సర్ సి.వి. రామన్ భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి సాధించిన వాడిగా అందరికీ తెలుసు. కానీ, ఒక మహోన్నతమైన వ్యక్తిగా జాతీయవాదిగా, దేశభక్తుడిగా చాలా కొద్ది మందికే తెలుసు. స్వలాభం కోసం దేశాన్ని అమ్మడానికైనా సిద్ధపడే కుట్రదారులు, పైరవీకారులు, కార్పొరేట్లు రాజకీయ నాయకులు, ఆధ్యాత్మిక గురువులు ఆయన జీవితంలోంచి ఎన్నో విషయాలు తెలుసుకుని ఆచరించాల్సి ఉంది. ముఖ్యంగా యువతీ యువకులు ఆయన జీవితంలోంచి ఎంతో స్ఫూర్తి పొందాల్సి ఉంది.


ప్రాయోగిక విజ్ఞానం కేవలం తమకే సాధ్యమని యూరోప్ దేశాలు విర్రవీగుతున్న దశలో బ్రిటీష్ ఇండియాలోని ఒక భారతీయుడు, ఏ అవకాశాలు లేని ఒక మారుమూల గ్రామంలో పుట్టినవాడు, నెలకు పది రూపాయల జీతంతో జీవితం వెళ్ళబోస్తున్న ఒక కాలేజి ట్యూటర్ సుపుత్రుడు విదేశాలలో పెద్ద పెద్ద చదువులు చదవకుండానే, పెద్ద పెద్ద ప్రయోగశాలలు చూడకుండానే తనకు తానుగా ఒక కాకలుతీరిన శాస్త్రజ్ఞుడిగా తయారై, నోబెల్ బహుమతి సాధించి, దేశంలో అనేక పరిశోధనా సంస్థలు స్థాపించి, సర్వస్వం దేశానికి అర్పించగలగడం కేవలం చంద్రశేఖర్ వెంకట రామన్ వంటి అద్భుత వ్యక్తులకు మాత్రమే సాధ్యపడుతుంది. తమిళనాడులో తిరుచునాపల్లి సమీపంలో 1888 నవంబర్ 7న పుట్టిన సి.వి.రామన్‌ను ప్రపంచం గొప్ప శాస్త్రవేత్తగా గౌరవించింది. అయితే ఆయనలో చిన్నప్పటి నుంచి ఒక కవి, ఒక సంగీతకారుడు, ఒక భాషావేత్త ఉన్న విషయం ఎవరూ అంతగా పట్టించుకోలేదు. ఆయనలో వీరందరూ ఉన్నారు కాబట్టే, వ్యక్తిగా ఆయనలో ఒక పరిపూర్ణత సిద్ధించింది. వివేచన, విశాల దృక్పథంతోనే ఆయన విశ్వమానవుడయ్యాడు. సంగీత ధ్వనులకు విపరీతంగా ప్రభావితుడయ్యేవాడు. అయితే, వాటి లయలో కొట్టుకుపోకుండా, వాటిని శాస్త్రీయంగా విశ్లేషించాలని అనుకునేవాడు. ఆ రకంగా ఆయన దృష్టి ధ్వని తరంగాల పైకి వెళ్ళింది.

ఆ రోజుల్లో వారి కుటుంబం విశాఖపట్నానికి చేరింది. రామన్ చదువుకునే పాఠశాల సముద్రతీరాన ఉండేది. తరగతి గదిలోంచి చూస్తే, లేచి పడే సముద్ర కెరటాలు కనిపిస్తూ ఉండేవి. బాల్యంలో రామన్ సముద్రాన్ని తదేకంగా చూస్తూ ఉండేవాడు. అలా సి.వి.రామన్ బాల్య దశలో విశాఖ సముద్రం ఎంతగానో ప్రభావితం చేసింది. ఆ తర్వాత చాలా కాలానికి తన ముప్ఫైయవ యేట ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో యూనివర్సిటీ కాంగ్రెస్‌లో పాల్గొనేందుకు ఇంగ్లండ్ వెళుతున్నప్పుడు మధ్య ధరా సముద్రపు నీటి రంగు మళ్ళీ అతనిని మేల్కొలిపింది. నౌకాయానం చాలా మందికి విసుగ్గా ఉంటే, రామన్‌కు మాత్రం ఉత్సాహంగా, ఉత్కంఠ భరితంగా సాగింది. ఎందుకంటే ఆయన నౌకనే ప్రయోగశాల చేసుకున్నాడు. డెక్ మీద నిలబడి ఆకాశాన్ని, చుక్కల్ని, నీలి సముద్రాన్ని తదేకంగా పరిశీలిస్తూ, వెంట తెచ్చుకున్న చిన్న చిన్న పరికరాలతో సముద్రపు నీటి నమూనాలు (SAMPLES) పైకి లాగి, ప్రయోగాలు జరిపి చూశాడు. అప్పటి ఒక ప్రఖ్యాత శాస్త్రవేత్త లార్డ్ రేలై - నీలాకాశపు ప్రతిబింబం సముద్రంపై పడడం వల్ల సముద్రం నీలంగా ఉంది - అని అన్నాడు. కానీ, అది సత్యదూరమని రామన్ నిరూపించగలిగాడు. సముద్రం స్వతహాగా నీలంగా ఉందని, రామన్ ఆ ప్రయాణంలో - నిర్ధారించుకున్నాడు.

అది 1921, తను భారతదేశం తిరిగి వెళ్ళాక, ఆ విషయంపైనే విస్తృతంగా పరిశోధనలు జరపాలని నిర్ణయించుకున్నాడు కూడా! అంతేకాదు, ఆ పని చేసి చూపించాడు. కేవలం ఆరేళ్ళ కాలంలో అంటే 1927లో 'రామన్ ఎఫెక్ట్'ను ప్రపంచానికి ప్రకటించాడు. రెండు, మూడేళ్ళు ప్రపంచ వ్యాప్తంగా రామన్ ఎఫెక్ట్ మీద చర్చలు జరిగాయి. విశ్లేషణలూ, పరిశీలనలు జరిగాయి. విచిత్రం ఏమిటంటే 1930లో నోబెల్ బహుమతులు ప్రకటించడానికి కొన్ని నెలల ముందే సి.వి.రామన్ స్టాక్‌హోమ్ వెళ్ళిరావడానికి టికెట్స్ బుక్ చేసుకున్నాడు. అదొక పిచ్చిపనిగా అనిపిస్తుంది గానీ, ఆయన ఆత్మవిశ్వాసం అలాంటిది! తెల్లవాళ్ళ ప్రాబల్యం ఎక్కువగా ఉన్నచోట ఒక నల్లవాడికి అందునా దక్షిణ భారతీయుడికి నోబెల్ రావడం అయ్యేపని కాదని అందరూ అనుకుంటున్న సమయంలో, ఆయన తన అచంచల ఆత్మ విశ్వాసాన్ని నమ్ముకుని ఉండడం సామాన్య విషయమా? కేవలం రికార్డుల కోసం కొందరు వెర్రి మొర్రి పనులెన్నో చేస్తుంటారు. కానీ, ప్రపంచ యువతీ యువకులెవరైనా సరే, సర్ సి.వి.రామన్ రికార్డులను అధిగమించగలరేమో పోల్చుకుని చూసుకోవచ్చు.

సి.వి. రామన్ తన పదకొండవ యేట మెట్రిక్యులేషన్ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడై మద్రాస్ ప్రెసిడెన్సీ కాలేజీలో చేరాడు. అప్పుడక్కడ పనిచేసే యూరోపియన్ ప్రొఫెసర్లంతా ఈ కుర్రవాడు పొరపాటున తమ క్లాసుకు వచ్చాడేమోనని భ్రమపడే వారు. ఆ తర్వాత ఆయన తన పద్దెనిమిదోయేట లండన్ నుండి వెలువడే 'ద ఫిలసా ఫికల్ మేగజైన్' (1906)లో పరిశోధన పత్రాలు ప్రచురించాడు. అప్పటికి ఆయన పి.జి(యం.ఎ) విద్యార్థి. తనకు ఇష్టమైన భౌతిక శాస్త్రంలో పరిశోధనలు చేస్తూ, వెలుగు కిరణాల్ని కొలుస్తూ ఉండేవాడు. ప్రొఫెసర్ ఆర్.ఎస్. జోన్స్ రామన్ ప్రశ్నలకు సమాధానాలివ్వలేక - నేచర్, ఫిలసాఫికల్ మేగజైన్ వంటి పత్రికలకు రామన్‌తో వ్యాసాలు రాయించి పంపిస్తూ ఉండేవాడు. ఒక రకంగా తొలి దశలో రామన్‌కు ఆయన గైడ్'గా ఉపయోగపడ్డాడు.

రామన్‌ది మామూలు కుటుంబం. ఉద్యోగం చేయడం తప్పని సరైన పరిస్థితి. బ్రిటీష్ గవర్నమెంట్ వారి ఫెనాన్స్ సర్వీసులో చేరాడు. పెద్ద జీతం, బంగళా వంటివి అమిరాయి. అప్పుడే లోకసుందరితో వివాహమైంది. 1907లో రామన్ ఉద్యోగం కలకత్తాకు మారింది. అక్కడికి చేరుకున్న మొదటి వారంలోనే ఆయన ట్రామ్‌లో ప్రయాణిస్తూ బౌ బజార్ స్ట్రీట్‌లో ఒక బోర్డు చూశాడు. INDIAN ASSOCIATION FOR THE CULTIVATION OF SCIENCE - ఆ సాయంత్రమే అక్కడికి వెళ్ళి వివరాలు తెలుసుకున్నాడు - డాక్టర్ మహేంద్రలాల్ సర్కార్ 1876లో ఆ అసోసియేషన్ స్థాపించి, భారతీయ శాస్త్రవేత్తలు జాతీయాభిమానంతో దేశం లోనే పరిశోధనలు సాగించాలన్న మహదాశయాన్ని ప్రచారం చేస్తున్నాడు. ఆ విషయం తెలుసుకుని సి.వి. రామన్ వెంటనే అందులో చేరిపోయాడు. అంతేకాదు, నోబెల్ బహుమతికి అర్హత సంపాదించగలిగే స్థాయి పరిశోధనలు కొన్నేండ్లలోనే అక్కడ చేయగలిగాడు. ఒక వైపు ఆర్థిక శాఖలో ఉద్యోగం చేస్తూ, మరోవైపు భౌతికశాస్త్రంలో పరిశోధనలు చేయడం ఎంత కష్టం? మనిషికి ఉండాల్సిన క్రమశిక్షణ, పట్టుదల, దీక్ష, అన్నీ రామన్‌కు ఉన్నాయి గనకనే - ఇతరులకు అసాధ్యమనిపించినవి సాధ్యమేనని ఆయన రుజువు చేసి చూపాడు.



ఒక దశలో టైగర్ ఆఫ్ బెంగాల్ అశుతోష్ ముఖర్జీ కలకత్తా విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడు, బ్రిటీష్ ప్రభుత్వంతో మధ్యవర్తిత్వం నెరపి, పరిశోధనల నిమిత్తం సి.వి.రామన్‌కు రెండేండ్ల సెలవు ఇవ్వాల్సిందిగా కోరాడు. ఈ భారతీయుడి పరిశోధనలపై బ్రిటీష్ ప్రభుత్వానికి నమ్మకం కలగలేదు. ఆ అభ్యర్థనను తోసి పుచ్చి, వీలు కాదని చెప్పింది. చివరకు అశుతోష్ ముఖర్జీ నిబంధనల్ని కొద్దిగా సడలించి సి.వి.రామన్‌ను ఎలిల్ చైర్ ఆఫ్ ఫిజిక్స్‌కు ఎన్నుకున్నాడు. అది 1917వ సంవత్సరం. చూస్తూ చూస్తూ పెద్ద ఉద్యోగం, హోదా, డాబు, వసతులు అన్నీ వదులుకుని, ఒక చిన్న ఉద్యోగానికి రావడం అందరూ చేయగల పని కాదు. ఆయనలోని వైజ్ఞానిక జిజ్ఞాస, నిబద్ధత, ధ్యేయం అన్నీ కలిసి ఆయనను ఆ పనికి ఉసిగొల్పాయి. ఒక వైపు విశ్వవిద్యాలయంలో బోధన, మరోవైపు పరిశోధనల మధ్య ఆయన జీవితం ఆ కాలంలో ఊపిరి సలపకుండా సాగింది. సహనం, సౌశీల్యం గల జీవిత సహచరి లోకసుందరి సహాయ సహకా రాలతో, రామన్- వైజ్ఞానిక శిఖరాలను అధిరోహించి, ఈ దేశపు జెండాను దిగ్విజ యంగా ఎగరేశాడు. జీవితంలో ఏదైనా సాధించాల నుకుంటే, ఎన్నింటినో వదులుకోక తప్పదు - అన్న విషయం రామన్ జీవితం స్పష్టం చేసింది. 'రామన్ ఎఫెక్ట్' వెలుగులోకి వచ్చిన పదేళ్ళలో ప్రపంచంలో సుమారు రెండు వేల పైచిలుకు పరిశోధనా పత్రాలు అదేవిషయాన్ని ధృవపరిచాయి. OPTICSకు సి.వి. రామనే ఆద్యుడు. PHYSIOLOGY OF VISIONను మొదట అధ్యయనం చేసిందీ ఆయనే. ఇలా వైజ్ఞానికరంగంలో ఎన్నో శాఖలకు ఆయన బీజం వేశాడు. అందుకే భారత ప్రభుత్వం 'భారత రత్న'తో గౌరవించుకున్న తొలి శాస్త్రవేత్త కూడా ఆయనే అయ్యారు!

వైజ్ఞానిక పరిశోధనా రంగంలో రాజకీయాల జోక్యం ఏ మాత్రం సహించని సర్ సి.వి. రామన్ బెంగుళూరులోని ఇండియన్ ఇనిస్టిటూట్ ఆఫ్ సైన్స్ - డెరెక్టర్ పదవి తనకు తానై వదులుకున్నాడు. హాలెండ్‌లోని ప్రముఖ పరిశోధనా సంస్థ డైరెక్టర్ పదవి ఇస్తామని ఆహ్వానిస్తే మర్యాదగా సున్నితంగా తిరస్కరించాడు. ఎందుకంటే తన సేవలు జీవితాంతం మాతృభూమికే అర్పించాలని దృఢంగా నిశ్చయించుకున్నాడు కాబట్టి! అలాంటి మరో అతి సున్నితమైన కారణం వల్లనే లండన్ రాయల్ సొసైటీ ఫెలోషిప్‌కు రాజీనామా చేశాడు. వీటన్నిటికంటే మరెంతో ముఖ్యమైన విషయం - మరొకటి ఉంది. భారత ఉపరాష్ట్రపతి పదవికి ఆహ్వానం వస్తే ఆయన ఏ మాత్రం తొణకకుండా, బెణకకుండా వద్దన్నాడు. బాధ్యతాయుతమైన ఒక శాస్త్రవేత్తగానే ఆయన ఉండ దలిచాడు. రాజకీయాలు, పరిపాలనా వ్యవహారాల మధ్య తనలోని శాస్త్రజ్ఞుణ్ణి ఆయన అణగదొక్కదలుచుకోలేదు. ఏ కొద్దిపాటి ఆసరా దొరికినా, విదేశాలకు పరుగులు తీసేవారూ, ఏ చిన్నపాటి ఉన్నత పదవి లభిస్తుందన్నా, నైతికంగా దిగజారేవారు ఇప్పుడు మన మధ్యే ఉన్నారు. జాతీయ స్థాయిలోనే దిగ జారిన, దిగజారుతున్న వ్యక్తులు టి.వి. తెరల మీద చూస్తూనే ఉన్నాం. సి.వి.రామన్ నెలకొల్పిన జీవిత విలువలు, ఉన్నత ఆదర్శాలు కనీసం వీరు అర్థం చేసుకోగలరా? అని అనిపిస్తుంది. ఇక ఆచరణలో ఏం పెట్టగలరూ?

'రామన్ ఎఫెక్ట్' పేరుతో 28 ఫిబ్రవరి 1928న సి.వి. రామన్ తన పరిశోధనల్ని ప్రతిపాదించారు. ఆ రోజును గుర్తు చేసుకుంటూ - దేశ ప్రజలలో వైజ్ఞానిక స్ఫూర్తిని నింపడానికి అదే ఫిబ్రవరి 28ని మనం జాతీయ వైజ్ఞానికదినంగా జరుపుకుంటున్నాం. అయితే సర్ సి.వి. రామన్‌కు నోబెల్ పురస్కార ప్రధానం 1930లో జరిగింది. ఇది మన భారత దేశానికేకాదు, మొత్తం ఆసియా ఖండానికే తొలి నోబెల్ బహుమతి అయింది.

> హాలెండ్‌లోని ప్రముఖ పరిశోధనా సంస్థ డైరెక్టర్ పదవి ఇస్తామని ఆహ్వానిస్తే మర్యాదగా సున్నితంగా తిరస్కరించాడు. ఎందుకంటే తన సేవలు జీవితాంతం మాతృభూమికే అర్పించాలని దృఢంగా నిశ్చయించుకున్నాడు కాబట్టి! అలాంటి మరో అతి సున్నితమైన కారణం వల్లనే లండన్ రాయల్ సొసైటీ ఫెలోషిప్‌కు రాజీనామా చేశాడు. వీటన్నిటికంటే మరెంతో ముఖ్యమైన విషయం - మరొకటి ఉంది. భారత ఉపరాష్ట్రపతి పదవికి ఆహ్వానం వస్తే ఆయన ఏ మాత్రం తొణకకుండా, బెణకకుండా వద్దన్నాడు. బాధ్యతాయుతమైన ఒక శాస్త్రవేత్తగానే ఆయన ఉండ దలిచాడు. రాజకీయాలు, పరిపాలనా వ్యవహారాల మధ్య తనలోని శాస్త్రజ్ఞుణ్ణి ఆయన అణగదొక్కదలుచుకోలేదు. ఏ కొద్దిపాటి ఆసరా దొరికినా, విదేశాలకు పరుగులు తీసేవారూ, ఏ చిన్నపాటి ఉన్నత పదవి లభిస్తుందన్నా, నైతికంగా దిగజారే వారు ఇప్పుడు మన మధ్యే ఉన్నారు. జాతీయ స్థాయిలోనే దిగ జారిన, దిగజారుతున్న వ్యక్తులు టి.వి. తెరల మీద చూస్తూనే ఉన్నాం. సి.వి.రామన్ నెలకొల్పిన జీవిత విలువలు, ఉన్నత ఆదర్శాలు కనీసం వీరు అర్థం చేసుకోగలరా?

> ఒక దశలో టైగర్ ఆఫ్ బెంగాల్ అశుతోష్ ముఖర్జీ కలకత్తా విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడు, బ్రిటీష్ ప్రభుత్వంతో మధ్యవర్తిత్వం నెరపి, పరిశోధనల నిమిత్తం సి.వి.రామన్‌కు రెండేండ్ల సెలవు ఇవ్వాల్సిందిగా కోరాడు. ఈ భారతీయుడి పరిశోధనలపై బ్రిటీష్ ప్రభుత్వానికి నమ్మకం కలగలేదు. ఆ అభ్యర్ధనను తోసి పుచ్చి, వీలు కాదని చెప్పింది. చివరకు అశుతోష్ ముఖర్జీ నిబంధనల్ని కొద్దిగా సడలించి సి.వి.రామన్‌ను ఎలిల్ చైర్ ఆఫ్ ఫిజిక్స్‌కు ఎన్నుకున్నాడు. అది 1917వ సంవత్సరం. చూస్తూ చూస్తూ పెద్ద ఉద్యోగం, హోదా, డాబు, వసతులు అన్నీ వదులుకుని, ఒక చిన్న ఉద్యోగానికి రావడం అందరూ చేయగల పని కాదు. ఆయనలోని వైజ్ఞానిక జిజ్ఞాస, నిబద్ధత, ధ్యేయం అన్నీ కలిసి ఆయనను ఆ పనికి ఉసిగొల్పాయి. ఒక వైపు విశ్వవిద్యాలయంలో బోధన, మరోవైపు పరిశోధనల మధ్య ఆయన జీవితం ఆ కాలంలో ఊపిరి సలపకుండా సాగింది.

- కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు విజేత, విశ్రాంత బయాలజీ ప్రొఫెసర్.

బయటపడుతున్న దుర్మార్గం

'నిష్కారణంగా ఓ నిండు ప్రాణాన్ని బలికొనడం ఎప్పుడైనా అమానుషమే' అని అంటాడు మహాత్మా గాంధీజీ. అందుకు ప్రభుత్వాలు అధినేతలు ఈ ప్రజాస్వామ్య శకంలో బాధ్యత తీసుకోవాలని కోరుకుంటాడు. కానీ చివరకు తానే ఆర్‌ఎస్‌ఎస్ ఫాసిస్టు శక్తులకు ఆ విధగా బలైపోయిన విషయం ఎల్లరకూ తెలిసిందే. గాంధీని హత్య చేసిన హంతక గాడ్సేను కొందరు ఫాసిస్టు ఉన్మాదులు ఇప్పటికీ హీరోగా కొలవడం వైపరీత్యం కాక మరేమిటి?

'ఇప్పుడిక యుద్ధాలు చేయాలన్నా మేమే. యుద్ధం ఆపాలన్నా మేమే' అన్న సినిమా డైలాగులు మాదిరి ట్రంప్ రూపంలో అమెరికన్ సామ్రాజ్యవాద వాచాలత్వాన్ని మనం తనివితీరా చూస్తున్నాం.

యుద్ధంలో ఎంతమంది అమాయక పౌరులు, సైనికులు బలైపోయినా మాకేం నష్టంలేదు. మేమేం బాధ్యులం కాము అన్నది కరుడుగట్టిన పాశవికత్వ ఫాసిస్టు లక్షణమే. ఇప్పుడు కార్పొరేట్ సామ్రాజ్యవాదం అలాంటి ఫాసిస్టు ఉన్మాదంతో చెలరేగిపోతున్నది. మోడీ-అదాని బంధం, ట్రంప్-నెతన్యాహు (ఇజ్రాయిల్ అధినేత) బంధం ఈ కోవలోనే చూడవలసి ఉంటుంది. ప్రజల ప్రాణాలకు వీరు వీసమెత్తు విలువ ఇవ్వరు. ఈ భయంకర ప్రమాదాన్ని గ్రహించి ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా మెలగలసిన పరిస్థితి నెలకొని ఉన్నది.

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమై దాదాపు



మూడేళ్ళయింది. ఈ యుద్ధంలో దాదాపు 46 వేల మందికిపైగా చనిపోయారు. మరి కొన్ని వేలమంది ఆచూకీ తెలియడం లేదు. కాగా 3 లక్షల ఎనభై వేలమంది క్షతగాత్రులయ్యారు. లక్షలాదిమంది నిరాశ్రయులయ్యారు. మరి ఈ పాపం ఎవరిది?

ట్రంప్ దృష్టి అంతా ఉక్రెయిన్‌లోని చమురు నిక్షేపాలపై ఉంది. రష్యాపై యుద్ధం చేయడానికి తాము మూడేళ్ళుగా 50 వేల కోట్ల డాలర్లు ఖర్చు చేసామని అమెరికా చెప్పుకుంటున్నది. కానీ ఆ ఖర్చు మొత్తం 12 వేల కోట్ల డాలర్లు మించదని ఉక్రెయిన్ వాపోతున్నది.

అంటే చమురు నిక్షేపాల కోసమే అమెరికా ఉక్రెయిన్‌ను రష్యాపై ఉసికొల్పినట్టు ప్రపంచానికి అర్థమవుతూనే ఉన్నది. అమెరికా వత్తాసుతో గతంలో ఏదేదో మాట్లాడినా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఇప్పుడు నీరుకారిపోయాడు. యుద్ధ కారణంగా ఉక్రెయిన్‌కు ఈ మానవ నష్టంతోపాటు గణనీయంగా భూభాగాన్ని కోల్పోయింది. పట్టణాలు, పరిశ్రమలు, పౌర స్థావరాలు విధ్వంసం అయ్యాయి.

ఇప్పుడు శాంతి కోసం అమెరికా చూపెడుతున్న ప్రతిపాదనను చూసి జెలెన్‌స్కీ గుండెలు బాదుకుంటున్నాడు. పది తరాలు తమ దేశ పౌరుల్ని పిప్పిచేసినా అమెరికా అప్పుతీరడం సాధ్యం కాదేమోనన్న భయాన్ని ఆయన వ్యక్తం చేస్తున్నాడు.

అమెరికా ప్రతిపాదన ఒప్పుకుంటే చమురు, సహజవాయు నిక్షేపాలతోపాటు పోర్టులు, గనులు, ఇతర మౌలిక సదుపాయల్లో ఉక్రెయిన్‌కు వచ్చే ఆదాయాల్లో సగం సమర్పించుకోవాలి. అంటే ఒక విధంగా అమెరికా ఉక్రెయిన్‌కు బానిస దేశంగా మారిపోతుంది. పెనం నుండి పొయ్యిలోకి పడ్డట్టయింది పరిస్థితి. అమెరికన్ సామ్రాజ్యవాద సహకారంతో విర్రవీగే చిన్న చిన్న దేశాలన్నీ ఇప్పుడు ఈ పెద్ద గుణపాఠం నేర్చుకోవాలి. ముఖ్యంగా ప్రజల ప్రాణాలను ఫణంగా పెట్టే పాలకులకు ఇదో చెంపపెట్టు.

2022లో రష్యాతో పోరాడటానికి ఉక్రెయిన్ సిద్ధమైంది. అదీ అమెరికా మద్దతుతోనే. అప్పుడు ఉక్రెయిన్‌కు నాటో దేశాలతోపాటు, ఐరోపా చాలా వరకు మద్దతునిచ్చింది. నాటో సభ్యత్వం మాటున అమెరికా యుద్ధ స్థావరాలు ఉక్రెయిన్‌లో ఏర్పడితే తమ దేశానికి ఇక రక్షణ ఉండదని, అందుకు ఎంతకైనా తెగిస్తామని రష్యా మొదటి నుండి వాదిస్తూనే ఉన్నది. అమెరికా సామ్రాజ్యవాద సైనిక పాటవాలు పక్కలో బల్లెంలా ఉండటాన్ని రష్యన్ ప్రజలు ఎన్నటికీ సహించబోరని రష్యా అధ్యక్షుడు పుతిన్ సందర్భం వచ్చినప్పుడల్లా హెచ్చరిస్తూనే ఉన్నాడు. కనుకనే దూరదృష్టితో మొక్క వోని దీక్షతో రష్యా చేసిన ప్రతిఘటన యుద్ధం ఇలా దీర్ఘకాలం కొనసాగడానికి కారణమైంది. ఫలితంగా రష్యాకు సైనిక నష్టం సంభవించినా అపజయం మాత్రం కలుగలేదు. ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షునిగా ఎన్నికైన తర్వాత తన వ్యూహాన్ని మార్చాడు. యుద్ధంలో రష్యా జయించిన ప్రాంతం రష్యాదేనని, దానికి ఉక్రెయిన్ కూడా సహించాలని అంటున్నాడు. 'మనం స్మార్ట్ కాకపోతే యుద్ధం కొనసాగుతూనే ఉంటుంది. లేదంటే అది మూడో ప్రపంచ యుద్ధానికి కూడా దారితీయవచ్చు' అని అంటున్నాడు ట్రంప్.

యుద్ధాన్ని ప్రారంభించినంత తేలికగా యుద్ధాన్ని ముగించడం తేలిక కాదు. సామ్రాజ్యవాద విస్తరణలో యుద్ధం అంతర్భాగమే అన్న లెనిన్ మాటలను సదా గుర్తుంచుకోవాలి. విశ్వ మానవాళి శాంతి - క్షేమం కోసం యుద్ధాలను ప్రతిఘటించడమంటే అంతిమంగా అది సామ్రాజ్యవాదాన్ని ప్రతిఘటించడమే అవుతుంది. ప్రస్తుత కాలంలో కార్పొరేట్ ఫాసిస్టు శక్తులను ప్రతిఘటించడంగానే ఈ అంశాన్ని మనం పరిగణించాలి.

- కె శాంతారావు, 9959745723

క్షమాసావంత్‌కు వీసా తిరస్కరణ- 'విశ్వగురు' కర్కశత్వం!

-సత్య

తన కన్నతల్లి వృద్ధాప్యంలో ఉన్నపుడు, చివరిరోజు వరకు ఆమెను చూసేందుకు ప్రధాని నరేంద్ర మోడీ అనేకసార్లు వెళ్లారు. ఆమెకు సేవ చేశారని కూడా వార్తలు చదివాం. చిత్రాలను చూశాం. కానీ అలాంటి మరో తల్లిని చూసేందుకు ఆమె కుమార్తెకు వీసా నిరాకరించిన అదే పెద్దమనిషి తీరును ఎలా చూడాలి? ఈ ఏడాది జనవరి తొమ్మిదిన ఆన్‌లైన్ ద్వారా క్షమ, ఆమె భర్త వీసా దరఖాస్తులను సమర్పించగా దాదాపు నెల రోజుల పాటు దరఖాస్తును తొక్కిపట్టి ఏ కారణం చెప్పకుండా మానసిక ఆందోళనకు గురిచేశారు. చివరికి భర్త కాల్విన్ ప్రీస్ట్‌కు వీసా మంజూరు చేసి, క్షమకు తిరస్కరించారు.

బెంగళూరులో ఉంటున్న తల్లి వసుంధరా రామానుజమ్‌ను పరామర్శించే నిమిత్తం ఇండియన్- అమెరికన్ మహిళ క్షమా సావంత్ (51) గతేడాది మే నెల నుంచి మూడుసార్లు దరఖాస్తు చేశారు. అమెరికాలోని మన దౌత్య కార్యాలయాలు అత్యవసర వీసా నిరాకరించాయి. తీవ్ర నేరారోపణలతో జైళ్లలో ఉన్న నిందితులకు, శిక్షలు పడిన వారికి కూడా ఇలాంటి కారణాలతో పరిమిత బెయిలు మంజూరు చేసిన ఉదంతాలు మనకు తెలిసిందే. క్షమ సావంత్ నేరస్తురాలు కాదు, మన దేశ ఉగ్రవాదా లేదా మరొక నిషేధిత జాబితాలో ఆమె పేరు లేదు. ఎలాంటి కేసులు లేవు. కానీ కారణాలు చూపకుండానే మీరు తిరస్కరణ జాబితాలో ఉన్నారంటూ అమెరికా వాషింగ్టన్ రాష్ట్రంలోని సియాటిల్ నగరంలో భారత కాన్సులేట్ దౌత్య కార్యాలయం 2025 ఫిబ్రవరి మొదటి వారంలో వీసా నిరాకరించింది. కారణం ఏమిటో చెప్పాలంటూ గట్టిగా అడిగినందుకు, చెప్పాల్సిన పనిలేదని, కార్యాలయంలో అక్రమంగా ప్రవేశించారంటూ పోలీసులను పిలిపించింది. భర్త కాల్విన్ ప్రీస్ట్‌కు వీసా మంజూరు చేసి తనకు నిరాకరించటానికి నరేంద్ర మోడీ విధానాలను వ్యతిరేకించే రాజకీయ కారణాలు తప్ప మరొకటి కాదని ఆమె 'ఎక్స్'లో పేర్కొన్నారు.



క్షమా సావంత్ మహారాష్ట్రలోని పూనాలో ఒక తమిళ కుటుంబంలో జన్మించారు. తల్లి స్కూల్ ప్రిన్సిపల్‌గా పనిచేశారు. ఇంజనీర్ అయిన తండ్రి క్షమ పదమూడేళ్ల వయస్సులో ఒక ప్రమాదంలో మరణించారు. ఆమె ముంబైలో చదువుకొని సాఫ్ట్‌వేర్ ఇంజనీరయ్యారు. 1996లో అమెరికా వెళ్లిన తరువాత అర్థశాస్త్రంలో పిహెచ్‌డి చేసి కొంతకాలం ప్రొఫెసర్‌గా పనిచేశారు. అక్కడే ఆమె 2006లో వామపక్ష రాజకీయాల్లో అడుగుపెట్టారు. అంతకు ముందు ఆమెకు రాజకీయాలతో సంబంధం లేదు. 2012లో వాషింగ్టన్ ప్రజా ప్రతినిధుల సభకు పోటీ చేసి ఓడిపోయారు. తరువాత సియాటిల్ నగర పాలక సంస్థ ఎన్నికల్లో గెలిచి 2014 నుంచి 2024 వరకు ప్రాతినిధ్యం వహిం చారు. ఆ సమయంలో కుల వివక్ష వ్యతిరేక తీర్మానం చేయించ టంలో కీలక పాత్ర పోషించటాన్ని హిందూ సంస్థలు తీవ్రంగా వ్యతిరేకించాయి. వీసా తిరస్కరణ వెనుక ఈ అంశం ఉందా అన్న ప్రశ్నకు ఇంతకు మించి బీజేపీ ప్రభుత్వ రాజకీయ నిర్ణయం వెనుక మరొక కారణం కనిపించటం లేదన్నారు.

"నేను ఒక సోషలిస్టును. పదేళ్ల పాటు కార్మికవర్గ ప్రతినిధిగా సియాటిల్ కౌన్సిల్‌లో ఉన్నాను. ఆ సమయంలో నేను ప్రజా ఉద్యమ నిర్మాణానికి, కనీస వేతనం గంటకు 15 డాలర్లకు పెంచాలని కోరుతూ నా పదవిని వినియోగించాను. ఇప్పుడది 20.76 డాలర్లకు పెరిగింది. అమెరికాలో ఇది గరిష్టం. పేదల గృహ నిర్మాణాలకు కార్పొరేట్ సంస్థలు వాటా చెల్లించాలని కూడా నేను పని చేశాను. 2020 ఫిబ్రవరిలో సిఏఏ, ఎన్.ఆర్.సి చట్టాలను ఖండిస్తూ సియాటిల్ కౌన్సిల్‌లో పెట్టిన తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ శాన్ ఫ్రాన్సిస్కోలోని భారత కాన్సులేట్ కార్యాలయం నాకు ఒక లేఖ పంపింది. అమెరికాలోని హిందూత్వ శక్తులు, మోడీ మద్దతుదార్ల నుంచి వ్యతిరేకత ఎదుర్కొన్నాం. 2023 ఫిబ్రవరిలో కుల వివక్షపై చారిత్రాత్మక నిషేధాన్ని ప్రకటించటంలో విజయం సాధించాం. మాకు విశ్వహిందూ పరిషత్ నుంచి తీవ్ర వ్యతిరేకత వెల్లడైంది. మితవాద హిందూ అమెరికన్ ఫౌండేషన్, ఉత్తర అమెరికా హిందువుల సంఘటన మాకు వ్యతిరేకంగా పని చేశాయి. అందువలన మోడీ ప్రభుత్వం, అమెరికాలోని దాని మద్దతుదార్లు మాకు వ్యతిరేకంగా ఉన్నారనటంలో ఎలాంటి సందేహం లేదు. వారందరికీ నా రాజకీయ అభిప్రాయాలు ఏమిటో తెలుసు. అనారోగ్యంతో ఉన్న తల్లిని చూసేందుకు అనుమ తించక పోవటం అమానుషం. ఏ రకమైన ప్రభుత్వమిది. నా వీసా తిరస్కరణ వెనుక రాజకీయ కారణాలు లేవని మోడీ సర్కార్ చెప్పుకోవా లంటే వీసా మంజూరు చేసి నిరూపించు కోవచ్చు" అని క్షమ పేర్కొన్నారు.

అమెరికాకు వెళ్లిన వారందరూ అని కాదు గానీ ఎక్కువ మంది తమతో పాటు కులతత్వాన్ని, కుల వివక్షను కూడా తీసుకుపోయారు. ఈ మధ్య దానికి మతాన్ని కూడా తోడు చేశారు. మన దేశంలో మత ప్రాతిపదిక మీద పని చేసే సంస్థలన్నింటికీ అమెరికా శాఖలు ఉన్నాయి. దక్షిణాసియా నుంచి వచ్చిన దళితులు, ఇతర అణచివేతకు గురైన కులాల వారు అమెరికాలో కూడా దాన్ని తప్పించుకోలేక పోతున్నారు. కార్నెగీ ఎండోమెంట్ ఫర్ ఇంటర్నేషనల్ పీస్ అనే సంస్థ జరిపిన అధ్యయనం ప్రకారం విద్యాపరంగా మూడింట ఒక వంతు, పని స్థలాల్లో , మూడింట రెండు వంతుల మంది వివక్షను ఎదుర్కొన్నట్లు తేలింది. తక్కువగా చూడటం, సూటిపోటి మాటలు, లైంగిక వేధింపుల గురించి ముప్పై మంది దళిత మహిళా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు తమ అనుభవాలను బహిరంగ లేఖ రూపంలో వెల్లడించారు. సిస్కో సిస్టమ్స్ కంపెనీలో అగ్రవర్ణాలుగా భావించబడుతున్నవారు తనకు రావాల్సిన ఉద్యోగోన్నతి, వేతన పెంపుదలను ఎలా అడ్డుకుంటున్నారో వెల్లడిస్తూ దాఖలు చేసిన కేసును ఒక దళిత సామాజిక తరగతికి చెందిన ఇంజనీరు గెలిచారు. ఆ తరువాత వందలాది మంది తాము ఎదుర్కొన్న వివక్ష గురించి గళం విప్పారు. ఈ పూర్వరంగంలోనే క్షమ సావంత్ సియాటిల్ సిటీ కౌన్సిలర్‌గా వివక్షకు వ్యతిరేకంగా ఒక తీర్మానాన్ని ప్రతిపాదించి ఆమోదింప చేయించారు.

క్షమా సావంత్ అలుపెరగని పోరాట యోధురాలు. కార్మికవర్గాన్ని దోచుకుంటున్న ధనికులు, వారికి మద్దతు ఇస్తున్న అధికార రిపబ్లిక్, ప్రతిపక్ష డెమోక్రటిక్ పార్టీలకు ప్రత్యామ్నాయంగా మరొక పార్టీ నిర్మాణం జరగాల్సిన అవసరం ఉందని ఆమె గతంలో ప్రకటించారు. దళితుల సమస్యల మీద ఆ సామాజిక తరగతికి చెందిన వారు మాత్రమే సక్రమంగా స్పందించగలరని, వారు మాత్రమే పోరాటాలకు నాయ కత్వం వహించాలని చెబుతున్న వారు క్షమ పోరాటం, ఆమె ఎదుర్కొంటున్న వేధింపులను చూసిన తర్వాత 'విశ్వగురు'నని చెప్పుకునే వారు తమ సంకుచిత వైఖరిని మార్చుకోవాలని సూచించటం తప్పుకాదేమో!

> అమెరికాకు వెళ్లిన వారందరూ అని కాదు గానీ ఎక్కువ మంది తమతో పాటు కులతత్వాన్ని, కుల వివక్షను కూడా తీసుకుపోయారు. ఈ మధ్య దానికి మతాన్ని కూడా తోడు చేశారు. మన దేశంలో మత ప్రాతిపదిక మీద పని చేసే సంస్థలన్నింటికీ అమెరికా శాఖలు ఉన్నాయి. దక్షిణాసియా నుంచి వచ్చిన దళితులు, ఇతర అణచివేతకు గురైన కులాల వారు అమెరికాలో కూడా దాన్ని తప్పించుకోలేకపోతున్నారు. కార్నెగీ ఎండోమెంట్ ఫర్ ఇంటర్నేషనల్ పీస్ అనే సంస్థ జరిపిన అధ్యయనం ప్రకారం విద్యాపరంగా మూడింట ఒక వంతు, పని స్థలాల్లో, మూడింట రెండు వంతుల మంది వివక్షను ఎదుర్కొన్నట్లు తేలింది. తక్కువగా చూడటం, సూటిపోటి మాటలు, లైంగిక వేధింపుల గురించి ముప్పై మంది దళిత మహిళా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు తమ అనుభవాలను బహిరంగ లేఖ రూపంలో వెల్లడించారు.

జీఎంఆర్ ఎరీనాలో కాపర్ పవర్ కంట్రోల్ కేబుల్ చోరీ

- సెక్యూరిటీగా పని చేసే వ్యక్తే సూత్రధారి
- ఆలస్యంగా పోలీసులకు ఫిర్యాదు
- ఏడుగురు సభ్యుల ముఠాలో నలుగురి అరెస్ట్, రిమాండ్
- రూ.20 లక్షల నగదు స్వాధీనం : వివరాలు వెల్లడించిన డీసీపీ రాజేష్



నవతెలంగాణ-శంషాబాద్

కంచె చేను మేసిన చందంగా కాపలాగా ఉన్న సెక్యూరిటీ గార్డు, కొంతమంది వ్యక్తులతో చేతులు కలిపి పెద్ద ఎత్తున చోరీకి పాల్పడిన ఘటన రంగారెడ్డి జిల్లా శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ కేసుకు సంబంధించిన వివరాలను శంషాబాద్ జోన్ డీసీపీ కార్యాలయంలో డీసీపీ రాజేష్ గురువారం మీడియాకు వెల్లడించారు. హైదరాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం జీఎంఆర్ ఎరీనాలో బిమార్ ఇండియా ప్రయివేటు లిమిటెడ్ కంపెనీకి సంబంధించిన కాపర్ పవర్ కేబుల్ స్టోరేజీ ఉంది. బాలాపూర్ మండలం మామిడిపల్లి గ్రామంలోని సిగ్నేచర్ వెంచర్‌లో నివాసం ఉంటున్న ప్రధాన నిందితుడు అదిల శ్రీకాంత్ స్టోరేజీ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఇతను ఉప్పుగూడ శివాజీనగర్‌కు చెందిన కేతావత్ భాష, ముషీరాబాద్ బోలక్‌పూర్‌కు చెందిన అబ్దుల్ వాహిద్, బాలాపూర్ మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ ఖాదర్‌ఖాన్, మహమ్మద్ హుస్సేన్, కుర్షీద్ హుస్సేన్, అలీ అనే ఏడుగురుతో కలిసి ముఠాగా ఏర్పడ్డాడు. ప్రధాన నిందితుడు శ్రీకాంత్ స్టోరేజ్‌కి సంబంధించిన నకిలీ తాళం చెవిని తయారు చేయించాడు. ఈ ముఠా సభ్యులతో కలిసి ఎవరికీ అనుమానం రాకుండా తాళం తెరిచి కాపర్ పవర్ కంట్రోల్ కేబుల్ చోరీ చేశారు. అనంతరం దాన్ని ముక్కలుగా చేసి వివిధ ప్రాంతాల్లోని పాత ఇనుప సామగ్రి దుకాణాల్లో అమ్మేశారు. అయితే స్టోరేజీలో నవంబర్ 17 నుంచి 27వ తేదీ మధ్య పవర్ కేబుల్ దొంగతనం జరిగిందని ఆ సంస్థ గుర్తించింది. అంతర్గత రహస్య విచారణ చేపట్టిన సంస్థ యాజమాన్యం సెక్యూరిటీ గార్డు శ్రీకాంత్ కొంతమందితో కలిసి దొంగతనం చేసినట్టుగా నిర్ధారణకు వచ్చారు. ఈ నెల 11వ తేదీన సంస్థ ప్రతినిధి పవన్‌కుమార్ కడ్తాల్, శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీసులకు తమ సంస్థలో దొంగతనం జరిగిందని, సెక్యూరిటీ గార్డు శ్రీకాంత్‌పై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేశారు. విచారణలో భాగంగా శ్రీకాంత్‌తో పాటు మరో ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. అమ్మిన కేబుల్ విలువను వెలకట్టి రూ. 20 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇందులో నలుగురు నిందితులు శ్రీకాంత్, కేతావత్ భాష, అబ్దుల్ వహీద్, మహమ్మద్ ఖాదర్ ఖాన్‌లను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. మిగతా ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారు. రెండు వారాల్లోపే కేసు ఛేదించి, రూ.20 లక్షల నగదు, సెల్ ఫోన్లు, బొలెరో వాహనం స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు శ్రీకాంత్ గతంలోనూ చోరీకి పాల్పడినట్టుగా గుర్తించారు. కేసు ఛేదించడంలో చురుకైన పాత్ర పోషించిన పోలీసులను డీసీపీ అభినందించి, రివార్డు అందజేశారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ కె.రామ్‌కుమార్, కే.బాలరాజు, డీఎస్‌ఐ హెచ్. కిషన్ జీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాటకు విరమణ లేదు

- కలం, గళానికి పదును పెట్టాల్సిందే : ప్రజాకవి జయరాజు ఉద్యోగ విరమణ సభలో వక్తలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రజాపాటకు విరమణ లేదనీ, కష్టాలున్నన్ని రోజులు వారి బాధల్ని కైకట్టి పాడటమే ప్రజాకవి లక్ష్యమని వక్తలు అన్నారు. ప్రకృతి, ప్రజాకవి, సింగరేణి ఉద్యోగి జయరాజు ఉద్యోగ విరమణ సభకు పలువురు కవులు, కళాకారులు, సీపీఐ(ఎం), సీపీఐ నేతలు హాజరయ్యారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ కార్మికులు, కష్టజీవుల ఇతిబాధలను ఒడిసి పట్టి, పాటగా మలిచిన గొప్ప ప్రజాకవి జయరాజు అని ప్రశంసించారు. ప్రకృతి ప్రేమికుడిగా ఆ ప్రకృతి విధ్వంసానికి కారణభూతమైన శక్తులపై తన కలానికి పదునెక్కించిన ప్రకృతి కవి అని కొనియాడారు. అందుకే ప్రజాపాటకు విరమణ లేదన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ప్రజాకళాకారుల బాధ్యత మరింత పెరిగిందన్నారు. సనాతన ధర్మం, పాశ్చాత్య సంస్కృతి మనిషి అస్థిత్వాన్ని ప్రమాదంలోకి నెడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం మతతత్వం, కార్పొరేటీకరణ విధానాలను అత్యంత వేగంగా అమలు చేస్తున్న తరుణంలో కలానికి, గళానికి విరామం ప్రకటించొద్దని సూచించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, వెన్నెల గద్దర్, కవి రచయిత సుద్దాల అశోక్‌తేజ, మా భూమి నర్సింగరావు, ట్రైకార్ చైర్మెన్ బెల్లయ్యనాయక్, కదిర కృష్ణ, యశ్‌పాల్,జి రాములు, భూపతి వెంకటేశ్వర్లు, విజయ్ తదితరులు మాట్లాడుతూ ఉద్యోగ ధర్మాన్ని పాటిస్తూనే..కార్మిక చైతన్యాన్ని రగిలించిన గొప్ప కవి జయరాజ్ అని కొనియాడారు.

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాద స్థలి వద్దకు దక్షిణ మధ్య రైల్వే నిపుణుల బృందం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాద ఘటనలో చిక్కుకున్న కార్మికులను కాపాడే కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే సహాయం చేయనున్నది. ఇందుకోసం నాగర్‌కర్నూల్ జిల్లాలోని ప్రమాదం జరిగిన చోటుకు మెటల్ కట్టింగ్ నిపుణులను, అవసరమైన యంత్రాలను సమకూర్చింది. ఇప్పటికే వారిని కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ఇండియన్ ఆర్మీ నేవీ, ర్యాట్ మైనర్స్, ఎన్డీఆర్ఎఫ్ రంగంలో ఉన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ జిల్లా కలెక్టర్ దక్షిణ మధ్య రైల్వేను సహాయం చేయాల్సిందిగా కోరగా వెంటనే స్పందించింది. ఇందులో భాగంగా డివిజనల్ మెకానికల్ ఇంజినీర్ మురళీ నేతృత్వంలో మొదటి బృందాన్ని పంపించింది. ఈ బృందంలో సికింద్రాబాద్ నుంచి ఒక సెక్షన్ ఇంజినీర్, 13 మంది వెల్డర్లు, ఇద్దరు టెక్నీషియన్లు ఉన్నారు. మొదటి బృందానికి సహాయం చేసేందుకు ఉద్దేశించిన రెండో బృందంలో ఒక సీనియర్ సెక్షన్ ఇంజినీర్, నలుగురు టెక్నీషియన్లున్నారు. బ్రోకో కట్టింగ్ మిషన్, కన్జ్యూమబల్స్, పోర్టబుల్ ఎయిర్ కంప్రెషర్ తదితర యంత్రాలను సమకూర్చింది.

రేవంత్‌రెడ్డి ఆర్ఎస్ఎస్ ముఖ్యమంత్రి

- ప్రధాని మోడీ డైరెక్షన్‌లోనే పనిచేస్తున్నారు : బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆర్ఎస్ఎస్ ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రధాని మోడీ డైరెక్షన్‌లో సీఎం పనిచేస్తున్నారని వ్యాఖ్యానించారు. బీజేపీ నాయకులే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దగ్గరుండి కాపాడుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర సర్కార్‌ను తాము ప్రజల్లో ఎండగట్టగానే బీజేపీ నాయకులు తమను విమర్శిస్తున్నారని గుర్తు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ మధ్య భాగస్వామ్యం ఉందనీ, అందులో భాగంగానే లేనిపోని విషయాలను బీఆర్ఎస్‌కు అంటగడుతున్నారని విమర్శించారు. "న్యాయవాది సంజీవ రెడ్డి కోర్టులో వాదిస్తూ అందరి ముందే ఆరు నెలల క్రితం గుండె పోటుతో మరణించారు. భూపాలపల్లిలో భూతగాదాల వల్లనే హత్య జరిగినట్టు జిల్లా ఎస్పీ చెప్పారు. దుబాయ్‌లో ఒక వ్యక్తి నిద్రలోనే చనిపోయారని పత్రికల్లోనే వచ్చింది. అయినప్పటికి తమకు సంబంధం లేని సంఘటనలను బీఆర్ఎస్‌కు ఆపాదించడం సీఎంకు అలవాటైంది. ఇప్పటికైనా రేవంత్ తన వైఖరి మార్చుకోవాలి" అని కవిత హితవు పలికారు. ఏడాది కాలంలోనే సీఎం కుటుంబ సభ్యులు రాజ్యాంగేతర శక్తులుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఆయన సోదరుడు తిరుపతిరెడ్డి తాను నియోజకవర్గ ఇన్‌చార్జి అని చెప్పుకుంటున్నారని కవిత వ్యాఖ్యానించారు. పార్టీ పరంగా బాధ్యులయితే తమకు ఇబ్బంది లేదని, కానీ అధికారిక సమావేశాల్లో ఎందుకు పాల్గొంటున్నారని నిలదీశారు.

అశోక హెూటల్‌కు బాంబు బెదిరింపు



నవతెలంగాణ-బేగంపేట

రంజాన్ ఉపవాస దినాలు సమీపిస్తున్న తరుణంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో బాంబు బెదిరింపు కాల్ కలకలం రేపింది. దీంతో ఒక్కసారిగా ప్రయాణికులు, స్టేషన్ ముందు వివిధ వ్యాపారాలు చేస్తున్న యజమానులు భయందోళనకు గురయ్యారు. వివరాల్లోకెళ్తే.. బుధవారం అర్ధరాత్రి సికింద్రాబాద్ స్టేషన్ ఎదురుగా ఉన్న అశోక హెూటల్లో బాంబు పెట్టినట్టు అగంతకుడు పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఫోన్ కాల్ చేశాడు. దాంతో అప్రమత్తమైన పోలీస్ కంట్రోల్ రూమ్ పోలీసులు.. గోపాలపురం పోలీసులకు సమాచారం ఇచ్చారు. హెూటల్లో భోజనం చేయడానికి వచ్చిన ప్రయాణికులందరినీ బయటకు పంపి గంట పాటు డాగ్స్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. చివరికి బాంబు లేదని, అది ఫేక్ కాల్‌గా తేల్చారు. దాంతో గోపాలపురం పోలీసులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

మావోయిస్టుల ప్రయత్నాలు భగ్నం

- 5 కేజీల పెసర్ బాంబు నిర్వీర్యం చేసిన భద్రతా బలగాలు
- సుకుమా జిల్లాలో ఘటన



నవతెలంగాణ-చర్ల

సరిహద్దు ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లా, కుంట పోలీస్ స్టేషన్ పరిధిలో భద్రతా దళాలే లక్ష్యంగా ప్రధాన రహదారిపై అమర్చిన 5 కేజీల పెసర్‌బాంబును భద్రతా బలగాలు కనుగొన్నాయి. గురువారం గొల్లపల్లి, బండ గ్రామాల మధ్య పోలీసులను హతమార్చాలన్న దురుద్దేశంతో మావోయిస్టులు పెసర బాంబును అమర్చారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు.. రోడ్డు ఓపెనింగ్ పార్టీ, బాంబు స్క్వాడ్ సహకారంతో నిర్వీర్యం చేసినట్టు సుకుమా ఎస్పీ కిరణ్ చౌహన్ తెలిపారు.

వైద్యునిపై హత్యాయత్నం కేసులో నిందితులు అరెస్ట్

- వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ వివరాలు వెల్లడి



నవతెలంగాణ-వరంగల్

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన వరంగల్ జిల్లాలో వైద్యునిపై హత్యాయత్నం కేసును పోలీసులు ఛేదించారు. వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏసీపీ నందిరామ్‌నాయక్ వివరాలు వెల్లడించారు. వరంగల్ నగరానికి చెందిన డాక్టర్ సుమంత్‌రెడ్డి.. షిరిడిసాయి నగర్‌కు చెందిన ఫ్లోరా మరియాతో 2016లో ప్రేమ వివాహం జరిగింది. 2018లో సంగారెడ్డిలో సుమంత్ రెడ్డి బంధువుల విద్యాసంస్థల బాధ్యత చూసుకునేందుకు వారు సంగారెడ్డికి మకాం మర్చారు. అక్కడే పీహెచ్‌సీలో కాంట్రాక్టు మెడికల్ ఆఫీసర్‌గా సుమంత్ రెడ్డి పనిచేస్తుండగా, ఫ్లోరా మరియా స్కూల్లో టీచర్‌గా పనిచేస్తుండేది. బరువు తగ్గడానికి ఆమె సంగారెడ్డిలోని సిద్ధు జిమ్ సెంటర్‌కి వెళ్తుండేది. ఈక్రమంలో జిమ్ కోచ్, సంగారెడ్డి జిల్లా కొండాపూర్ ఆదర్శ కాలనీకి చెందిన ఏర్రోల్ల శామ్యూల్‌తో పరిచయమై ఇద్దరి మధ్య వివాహేతర సంబంధానికి దారితీసింది. ఈ విషయం భర్త సుమంత్ రెడ్డికి తెలిసి గొడవలయ్యాయి. ఈ నేపథ్యంతో తన ఫ్యామిలీతో వరంగల్‌కు వచ్చారు. 2019లో ఫ్లోరా మరియా ప్రభుత్వ లెక్చరర్ ఉద్యోగం పొంది జనగామ జిల్లాలోని పెంబర్తి సోషల్ వెల్ఫేర్ కాలేజీలో లెక్చరర్ ఉద్యోగం చేసుకుంటూ అక్కడే ఉండేవారు. కాగా ఆ కళాశాల వరంగల్ రంగశాయిపేట్ మారడంతో డాక్టర్ సుమంత్ రెడ్డి వరంగల్‌లోని వాసవి కాలనీలో ఉంటూ కాజీపేటలో ప్రయివేట్ హాస్పిటల్ నడుపుకుంటూ ఉదయం వెళ్లి రాత్రి ఇంటికి వస్తుండేవారు. ఫ్లోరా మరియా మాత్రం శామ్యూల్‌తో వివాహేతర సంబంధాన్ని కొనసాగించింది. దాంతో సుమంత్ రెడ్డి ఆమెను మందలించగా, అతన్ని హతమార్చేందుకు కుట్ర పన్నారు. శామ్యూల్ స్నేహితుడైన ఏఆర్ కానిస్టేబుల్ రాజ్‌కుమార్‌కు విషయం చెప్పి ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ నెల 20న సంగారెడ్డిలో ఒక సుత్తిని కొనుగోలు చేసి రాజకుమార్ బైక్‌పై బయలుదేరి కాజీపేటకు వచ్చారు. అనుకున్న ప్రకారం రెక్కి చేశారు. సుమంత్ రెడ్డి క్లినిక్ ముగించుకొని కారులో బట్టుపల్లి రోడ్డు నుంచి రంగాశాయపేట వెళ్తున్న క్రమంలో బట్టుపల్లి శివారులోని ఎస్ఆర్ స్కూల్ సమీపంలో బ్రిడ్జి వద్ద అడ్డగించి అతనిపై దాడి చేశారు. చనిపోయాడని భావించి అక్కడి నుంచి పరారయ్యారు. సుమంత్‌రెడ్డి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి నిందితులు శామ్యూల్, అతని స్నేహితుడు ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ రాజ్‌కుమార్‌ను అరెస్ట్ చేసినట్టు ఏసీపీ వెల్లడించారు. ఈ సమా వేశంలో మిల్స్ కాలనీ సీఐ వెంకటరత్నం, టాస్క్‌ఫోర్స్ సీఐ రంజిత్ కుమార్, మిల్స్ కాలనీ ఎస్ఐ సురేష్, కానిస్టేబుళ్లు బాబ్ సింగ్, చంద్రశేఖర్, వెంకన్న, రాజు, జెలెందర్, టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్ ఎండీ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

రెండ్రోజుల్లో ఆపరేషన్ పూర్తి

పదేండ్ల కాలంలో ఏ అనుమతులు తీసుకొని పనులు చేశారు ?

- పవర్ హౌజ్ సందర్శనకు వెళితే రేవంత్ రెడ్డిని అరెస్టు చేయలేదా..?
- మేము ప్రజాస్వామ్యబద్ధంగా ముందుకెళ్తున్నాం : మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి
- ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంపై ఆశలు వదులుకుంటున్న అధికారులు
- బోరింగ్ మిషన్ కటింగ్ ప్రారంభం





నవతెలంగాణ- మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రమాదంలో చిక్కుకున్న కార్మికులను రెండ్రోజుల్లో బయటకు తీసుకొస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం బీఆర్ఎస్ నాయకులు, మాజీ మంత్రులు హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి ప్రాజెక్టు వద్దకు వచ్చి మాట్లాడిన తీరు పట్ల ఆక్షేపించారు. మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. సొరంగం పనులు చేశామంటున్న బీఆర్ఎస్ నేతలు ఎవరి దగ్గర అనుమతులు తీసుకున్నారో చెప్పాలని ప్రశ్నించారు. పదేండ్లపాటు నిర్లక్ష్యంగా వ్యవహరించినందు వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని చెప్పారు. త్వరలో మళ్లీ సొరంగం పనులు పున్ణప్రారంభిస్తామని తెలిపారు. ఎస్-ఎల్‌బీసీ ద్వారా 30 టీఎంసీల నీటిని పంపింగ్ చేసి నాలుగు లక్షల ఎకరాలకు సాగు నీరు అందించేలా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వెళ్తుందని అన్నారు. ప్రాజెక్టుల పేరుతో జేబులు నింపుకున్న హరీశ్‌రావుకు కాంగ్రెస్‌ను విమర్శించడానికి సిగ్గుండాలన్నారు. లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం కుంగిపోయిందని, బీఆర్ఎస్ మానస పుత్రిక అని చెప్పుకుంటున్న పాలమూరు-రంగారెడ్డి ద్వారా ఎకరాకు కూడా నీరు ఇవ్వలేదని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసిన బీఆర్ఎస్ నాయకులకు కాంగ్రెస్‌ను విమర్శించే అర్హత లేదన్నారు. ఎడమ గట్టు విద్యుత్ ప్లాంట్‌లో మంటలు చెలరేగినప్పుడు అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న రేవంత్‌రెడ్డి ప్రాజెక్టు సందర్శనకు వెళితే అరెస్టు చేయలేదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకి ఒక న్యాయం.. బీఆర్ఎస్‌కు మరో న్యాయం ఉండదని ఈ సందర్భంగా తెలుసుకోవాలని అన్నారు. దేవాదుల ప్రాజెక్టులో ఏడుగురు కార్మికులు చనిపోతే నోరెత్తని హరీశ్‌రావు ఇప్పుడు గగ్గోలు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు.

ఆశలు వదులుకున్నట్టేనా..

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో చిక్కుకున్న ఎనిమిది మంది కార్మికుల ప్రాణాలపై అధికారులు ఆశలు వదులుకున్నట్టు తెలుస్తోంది. ప్రమాదం జరిగి ఆరు రోజులు కావడంతో వారు సజీవంగా ఉన్నారా ? లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సొరంగంలో భారీ ఎత్తున మట్టి కూలడం, నీరు, బురద చేరడంతో ప్రాణాలతో ఉండే అవకాశం తక్కువని భావిస్తున్నారు. వారంతా బురదలోనే టన్నెల్ బోరింగ్ మెషీన్ టీబీఎం చుట్టూ కూరుకుపోయి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. ఒకవేళ ప్రమాదంలో గాయపడినా నీళ్లు, ఆహారం లేకుండా జీవించడం కష్టమని అంటున్నారు.

టన్నెల్ బోరింగ్ మిషన్ కటింగ్

కార్మికులను కాపాడేందుకు టన్నెల్ బోరింగ్ మిషన్ అడ్డంకిగా మారడంతో దాన్ని కట్ చేయాలని అధికారులు నిర్ణయించారు. పనుల్లోనూ మరింత వేగం పెంచారు. గురువారం నుంచి కటింగ్ పనులు ప్రారంభిస్తున్నారు. ప్రమాదం జరిగినప్పుడు మిషన్ భారీగా దెబ్బతింది. ఆ తర్వాత ఒత్తిడితో దాని వ్యర్థాలు ముందుకు తోసుకొచ్చాయి. దాన్ని దాటి వెళ్తేగానీ కార్మికులను కాపాడే ప్రయత్నాలు ఫలించవు. అయితే ప్రమాదం జరిగిన మూడో రోజునే వాటిని తొలగించేందుకు కట్టర్లు, జనరేటర్లు తీసుకెళ్లారు. అయితే కట్ చేసేందుకు జయప్రకాశ్ అసోసియేట్స్ యాజమాన్యం ఒప్పుకోలేదు. భారీ ఖర్చుతో కూడుకోవడం, టీబీఎంను కట్ చేస్తే తిరిగి పనులు ప్రారంభించడం కష్టమవుతుందని భావించారు. కానీ, బుధవారం ఆ సంస్థ చైర్మెన్ జయప్రకాశ్ గౌర్ ఢిల్లీ నుంచి ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంత్రులు, అధి కారులు, కంపెనీ ప్రతినిధులు, సహాయ బృందాలతో చర్చల అనంతరం టీబీఎంను కట్ చేయాలని నిర్ణయించారు. ఈ రెస్క్యూ ఆపరేషన్‌లో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, నేవీ, ఆర్మీ నిపుణులతోపాటు ర్యాట్ హోల్ మైనర్స్ ప్రత్యేక నిపుణులు ప్రమాదస్థలానికి చేరుకుని టన్నెల్‌లో నుంచి బురదను బయ టికి పంపే చర్యలు చేపట్టినట్టు తెలుస్తోంది. సహాయక చర్యలపై అధికార యంత్రాంగం ఎలాంటి సమాచారాన్నీ బయ టకు రానివ్వడం లేదు. సొరంగం ప్రవేశ మార్గం వద్దకు మీడియా సహా ఎవరినీ అనుమతించడం లేదు.

మహిళా వర్సిటీకి కావాల్సిన నిధులను సమకూరుస్తాం

- దేశంలోనే ఉత్తమ విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దుతాం : ఉప ముఖ్యమంత్రి భట్టి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలోనే ఉత్తమ విశ్వవిద్యాలయంగా వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీని తీర్చిదిద్దడానికి ప్రజా ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. మహిళా వర్సిటీ అభివృద్ధికి కావాల్సిన నిధులను సమకూరుస్తామని చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచన మేరకు విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఉన్న హెరిటేజ్ బిల్డింగ్‌లను పరిరక్షించడంతోపాటు వాటిని పునరుద్ధరించడానికి కావాల్సిన నిధులను ప్రభుత్వం ఇస్తుందని వెల్లడించారు. మహిళా విద్యార్థులకు కావాల్సిన తరగతి గదులు, ల్యాబ్‌లు, లైబ్రరీ, విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది ఉండడానికి కావాల్సిన వసతి గృహాలు, వీసీ కార్యాలయం, అతిథి గృహం, ఆడిటోరియం, పరిపాలన విభాగానికి సంబంధించిన భవనాల నిర్మాణాలకు సంబంధించిన ప్రదేశాలను పరిశీలించామన్నారు. ఇంజినీరింగ్ అధికారులు రూపొందించిన భవన నిర్మాణ నమూనాలను ఆయన తిలకించారు. ఇటీవల పునరుద్ధరణ చేసిన దర్బార్ మహల్ హెరిటేజ్ బిల్డింగును పరిశీలించారు. దర్బార్ మహల్‌ పై అంతస్తులో 1779-1947 మధ్య, హైదరాబాద్‌లో పనిచేసిన 57 మంది బ్రిటీష్ రెసిడెంట్లకు సంబంధించిన చిత్రపటాలు, వారి పదవీ కాలంలో హైదరాబాద్ నగర రాజకీయ, సాంస్కృతిక, సామాజిక రంగాల్లో చేసిన అభివృద్ధికి సంబంధించి ప్రదర్శించిన చిత్రపటాలను ఆసక్తిగా తిలకించారు. పూర్వపు బ్రిటీష్ రెసిడెన్సికి సంబంధించిన చరిత్రను విజిటర్ మేనేజర్ సతీష్ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు సమగ్రంగా వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు వీరనారి చాకలి ఐలమ్మ యూనివర్సిటీలో నూతనంగా నిర్మించే భవనాలకు సంబంధించి రూపొందించిన నమూనాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యాశాఖ అధికారుల సమక్షంలో ఇంజినీరింగ్ అధికారులు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు వివరించారు. యూనివర్సిటీ ప్రాంగణంలో ఉన్న గార్డెన్‌లో పచ్చదనాన్ని మరింత అభివృద్ధి చేయడంతోపాటు అందరినీ ఆకట్టుకునే విధంగా మూసీని అనుసంధానం చేయడానికి తయారు చేసిన ప్రతిపాదనలను ఆయనకు అధికారులు చూపించారు. వర్సిటీలో నూతనంగా నిర్మాణం చేసే భవనాలు రాబోయే తరాలకు వారసత్వ కట్టడాలుగా చరిత్రలో మిగిలిపోయే విధంగా ఉండాలనీ, ఆ విధంగా ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు భట్టి విక్రమార్క సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పూజారి గౌతమి, టీజీఈడబ్ల్యుఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్ గణపతి రెడ్డి, యూనివర్సిటీ ఇంచార్జ్ వైస్ ఛాన్సలర్ సూర్య ధనుంజయ్, ప్రిన్సిపల్ లోక పావని తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయానికి 20 శాతం బడ్జెట్ కేటాయించాలి

- బడ్జెట్లలో కార్పొరేట్ శక్తులకు వరాలు.. రైతులకు భారాలు తగవు
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

నవతెలంగాణ - ముషీరాబాద్

మానవ మనుగడకు, దేశ అభ్యున్నతికి జీవనాధారమైన వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో 20 శాతం నిధులు కేటాయించాలని రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని విస్మరిస్తూ.. కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం అన్యాయమన్నారు. వివిధ రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో 'కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లు-రైతుల వ్యవసాయంపై ప్రభావం' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం గురువారం హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లి ఓంకార్ భవన్ బీఎస్ హాల్లో ఏఐకేఎఫ్, ఏఐఏడబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వస్కుల మట్టయ్య వరికుప్పల వెంకన్న అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌పై నోట్ ప్రవేశపెట్టగా.. వివిధ రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల రాష్ట్ర బాధ్యులు, నాయకులు చర్చల్లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్ మాట్లాడుతూ.. 70 శాతం ప్రజలు వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్నప్పటికీ పాలకులకు మాత్రం వ్యవసాయంపై పట్టింపు లేదన్నారు. పంటలను మార్కెట్లో దోచుకునే విధంగా, రైతుల భూములను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేలా చట్టాలను రూపొందించి తమ నైజాన్ని తేటతెల్లం చేస్తున్నా రని ఆవేదన వ్యక్తం చేశారు. దేశీయ రైతుల వ్యవసాయానికి ప్రోత్సాహకాలు ప్రకటించకుండా కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహించేలా రాయితీలు, సబ్సిడీలు, మాఫీలు ఇస్తున్నారని చెప్పారు. 52 శాతం మందికి ఉపాధి అవకాశాలు కేవలం వ్యవసాయ రంగంలోనే లభిస్తున్నాయని అన్నారు. ఎరువుల సబ్సిడీ తగ్గించి సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించే విధంగా వ్యవసాయ ఉత్పత్తులను తగ్గించేలా కేంద్రం కుట్ర చేస్తున్నదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రైతులకు ఇచ్చిన హామీల అమలుకు ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి మండల వెంకన్న, తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర అధ్యక్షులు జక్కుల వెంకటయ్య, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాంతయ్య, ఏఐఏడబ్ల్యుఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గోనె కుమారస్వామి, ఏఐఏడబ్ల్యూయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్, ఏఐసీటీయూ రాష్ట్ర కార్యదర్శి రాయబండి పాండు రంగం, ఏఐకేఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్ రెడ్డి హంసారెడ్డి, నాయ కులు ఏపూరి సోమన్న, కుర్ర రవీందర్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, వరికెల కిషన్, మానయ్య మోహన్ నాయక్, మారయ్య, బాలరాజు, జక్కుల నరసింహ మాట్లాడారు.

కుసుమ కుమార్‌కు ఎమ్మెల్సీ ఇవ్వాలి : టి.జగ్గారెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కమ్మ సామాజికవర్గానికి చెందిన జెట్టి కుసుమకుమార్‌కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని అధిష్టానాన్ని కోరనున్నట్టు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తెలిపారు. గురువారం మీడియా ప్రతినిధులతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడారు. తనకు ఇస్తున్న ప్రాధాన్యతతో తృప్తిగా ఉన్నట్టు తెలిపారు. ఇప్పటికే ఈ విషయంపై సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. కమ్మ సామాజిక వర్గం, సెటిలర్లకు అవకాశమిస్తే జీహెచ్ఎంసీ, సాధారణ ఎన్నికల్లో లబ్ది కలుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. 30 ఏండ్లుగా గాంధీభవన్‌కు సేవలందిస్తున్న కుమార్ రావుకు ఎమ్మెల్సీగా అవకాశమిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు.

హెచ్‌సీయూలో ప్రమాదం

- కుప్ప కూలిన నిర్మాణంలో ఉన్న అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్
- ఐదుగురు కార్మికులకు గాయాలు



నవతెలంగాణ-శేరిలింగంపల్లి

రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)లో నిర్మాణంలో ఉన్న యూనివర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ ఎక్స్‌టెన్షన్ బాల్కనీ గురువారం కుప్పకూలింది. ఈ ఘటనలో ఐదుగురు కార్మికులు గాయపడ్డారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. యూనివర్సిటీలో నూతనంగా అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ నిర్మాణం జరుగుతోంది. గురువారం కూడా పనులు కొనసాగాయి. ఉన్నట్టుండి ఒక్కసారిగా బిల్డింగ్ బాల్కనీ కూలిపో యింది. ఈ ఘటనలో ఐదుగురు కార్మికులు గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు, ఇతర అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన కార్మికులను అంబులెన్స్‌లో సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. శిథిలాల కింద మరెవారైనా చిక్కుకొని ఉన్నారేమో అనే కోణంలో పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. అయితే నిర్మాణం లో ఉన్న స్తంభాలు, కాంక్రీట్ స్లాబ్‌లు కూలిపోవడం వల్ల ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. ప్రమాదానికి గల కారణాల ను తెలుసుకోవడానికి యూని వర్సిటీ అధికారులు, స్థానిక పోలీసులు సంయుక్తంగా దర్యాప్తు ప్రారంభిం చారు. నిర్మాణ నిబంధనలు పాటిం చడంలో ఏమైనా లోపాలు ఉన్నాయా అని పరిశీలిస్తున్నారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు త్వరలోనే తెలియ జేస్తామని అధికారులు తెలిపారు.

ప్యారానగర్ డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు నిరసనగా

ఎమ్మెల్సీ ఎన్నికలు బహిష్కరణ



- ఏర్పాటు ఆగే వరకు నిరవధిక సమ్మెలు ఉధృతం : పట్టభద్రులు
- ప్రజాసంఘాల మద్దతుతో నిరసనలు
- జేఏసీ ఆధ్వర్యంలో పాస్టర్స్ అసోసియేషన్ నిరవధిక సమ్మె

నవతెలంగాణ-గుమ్మడిదల

సంగారెడ్డి జిల్లా ప్యారానగర్ డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు నిరసనగా గ్రామంలోని ఎక్కువ శాతం మంది యువకులు గురువారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలను స్వచ్ఛందంగా బహిష్కరించారు. పట్టభద్రుల ఎన్నికల్లో మండల వ్యాప్తంగా 295 మంది ఓటర్లు ఉండగా సాయంత్రం వరకు కేవలం 42 మంది మాత్రమే తమ ఓటు హక్కును వినియోగిం చుకున్నారు. నల్లవల్లి పంచాయతీ పరిధిలోని ప్యారానగర్ డంపింగ్ యార్డ్ ఏర్పాటు నిలిచిపోయే వరకు మండల పరిధిలోని గ్రామాల్లో నిరవధిక సమ్మెను మరింత ఉధృతం చేస్తామని, ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను విద్యావంతులు, మేధావులు స్వచ్ఛందంగా బహిష్కరిం చినట్టు తెలిపారు.

ఈ సందర్భంగా మండల జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు మాట్లా డుతూ.. అన్ని ప్రజాసంఘాల మద్దతుతో జిల్లా, రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు, నిరవధిక సమ్మెలను కొనసాగిస్తామన్నారు. ఈ ప్రాంత రైతుల ఆత్మగౌరవానికి, ప్రభుత్వానికి మధ్యన జరుగుతున్న పోరాటాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం సమాలోచన చేసి డంపింగ్ యార్డ్ ఎత్తివేసే దిశగా అడుగులు వేయాలని హెచ్చరించారు. ప్యారా నగర్ అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డ్ వెంటనే నిలిపి వేయాలని పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మెను కొనసాగించారు.

భయభ్రాంతులకు గురి చేస్తే చట్టపరమైన చర్యలు

ఆర్‌డీ రవీందర్ రెడ్డి

పట్టభద్రుల ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని ఆర్డీవో రవీందర్ రెడ్డి సందర్శించి మీడియాతో మాట్లాడారు. ఓటు హక్కును వినియోగించుకునే వారిని ఎవరైనా అడ్డుకోవడంగాని, భయ భ్రాంతులకు గురి చేసినట్టయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రాంత సమస్యలు ఏమైనా ఉన్నట్టయితే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వారి సమస్యను పరిష్కరించే దిశగా తాము పని చేస్తామని సూచించారు. ఈ కార్య క్రమంలో ఆర్ఐ శ్రీనివాస్ రెడ్డి, సీఐ నయీముద్దీన్ వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

వేలాల గుట్టపై అగ్ని ప్రమాదం

అప్రమత్తమైన అటవీ అధికారులు



నవతెలంగాణ-జైపూర్

మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం వేలాల గుట్టపై బుధవారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. ఫైర్ బ్లోయర్లతో మంటలు ఆర్పేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. జాతరకు తరలివచ్చే సందర్శకులు వంటావార్పు తర్వాత నిప్పును చల్లార్చాలని మంచిర్యాల డివిజన్ పరిధి అటవీ అధికారులు సూచిం చారు. అదేవిధంగా జాతర ఏర్పాట్లు పరిశీలించేందుకు వచ్చిన రామ గుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ అగ్ని ప్రమాదాలకు తావివ్వకుండా ప్రతి ఒక్కరూ వంటల అనంతరం నిప్పును ఆర్పాలని చెప్పినా ఫలితం లేకుండా పోయింది. బుధవారం రాత్రి గటు మల్లన్న సన్నిధిలో విధులు నిర్వహిస్తున్న బీట్ ఆఫీసర్ శ్రీధర్ గుట్టకు అగ్గి అంటు కోవడం గుర్తించారు.

వెంటనే టీజీఎఫ్ డీసీ సంస్థ వాచర్ సాయి కిరణ్‌కు సమా చారం అందించిన ఫైర్ బ్లోయర్‌తో మంటలు ఆర్పేశారు. వేలాల గట్టుమల్లన్న సన్నిధిలో జాగరణ చేయడం కోసం వచ్చిన సందర్శకుల్లో కొందరి నిర్లక్ష్యం కారణంగా అగ్ని ప్రమాదం జరిగివుం టుందని అధికారులు అభిప్రా యపడు తున్నారు. విషయం తెలిసిన వెంటనే మంటలను ఆర్పేసిన అటవీ అభివృద్ధి సంస్థ వాచర్ సాయి కిరణ్‌ను మంచిర్యాల రేంజ్ ఆఫీసర్ రత్నాకర్ రావు, అటవీ అభివృద్ధి సంస్థ ప్లాంటేషన్ మేనేజర్ గోగు సురేష్ అభినందించారు.

ఓటర్లు పోటెత్తారు

కరీంనగర్..పట్టభద్రుల, టీచర్ ఎమ్మెల్సీ స్థానాలకు పోలింగ్

- ఉపాధ్యాయ ఓటర్లు 27,088మంది కాగా.. 91.90శాతం ఓటింగ్
- నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో గ్రాడ్యుయేట్లు 355159 మంది.. 70.42శాతం పోలింగ్
- గ్రాడ్యుయేట్ల ఓటింగ్‌లో నిజామాబాద్ టాప్
- టీచర్ ఓటింగ్‌లో 95.03శాతంతో ముందు వరుసలో మెదక్
- మార్చి 3న ఓట్ల లెక్కింపు.. అధికారుల పకడ్బందీ ఏర్పాట్లు

నవతెలంగాణ - కరీంనగర్/ ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధులు

ఉమ్మడి కరీంనగర్- ఆదిలాబాద్- నిజామాబాద్- మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. మొత్తం ఓటర్లలో గ్రాడ్యుయేట్స్ 70.42 శాతం ఓటు హక్కు వినియోగించుకోగా, ఉపాధ్యాయ ఓటర్లు 91.90 శాతం ఓట్లు వేశారు. అయితే గ్రాడ్యుయేట్స్, టీచర్ ఓట్లు ఎక్కువగా ఉన్న ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే ఓటింగ్ శాతం తగ్గింది. మొత్తంగా నాలుగు ఉమ్మడి జిల్లాల్లో అత్యధికంగా గ్రాడ్యుయేట్ పోలింగ్ నిజామాబాద్‌లో 76.18శాతం నమోదు కాగా.. టీచర్ ఎమ్మెల్సీలో మెదక్ జిల్లా ఉపాధ్యాయులు 95.03శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారు. నాలుగు ఉమ్మడి జిల్లాలోని 15 జిల్లాల పరిధిలో చిన్న చిన్న ఘటనలు మినహా ఆయా కలెక్టర్ల పర్యవేక్షణలో పోలింగ్ సరళి ప్రశాంతంగా ముగిసింది. అనంతరం ఆయా జిల్లాల నుంచి బ్యాలెట్



బాక్స్‌లను కరీంనగర్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియానికి తరలించారు. మార్చి 3వ తేదీన ఓట్లను లెక్కించేందుకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.

ఉమ్మడి కరీంనగర్- ఆదిలాబాద్- నిజామాబాద్- మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో పట్టభద్రులు 70.42 శాతం ఓటర్లు పాల్గొన్నారు. ఈ నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో 3,55,159 మంది ఓటర్లు ఉండగా.. ఇందులో 2,50,106 మంది (70.42శాతం) ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో నిజామాబాద్ జిల్లాలోనే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకి 76.18శాతం ఓటింగ్ నమోదై టాప్‌లో ఉండగా.. ఉపాధ్యాయ ఎమ్మెల్సీలో మెదక్ జిల్లా 95.03 శాతం నమోదు చేసుకుని మొదటి వరుసలో నిలిచింది. ప్రధానంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే అత్యధికంగా ఉన్న 1,60,260 మంది పట్టభద్రులకుగాను 1,01,052మంది (63శాతం) ఓటు హక్కు వినియోగించుకున్నారు.

- కరీంనగర్ జిల్లాలో 71,545 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లకుగాను 46,247 మంది మాత్రమే (64.64శాతం) ఓటు హక్కు వినియోగించుకున్నారు. టీచర్ ఎమ్మెల్సీకి సంబంధించి 4,305 మంది ఓటర్లకుగాను 3871 మంది 89.92 శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారు.
- జగిత్యాల జిల్లాలో 35281మంది పట్టభద్రుల ఓటర్లకు 26494 మంది (70.46శాతం) మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. టీచర్ ఎమ్మెల్సీ పరిధిలో ఈ జిల్లాలోని 1752 మందికిగాను 1635 మంది (92.43శాతం) ఓట్లేశారు.
- రాజన్నసిరిసిల్ల జిల్లాలో 22,397 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లకుగాను 15,344 మంది (68.51)శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారు. టీచర్ ఎమ్మెల్సీలో ఈ జిల్లాలోని 950మంది ఉపాధ్యాయులగాను 899మంది (94.63శాతం) ఓట్లేశారు.
- పెద్దపల్లి జిల్లాలో 31,037 మంది పట్టభద్రుల ఓటర్లకుగాను 21,259 మంది (68.50శాతం) ఓటు హక్కు వినియోగించుకున్నారు. టీచర్ ఎమ్మెల్సీ పరిధిలో 1111మందికిగాను 1049 మంది (94.42శాతం)ఓట్లేశారు.

ఒక్క ఓటుకు నలుగురు సిబ్బంది..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఒకటి, రెండు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలంలో ఒకే ఓటరు ఉండగా.. పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి నలుగురు సిబ్బందిని కేటాయించారు. భీంపూర్ మండలంలో పట్టభద్ర ఓటర్లు నిరసన చేపట్టారు. ప్రధాన రహదారి అస్తవ్యస్తంగా ఉండటంతో అనేక ఏండ్లుగా ఇబ్బందులు పడుతున్నామని ఓటింగ్‌లో పాల్గొనబోమని బహిష్కరించారు. సీఐ సాయినాథ్ వారితో మాట్లాడి నచ్చజెప్పి ఓటేయించారు. మందమర్రిలో పోలింగ్ కేంద్రం సమీపంలో బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య వాగ్వివాదం జరిగింది. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలోని తీగల్‌పహాడ్ పోలింగ్ కేంద్రం వద్ద కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. పోలీసులు కాంగ్రెస్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని బీజేపీ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. దీంతో కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణ తలెత్తి ఇరు గ్రూపులు రాళ్లురువ్వుకున్నాయి. విషయం తెలియగానే డీసీపీ భాస్కర్, సీపీ శ్రీనివాస్ ఘటనా స్థలానికి చేరుకొని ఇరు గ్రూపులను చెదరగొట్టారు.

జిల్లా	గ్రాడ్యుయేట్ ఓటర్లు	ఓట్లేసిన వారు	ఓటింగ్ శాతం
ఆసిఫాబాద్	6137	4546	74.08
మంచిర్యాల	30921	20811	67.30
ఆదిలాబాద్	14935	10375	69.47
నిర్మల్	17141	12088	70.52
నిజామాబాద్	31574	24388	77.24
కామారెడ్డి	16410	12820	78.12
జగిత్యాల	35.281	24.862	70.47
పెద్దపల్లి	31.037	21.259	68.50
కరీంనగర్	71.545	46247	64.64
సిరిసిల్ల	22.397	15.394	68.73
సంగారెడ్డి	25652	18774	73.19
మెదక్	12472	9387	75.26
సిద్దిపేట	32589	23736	72.83
హన్మకొండ	4585	3445	75.14
భూపాపల్లి జిల్లా	2483	1974	79.50
మొత్తం	87544	250106	70.42

జిల్లా	ఉపాధ్యాయ ఓటర్లు	ఓట్లేసిన ఉపాధ్యాయులు	ఓటింగ్ శాతం
ఆసిఫాబాద్	470	424	90.21
మంచిర్యాల	1664	1527	91.77
ఆదిలాబాద్	1593	1478	92.78
నిర్మల్	1966	1614	82.10
నిజామాబాద్	3751	3468	92.46
కామారెడ్డి	2011	1883	93.64
జగిత్యాల	1769	1635	92.43
పెద్దపల్లి	1111	1049	94.42
కరీంనగర్	4305	3871	89.92
సిరిసిల్ల	950	899	94.63
సంగారెడ్డి	2690	2490	92.57
మెదక్	1347	1280	95.03
సిద్దిపేట	3212	3046	94.83
హన్మకొండ	166	154	92.77
భూపాపల్లి జిల్లా	83	77	92.77
మొత్తం	27088	24895	91.90

మమ్మల్ని అడిగి హామీలిచ్చారా?

- దమ్మూధైర్యముంటే ప్రాజెక్టులు అడ్డుకున్నట్టు నిరూపించు : సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సవాల్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మమ్మల్ని అడిగి హామీలిచ్చి అధికారంలోకి వచ్చారా? ప్రధానమంత్రి నరేంద్రమోడీ, బీజేపీ ప్రభుత్వం డబ్బులిస్తేనే అభివృద్ధి పనులు చేస్తానని చెప్పాడా? ప్రాజెక్టులకు రూపకల్పన చేశాడా? రాష్ట్రాలు ఇలా బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేయడం ఎంతవరకు సబబు? అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. దమ్మూధైర్యముంటే ప్రాజెక్టులు అడ్డుకున్నట్టు నిరూపించాలని రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఉన్నది లేనట్టు లేనిది ఉన్నట్టు చెప్పడం కొందరికి బాగా అలవాటైంది. రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి అనేక ప్రాజెక్టులను ఎప్పటికప్పుడు వివిధ విభాగాలతో మాట్లాడి, ఉత్తరాలు రాస్తూ అభివృద్ధి పనులు జరిగేలా చూస్తున్నాను. ఇక్కడ బెదిరింపు రాజకీయాలు చేస్తే భయపడేవారు లేరు. రేవంత్ రెడ్డి మాటలను నమ్మేవారెవ్వరూ లేరు. అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్ రెడ్డిని నమ్మి ఇపుడు ఆయన ఎలాంటి గాలి మాటలు మాట్లాడుతారో ప్రజలు అర్థం చేసుకున్నారు. నేనేం ఆయన, కాంగ్రెస్ పార్టీ దయాదాక్షిణ్యాలతో పార్లమెంట్‌లోకి రాలేదు.. నేను తెలంగాణ ప్రజలకు మాత్రమే జవాబుదారీని. రేవంత్ మాటలకు కాదు. ముఖ్యంగా ఒక్క విషయంలో అయినా ఆయనకు దమ్ము, ధైర్యం ఉంటే నేను ఒక్క ప్రాజెక్టును అడ్డుకున్నట్టు నిరూపించాలని సవాలు చేస్తున్నాను. చేతకాని ముఖ్యమంత్రి, దమ్ము లేని ముఖ్యమంత్రి, మాటలు చెప్పి చేతులు దులుపుకొనే ప్రయత్నం చేస్తున్నారు. ప్రాజెక్టులకు రూపకల్పన చేస్తే ఎలాంటి ఆర్థిక ప్రణాళిక చేస్తారో కూడా ఓ కార్యాచరణ లేదు. మెట్రో ప్రాజెక్టుకు సంబంధించి ఎలా డబ్బులు తెచ్చుకుంటారో కూడా ఆయనకు క్లారిటీ లేదు. ఇటీవలే ప్రాజెక్టును కేంద్రానికి పంపారు. అది అన్ని మినిస్ట్రీలకు సర్క్యులేట్ చేయాలి. ఏదో ఇలా పంపగానే అలా అయిపోదు. దానికో సిస్టం ఉంటుంది. ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి అవగాహన లేకుండా దుందుడుకుగా మాట్లాడుతున్నారు' అని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

అసమర్థ సీఎం రేవంత్‌రెడ్డి : కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి అసమర్థుడనీ, పాలన చేతగాని సీఎంగా చరిత్రకెక్కుతారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒక ప్రకటనలో విమర్శించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదానికి గత సర్కారే కారణమని చిల్లర మాటలు మానాలని హితవు పలికారు. అధికారం చేపట్టి ఏడాది గడుస్తున్నా ఇంకా తన వైఫల్యాలను బీఆర్ఎస్‌పై నెట్టడం ఆపాలని సూచించారు. జీఎస్ఐ, ఇంజినీరింగ్ నిపుణులతో సంప్రదించకుండానే అవినీతి సొమ్ముల కోసం లాలూచీ పడి పాత యంత్రాలతో ప్రారంభించడంతోనే ప్రమాదం జరిగిందని తెలిపారు. రేవంత్ రెడ్డి ధన దాహంతోనే ఎనిమిది మంది కార్మికులు ప్రమాదంలో చిక్కుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వారు బతికున్నారో? లేదో? తెలియని పరిస్థితి నెలకొందని వాపోయారు. దీనికి పూర్తి బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. సీఎంకు చిత్తశుద్ధి ఉంటే కావాల్సిన విచారణలు చేసుకోవచ్చని సవాల్ విసిరారు. అరచేతిలో స్వర్గం చూపించేలా ఇచ్చిన హామీలను అమలు చేయడం చేతకాకనే ప్రజలను పక్కదారి పట్టించేందుకు సీఎం మాట్లాడుతున్నారని విమర్శించారు.

సాంకేతికతను బాధ్యతగా వాడుకోవాలి

సాంకేతికతను బాధ్యతాయుతంగా వాడుకోకుంటే భారీ విధ్వంసం జరిగే అవకాశాలు న్నాయని కేటీఆర్ అన్నారు. బెంగుళూర్‌లో గురువారం జరిగిన టెక్ ఎంట్రప్రెన్యూర్ ఇన్నోవేషన్ 2025 సమ్మిట్‌లో "డ్రైవింగ్ డిజిటల్ ఇండియా: టెక్నాలజీ అభివృద్ధికి మార్గదర్శకతలు, ఆవిష్కరణలు" అనే అంశంపై ఆయన కీలకోపన్యాసం చేశారు. డ్రోన్ టెక్నాలజీని వ్యవసాయానికి వాడుకోవాలా? యుద్ధానికి వాడుకోవాలా? నిర్ణయించుకోవాల్సింది మనమే అని అన్నారు. "భవిష్యత్ నిర్మాణం అంటే కేవలం రేపటి రోజుల్లో జీవించడం కాదు. దాన్ని రేపటికి నిర్మించడం అని అర్థం. ఇదే స్ఫూర్తితో సామాజిక ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని సాంకేతికత అభివృద్ధి జరగాలి. సాంకేతిక ప్రగతి పెరుగుతున్నా సైబర్ నేరాలు ఎందుకు పెరుగుతున్నాయో ఆలోచించాలి. టెక్నాలజీలో మానవీయ విలువలు, పర్యావరణం తదితర అంశాలను జోడించి అభివృద్ధి చేయాలి" అని కేటీఆర్ చెప్పారు. ఆ దిశగా నిపుణులు కొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని సూచించారు.

కట్టు కథలను ప్రారంభంలోనే అడ్డుకుందాం

- అందరి వద్ద సమాచారం ఉంచుదాం : కార్యదర్శిని నివేదిక కోరిన మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు
- ఎరువుల లభ్యతపై ఉన్నతస్థాయి సమీక్ష

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కొంత మంది స్వప్రయోజనాల కోసం కొన్ని వేదికలను ఆధారంగా చేసుకుని రైతాంగాన్ని ఆందోళనకు గురి చేసే ప్రయత్నం చేస్తున్నారని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తెలిపారు. అలాంటి వారికి చిన్న అవకాశం ఇవ్వకుండా జాగ్రత్తగా ఉండాలనీ, ఇలాంటి కట్టుకథల్ని ప్రారంభంలోనే కొట్టేసే విధంగా సమాచారం ప్రతి ఒక్కరి దగ్గర అందుబాటులో ఉంటే బాగుంటుందని సూచించారు. ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకుంటే బాగుంటుందో నివేదిక సమర్పించాలని ఆ శాఖ కార్యదర్శి రఘునందన్ రావును కోరారు. గురువారం హైదరాబాద్ లోని సచివాలయంలో ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎరువుల కొనుగోలు కేంద్రాలను తెరిచి రైతులకు అందుబాటులో ఉండే విధంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులను, సహకార సంఘాల కేంద్రాల అధికారులను ఆదేశించారు. మార్కెఫెడ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులతో ఎరువుల లభ్యతపై సమీక్షించి రైతులకు కావలసిన యూరియాను ఇకముందు కూడా ముందస్తుగా తెప్పించి అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఈ క్రమంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని మంత్రి కోరారు. పంట కాలాని కంటే ముందే మార్క్‌ఫెడ్ దగ్గర ప్రారంభ నిల్వలు ఉంచుకొని, రోజు వారీ నివేదికల ఆధారంగా కట్టుదిట్టంగా అన్ని జిల్లాలకు రానున్న పదిరోజులకు సరిపడా యూరియాను ముందుగానే సరఫరా చేసి, పంపిణీలో నిరంతరం పర్యవేక్షించిందని తెలిపారు.

అంతకు ముందు అధికారులు, 2024-25 సీజన్‌లో ఇప్పటివరకు 10.36 ఎల్ఎంటీల యూరియా అందుబాటు లో ఉంచినట్టు తెలిపారు. దీంట్లో రైతులు 9.21 ఎల్ఎంటీల యూరియాను కొనుగోలు చేసినట్టు చెప్పారు. ఇప్పటికీ 1.08 ఎల్ఎంటీల యూరియా అందుబాటులో ఉందని అధికారులు వివరించారు. రాష్ట్రానికి కావాల్సిన యూరియా కోసం కేంద్రంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్టు వెల్లడించారు. వివిధ కంపెనీలకు చెందిన సుమారు 41,000 మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి రానుందని, అది కాకుండా త్వరితగతిన మరో 30,000 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరాకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు.

వర్గీకరణను అడ్డుకుంటున్న బీజేపీ

- రాష్ట్రంలో నామరూపాల్లేకుండా చేస్తాం : దేవని సతీష్ మాదిగ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వర్గీకరణను అడ్డుకుంటున్న బీజేపీని రాష్ట్రంలో నామరూపాల్లేకుండా చేస్తామని తెలంగాణ మాదిగ దండోరా వ్యవస్థాపక అధ్యక్షులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేవని సతీష్ మాదిగ హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. వర్గీకరణ వ్యతిరేకి మంద కృష్ణ మాదిగకు అండగా ఉంటూ బీజేపీ అడ్డుకుంటున్నదని సతీష్ మాదిగ ఆరోపించారు. కమిషన్ రిపోర్ట్ ఇవ్వకముందే తాను చెప్పినట్టే వర్గీకరణ జరగాలంటూ మంద కృష్ణ మాదిగ కమిషన్‌ను, ప్రభుత్వాన్ని బెదిరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాదిగలకు న్యాయం జరుగుతున్న సమయంలో మాదిగ డప్పులతోనే అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు ఎస్సీల వర్గీకరణ చేయాలని, రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ మాదిగలు అండగా ఉన్నారని తెలిపారు.

అదే ఉత్కంఠ..

(మొదటిపేజీ తరువాయి)

మంత్రులు, రెండు జిల్లాల కలెక్టర్లు, డిజాస్టర్ మేనేజ్‌మెంటు బృందాలతోపాటు వందలాది మంది సహాయక సిబ్బంది కార్మికులను కాపాడేందుకు 24 గంటలపాటు టన్నెల్ లోపలకు, బయటకు తిరుగుతున్నారు. టన్నెల్ బోరింగ్ మెషిన్(టీబీఎం)పై సొరంగంపైకప్పు కూలి పడిన సంగతి తెలిసిందే. ఇప్పుడా శిథిలాలను తొలగిస్తే తప్ప అసలు నిజం బయటకు రాదు. కార్మికుల ప్రాణాలు సురక్షితమా ? కాదా ? అనేది మరో 24 గంటలు గడిస్తేగాని చెప్పలేమని మంత్రులే స్వయానా వెల్లడిస్తున్నారు. అమెరికాకు చెందిన రాబిన్‌సన్ మైనింగ్ కంపెనీ ప్రత్యేక యంత్రాలు, స్పెషల్ కెమెరాలతో అవతల ఉన్న పరిస్థితిని పసిగట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలు విఫలమయ్యాయి. గతంలో ఉత్తరాఖండ్‌లో జరిగిన ఈ తరహా ప్రమాదంలో మూడు వారాల తర్వాత కూడా కార్మికులను రక్షించిన నేపథ్యంలో ఎస్ఎల్‌బీసీ ఘటనలోనూ కార్మికులు సురక్షితంగా బయటకొస్తారనే ఆశాభావాన్ని ఇటు అధికారులు, అటు మంత్రులు వ్యక్తం చేస్తున్నారు. అంతర్జాతీయ నిపుణులతోపాటు అత్యాధునిక యంత్ర పరికరాలైన ప్లాస్మా కట్టర్లు, హైగ్రేడ్ షట్టర్లు, శిథిలాలను తొలగించే యంత్రాలను వాడుతున్నారు. ' ఇది సవాళ్లతో కూడిన ఆపరేషన్. అత్యంత నిష్ణాతులైన నిపుణులు ఇందులో పాల్గొంటున్నారు. కార్మికులను కాపాడేందుకు తమ ప్రాణాలను లెక్కచేయకుండా సహాయక చర్యల్లో పాల్గొంటున్నారని' మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు. బాధితులతోపాటు రక్షించేవారిని భద్రత కోసం ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామని చెప్పారు. ఇదిలావుండగా కాంట్రాక్టు సంస్థ కార్మికుల ప్రాణాలను రక్షించడంలో మీనమేషాలు లెక్కబెడుతున్నది. టన్నెల్ బోరింగ్ మెషిన్(టీబీఎం) తొలగించడానికి తొలుత జేపీ నవయుగ కంపెనీలు నిరాకరించినట్టు తెలిసింది. దీని విలువ రూ. 100 కోట్ల వరకు ఉంటుందనీ, మళ్లీ పనులు చేయాలంటే కొత్త యంత్రాన్ని తెప్పించడానికి సమయం పడుతుందనే ఉద్దేశంతో అలా అన్నప్పటికీ, ప్రభుత్వం నుంచి ఒత్తిడి రావడంతో టీబీఎంను కట్‌చేయడానికి అంగీకరించినట్టు తెలిసింది. కన్వేయర్ బెల్టును సైతం మరమ్మతు చేశారు. టీబీఎంను ముక్కలు ముక్కలుగా కట్‌చేయడానికి పాస్మా, గ్యాస్ కట్టర్లను ఉపయోగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రెండు, మూడు రోజుల్లో సహాయక చర్యలను పూర్తి చేస్తామనీ, మరో మూడు నెలల్లో సొరంగం పనులు మళ్లీ పునరుద్ధరిస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్ ప్రకటించడం గమనార్హం.

హిందీ వల్లే ప్రాంతీయ భాషలు కనుమరుగు

- తమిళనాడు సీఎం స్టాలిన్ వ్యాఖ్యలు

చెన్నై : హిందీ భాష వల్ల పలు ప్రాంతీయ భాషలు కనుమరుగైపోయాయని తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేశారు. బలవంతంగా ప్రజలపై హిందీని రుద్దేందుకు చేసిన ప్రయత్నాలు, చేపడుతున్న చొరవలతో ప్రాచీనమైన పలు మాతృభాషలు గల్లంతయ్యాయని ఆయన విమర్శించారు. ఆ మాతృభాషల స్థానాన్ని హిందీ ఆక్రమించడంతో నెమ్మదిగా ప్రాచీనమైన ఆ ప్రాంతీయ మాతృ భాషలన్నీ కనుచూపు మేరలో వినిపించకుండా పోయాయన్నారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. ఇలా ఎన్ని భాషలు అదృశ్యమయ్యాయో మీకు తెలుసా అంటే ఇతర రాష్ట్రాల్లోని సోదర సోదరీమణులను ఆయన ప్రశ్నించారు. భోజ్‌పురి, మైథిలి, అవాధి, బ్రజ్, బుందేలి, గర్హ్వాలీ, కుమౌని, మాఘి, మార్వారి, మాల్వి, ఛత్తీస్‌ఘరి, సంథాలి, ఆంగిక, హెూ, ఖరియా, ఖోర్తా, కుర్మాలి, కురుఖ్, ముందారి ఇలా దాదాపు 25 భాషలు గత వందేండ్లలో ఆచూకీ లేకుండా పోయాయని, అవి 'మనుగడ కోసం గాలిస్తున్నాయి' అని వ్యాఖ్యానించారు. ఇలా హిందీని బలవంతంగా ప్రజలపై రుద్దే ప్రయత్నాల వల్ల చాలా నష్టం జరుగుతోందన్నారు. ఉత్తరప్రదేశ్, బీహార్‌లు ఎన్నటికీ హిందీ రాష్ట్రాలు కాలేవని ఆయన వ్యాఖ్యానించారు. ఆ రాష్ట్రాల నిజమైన మాతృభాషలు గతకాలపు అవశేషాలుగా మిగిలిపోయాయన్నారు. 'ఇది ఎక్కడ ముగుస్తుందో మాకు తెలుసు.' అంటూ అందుకే తమిళనాడు దీన్ని ప్రతిఘటిస్తోందని స్టాలిన్ పేర్కొన్నారు. "తమిళం మేల్కొంది, తమిళుల సంస్కృతి కాపాడబడింది.' అని వ్యాఖ్యానించారు. తమిళంలో కొన్ని మాటలను ఆయన ఆ పోస్టులో పంచుకున్నారు. హిందీ భాషను బలవంతంగా ప్రజలపై రుద్దే విషయమై ఆయన డీఎంకే పార్టీ కార్యకర్తలకు మూడో లేఖ రాశారు. రాజకీయ రంగంలో డిఎంకెను తీవ్రంగా వ్యతిరేకించే రాజకీయ పార్టీలు కూడా హిందిని వ్యతిరేకిస్తాయని చెప్పారు. కేంద్రం తీసుకువచ్చిన త్రి భాషా విధానాన్ని కూడా ఆయన తీవ్రంగా విమర్శించారు. ఇందులో భాగంగా హిందీ లేదా సంస్కృతాన్ని తప్పనిసరిగా నేర్చుకోవాలని ఆదేశించడం లేదని, మరే ఇతర రాష్ట్రాల ప్రాంతీయ భాషనైనా నేర్చుకోవచ్చునని ఆ విధానం పేర్కొంటుందని బీజేపీ, దాని మద్దతుదారులు చేస్తున్న వాదనను స్టాలిన్ తిప్పికొట్టారు. ఒకసారి దీన్ని పరిశీలిస్తే చాలా రాష్ట్రాల్లో హిందీ లేదా సంస్కృతానికే ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. ఈ పరిస్థితి ఎంతకాలం కొనసాగుతుందో చెప్పలేమన్నారు. బీజేపీ పాలిత రాజస్థాన్‌లో ఉర్దూ టీచర్ల స్థానే సంస్కృత టీచర్లను నియమించినట్లు వెలుగులోకి వచ్చిందన్నారు. తమిళనాడు త్రిభాషా సూత్రాన్ని ఆమోదిస్తే, మాతృభాష బహిష్కరించబడుతుందని, భవిష్యత్తుల్లో 'సంస్కృతీకరణ పథకం' అమలవుతుందని స్టాలిన్ విమర్శించారు.

సిల్లీ వ్యాఖ్యలు

కాగా, స్టాలిన్ విమర్శలను సిల్లీ వ్యాఖ్యలుగా బీజేపీ కొట్టేపారేసింది. ప్రత్యేకంగా ఏ ఒక్క రాష్ట్రంలో ఏ ఒక్క భాషను రుద్దేలా కొత్త విద్యా విధానాన్ని తీసుకురాలేదని పేర్కొంది. అనవసరంగా తమిళనాడు ప్రభుత్వం ఇటువంటి రాజకీయ వైఖరి తీసుకుందని విమర్శించింది.

15 శాతం సీట్లకు 4 కేటగిరీల వారు అర్హులు

- స్థానికులకే 85 శాతం ప్రవేశాలు
- ఇంజినీరింగ్, వృత్తి కోర్సుల ప్రవేశాలపై ప్రభుత్వ నిర్ణయం
- సవరణ మార్గదర్శకాలు విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్, వృత్తి విద్యా కోర్సుల ప్రవేశాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో జారీ చేసిన మార్గదర్శకాలను సవరించింది. ఇంజినీరింగ్, వృత్తి విద్యా కోర్సుల్లో 85 శాతం సీట్లు స్థానికులకే కేటాయించింది. మిగిలిన 15 శాతం సీట్లను అన్ రిజర్వుడు కోటాకు సంబంధించి నాలుగు రకాల వారు అర్హులని స్పష్టం చేసింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా గురువారం ఉత్తర్వులు (జీవోనెంబర్ 15) విడుదల చేశారు. 1974 నాటి రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ) పరిధిలో స్థానికులకు 85 శాతం సీట్లు కేటాయించామని తెలిపారు. 1974 రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం తెలంగాణలో తొమ్మిది, పది, 11, 12వ తరగతి లేదంటే ఆరు నుంచి 12వ తరగతి వరకు ఏడేండ్లలో నాలుగేండ్లు అంతకంటే ఎక్కువ ఏండ్లు ఇక్కడ చదివితే తెలంగాణ స్థానికులుగా పరిగణిస్తారు. వారికి 85 శాతం సీట్లు దక్కుతాయి. మిగిలిన 15 శాతం అన్ రిజర్వుడు కోటాకు సంబంధించి నాలుగు రకాల వారిని అర్హులుగా పరిగణిస్తామని యోగితారాణా తెలిపారు. ఓయూ పరిధిలో ఉన్న అభ్యర్థులందరూ స్థానికులుగానే ఉంటారని పేర్కొన్నారు. తెలంగాణలో పదేండ్లు నివాసముండి ఇతర రాష్ట్రాల్లో చదివిన విద్యార్థులు లేదా వారి తల్లిదండ్రులు తెలంగాణలో పదేండ్లు ఉండి ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగం చేసే వారి పిల్లలు అర్హులని స్పష్టం చేశారు. తెలంగాణలో పనిచేస్తున్న రాష్ట్ర లేదా కేంద్ర ప్రభుత్వ ప్రభుత్వ రంగ సంస్థలు, స్థానిక సంస్థలు, విశ్వవిద్యాలయాలు, సహకార రంగ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల పిల్లలు కూడా అర్హులుగా ఉంటారని వివరించారు. తెలంగాణలో పనిచేస్తున్న భార్యాభర్తలైన (స్పౌజ్) ఉద్యోగుల్లో ఎవరైనా ఒకరు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థలు, స్థానిక సంస్థలు, విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయం లేదా ఇతర సంస్థలు, సహకార సంస్థల్లో పనిచేస్తున్న వారి పిల్లలు కూడా 15 శాతం కోటాలో అర్హులని తెలిపారు.

తెలంగాణ రాష్ట్రం 2014, జూన్ రెండున ఆవిర్భవించింది. 2014-15 విద్యాసంవత్సరం నుంచి రాష్ట్రంలో ఇంజినీరింగ్ సహా వృత్తి విద్యాకోర్సుల్లో 85 శాతం సీట్లు తెలంగాణ స్థానికులకు, మిగిలిన 15 శాతం అన్ రిజర్వుడు కోటాలో తెలంగాణతోపాటు ఏపీ విద్యార్థులకు కూడా ప్రవేశాలు కల్పించే విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అవలంభించింది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014 ప్రకారం ఆ విధానాన్ని పాటించింది. పదేండ్లు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఉన్నది. అందుకే ప్రస్తుత విద్యాసంవత్సరం వరకు తెలంగాణ వారికి 85 శాతం సీట్లు, తెలంగాణతోపాటు ఏపీ విద్యార్థులకు కూడా కలిపి 15 శాతం సీట్లను భర్తీ చేసింది. ఈ విధానంలో రాష్ట్ర ప్రభుత్వం మార్పులు చేసింది. అందుకనుగుణంగా గతంలో జారీ చేసిన ఉత్తర్వులను సవరణ చేస్తూ గురువారం జీవోనెంబర్ 15ను విడుదల చేసింది. తాజా నిర్ణయంతో తెలంగాణ స్థానికులతోపాటు ఇక్కడ నివాసమున్న వారికి వంద శాతం సీట్లు కేటాయించింది. ఏపీ విద్యార్థులు తెలంగాణ ఎప్‌సెట్ సహా వివిధ ప్రవేశ పరీక్షలకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం లేదు. దీంతో ఏపీ విద్యార్థులు తెలంగాణలో సీట్లు పొందలేరు.

రేపటి నుంచి ఎప్‌సెట్ దరఖాస్తుల స్వీకరణ

రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్ (ఎంసెట్) దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఆన్‌లైన్‌లో శనివారం నుంచి ప్రారంభం కానుంది. స్థానికతపై స్పష్టత రావడంతో షెడ్యూల్ శుక్రవారం విడుదల చేసే అవకాశమున్నది. ఏప్రిల్ 29 నుంచి మే ఐదో తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఎప్‌సెట్ రాతపరీక్షలు జరుగుతాయి. వివరాల కోసం https://eapcet.tgche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది.

వక్ఫ్ బిల్లు సవరణలకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం

(మొదటిపేజీ తరువాయి)

సమావేశాల్లో ఈ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి, చర్చించేందుకు మార్గం సుగమమైంది. బీజేపీ ఎంపీ జగదాంబిక పాల్ ఆధ్వర్యంలో ఏర్పాటైన జేపీసీ.. కేంద్ర వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులను చేర్చడం, వివాదాలకు సంబంధించిన విచారణలను జిల్లా కలెక్టర్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ సీనియర్ ఉద్యోగికి అప్పగించడం, రాష్ట్ర వక్ఫ్ బోర్డులో ముస్లిం ఓబీసీ వర్గం నుంచి ఓ వ్యక్తిని నియమించి, ఆయన అధికారాలను విస్తృతం చేయడం వంటి సవరణలను సూచించింది. ఈ బిల్లుపై జేపీసీ నివేదికను ఫిబ్రవరి 13న పార్లమెంటు ఉభయ సభలలో ప్రవేశపెట్టారు. దీనిపై ప్రతిపక్షాలు తీవ్ర నిరసనలు వ్యక్తం చేశాయి. జనవరిలో అధికార బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ సభ్యులు ప్రతిపాదించిన అన్ని సవరణలనూ కమిటీ ఆమోదించింది. అయితే క్లాజుల వారీగా చర్చ సందర్భంగా ప్రతిపక్ష సభ్యులు సూచించిన ప్రతి మార్పునూ తిరస్కరించింది. 44 సవరణలను ప్రతిపాదించగా, ఎన్‌డీఏ సభ్యులు సూచించిన 14 మార్పులను ప్యానెల్ ఓటింగ్‌తో ఆమోదించింది. బిల్లులోని కీలక నిబంధనలలో రాష్ట్ర వక్ఫ్ బోర్డులకు కనీసం ఇద్దరు ముస్లిమేతర సభ్యులను నియమించడం, ఒక ప్రాపర్టీ వక్ఫ్ ఆస్తిగా అర్హత పొందుతుందో లేదో నిర్ణయించడానికి ఒక ప్రభుత్వ అధికారిని అనుమతించడం ఉన్నాయి.

చర్చల అనంతరం జేపీసీ తన తుది నివేదికను జనవరి 30న లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు సమర్పించింది. ఆమోదించబడిన సవరణలను కలుపుకొని సవరించిన బిల్లును జనవరి 29న ప్యానెల్ అధికారికంగా ఆమోదించింది. మొదట్లో 2024 నవంబర్‌లో జరిగే శీతాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టాలని భావించినప్పటికీ, వివరణాత్మక సమీక్ష కోసం ఈ బిల్లును జేపీసీకి పంపారు.

ఎస్ఎల్‌బీసీ వద్ద ఉద్రిక్తత..

నవ తెలంగాణ మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

'ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రమాదం జరిగి వారం రోజులైనా తట్టెడు మట్టి తీయలే.. ఇప్పటికీ కన్వర్ బెల్టు రిపేరు చేయలేదు.. సొరంగంలో ఇరుక్కున్న కార్మికులను బయటకు తీసుకురావడానికి అడ్డుగా మారిన బోరింగ్ మిషన్‌ను కట్ చేయాలా వద్దా అనే నిర్ణయం జరగలేదు.. గాలి మోటర్లలో తిరుగుతూ గాలి మాటలు మాట్లాడుతూ మంత్రులు సమయం వృథా చేస్తున్నారు.." అని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. గురువారం బీఆర్ఎస్ నేతలతో కలిసి నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని దోమలపెంటకు వచ్చి ప్రమాద స్థలంలో పనులను పరిశీలించారు. అంతకు ముందు హరీశ్‌రావు బీఆర్ఎస్ నేతలతో కలిసి ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను పరిశీలించేందుకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఎస్ఎల్‌బీసీ కార్యాలయం సమీపంలో నిరసన చేపట్టారు. తనిఖీలు చేయడాన్ని తప్పుబట్టారు. అందరికీ అనుమతి ఇవ్వాలని నినాదాలు చేశారు. అనంతరం టన్నెల్ పరిశీలనకు అధికారులు అంగీకరించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ప్రతిపక్ష పాత్ర పోషించడానికి బాధ్యతాయుతంగా ఘటనా స్థలానికి వస్తే వైఫల్యాలు బయటపడతాయని తమను అడ్డుకోవడం విడ్డూరమన్నారు. ఎన్డీఆర్ఎఫ్ టీం సహాయక చర్యలను అభినందించారు. నేవీ, ఆర్మీ హైడ్రా, జాతీయ రహదారులు తదితర సహాయ టీముల మధ్య సమన్వయం లేకపోవడం



ఆందోళనకరమన్నారు. మంత్రులు గాలి మోటర్‌లో ఉదయం వచ్చి సాయంకాలం ఎగిరిపోవడం తప్ప ఆరు రోజుల్లో ఒరగబెట్టింది ఏమీ లేదని విమర్శించారు. బోరింగ్ మిషన్‌పై రాళ్లుపడి పనికిరాకుండా పోయిన దానిని గ్యాస్ కట్టర్‌తో ముక్కలు చేసి బయటికి పంపించే విషయంలోనూ నిర్ణయం తీసుకోలేకపోవడం ఆందోళన కలిగించే విషయం అన్నారు.

రెండ్రోజుల్లో ఆపరేషన్ పూర్తి అవుతుందని మంత్రి చెబుతుంటే.. నిపుణులు మాత్రం కన్వర్ బెల్టును అతికించడానికి రెండ్రోజుల సమయం పడుతుందని చెప్పడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం కూలిపోవడం గత పాలకుల వైఫల్యమని చెప్పడానికి మంత్రికి సిగ్గుండాలన్నారు. సొరంగ ప్రమాదంపై సాంకేతిక నిపుణుల రిపోర్టును బయటపెట్టాలని డిమాండ్ చేశారు. పని మొదలుపెట్టే సమయంలో ఇంజినీర్ల అభిప్రాయం ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో పైసా ఖర్చు పెట్టలేదని చెప్పడం విడ్డూరమన్నారు. రూ.3900 కోట్లు కేటాయించి ఖర్చు చేశామన్నారు. పాలమూరు -రంగారెడ్డితోపాటు ఉమ్మడి జిల్లాలో 90 శాతం ప్రాజెక్టు పనులు పూర్తి చేసిన ఘనత బీఆర్ఎస్‌దే అన్నారు. పదేండ్ల కాలంలో ఎస్ఎల్బీసీ సొరంగం 12 కిలోమీటర్లు తవ్విన విషయం మంత్రి జూపల్లికి తెల్వదా అని ప్రశ్నించారు. సొరంగం కుప్పకూలి కార్మికులు ప్రమాదంలో చిక్కుకుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎలక్షన్‌లో ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసం అని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 15 నెలల కాలంలో ఖమ్మం జిల్లా పెద్దవాగు, సుంకిశాల, పాలమూరు-రంగారెడ్డి పంప్, ఎస్ఎల్బీసీ ఇలా వరుసగా కూలిపోయిన ఘటనలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.

అత్యంత లోపభూయిష్టంగా ఉంది : మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రాజెక్టు అత్యంత లోపభూయిష్టంగా ఉందని ఆనాడే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పారని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి తెలిపారు. పాలమూరు-రంగారెడ్డిలో 63 కిలోమీటర్ల సొరంగం పనులను సురక్షితంగా నిర్వహించామన్నారు. ప్రాజెక్టుల నిర్వహణపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని చెప్పడానికి ఈ సొరంగం కుప్పకూలడం నిదర్శనమన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, బైకాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధుల మంజూరు చేయండి

● జీహెచ్ఎంసీ కమిషనర్‌కు కార్పొరేటర్ శ్రీదేవి యాదవ్ వినతి



నవతెలంగాణ - చర్లపల్లి

చర్లపల్లి డివిజన్‌లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇల్లంబర్తితో స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్, చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ భేటీ అయ్యారు. పెండింగ్‌లో ఉన్న చర్లపల్లి గ్రేవీ యాడ్, వివిధ కాలనీలలోని సీసీ రోడ్లు, పోల్స్, లైట్స్, బాక్స్ డ్రైన్ పనులు, యూబీడీ పెండింగ్ వర్క్స్, ఎస్ఎన్‌డీపీ వర్క్స్, యూజీడీ సాంక్షన్, సీఆర్ఎంపీ రోడ్లు, వివిధ అంశాలపై చర్చించారు. డివిజన్‌కు కావాల్సిన నిధులు మంజూరు చేయాలని కోరారు. కమిషనర్ త్వరలోనే ఎమర్జెన్సీ వర్క్స్, పెండింగ్ పనులన్నింటికీ నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారని కార్పొరేటర్ తెలిపారు.



నాగోల్‌లోని శ్రీ మల్లికార్జున స్వామి భ్రమరాంభిక ఎల్లమ్మ తల్లి కల్యాణోత్సవానికి ముఖ్యఅతిథిగా అఖిల భారత యాదవ మహాసభ తెలంగాణ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ హాజరయ్యారు.-నవతెలంగాణ - చర్లపల్లి

కాలుష్య కోరల్లో మేడ్చల్ వాగు

● పట్టించుకోని అధికారులు

● పరివాహక పంట పొలాలు, మత్స్య సంపద, భూగర్భ జలాలపై తీవ్ర ప్రభావం



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ వాగు కాలుష్య కొరల్లో చిక్కుకొని పారిశ్రామిక వ్యర్థ జలాలు, మురుగునీటి ప్రవాహానికి నిలయంగా మారింది. మేడ్చల్ వాగు నీరు మేడ్చల్ పట్టణం నుండి మొదలై కిష్టాపూర్, రావల్‌కోల్, రాజబొల్లారం, ఘనపూర్, పూడూరు గ్రామాల మీదుగా ప్రవహిస్తూ శామీర్ పేట పెద్ద చెరువులో కలుస్తుంది. మేడ్చల్ పట్టణంతో పాటు రావల్‌కోల్ మినహా పైన పేర్కొన్న గ్రామాల మురుగునీరు సరైన సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ లు లేని కారణంగా ఈ వాగులోకి వదిలేస్తున్నారు. దీనికి తోడు పక్కనే ఉన్న మేడ్చల్ చెక్ పోస్ట్ పారిశ్రామిక వాడతోపాటు ఇతర ప్రాంతాలకు చెందిన పలు కంపెనీల వ్యర్థ జలాలు కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి సమయాల్లో పెద్ద పెద్ద ట్యాంకర్ల ద్వారా వాగులోకి వదిలేస్తున్నారు. దీంతో వాగు మొత్తం మురుగునీరు, పారిశ్రామిక వ్యర్థ జలాల ప్రవాహంగా మారింది. కిచన్నగారి లక్ష్మారెడ్డి 2009లో మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన అనంతరం తన పేరు మీద కేఎల్ఆర్ వెంచర్, కేఎల్ఆర్ విజయ నగర్ పేరుతో భారీ వెంచర్ ఏర్పాటు చేశారు. ఇందులో సైతం పేరుకే సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ ఏర్పాటుకు స్థలం వదిలేసినా దానిని అందుబాటులోకి తీసుకురాకపోవడంతో ఆ మురుగు నీరు మొత్తం మేడ్చల్ వాగులోనే కలిపారు. దీంతో వాగు పరివాహక ప్రాంతాలల్లోని భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయని పలువురు మండల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మేడ్చల్ వాగు మరో మూసి నది కాకుండా అరికట్టాల్సిన బాధ్యత మున్సిపల్, ఇరిగేషన్, గ్రామపంచాయతీ, మత్స్యశాఖ అధికారులపై ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

మురుగునీరు, పారిశ్రామిక వ్యర్థ జలాలతో మత్స్య సంపదకు తీవ్ర నష్టం



మురుగునీరు, పారిశ్రామిక వ్యర్థ జలాలు యథేచ్ఛగా మేడ్చల్ వాగులోకి వదలడం వల్ల మత్స్య సంపదకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. కాలుష్య నీటి వల్ల చేపల పెరుగుదల, ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం పడుతుంది. మేడ్చల్ వాగు, శామీర్ పేట్ పెద్ద చెరువులు మరో మూసీ నది, హుస్సేన్ సాగర్‌ల కాకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి.

-నీరుడి శ్రీరామ్, మత్స్యకారుడు

మురుగనీరు, పారిశ్రామిక వ్యర్థ జలాలు వాగులోకి వదలకుండా చర్యలు తీసుకోవాలి



వాగులోకి విడుదల చేసే మురుగునీరు, పారిశ్రామిక వ్యర్థ జలాల వల్ల భూగర్భ జలాలు కలుషితమై పరివాహక ప్రాంతాల రైతులు పంటలు దెబ్బతింటున్నాయి. ఆ నీటితో పండించిన పంటలతో సైతం ఇబ్బందులు వచ్చే అవకాశాలు ఉన్నాయి. మేడ్చల్ వాగు ద్వారా శామీర్ పేట్ పెద్ద చెరువులోకి వచ్చే కాలుష్య జనాలపై హైడ్రా అధికారులు చర్యలు తీసుకోవాలి. -మార్యాంటి నాగరాజు యువరైతు

ఇనాయా ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం



● ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-కాప్రా

ఇనాయ ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మౌలాలి లోని కలర్ ఫంక్షన్ హాల్‌లో పేద ముస్లిం వికలాంగులకు, వితంతువులకు రంజాన్ మాసం సందర్భంగా బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ముస్లింల కోసం ఇలాంటి కార్యక్రమాలు మునుముందు కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకులు బద్రుద్దిన్, సయ్యద్ అబిబ్, సయ్యద్ అఫ్సర్, మాజిద్ హుస్సేన్ పాల్గొన్నారు.

రెడ్డి సంఘం ఆధ్వర్యంలో అన్నదానం



నవతెలంగాణ-కీసర

కీసరగుట్ట బ్రహ్మోత్సవాల సందర్భంగా రెడ్డి సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శివరాత్రి ప్రారంభం రోజు నుంచి నాలుగు రోజుల పాటు భక్తులకు అన్నప్రసాదం అందించారు. శివరాత్రి సమయంలో నిరంతర అన్నదానం చేసిన రెడ్డి అసోసియేషన్‌కు, భవన నిర్మాణదాతలకు భక్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సేవా కార్యక్రమాన్ని భవిష్యత్తులో మరింత వైభవంగా నిర్వహించనున్నట్టు రెడ్డి అసోసియేషన్ నేతలు ప్రకటించారు. ఈ కార్యక్రమం విజయవంతంగా సాగడానికి ప్రభుత్వం అందించిన సహకారాన్ని పలువురు నేతలు కొనియాడారు.

మంజూరైన పనులకు టెండర్లను పిలవండి

● కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ వినతి



నవతెలంగాణ - చర్లపల్లి

నాచారం డివిజన్‌లో భూగర్భ డ్రయినేజీ సమస్యల పరిష్కారానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మంజూరు చేయించిన పనులకు వెంటనే టెండర్లను పిలవాలని జలమండలి జనరల్ మేనేజర్ సంతోష్ కుమార్‌ను నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ కోరారు. గురువారం జలమండలి ప్రధాన కార్యాలయంలో జీఎంను కలిసి వివిధ కాలనీల్లో త్వరగా పనులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సాయిజెన్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి భవన్‌లో వైజ్ఞానిక ప్రదర్శన



● వీక్షించేందుకు విద్యార్థులను తరలించిన బీఆర్ఎస్ నేతలు

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

జాతీయ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా గురు, శుక్రవారాల్లో (ఈనెల 27,28) తేదీల్లో బొల్లారంలోని రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనను వీక్షించేందుకు గురువారం మల్కాజిగిరిలోని జడ్పీహెచ్ఎస్ బాయ్స్ హై స్కూల్, జడ్పీహెచ్ఎస్ గర్ల్స్‌హై స్కూల్, మౌలాలిలోని జడ్పీహెచ్ఎస్, నేరేడ్‌మెట్‌లోని జడ్పీహెచ్ఎస్ గవర్నమెంట్ హై స్కూల్ రైల్వే క్వార్టర్స్ లోని పాఠశాలల విద్యార్థులు రాష్ట్రపతి భవన్‌కు వెళ్లేందుకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఏర్పాటు చేసిన బస్సులను బీఆర్ఎస్ నాయకులు దగ్గరుండి పంపించారు. ఈ కార్యక్రమంలో గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత యాదవ్, నాయకులు రావుల అంజయ్య, బద్దం పరశురామ్ రెడ్డి, రాము యాదవ్, జేఏసీ వెంకన్న, మురుగేశ్, అమీనుద్దిన్, చిన్న యాదవ్, ఉపేందర్, అనిల్ కుమార్, సాయి గౌడ్, నర్సింగ్, శివ కుమార్, సుమన్ గౌడ్, వాసు, బాలకృష్ణ, వినీత్, సంతోష్ గుప్త, నవాబ్, అరుణ్, తదితరలున్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

● మల్లాపూర్ ఏఈ కె.నాగరాజు

నవతెలంగాణ -చర్లపల్లి

మల్లాపూర్ 33/11కేవీ ఎస్ఎస్ -II(నోమా) విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాల్సిందిగా మల్లాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ అసిస్టెంట్ ఇంజనీర్ కె.నాగరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శక్తి సాయినగర్, సూర్యనగర్, ఉదయ్ నగర్, మల్లికార్జున నగర్, గుల్మోర్ గార్డెన్స్, చండియానగర్, గోకుల్ నగర్, వేల్పుల, ఎస్ ఎస్.నగర్, బ్యాంకు కాలనీ, జన్నరం హౌసింగ్ కాలనీలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

అన్నదానం మహాదానం : కంఠం కృష్ణారెడ్డి

నవతెలంగాణ -శామీర్ పేట



అన్నదానం మహాదానం అని అలియాబాద్ మాజీ సర్పంచ్ కంఠం కృష్ణారెడ్డి అన్నారు. మహాశివరాత్రి రోజున ఉపవాస దీక్షలు చేసిన భక్తుల కోసం గురువారం శామీర్‌పేట మండలం అలియాబాద్ గ్రామంలోని శివాలయం వద్ద కంఠం కృష్ణారెడ్డి అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

మేడ్చల్ తహసీల్దార్, ఆర్డీవోలపై

క్రిమినల్ కేసు నమోదుకు అనుమతులివ్వాలని వినతి

నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ మండల పరిధి గౌడవెల్లి గ్రామంలోని 29ఎకరాల 24గుంటల ఎవాక్యు ప్రాపర్టీ, కంపోసిట్ ఎవక్యూ ప్రాపర్టీ భూములను కాపాడడంలో విఫలమైన అధికారులపై చర్యలు తీసుకొనుటకు అనుమతులు ఇవ్వాలని కోరుతూ గ్రామస్తుడు సింగిరెడ్డి నరేందర్ రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రెటరీ, రాష్ట్ర ప్రధాన భూ పరిపాలన కమిషనర్‌కు, జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రభుత్వానికి చెందాల్సిన ఎవాక్యు ప్రాపర్టీ, కంపోసిట్ ఎవక్యూ ప్రాపర్టీ సర్వే నెంబర్లు 331/1,2, 352, 364/1,2, 365/1,2 లలో 29ఎకరాల 24 గుంటల భూమి ఉందని తెలిపారు. కాగా ఈ భూమి పై లక్షలాది రూపాయలు ఖర్చు చేసి సుమారు 12 ఏండ్లు నిర్విరామ పోరాట ఫలితంగా జిల్లా కలెక్టర్ క్రయవిక్రయాలు నిషేధిస్తూ 22ఏ రిజిస్టర్‌లో చేర్చారని తెలిపారు. 12 ఏండ్ల కాలంలో ఉన్నత అధికారులు, కోర్టులు, లోకయుక్తకు తప్పుడు నివేదికలు ఇచ్చి అక్రమ కబ్జాదారులకు సహకరించి సుమారు రూ.300 కోట్ల రూపాయల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కావడానికి కారణమైన అధికారులపై చర్యలకు అనుమతిని ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరినట్టు తెలిపారు. అప్పటి మేడ్చల్ తహశీల్దార్లు, ఆర్డీవోలుపై ప్రభుత్వం ఎలాంటి శాఖపరమైన చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాచేసిన వ్యక్తులపై ఎలాంటి క్రిమినల్ చర్యలు తీసుకోలేదని గుర్తు చేశారు. గౌడవల్లిలోని 29ఎకరాల 24 గుంటల భూమి అన్యాక్రాంతం కావడానికి కారణమైన మేడ్చల్ తహశీల్దార్లుగా పని చేసిన ఎస్ యాదగిరి, హనుమంత్ రెడ్డి, వి.భూపాల్ రెడ్డి, డి. శ్రీకాంత్ రెడ్డి, డి.వెంకట్ రెడ్డి, బి.సరిత, బి. శైలజ, ఆర్డీవోలు ప్రభాకర్ రెడ్డి, ఎస్.రవి, మేడ్చల్ కలెక్టర్ కార్యాలయం ఈ సెక్షన్ సూపరింటెండెంట్ రాజేశ్వర్ రెడ్డి, అమరాజ్యోతిలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, లేదా తాను క్రిమినల్ చర్యలు తీసుకోవడానికి అనుమతి నివ్వాలని కోరారు.

సాగర్ గ్రామర్ స్కూల్ తెరిపించాలి

● విద్యార్థుల తల్లిదండ్రుల డిమాండ్



నవతెలంగాణ-ఉప్పల్

ఉప్పల్‌లోని సాగర్ గ్రామర్ స్కూల్ లో ఇటీవల టీచర్ మందలించడంతో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. విద్యా శాఖ అధికారు లు సదరు స్కూల్‌ను సీజ్ చేయడంతో వందలాది మంది విద్యార్థుల జీవితాలు ఆగమయ్యే పరిస్థితి ఏర్పడింది. కాగా విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. "వచ్చే నెలలో పదో తరగతి వార్షిక పరీక్షలు జరగనున్నాయి. ఈ నెల రోజులు విద్యార్థులకు ఎంతో కీలకమైన సమయం. ఏడాది పాటు చదివిన చదువు ఒకెత్తయితే, పరీక్షలకు ఈ సమయం ఎంతో విలువైంది. పదో తరగతి బోర్డు పరీక్షలు. ఆ స్కూల్ విద్యార్థులకు హాల్ టిక్కెట్లు వచ్చే సమయం. పైగా ఈ నెల రోజులపాటు టీచర్లు ఆ విద్యార్థులను పూర్తి స్థాయిలో సన్నద్ధం చేయాల్సి ఉంటుంది. సిలబస్ ఒక్క అంశమే కాదు పరీక్షలపై ఆ విద్యార్థులకు అవగాహన పెంచాల్సిన అవసరం ఉంటుంది. ఆ పరీక్షలపై పూర్తి స్థాయిలో విద్యార్థులను తీర్చిదిద్దాల్సి ఉంటుంది. ఇలాంటి సమయంలో విద్యార్థి ఆత్మహత్య సంఘటన దురదృష్టకరమే అయినా మిగతా పిల్లల భవిష్యత్తు కూడా అంతే ముఖ్యం. కలెక్టర్, జిల్లా విద్యాధికారి, మండల విద్యాధికా రులను స్కూల్‌ను ఓపెన్ చేయించాలి. మా పిల్లల జీవితాలను ఇబ్బందుల్లోకి నెట్టొద్దు. సంఘటనపై దర్యాప్తు, ఇతరన్యాయ పరమైన అంశాల పేరు చెప్పి స్కూల్‌ను మూసే యడంతో మిగతా విద్యార్థు లకు అన్యాయం జరుగుతోంది" అని అన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయి



● కాంగ్రెస్ నాయకులు నెమలి అనిల్

● శాంతి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

నవతెలంగాణ - చర్లపల్లి

క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి దోహదపడతాయని కాంగ్రెస్ నాయకులు నెమలి అనిల్ కుమార్ అన్నారు. మహా శివరాత్రి సందర్భంగా మల్లాపూర్ డివిజన్ శాంతి యూత్ క్లబ్, ఎస్వీ శశిధర్ ఆధ్వర్యంలో ఎస్వైసీ మున్సిపల్ గ్రౌండ్‌లో నిర్వహించిన చాందిని క్రికెట్ టోర్నమెంట్ కార్యక్రమానికి ముఖ్యతిథిగా హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటితరం విద్యార్థులు, యువతరం టెక్నాలజీ వైపు దూసుకెళ్తున్న ఈ తరుణంలో క్రీడలపై ఆసక్తిని పెంపొందించేలా క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడలతో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం పెంపొందడంతోపాటు ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో శాంతి యూత్ క్లబ్ అధ్యక్షులు కొల్లూరి రవి, ప్రధాన కార్యదర్శి కోయలకొండ రాజేష్, ఉపాధ్యక్షులు మెండ రఘు, నిర్వాహకులు తాటిపల్లి శ్రీనివాస్, బండి సంపత్, పి ఆర్.మెహ్రాజ్ పాల్గొన్నారు.



రోడ్డుపై మురుగునీటి ప్రవాహం



● పట్టింపులేని మున్సిపల్ అధికారులు

● సమస్యను పరిష్కరించాలని ఎస్సీ సెల్ మున్సిపల్ అధ్యక్షులు కుండా భానుచందర్ విజ్ఞప్తి

నవతెలంగాణ- మేడ్చల్

గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధి 8వ వార్డు శుభగృహ సుకృతి డిలైట్ కాలనీకి వెళ్లే దారిలో మదన్ బార్ పక్కన అండర్ గ్రౌండ్ డ్రయినే జీ మ్యాన్ హెూల్ నుం డి మురుగునీరు రోడ్డు పై ప్రవ హిస్తుందని మున్సిపల్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కుండా భానుచందర్ తెలిపారు. గత నాలుగైదు రోజుల నుండి మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. దుర్వాసన వెదజల్లడంతో కాలనీవాసులు, అటువైపుగా వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వెంటనే మున్సిపల్ కమిషనర్ స్వామి నాయక్, శానిటేషన్ ఇన్‌చార్జి నర్సింహ రెడ్డిలు సమస్యను పరిష్కరించాలని భానుచందర్ విజ్ఞప్తి చేశారు.

మెటీరియల్స్ దొంగతనం..కేసు నమోదు

నవతెలంగాణ-కీసర

లక్షల విలువైన కంపెనీ మెటీరియల్స్ నిల్వ చేసి ఉంచితే గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయినట్లు బాధితుడు కీసర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కీసర పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని సఫీల్ గూడకు చెందిన బెజ్జంకి చంద్రశేఖర్ చర్లపల్లిలో ఆదిత్య కరోసివ్ ఇంజనీరింగ్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీని నడుపుతున్నాడు. కాగా కీసర సమీపంలోని కేబీఆర్ సమీపంలో ఖాళీ స్థలాన్ని కిరాయికి తీసుకొని కంపెనీ మెటీరియల్స్ నిల్వ చేసుకుంటున్నాడు. అందులో భారీ హెచ్.డీ.పీఈ స్పైరేల్ ట్యాంకర్స్ నిల్వ ఉంచగా అందులో కొన్నింటిని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకు పోయారు. ఇది గమనించిన కంపెనీ యజమాని కీసర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న ట్లు కీసర క్రైమ్ పోలీసులు తెలిపారు.

వైభవంగా శ్రీరామలింగేశ్వర స్వామి విమాన రథోత్సవం



నవతెలంగాణ-కీసర

కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం కన్నుల పండువగా విమాన రథోత్సవము నిర్వహించారు. కీసరగుట్ట పురవీధుల్లో రథోత్సవం కొనసాగింది. గురువారం శ్రీ స్వామివారికి వేద పండితులు మాఘ బహుళ చతుర్దశిమహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకము, సామూహిక అభిషేకములు(కళ్యాణ మండపములో) రుద్ర స్వాహాకార హెూమము, ప్రదోష కాలపూజ, హారతి, మంత్రపుష్పము వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కాగా నగర నలుమూలల నుండి ఆర్టీసీ బస్సుల్లో సొంత వాహనాల్లో భక్తులు కీసరగుట్టకు చేరుకొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం గుట్టపై గల శివలింగాలకు అభిషేకాలు నిర్వహించారు. గ్రామీణ ప్రాంత ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి కీసరగుట్ట జాతరను సందర్శించారు. పిల్లాపాపలతో కలిసి ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా జిల్లా యంత్రాంగం, అధికారులు, పోలీస్ సిబ్బంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టారు.





ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయం, పాండురంగ నగర్, మోతీ నగర్‌కు సంబంధించిన నూతన కమిటీ సభ్యులకు కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ గురువారం శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపి శెట్టి రాఘవేందర్, సుధాకర్ రెడ్డి, కమిటీ మెంబర్స్ రామకృష్ణారావు, బుచ్చయ్య, నరసింహులు, జనార్ధన్, మల్లికార్జున్ రెడ్డి, నాగేశ్వరరావు అనుపమ, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కూకట్‌పల్లి



కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ పరిధిలో రంజాన్ పర్వదిన క్యాలెండర్‌ను కూకట్ పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ గురువారం బాలానగర్‌లోని కాంగ్రెస్ కార్యాలయంలో పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ లక్ష్మయ్య, యాదగిరి, అస్లాం, అరుణ్, పర్వేజ్, అశోక్, అజాజ్, బాలరాజు, థామస్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-బాలానగర్

'రాందేవ్ రావు'లో ఉచిత హెల్త్ క్యాంప్

- మార్చి 2న ఉదయం 9 నుంచి 2 గం॥ వరకు డెర్మటాలజీ, ఈఎన్‌టీ క్యాంప్
- రాందేవ్ రావు హాస్పిటల్ సీఈఓ డాక్టర్ యోబు

నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి రాందేవ్ రావు అస్పత్రిలో ఉచిత డెర్మాటలజీ, ఈఎన్‌టీ క్యాంప్ నిర్వహిస్తున్నామని హాస్పిటల్ సీఈఓ డాక్టర్ యోబు ఓ ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 2 వ తేదీ ఆదివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు క్యాంప్ జరుగుతుందన్నారు.ఈ క్యాంప్‌లో చెవి నొప్పి, వినికిడి నష్టం, చెవి నుంచి ద్రవం విడుదల, తల తిరగడం, ముక్కు ముసుకుపోవడం, ముక్కు నుంచి రక్తం కారుట, ముక్కు నొప్పి, గొంతు నొప్పి, దగ్గు, చేదు శ్వస, అలర్జీలకు వైద్య పరీక్షలు చేశారనన్నారు. ఈఎన్‌టి సర్జన్స్ డాక్టర్ ఎస్.శ్వేత, డాక్టర్ డి.లావణ్యలు వైద్య శిబిరాన్ని పర్యవేక్షిస్తారని తెలిపారు. డాక్టర్ల సలహామేరకు అవసరమైన వారికు సిటి స్కాన్ రూ.1000, ఎంఆర్‌ఐ రూ.2000లకే చేస్తామన్నారు.

అదేవిధంగా మొటిమలు, బొల్లి మచ్చలు, మంగు మచ్చలు, గజ్జి, తామర, ఇతర మచ్చలు, దురదలు, దద్దుర్లు, అలర్జీలు, జుట్టు రాలడం, బట్ట తల, చుండ్రు, పెను కొరకడం, గోరు చుట్టు ఇన్ఫెక్షన్‌లకుకు కూడా పరీక్షలు చేయనున్నామన్నారు. వీటిని డాక్టర్ సి.స్వాతి డాక్టర్ కె.శ్రీహర్షలు పర్యవేక్షిస్థారన్నారు. డాక్టర్ల సలహమేరకు సిబిపి, ఏఈసి, ఐజిఈ, ఎనిమియా ప్రొఫైల్, పిటీపి, ఐఎంపి, ఓఏఈ పరీక్షలు ఉచితంగా చేస్తామన్నారు. వినికిడి పరికరాలు మీద ప్రత్యేక డిఎం క్యాంప్ ఉంటుందని డాక్టర్ యోబు తెలియజేశారు. ఈ ఉచిత క్యాంప్ డాక్టర్ కమలాకర్ డైరెక్టర్.విక్రందేవ్ రావు, మీరా రావు, ప్రశాంత్ రెడ్డి, అపర్ణ రావుల ఆధ్వర్యంలో నిర్వహించబడుతుందన్నారు.

దరువు అంజన్న తల్లి మృతి బాధాకరం

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ





నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ప్రజా గాయకులు, ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి సంఘం జేపీసీ చైర్మెన్ దరువు అంజన్న మాతృమూర్తి కమ్మరి లలితమ్మ అనారోగ్యంతో మృతి చెందడం చాలా బాధాకరమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ విచారం వ్యక్తం చేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గాజులరామారం డివిజన్ పరిధిలోని ద్వారకనగర్‌లో గల దరువు అంజన్న నివాసంలో గురువారం కమ్మరి లలితమ్మ మృతదేహంపై పుష్పగుచ్ఛాన్ని వేసి శ్రద్ధాంజలి ఘటించారు. వారి కుటుంబానికి ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ పోరాటంలో భాగంగా రాష్ట్రమంతటా లక్ష డప్పులు వేల గొంతుల కార్యక్రమంలో బీసీ కులాల వర్గీకరణకు మద్దతుగా దరువు అంజన్న సభల్లో తన ప్రసంగంతో చైతన్యవంతులను చేసేవారన్నారు.అనంతరం అంతిమయాత్రలో లలితమ్మ పార్థివదేహాన్ని పాడేను ఆయనతోపాటు బీసీ రాష్ట్ర నాయకులు పృథ్వీరాజ్ యాదవ్, సీనియర్ పాత్రికేయులు, మైనార్టీ రాష్ట్ర నాయకులు సయ్యద్ ఇస్మాయిల్,కవి గాయకులు దరువు ఎల్లన్న, పలువురు డప్పు కళాకారులు పాడే మోసుకుంటూ గాజులరామారం సమీపంలోని అంబేద్కర్ నగర్‌లో అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

దరువు అంజనను పరామర్శించి సంతాపం తెలిపిన జర్నలిస్టు నేతలు..

దరువు అంజన్న మాతృ మూర్తి లలితమ్మ మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న టీయూడబ్ల్యూజే ఐజేయూ రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు గడ్డమీద బాలరాజ్ గౌడ్, పలువురు జర్నలిస్టులు, సామాజికవేత్తలు, పరామర్శించి సంతాపం తెలిపారు. అనంతరం దరువు అంజన్నకు ధైర్యం చెప్పారు. ఆయన కుటుంబంతో తనకున్న సాన్నిహిత్యాన్ని,1990 దశకంలో సమాజం కోసం, తెలంగాణ ఉద్యమం కోసం తాము కలిసి ఎన్నో కార్యక్రమాలు చేశామని గుర్తు చేసుకున్నారు. జర్నలిస్టులు దయాకర్ రెడ్డి, మహేందర్, శ్రీనివాస్,పెండ్లి మడుగు భాస్కరాచారి, అంజన్న కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య స్కూల్‌లో ఫ్యామిలీ బ్లూమ్ వేడుకలు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

విద్యార్థుల యొక్క నడవడిక వారి ప్రవర్తన, కుటుంబ వ్యవస్థను మెరుగుపరుస్తుందని శ్రీ చైతన్య విద్యా సంస్థలు వివేకానంద నగర్ ప్రిన్సిపాల్ సూర్య కళ అన్నారు. అన్ని రంగాల్లో ముందుండే శ్రీ చైతన్య విద్యా సంస్థల్లో భాగమైన, వివేకానంద నగర్ బ్రాంచ్‌లో ఫ్యామిలీ బ్లూమ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా.. విద్యార్థులు వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల యొక్క తల్లిదండ్రులు మాట్లాడుతూ విద్యార్థుల్లో కుటుంబ విలువలు పెరిగేలా, ఇటువంటి సామాజిక విలువలు కలిగినటువంటి కార్యక్రమాలు చేయడం ఎంతగానో అభినందించదగిన విషయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివేకానం దనగర్ శ్రీచైతన్య స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు, జి.వి. సూర్యకళ మాట్లాడుతూ విద్యార్థుల యొక్క నడవడికను గురించి, కుటుంబ వ్యవస్థ యొక్క ప్రాము ఖ్యతను వివరిస్తూ విదేశాల్లో సైతం భారతీయ సంస్కృ తి యొక్క ప్రాముఖ్యతను గురించి ప్రస్తావించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులు రీజనల్ ఇన్‌చార్జి, పద్మజ, జోనల్ కో-ఆర్డినేటర్ మురళీకృష్ణ, అకాడమిక్ డీన్ రామకృష్ణారెడ్డి, సి- బ్యాచ్ ప్రోగ్రాం ఇన్‌చార్జి శ్రీకాంత్, ఇతర అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా 54వ బ్రహ్మోత్సవాలు





నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని జీడిమెట్ల గ్రామంలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ శ్రీ మల్లికార్జున స్వామి 54వ బ్రహ్మోత్సవాల జాతరలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనల మధ్య తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక దేవాదాయ శాఖ అభివృద్ధి గణనీయంగా పెరిగింది అన్నారు. శ్రీశ్రీ మల్లికార్జున స్వామి వారి ఆశీస్సులు నియోజవర్గ ప్రజలపై ఉండాలని కోరారు. నియోజకవర్గంలో ఆయా దేవస్థానాలలో బోనాలు, జాతర మహోత్సవ కార్యక్రమాలు చూస్తే చాలా సంతోషమేసిందన్నారు. శ్రీశ్రీ మల్లికార్జున స్వామి వారి దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు బేకు శ్రీనివాస్,బండి శ్రీనివాస్ గౌడ్, ఆలయ కమిటీ అధ్యక్షులు జి.జీతయ్య, ప్రధాన కార్యదర్శి జి.బాలప్ప, ఆలయ కమిటీ సభ్యులు ఆంజనేయులు, బాల మల్లేష్, వెంకటేష్, ఎల్లప్ప, శ్రావణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పెట్ బషీరాబాద్:

జీడిమెట్ల పరిధిలోని శ్రీ మల్లికార్జున స్వామి వారి ఆలయము నందు 54వ బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వామి వారి కళ్యాణం, గొర్రెపోతుల రథోత్సవం, అగ్నిగుండాలు గొలుసు తెంపుట, బోనాలు ఊరేగింపు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కెపి. వివేకానంద్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, స్థానిక కార్పొరేటర్ తారాచంద్రారెడ్డి, మాజీ కౌన్సిలర్ జయరాం రెడ్డి రంగారెడ్డి జిల్లా మాజీ పీసీసీ కేఎం ప్రతాప్ హజరయ్యారు.

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని జీడిమెట్ల గ్రామంలో కెకెఎమ్ ట్రస్ట్ చైర్మెన్, కంటెస్టెంట్ కార్పొరేటర్ కూన శ్రీనివాస్ గౌడ్ శ్రీ మల్లికార్జున స్వామి 54వ బ్రహ్మోత్సవాల జాతరలో పాల్గొని ప్రత్యేక పూజ లు నిర్వహించారు. అనంతరం వేదమంత్రాల మధ్య స్వామి వారి ఆశీస్సులు పొంది, తీర్థప్రసాదములు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు బేకు శ్రీనివాస్, ఆలయ కమిటీ అధ్యక్షులు జి.జీతయ్య, ప్రధాన కార్యదర్శి జి.బాలప్ప, సభ్యులు ఆంజనేయులు, బాలమల్లేష్, వెంకటేష్, ఎల్లప్ప, బండి శ్రీనివాస్ గౌడ్, శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఎండ తీవ్రతతో వైద్యశాఖ తగు ఏర్పాట్లు

- హైదరాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జె.వెంకటి
- జిల్లాలోని ప్రభుత్వ వైద్యులందరికీ ఎండ తీవ్రత, శాఖా పరంగా తీసుకోవాల్సిన ఏర్పాట్లపై శిక్షణ



నవతెలంగాన-సిటీబ్యూరో

తెలంగాణలో భానుడు క్రమక్రమంగా తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. వాతావరణ మార్పుల కారణంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. హైదరాబాద్ జిల్లాలో పెరుగుతున్న ఎండలకు వైద్య ఆరోగ్యశాఖ తగు ఏర్పాట్లు, ఎండలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం సికింద్రాబాద్ యశోద హాస్పిటల్ ఆడిటోరియంలో ప్రోగ్రామ్ ఆఫీసర్స్, ఎస్‌పిహెచ్‌ఓలు, ఎంఓలు, డిఈఓల శిక్షణ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ మాట్లాడుతూ గత ఏడాదితో పోలిస్తే ఈసారి హైదరాబాదు జిల్లాలో ఉష్ణోగ్రతలు అధికమయ్యె అవకాశాలు ఉన్నాయని, అందులో భాగంగా ఎండ తీవ్రత నుంచి ప్రజలను కాపాడేందుకు జిల్లాలో టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేశామని తెలియజేశారు. ఇందులో జిల్లా కలెక్టర్ చైర్మెనుగా వ్యవహరించగా, వైద్య ఆరోగ్యశాఖ, పోలీస్, కార్మిక, మహిళా సంక్షేమం, విద్యాశాఖ, ఆర్టీసీ మొదలైన శాఖల జిల్లా అధికారులంతా సభ్యులుగా ఉన్నారని తెలిపారు. వీరంతా ఎప్పటికప్పుడు తమ శాఖల పరిధిలోని ప్రజలకు జాగ్రత్తలు చెబుతుంటారని తెలిపారు. వివిధ శాఖలతో సమన్వయం చేసుకొని జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. జిల్లాలోని ఎస్‌పిహెచ్‌ఓలకు, ఎంఓలకు శిక్షణ ఏర్పాటు చేశామని, ఈ శిక్షణలో ఎండ తీవ్రత, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఓఆర్ఎస్ పాకెట్స్, మందులు అన్ని అందుబాటులో ఉంచుకోవాలని, కన్‌స్ట్రక్షన్ సైట్స్ గుర్తించి అక్కడ పనిచేస్తున్న కార్మికుల కోసం షెడ్డు వేయడం, ఫ్యాన్స్, ఓఆర్ఎస్, నీరు, మజ్జిగ లాంటి పదార్థాలు అందుబాటులో ఉంచాలని తెలిపారు.

కార్మిక శాఖకు పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి లెటర్ రాస్తూ ఏర్పాటు చేయవలసిందిగా కార్మిక శాఖకు విజ్ఞప్తి చేయాలని, అలాగే బస్ షెల్టర్లలో నీరు, మజ్జిగ ఉంచడానికి రవాణా శాఖతో సమన్వయం చేసుకొని ఉండే విధంగా చూడాలి అన్నారు. ఎన్‌జిఓలతో ఏర్పాటు చేసే చలి వేంద్రాలలో ఓఆర్ఎస్ పాకెట్స్ ఉంచాలని, ఏఎన్ఎం, ఆశ సర్వే చేసి ఆరోగ్య కేంద్రం పరిధిలో ఎన్ని చలి వేంద్రాలు ఉన్నాయి గుర్తించి అందులో ఓ ఆర్ ఎస్ పాకెట్స్ ఉంచాలని తెలిపారు. ప్రతి పట్టణ ఆరోగ్య కేంద్రాలలో, బస్తీ దవాఖానాలో ఓఆర్ఎస్,జింక్ కార్నర్స్ పెట్టాలి అని తెలిపారు.

అన్ని పాఠశాలలు, మదర్సాలను గుర్తించి అక్కడ ఓఆర్ఎస్ పాకెట్స్ ఉంచాలి అని తెలిపారు.

కన్‌స్ట్రక్షన్ సైట్‌లో ఆశా మొబైల్ నెంబరు ఇవ్వాలి అని, అలా ఇవ్వడం వల్ల అత్యవసరంగా చికిత్స, 108 అంబులెన్సుకు సమాచారం అందించి సత్వర చికిత్స కోసం ఉపయోగపడుతుంది అని తెలిపారు. ఫ్రూట్ మార్కెట్, వెజిటేబుల్ మార్కెట్లలో ఓఆర్ఎస్ పాకెట్లు ఉంచాలని, అంగన్వాడి సెంటర్లు సందర్శించి పిల్లలకు ఎండ తీవ్రత, జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని కోరారు. ఓఆర్ఎస్ పాకెట్స్ అందుబాటులో ఉంచాలని కోరారు. సిబ్బంది సర్వే చేపట్టాలని కోరారు. ఎస్‌పిహెచ్‌ఓలు, ఎంఓలు తమ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోని సూపర్‌వైజర్, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆశలకు తక్షణమే శిక్షణ ఏర్పాటు చేసి ఎండ తీవ్రత, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఫీల్డ్ విజిట్స్, సర్వే, ఓఆర్ఎస్ ప్యాకేట్స్, మందులపై సిబ్బందికి అవగాహన కల్పించి ఎండ తీవ్రతకు ఎవరు కూడా అనారోగ్యం పాలు కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఎండ తీవ్రత గురించి ప్రజలు తీసుకొవలసిన జాగ్రత్తలపై వైద్యులు ఈ విధంగా సూచనలు అవగాహన సిబ్బందికి శిక్షణ ద్వార కల్పించి ప్రజలు ఎండ తీవ్రతపై ఎవరు అనారోగ్యం పాలు కాకుండా సిబ్బంది ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు.

- ఎండ తీవ్రత వల్ల మన శరీరంలోని నీరంతా చెంప రూపంలో బయటకు వెళ్తుంది. శరీరం డేహైడ్రేషనుకు గురి కాకుండా రోజుకు 5 లీటర్ల మీరు త్రాగాలి.
- మజ్జిగ తీసుకోవడం మంచిది
- శీతల పానీయాలు, నూనెతో చేసిన వంట పదార్థాలకు దూరంగా ఉండటం మంచిది
- వేడి గాలులు లోపటికి రాకుండా మధ్యాహ్న సమయంలో కిటికీలు, తలుపులు మూసివేయాలి.
- లోపలి గాలి బయటకు వెళ్లేందుకు సాయంత్రం వేళల్లో తలుపులు, కిటికీలు తెరవాలి
- కాటన్ దుస్తులు ధరించాలి
- అత్యవసర పరిస్థితుల్లో ఎండలో బయటకు వెళ్లేటప్పుడు రుమాలు, గొడుగు తీసుకెళ్లాలి.
- ఈ విషయాలన్నీ ప్రజలందరికీ తెలియజేయాలని డీఎంహెచ్ఓ కోరారు.

జిల్లాలోని పట్టణ ఆరోగ్య కేంద్రాలలో, బస్తీ దవాఖానాలో, ఏరియా హాస్పిటల్‌లో ఓఆర్ఎస్ పాకెట్స్, మందులు అందుబాటులో ఉంచాలని వైద్యులను ఆదేశించారు.

ఫీల్డ్ సిబ్బంది, ఆశ వర్కర్లు తమ పరిధిలోని ఏరియాను సందర్శించి, ఎండ తీవ్రత ఏరియాలను గుర్తించి ప్రజలకు అవగాహన, ఓఆర్ఎస్ పాకెట్స్, మందులు ఇవ్వాలని, ప్రతిరోజు నివేదికను జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంకు పంపాలని కోరారు. ఈ శిక్షణ సమావేశ కార్యక్రమంలో ఎన్‌సిడి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆశితారెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్స్, ఎస్‌పిహెచ్‌ఓలు, ఎంఓలు, జిల్లా మాస్ మీడియా అధికారి జక్కుల రాములు, డేటా ఎంట్రీ ఆపరేటర్స్, అకౌంటెంట్స్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసం పెంపొందిస్తాయి



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. 130 - సుభాష్ నగర్ డివిజన్ ఎస్ఆర్ నాయక్ నగర్ నందు బీఆర్ఎస్ యువ నాయకులు "దొంతిరి కార్తీక్ రెడ్డి" జ్ఞాపకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..2023 డిసెంబర్‌లో నిర్వహించిన రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో కుత్బుల్లాపూర్‌లో బీఆర్ఎస్ పార్టీతో పాటు నా గెలుపుకై ఎంతో కృషి చేసిన యువ నాయకులు "దొంతిరి కార్తీక్ రెడ్డి" మరణం తాన్ను ఎంతో బాధించిందన్నారు. ఈ కార్యక్రమంలో సుభాష్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మాజీ సురేష్ రెడ్డి, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో-ఆపరేటివ్ చైర్మెన్ మన్నె రాజు, డివిజన్ అధ్యక్షులు పోలె శ్రీకాంత్, పుప్పాల భాస్కర్, రుద్ర, అశోక్, జగద్గిరిగుట్ట వెంకటేశ్వర దేవస్థా నం మాజీ చైర్మెన్ వేణు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

విజేత జట్టుకు కప్పు అందజేత



నవతెలంగాణ-బాలానగర్

ఫతేనగర్ భగత్ సింగ్ పార్క్‌లో క్రికెట్ పోటీల్లో గెలుపొం దిన జట్టుకు కార్పొరేటర్ సతీష్ గౌడ్ కప్పును అందజేశా రు. కూకట్‌పల్లి నియోజకవర్గం మూసాపేట సర్కిల్ పరిధిలోని మహా శివరాత్రి జాగరణలో భాగంగా.. ప్రతి సంవత్సరం కార్పొరేటర్ సహకారంతో ఉదయ్ ముది రాజ్ ఆధ్వర్యంలో భగత్ సింగ్ పార్క్‌లో క్రికెట్ టోర్న మెంట్ నిర్వహించారు. అనంతరం క్రికెట్ పోటీలను కార్పొరేటర్ ప్రారంభించారు. అనంతరం ఇందిరాగాంధీ పురంకి చెందిన టీం అక్రంకు, రన్నరప్‌గా నిలిచిన పవన్ టీంలకు కప్పులను గెలుపొందిన జట్టు విజేత లకు కప్పును అందజేశారు. ఈ కార్యక్రమంలో సాయి నాథ్ గౌడ్, తేజ, గట్ల శేఖర్, రోహిత్, బిజ్జు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా



- ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మిరాజ్

నవతెలంగాణ-చంపాపేట్

ప్రజల సమస్య పరిష్కారానికి అభివృద్ధి లక్ష్యంగా, యకూత్‌పురా నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా అని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మిరాజ్ అన్నారు. గురువారం సంతోష్ నగర్ డివిజన్ పరిధిలోని ఎస్బిఐ బ్యాంక్ వద్ద ఈదీ బజార్ పరిధిలోని స్థానిక కార్పొరేటర్లు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తూ శాలువాతో ఘనంగా సత్కరించారు. నియోజకవర్గంలో అన్ని రకాల ప్రజలకు సదుపాయాలు మంచినీరు, డ్రయినేజీ మురుగు తదితర అభివృద్ధి పనులను చేపట్టాలని సిబ్బందులతో పర్యవేక్షించారు. డివిజన్ కార్పొరేటర్ స్థానిక నాయకులు, కార్యకర్తలు సభ్యులు పెద్దలు పరిసర ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ అధికారులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను అధికారులతో కలిసి ఎమ్మెల్యే డివిజన్ పరిధిలోని సీసీ రోడ్డు, డ్రయినేజీ, పలు అభివృద్ధి పనులకు రూ. 3 కోట్ల 70 లక్షల 43, వేలు మంజూరు చేస్తూ ప్రారంభించారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. అధ్యక్షులు సయ్యద్ కరీముద్దీన్ (అక్రమ్), సయ్యద్ సిజన్, మనసురుద్ది న్, సయ్యద్ రఫీ ఉద్దన్, ఇబ్రహీం, జునాథ్, జనరల్ సెక్రెటరీ సయ్యద్ ఇర్ఫాన్, స్థానిక కార్పొరేటర్లు ముజఫర్ హుస్సేన్, సాఫాత్ అలీ, సీనియర్ నాయకులు, అధికారులు, యువకులు, పెద్దలు పాల్గొన్నారు.

మల్లికార్జున ఆలయంలో అన్నదానం



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని అంజయ్య నగర్‌లో గల శ్రీ భ్రమరాంబ మల్లికార్జున దేవాలయంలో గురువారం ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన వేడుకలకు బీఆర్ఎస్ నియోజకవర్గ యూత్ నాయకులు కొలుకుల జైహింద్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించిన నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. డివిజన్ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. సాయంత్రం స్వామివారి పల్లకి సేవ పురవీధులలో కోలాటాల, భాజ భజంత్రీల నడుమ ఘనంగా ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మెన్, జాతీయ బిసి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు నల్లగోపుల బాబుగౌడ్, ప్రధాన కార్యదర్శి, పటోళ్ల ప్రవీణ్ చారి, కమిటీ సభ్యులు, డి. జయశ్రీ, కిరణ్ రవీంద్ర చారి, వెంకటేష్, రమేష్, పి.రాజు, సోమారపు రాజు, బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

ఈదమ్మ ఆలయంలో శివపార్వతుల కళ్యాణం



నవతెలంగాణ-సిటీబ్యూరో

మహాశివరాత్రిని పురస్కరించుకుని ఉప్పల్ సర్వే ఆఫ్ ఇండియా ఈదమ్మ గుడి ప్రాంగణం లోని శ్రీ అన్నపూర్ణ సహిత కాశీ విశ్వేశ్వర ఆలయంలో గురువారం శివపార్వతుల కళ్యాణ వేడుకలు అంగరంగ వైభోపేతంగా జరిగాయి. చాడ వాణిశ్రీ అనూప్ కుమార్ రెడ్డి దంపతులు స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిం చగా.. ప్రధాన అర్చకులు సిద్దేశ్వర శర్మ ఆధ్వర్యంలో శివపార్వతుల కళ్యాణం వేదమంత్రోచ్ఛరణ మధ్య కమనీయంగా జరిపించారు. భక్తులు, ప్రముఖులు, స్థానికులు తదితరులు పెద్దఎత్తున తరలివచ్చి కళ్యాణ మహోత్సవాన్ని విజయవంతం చేశారు. ఆలయాన్ని స్థాపించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న శుభసందర్భంగా ఆలయ ప్రాంగణంలో పలు సేవా కార్యక్రమాలతో పాటు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కళ్యాణ వేడుకల్లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు చర్ల సుధాకర్ రెడ్డి, గుడి చైర్మెన్ మేకల దయాసాగర్ రెడ్డి, భక్తులు సర్వే ఆఫ్ ఇండియా ఎంప్లాయిస్ గోపాల కృష్ణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సూరారంలో అన్నదానం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని సూరారం " శ్రీ ఉమా మహేశ్వరస్వామి శైవక్షేత్రం"లో ఉపవాసాలుండే భక్తుల కోసం మహా అన్నదాన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్యంగా ఆలయ వ్యవస్థాపకులు , ధర్మకర్త ముద్దాపురం మదన్ గౌడ్ భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. స్థానికులతో పాటు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ప్రజలు సైతం వచ్చి అన్నదానంలో పాల్గొన్నారు. ముద్దాపురం మదన్ గౌడ్ స్వయంగా భక్తులకు భోజనం వడ్డించారు.

పోక్సో కేసులో వ్యక్తికి పదేండ్ల జైలు శిక్ష



నవతెలంగాణ-హయత్‌నగర్/బడంగ్‌పేట్

సోదరుడితో కలిసి వీధిలో ఆడుకుంటున్న ఒక మైనర్ బాలుడుతో అసహజ రీతిలో ప్రవర్తించిన బాలాపూర్ మండలం జల్పల్లి గ్రామానికి చెందిన మొహమ్మద్ ఇద్రీస్‌కు పోక్స్ చట్ట ప్రకారం పదేండ్లు జైలు శిక్ష, రూ.15వేలు జరిమానా విధించినట్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సునీత, పహడి షరీఫ్ ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి తెలిపారు. 2019లో రాచకొండ కమిషనరేట్ పరిధిలోని పహాడీ షరీఫ్ పోలీస్ స్టేషన్‌లో లైంగికదాడి, పోక్సో చట్ట ప్రకారం రంగారెడ్డి జిల్లా ఫాస్ట్ ట్రాక్ కోర్ట్ పోలీసులు ద్వారా సాక్షాదారుల పరిశీలించి శిక్ష విధించారు. బాధిత బాలుడికి మూడు లక్షల పరిహారం అందజేసినట్టు పోలీసులు తెలిపారు.



చిందోళ్ల చరిత్ర - సాహిత్యం, సంస్కృతి గ్రంథానికిగాను కొలకలూరి రామయ్య పరిశోధన పురస్కారం అందుకుంటున్న డా. గడ్డం మోహన్ రావు. చిత్రంలో పద్మశ్రీ కొలకలూరి ఇనాక్, ద్రావిడ విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కొలకలూరి మధు జ్యోతి, కొలకలూరి శ్రీకిరణ్, ఆచార్య కొలకలూరి సుమకిరణ్ తదితరులు ఉన్నారు. నవతెలంగాణ-సిటీబ్యూరో

సికింద్రాబాద్‌లో 69వ రైల్వే వారోత్సవాలు



- 69 మంది సిబ్బంది, అధికారులకు రైల్ సేవా పురస్కార్ అవార్డ్స్

నవతెలంగాణ-ఓయూ

దక్షిణ మధ్య రైల్వే 69వ రైల్వే వారోత్సవాలను గురువారం సికింద్రాబాద్ డివిజన్ న్యూ భోయిగూడలోని రైల్ కలారంగ్‌లో జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి సికింద్రాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ శ్రీ భరతేష్ కుమార్ జైన్ ముఖ్య అతిథిగా హాజరై వ్యక్తిగత రైలు సేవా పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో 69 మంది సిబ్బంది, అధికారులకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ సుబ్రహ్మణ్యం, సికింద్రాబాద్ డివిజన్ అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ గోపాల కృష్ణ, అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ గోపాల్, బ్రాంచ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ భరతేష్ కుమార్ జైన్ మాట్లాడుతూ. అవార్డు గ్రహీతలను అభినందించారు. గత ఏడాదిలో వారు కనబరిచిన అంకితభావాన్ని, ప్రతిభావంతమైన పనితీరును ప్రశంసించారు. సికింద్రాబాద్ డివిజన్ గత రెండేండ్లుగా ఉత్తమ పనితీరును కనబరిచిందని, తన గుర్తింపును బలోపేతం చేసుకుంటోందని, అత్యుత్తమ ప్రదర్శనకారులలో ఒకటిగా జోనల్ వ్యాప్త గుర్తింపును పొందిందని పేర్కొన్నారు. డివిజన్ వృద్ధి వేగాన్ని కొనసాగించడానికి అదే ప్రయత్నాలను కొనసాగించాలని ఆయన సిబ్బందికి సూచించారు. రైలు కార్యకలాపాల భద్రత డివిజన్ యొక్క అత్యంత ప్రాధాన్యత అని, భద్రతా చర్యల అమలులో ఎటువంటి రాజీ పడకూడదని ఆయన పేర్కొన్నారు. సికింద్రాబాద్ డివిజన్ విశిష్ట రైల్ సేవా పురస్కార్ సందర్భంగా జనరల్ మేనేజర్ జోనల్ ఎఫిషియెన్సీ షీల్డ్‌లను కూడా అందుకుంది.

సాంకేతికతకు భాగస్వామ్యం తోడైతే మరింత ముందుకు వెళ్లగలం



- వ్యూసోనిక్ అండ్ విశాల్ పెరిఫెరల్స్ భాగస్వామ్య ప్రతినిధులు

నవతెలంగాణ-బంజారాహిల్స్

ఏపీ, తెలంగాణతో పాటు డిజిటల్ స్పేస్‌లో వ్యూసోనిక్ మరింత బలోపేతమయ్యేందుకు విశాల్ పెరిఫెరల్స్ భాగస్వామ్యలు దోహదపడనున్నట్టు విజువల్ సొల్యూషన్స్ విభాగంలో లీడింగ్ గ్లోబల్ ప్రొవైడర్‌గా ఉన్న వ్యూసోనిక్ కార్పొరేషన్ డైరెక్టర్ సంజయ్ భట్టాచార్య, విశాల్ పెరిఫెరల్స్ మేనేజింగ్ డైరెక్టర్ వికాష్ హిసరియాలు అన్నారు. సాంకేతికతకు భాగస్వామ్యం తోడైతే మరింత ముందుకు సాగడం చాలా సులువుతుందని ఏపీ, తెలంగాణతో పాటు డిజిటల్ స్పేస్‌లో బలోపేతమవడంపై దృష్టి కేంద్రీకరించి సంస్థల అభివృద్ధితోపాటు ఉద్యోగ కల్పనకు కృషి చేస్తామని తెలిపారు.

ప్రయివేటు యూనివర్సిటీలలో రిజర్వేషన్లు అమలు చేయాలి



- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్

నవతెలంగాణ-ఓయూ

ధనార్జనే ధ్యేయంగా పుట్టుకొచ్చిన ప్రయివేట్ యూనివర్సిటీలలో బీసీ,ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ కోరారు. ఈ మేరకు గురువారం ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో ఉన్నత విద్య మండలి చైర్మెన్ బాలకిష్టా రెడ్డికి వినతిపత్రం ఇచ్చినట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ.. ధనార్జనే ధ్యేయంగా పేద ప్రజల రక్తాన్ని జలగల్లా పీడిస్తూ లక్షలకు లక్షల రూపాయలు బడుగు బలహీన వర్గాల విద్యార్థుల దగ్గర ఫీజు వసూలు చేస్తున్నారని కనీస మౌలిక వసతులు కల్పించడంలో ప్రయివేట్ యూనివర్సిటీలు విఫలమయ్యాయని అన్నారు. కొన్ని యూనివర్సిటీలు ఏలాంటి అర్హతలు లేకుండా అక్రమార్గంలో దొంగ పత్రాలు సృష్టించి అధికారులను మచ్చిక చేసుకొని, ముడుపులు ఇచ్చి (నాక్,ఎన్‌బీఏ) అక్రీడియేషన్ పొంది విద్యార్థుల దగ్గర లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని వాటినీ గుర్తించి క్షణంగా తనిఖీలు చేయాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి యువజన పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బూర శ్రీనివాస్, ఓయూ జేఏసీ చైర్మెన్ బండి నరేష్, మాల మహానాడు సంక్షేమ సంఘం అధ్యక్షులు చంద్రమోహన్ రాయ్, బీసీ విద్యార్థి సంఘం ఓయూ ఇన్‌చార్జి గోదా రవీందర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలి



నవతెలంగాణ-యాలాల

విద్యార్థులకు పరీక్షల భయం, ప్రేమ వివాహాలు, ఆత్మహత్యలపై, చట్టాలపై అవగాహన కల్గి ఉండాలని డీఎస్పీ బాలకృష్ణారెడ్డి అన్నారు. గురువారం యాలాల మండల కేంద్రంలో కేజీబీవీ పాఠశాలలో ఎస్ఐ గిరితో కలిసి విద్యార్థులకు రానున్న పదవ తరగతి, ఇంటర్మీడియట్, పరీక్షలపై అవగాహన కల్పించారు. దీంతో పాటు సైబర్ నేరాలతో పాటు చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలని సూచించారు. ఆకతాయిల వేధింపులపై ఫిర్యాదు చేయడానికి పాఠశాలలలో, కళాశాలలోని అన్ని క్లాస్ రూమ్లలో క్యూఆర్ కోడ్ స్కానర్లు అంటించే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. వేధింపులకు గురైన విద్యార్థినులు ఫిర్యాదు చేసేందుకు సరళ మార్గాలు ఉన్నాయని ప్రతి చోట అందుబాటులో క్యూఆర్ కోడ్ స్కానర్లు ఉన్నాయన్నారు. అదేవిధంగా డయల్ 100, షీటీం, వాట్సాప్ నంబర్ 8333986926కు ఫిర్యాదు చేయాలన్నారు. అయితే బాల్యవివాహాలు, సైబర్ నేరాలు, ఫోక్సో చట్టం, రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, మానవ అక్రమ రవాణా తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేజీబీవీ ఉపాధ్యాయినీలు, విద్యార్థినులు, పాల్గొన్నారు.

ఏఐ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

- అధికారులు అందుబాటులో ఉండాలి
- జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి



నవతెలంగాణ-సిటీబ్యూరో

జోనల్, డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని జిహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి ఆదేశించారు. అధికారులు సిబ్బంది సమయ పాలన పాటించాలని అందుకు ఏఐ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. హెడ్ ఆఫీసులో హెచ్ఓడీలు కూడా అందుబాటులో ఉండేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు కమిషనర్ తెలిపారు. జోనల్, డిప్యూటీ కమీషనర్ కార్యాలయాల్లో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఐటీ అడిషనల్ కమిషనర్ ను కోరారు. హెడ్ ఆఫీస్‌లో హెచ్ఓడీలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టి అదేవిధంగా జోనల్, డిప్యూటీ కమిషనర్ కార్యాలయాలకు మీరే భాధ్యత కాబట్టి అధికారులు, సిబ్బంది సమయ పాలన పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

బాధితులతో అధికారుల గ్రామ సభ





నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ ప్రాంతంలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో భూమి కొల్పోతున్న వారితో గురువారం హైదరాబాద్ రెవెన్యూ జాయింట్ కలెక్టర్ ముకుంద రెడ్డి, ల్యాండ్ అక్రిడేషన్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేష్ కుమార్, సికింద్రాబాద్ ఆర్డీవో పి.సాయిరాం, తిరుమలగిరి తాహశీల్దార్ ఎస్.అశోక్ కుమార్ గ్రామసభ నిర్వహించారు. సంజీవయ్య నగర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన సమావేశానికి బాధితులు పాల్గొని వారి బాధను వెల్లబుచ్చారు. అధికారులు వారి రికార్డులను పరిశీలించారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకెజ్, 200ఫీట్ రోడ్ వైండినింగ్ చేయాలని నిర్ణయించారు. అయితే బాధితులు తమ తాతలు నాటి భూములు కొల్పోతున్నామని, ఇండ్లు పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమకి సరైన న్యాయం చేసిన తర్వాతే నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంజీవయ్య కాలనీ జనరల్ సెక్రెటరీ జీఎస్ యాదవ్, ప్రెసిడెంట్ డీఎం అశోక్ కుమార్, పీఎల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఖైరతాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి. విజయ రెడ్డి మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నియోజకవర్గంలోని నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల పరిధిలో ఉన్న శివలయల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

నవతెలంగాణ-బంజారాహిల్స్

4 వేల షూ పోయాయి

- పీఎస్‌లో ఆస్పత్రి సెక్యూరిటీ సిబ్బంది ఫిర్యాదు

నవతెలంగాణ-బంజారాహిల్స్

సోమాజిగూడ యశోద ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్యుడికి సంబంధించిన 4 వేల ఖరీదైన షూ పోయాయని ఆస్పత్రి సెక్యూరిటీ సిబ్బంది పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గురువారం 12 గంటల పది నిమిషాలకు గుర్తు తెలియని వ్యక్తి హాస్పిటల్‌లోని బీ-1 లిఫ్ట్‌లో ఎక్కి 5వ అంతస్తులు పైకి వెళ్లి డాక్టర్ డ్రెస్సింగ్ రూమ్ దగ్గర వరుసగా ఉన్న షూలలో ఒక జతను తీసుకొని 14వ అంతస్తుకూ వెళ్ళి కిందికి వచ్చి బయటికి వెళ్ళిపోయాడు. దీనిని సీసీ కెమెరాలో గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నిందుతుని చట్టపరంగా శిక్షించాలని పోలీసులను కోరాడు.

బాల్య వివాహాలపై అవగాహన కలిగి ఉండాలి





- సాధన సంస్థ డైరెక్టర్ మురళీమోహన్

నవతెలంగాణ-ధారూర్

బాల్య వివాహాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలని సాధన సంస్థ డెరెక్టర్ మురళీమోహన్ తెలిపారు. మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లతో సాధన సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బాల్యవివాహాలు, బాల కార్మికుల విముక్తి గురించి అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాధన సంస్థ డైరెక్టర్ మురళి మోహన్ మాట్లాడుతూ వికారాబాద్ జిల్లాలో బాల్య వివాహాలు జరుగుతున్నట్టు సమాచారం వస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని తెలిపారు. అనంతరం తహసీల్దార్ సాజిదాబేగం మాట్లాడుతూ ఎక్కడైనా బాల్యవివాహాలు ఎవ్వరైనా జరిపిస్తే వెంటనే పోలీసులు, అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. సమాచారం ఇచ్చిన వివరాలు గోప్యంగా పెడుతామని తెలిపారు. అనంతరం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ మేడం వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ ధారూర్ మండలంలో బాల్యవివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అంగన్‌వాడీలు తీసుకుని, బాల్యవివాహాల వల్ల జరిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్, అంగన్‌వాడీ టీచర్లు, సాధన సంస్థ మండల కోఆర్డినేటర్ బి అంజయ్య, ఎండీ.అసిమా, బి.శివలక్ష్మి, వై.ప్రకాశం, సాధన సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ప్యారడైజ్ హలీమ్ ఫెస్టివల్ ప్రారంభం



నవతెలంగాణ-బేగంపేట్

ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న వార్షిక 'జమ్-ఎ-హలీమ్' ప్యారడైజ్ హలీమ్ ఫెస్టివల్ శుక్రవారం(నేటి) నుంచి ప్రారంభం కానుందని ప్యారడైజ్ ఫుడ్ కోర్ట్ ప్రయివేట్ లిమిటెడ్ సీఈఓ గౌతమ్ గుప్తా అన్నారు. ఈ సందర్భంగా గురువారం ప్యారడైజ్ హోటల్‌లో ఆయన మాట్లాడుతూ.. ఇది భారతదేశ వ్యాప్తంగా ఉన్న ప్యారడైజ్ అవుట్‌లేట్లలో డైన్ ఇన్, టేక్ అవేలు, స్విగ్గీ, జొమాటో, ప్యారడైజ్ యాప్ ద్వారా హలీమ్ డెలివరీ అందుబాటులో ఉంటుందన్నారు. ఈ ఫెస్టివల్ రూ.299, రూ.235 ధరలకు రుచికరమైన మటన్, చికెన్ హలీమ్ అందిస్తుందని తెలిపారు. ఇరవై తొమ్మిది ఉత్తమ నాణ్యత గల పదార్థాలు 100 శాతం స్వచ్ఛమైన నెయ్యితో దీనిని వండుతారు. స్నేహితులు, కుటుంబ సభ్యులతో గ్రూప్ షేరింగ్ కోసం మటన్, చికెన్ ఫ్యామిలీ ప్యాక్‌లు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. పరిశుభ్రత ప్రమాణాలకు అనుగుణంగా, ప్యారడైజ్ తమ కస్టమర్లకు ఉత్తమమైన వాటిని నిర్ధారిస్తూ అత్యున్నత భద్రతా ప్రోటోకాల్‌ను నిర్వహిస్తుంది. మహోన్నత వారసత్వంతో తమ బ్రాండ్ కస్టమర్ల జీవితాల్లో అంతర్భాగంగా మారిందన్నారు. దిల్ సే హైదరాబాదీ అని చెప్పుకోవడానికి మేము గర్విస్తున్నామని తెలిపారు. తమ పారడైజ్ మటన్, చికెన్ హలీమ్, హలీమ్ వాల్యూ కాంబో డీల్స్ పారడైజ్ ఇఫ్తార్ బాక్స్ వంటి ప్రత్యేక ఆఫర్లు ఉన్నాయని, ఎప్పటిలాగే, ప్యారడైజ్ బ్రాండ్ వాగ్దానానికి అనుగుణంగా నాణ్యత, రుచి, భద్రతను కలిపి హైదరాబాదీలకు అత్యంత ఇష్టమైన ఆహారాలను అందించడానికి సిద్ధంగా ఉన్నాట్టు పేర్కొన్నారు. ఫుడ్ చైన్ ఇటీవల రెస్టారెంట్ అవార్డ్స్ 2024- తెలంగాణ అండ్ ఆంధ్రప్రదేశ్‌ను గెలుచుకుంది. ప్యారడైజ్ 2018లో ఆసియా ఫుడ్ కాంగ్రెస్‌లో 'రెస్టారెంట్ సర్వింగ్ ది బెస్ట్ బిర్యానీ' అవార్డును, ఇండియా ఫుడ్ ఫోరమ్లో గోల్డెన్ స్పూన్ అవార్డును కూడా గెలుచుకుంది. గత కొన్ని ఏండ్లుగా తెలంగాణ స్టేట్ హెరీటల్స్ అసోసియేషన్స్ జీహెచ్ఎంసీ, టైమ్స్ ఫుడ్ అవార్డు, (ప్రైడ్ ఆఫ్ తెలంగాణ, లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుల నుంచి అనేక ప్రశంసలు, పురస్కారాలను గెలుచుకున్నట్టు సీఈఓ గౌతవమ్ గుప్తా గుర్తచేశారు.

బాస్ వాలా చేతికి 'ఫ్రీడం' యాప్

- ఏడు మిలియన్ డాలర్ల పెట్టుబడే లక్ష్యం
- బాస్ వాలా అధినేత శశి రెడ్డి



నవతెలంగాణ-బంజారాహిల్స్

ప్రముఖ పెట్టుబడిదారుడు వ్యాపారవేత్త, బాస్ వాలా అధినేత శశి రెడ్డి ఆధ్వర్యంలోకి 'ఫ్రీడం' యాప్ వచ్చిందనీ ఈ యాప్ ఒక ఎడ్టెక్ ప్లాట్‌ఫాం సువిజన్ హోల్డింగ్స్ ప్రయివేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నడిచేదనీ ఇందులో బాస్ వాలా ఏడు మిలియన్ డాలర్లు (సుమారు 60 కోట్లు) పెట్టుబడి పెట్టిందనీ ప్రకటించారు. గురువారం ఇందుకు సంబంధించిన ఒప్పందాలు పూర్తయినట్టు బాస్ వాలా సీఈఓ శశి రెడ్డి తెలిపారు. ఈ ఫ్రీడం యాప్ ద్వారా లభించే ఉపాధి ఆధార విద్యా కంటెంట్‌తో పాటు బాస్ వాలా వివిధ వ్యాపార రంగాల్లో వేల మంది నిపుణులను అందుబాటులోకి తెస్తుందన్నారు. టైర్2, టైర్3 పట్టణాల్లో వ్యాపారం ప్రారంభించాలని అనుకునే వ్యక్తులకు అవసరమైన వనరులు అందించనుందన్నారు. విజయవంతమైన వ్యాపారం నిర్మించేందుకు సహాయపడుతుందని తెలిపారు. జేఈఈ, ప్రభుత్వ పరీక్షల కోసం ఎన్నో ప్లాట్‌ఫాంలు ఉన్నాయన్నారు. కానీ ఉపాధి కల్పించే, ఆదాయాన్ని అందించేవి లేవన్నారు. బాస్ వాలా ఆ లక్ష్యాన్ని సాధించేందుకు ముందుకు వచ్చిందన్నారు. వ్యాపార విద్యా, మార్గదర్శకత అందించే సమగ్ర వేదికగా బాస్ వాలా ఉంటుందన్నారు. బాస్ వాలా పెట్టుబడితో వేలాది మంది వ్యాపారవేత్తలు తమ వ్యాపారాన్ని ప్రారంభించడానికి, అభివృద్ధి చేసుకోవడానికి, అవసరమైన నైపుణ్యాలను పొందడానికి, మార్గదర్శకత అందుకోవడానికి సమగ్ర వేదికను అందించనుందని తెలిపారు. ఈ ప్లాట్ఫారమ్ ప్రారంభంలో డిజిటల్ వ్యాపారాలు, గృహాధారిత వ్యాపారాలు, చిన్నతరహా తయారీ, హస్తకళలు, వ్యవసాయం, పశుపోషణ, రిటైల్, ఫుడ్ వ్యాపారాలు వంటి 12 ప్రధాన విభాగాల్లో నైపుణ్యాలను అందించేందుకు దృష్టి సారించాయనీ అన్నారు.

ఎంత ధైర్యం నా కారుని ఆపుతావ్..



- ఒక్క ఫోన్ కొట్టానంటే ట్రాన్స్‌ఫర్
- పంజాగుట్టలో వ్యక్తి హల్చల్

నవతెలంగాణ-బంజారాహిల్స్

ఇంత ధైర్యం ఉంటే నా కారుని ఆపుతావా ఒక్క ఫోన్ కొట్టానంటే ట్రాన్స్‌ఫర్ అయిపోతావ్ అంటూ పంజాగుట్టలో మెర్క్యూర్ హోటల్ వద్ద వాహన తనిఖీలలో ఓ కారు యజమాని చేసిన హల్చల్ సామాజిక మాధ్యమాల్లో చక్కెర్లుకొడుతుంది. అతడి వాహనాన్ని పోలీసులు తనిఖీ చేయగా రూ.4 వేల పెండింగ్ చలాన్ గుర్తించారు. దీంతో రెచ్చిపోయిన సదరు వాహన యజమాని రెండు నిమిషాల్లో ట్రాన్స్‌ఫర్ చేయిస్తా.. అంటూ ట్రాఫిక్ పోలీసుల మీద చిందులు వేశాడు. తన కారు ఆపడానికి ఎన్ని గుండెలు. తన ఇంట్లో ఉన్న వాహనాలకు 16 వేల పెండింగ్ చలానా ఉంటేనే ఎవరు ఆపలేదు ఆఫ్‌ట్రాల్ నాలుగు వేలకే ఆపుతావ అని రెచ్చిపోయాడు. వాహన తనిఖీలలో భాగంగా భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో పంజాగుట్ట పోలీసులకు సదరు ట్రాఫిక్ పోలీస్ అధికారి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నవతెలంగాణ-శేరిలింగంపల్లి

వేసవి కార్యాచరణ ప్రణాళిక పనుల కోసం శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 33/11కేవీ వేమన కాలనీ సబ్ స్టేషన్ నుంచి వెలువడే 11 కేవీ భవానీపురం ఫీడర్ పరిధిలోని భవానీపురంరెడ్డి కాలనీ, బలహీన విభాగం కాలనీ, శంకర్‌నగర్ ప్రాంతాల్లో 33/11కేవీ వేమనకాలనీ సబ్ స్టేషన్ నుంచి వెలువడే 11కేవీ సురక్ష ఫీడర్ పరిధిలోనీ విద్యానగర్, సురక్ష ఎన్‌క్లేవ్, రాజేందర్‌రెడ్డి నగర్, సత్య ఎన్‌క్లేవ్, శుభోదయ కాలనీ, అపరణ హెచ్‌టీ. సర్వీస్ జేటీపీఎల్ సబ్ స్టేషన్ నుంచి 11కేవీ పీజేఆర్ ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలోని పీజేఆర్ రోడ్ నంబర్లు 1,3,5,7,10,12, లక్సరీ అపార్ట్‌మెంట్ ప్రాంతంలో విద్యుత్ ఉండదని అధికారులు తెలిపారు.

మియాపూర్‌లో...

33/11 కెవి మదీనాగూడ సబ్‌స్టేషన్ నిర్వహణ కారణంగా శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మదీనాగూడ, కృషి నగర్, మా నగర్, స్టాలిన్ నగర్, ప్రశాంత్‌నగర్, జనప్రియ వెస్ట్ సిటీ, బీకె ఎంక్లేవ్, మియాపూర్ సెక్షన్‌లో విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు తెలిపారు.

'సీఏఐఎస్ఆర్‌సీ' కౌన్సిల్ నూతన కార్యవర్గం ఏర్పాటు



చైర్మెన్‌గా సి.ఏ.చిన్న సీతారామిరెడ్డి అన్నపురెడ్డి ఎన్నిక

నవతెలంగాణ-బంజారాహిల్స్

ది ఇన్‌స్టిట్యూట్ అఫ్ ఛార్టర్డ్ అకౌంట్స్ అఫ్ ఇండియా సదరన్ రీజినల్ కౌన్సిల్ హైదరాబాద్ బ్రాంచ్ నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసింది. ఈ మేరకు రెడ్ హిల్స్‌లోని సంస్థ ఆఫీసులో జరిగిన మేనేజింగ్ కమిటీ సమావేశంలో సభ్యులు తమ ప్రతినిధులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 2025-2026 సంవత్సరానికి చైర్మెన్‌గా సీఏ. చిన్న సీతారామిరెడ్డి అన్నపురెడ్డి, వైస్ చైర్మెన్‌గా సీఏ. గింధారి లాల్ తోష్నివార్, సెక్రెటరీగా సీఏ కారుమంచి రామారావు, కోశాధికారిగా సీఏ. నాగ హర్షవర్ధన్ రెడ్డి, శీలం సీఏ. ముక్కర సాయి చరణ్ రెడ్డి, సికాస చైర్మెన్ సీఏ. గోనుగుంట మురళి ఎన్నిక అయ్యారు. సీఏ. ఉప్పలపాటి శరణ్ కుమార్, సీఏ. కుమార్ పాల్ టాటెడ్, సీఏ. శైలేష్ ఖండేల్ వాల్ కార్యవర్గ సభ్యులుగా ఉన్నారు. ఈ సమావేశానికి ఐసీఏఐ సెంట్రల్ కౌన్సిల్ సభ్యులు సీఏ. దయచివాస్ శర్మ, సీఏ. ముప్పాళ్ల శ్రీధర్, రీజినల్ కౌన్సిల్ సభ్యులు సీఏ భాను నారాయణ రావు, సీఏ. చెంగల్ రెడ్డి, సీఏ. సునీల్ కుమార్ మండవ, సీఏ. యర్రా తిరుపతయ్య, సీఏ. దీపక్ లడ్డా తదితరులు పాల్గొన్నారు. గత కమిటీ సభ్యులు సంస్థకు అందించిన విశిష్ట సేవలను కొనియాడారు. అనంతరం వారిని ఘనంగా సత్కరించారు.

హాస్టల్ కుక్‌కు మెరుగైన వైద్యం అందించాలి



- పీడీఎస్‌యూ డిమాండ్

నవతెలంగాణ-ఓయూ

ఓయూ గోదావరి హాస్టల్ కుక్ జంపయ్యకు మెరుగైన వైద్యం అందించాలని కోరుతూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) గురువారం ఓయూ చీఫ్ వార్డెన్ ప్రొ. కొర్రెముల శ్రీనివాస్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఓయూ పీడీఎస్‌యూ నాయకుడు ఆసిఫ్ మాట్లాడుతూ.. గోదావరి హాస్టల్‌లో వంట చేస్తున్న కుక్ జంపయ్యకు ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని చేతులు కాలడం బాధాకరమన్నారు. తనది నిరుపేద కుటుంబమని ఆయనకి జరిగిన ప్రమాదంకు ఉస్మానియా యూనివర్సిటీ యాజమాన్యమే పూర్తి బాధ్యత వహిస్తూ ఆస్పత్రి ఖర్చులు అన్నింటిని పెట్టుకోవాలని, తనకు మెరుగైన వైద్య అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. హాస్టల్ విద్యార్థుల సంఖ్య కనుగుణంగా పని మనుషులను, వంట మనుషులను కేటాయించాలని కోరారు. వంట చేస్తున్న సమయంలో పనిచేస్తున్న కార్మికులకు భద్రత కల్పించే విధంగా భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఓయూ వీసీ, చీఫ్ వార్డెన్‌లు యూనివర్సిటీ పరిధిలో ఉన్న హాస్టల్‌లో అన్నింటినీ సందర్శించి సమస్యలను పరిష్కరించాలన్నారు. అనేక హాస్టల్స్‌లో కనీస మౌలిక సదుపాయాలు లేవని వాపోయారు. మెస్ నాణ్యతను పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సృజన్, చందు, గోపాల్, ఆర్పన్, శ్రావణ్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
మన తెలుగు దినపత్రిక
హైదరాబాద్
శుక్రవారం | ఫిబ్రవరి 28, 2025 | www.navatelangana.com

గుడిమల్కాపూర్‌లో జింక



నవతెలంగాణ-మెహిదీపట్నం

ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుడిమల్కాపూర్ సాయిబాబా టెంపుల్ వద్ద జింక ప్రత్యక్షమైంది. దానిని చూసిన స్థానికులు ఆశ్చర్యానికి లోనయ్యారు. వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి చేరుకుని స్థానికుల సహాయంతో జింకను పట్టుకున్నారు. అనంతరం జింకను పోలీసులు అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. అటవీశాఖ అధికారులు ఆ జింకను నెహ్రూ జూపార్కులో వదిలేశారు. అయితే జింక ఎక్కడ నుంచి వచ్చిందనే కోణంలో అటవీశాఖ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

కమిషనర్‌ను కలిసిన నియోజకవర్గ డెవలప్మెంట్ ఫోరమ్ కమిటీ

నవతెలంగాణ-ధూల్‌పేట్



నూతనంగా బాధ్యతలు చేపట్టిన జీహెచ్ఎంసీ సర్కిల్-14 డిప్యూటీ కమిషనర్ లావణ్యని గోషా మహల్ నియోజకవర్గం డెవలప్మెంట్ ఫోరమ్ కన్వీనర్ బద్దం సతీష్ గౌడ్ కమిటీ సభ్యులతో మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. అనంతరం నియోజకవర్గంలోని పలు సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు. సూర్య మహల్ అక్రమ నిర్మాణం, రీసలా అబ్దుల ప్రాంతంలో జరుగుతున్న ఆక్రమ నిర్మాణాల పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో ఇఫతఖర్, ఆరీఫ్ ఖాన్, చెతన, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

'యునానీ' ద్వారా మెరుగైన వైద్య సేవలు అందాలి

- ఆస్పత్రి నిర్మాణం, వసతి గృహం ఏర్పాటుకు ప్రభుత్వం రూ.52 కోట్లు మంజూరు
- ఆస్పత్రి, కళాశాలను చార్మినార్ ఎమ్మెల్యేతో సందర్శించిన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి





నవతెలంగాణ-సిటీబ్యూరో

యునానీ ఆస్పత్రి ద్వారా పేషెంట్లకు మెరుగైన వైద్య సేవలు అందాలని గవర్నమెంట్ నిజామీయా టిబ్బి కళాశాల, జనరల్ ఆస్పత్రిని చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జులీఫకర్ అలీతో కలసి కళాశాల, ఆస్పత్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యత కల్పిస్తుందని ఆ దిశగా అన్ని విభాగాల వైద్యులు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఆస్పత్రి, కళాశాల ఆవరణలో ఐదు పురాతన భవనాలను తొలగించే ప్రక్రియపై కాంట్రాక్టర్, ఇంజనీరింగ్ అధికారులకు కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వం అత్యంత సౌకర్యాలతో అద్భు తమైన ఆస్పత్రి నిర్మాణం అలాగే వైద్య విద్యార్థుల వసతి గృహం చేపట్టడానికి ప్రభుత్వం రూ.52 కోట్లు మంజూరు చేసిందన్నారు. హెరిటేజ్ కిందకు వచ్చే పురాతన భవనాల రెనోవేషన్ చేపట్టేం దుకు గాను రూ.10 కోట్లు అలాగే నూతన ఆస్పత్రి భవనం, హాస్టల్ నిర్మాణం అలాగే క్యాం టీన్ సదుపాయాలు కల్పించడం కోసం రూ. 42 కోట్లు కేటాయించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. పాత భవనాల తొలగింపు ప్రక్రియ నిబంధనల మేరకు జరగాలని, భవనాల తొలగింపు తదుపరి భూమి విస్తీర్ణం యొక్క వివరాలను అందించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇక్కడి వసతి గృహం కూడా తొలగింపులో ఉన్నందున వైద్య విద్యార్థులకు చార్మినార్ పరిసర ప్రాంతంలో తాత్కాలిక వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. బీయుఎంఎస్ వైద్య విద్యార్థులకు ఫలక్నుమా ప్రాంతంలో రెండు ఎకరాలలో వసతి గృహహం ఏర్పాటుకు నివేదికలు అందచేయాలని ఇంజనీ రింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. తదు పరి ఆస్పత్రి పరిసర ప్రాంతాలతో పాటు ఓ.పి బ్లాక్‌ను శాసన సభ్యులతో కలసి సందర్శించి ఓ.పి వివరాలను, పేషంట్స్‌కి అందుతున్న మెడి సన్ అలాగే వైద్యాసేవలను అడిగి పలు విభాగాలను ఈ సందర్భంగా తనిఖీ చేసి అందుతున్న వైద్య సేవలపై పేషెంట్లతో తెలుసుకున్నారు. కళాశాలలో లైబ్రరిని సందర్శించిపురాతనమైన ఉర్దూ, ఫార్సీ భాషలో గల వైద్య పుస్తకాలను పరిశీలించి వైద్య విద్యార్థులతో అందుతున్న వైద్య సదుపాయాలను తెలుసుకు న్నారు. అదేవిధంగా ఫిజియోథెరపీ విభాగాన్ని సందర్శించి డాక్టర్ సిద్ధిఖి అందించిన పలు పరికరాలను పరిశీలించి అభినందించారు. హెచ్‌డీసీ కమిటీ నిధులతో ఫిజియోథెరపీ డాక్టర్‌ను నియమిస్తామని పేషెంట్లకు మెరుగైన వైద్యం అందుతుందని ఈ సందర్భంగా అన్నారు. గర్భినులకు వైద్య సదుపాయాలు నిరంతరం అందాలని అలాగే సాధారణ ప్రసావాలు ఎక్కువగా జరిగేలా ప్రత్యేక కృషి చేయాలని, కళాశాలలో వైద్య విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో వివిధ విభాగాలలో వైద్యులు, సిబ్బంది కొరత ఎక్కువగా ఉందని వచ్చే పేషంట్ల దృష్ట్యా వైద్యుల్ని, సిబ్బందిని నియమించాలని కలెక్టర్‌ను ప్రిన్సిపాల్ అభ్యర్థించగా నివేదికను అందచేస్తే డీఎంఈకి పంపించి తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శైజాదీ సుల్తానా, ఆస్పత్రి సూపరెంట్ వసంతరావు, ప్రెసిడెంట్ యుఎంఓఏ డా. హైదర్ యమని, కార్పొరేటర్ సోయబ్ ఖాద్రి, తహసీల్దార్ చంద్రశేఖర్, ప్రొఫెసర్లు, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు స్నేహపూర్వకంగా ఉండాలి

- రెడ్ కాన్వెంట్ హైస్కూల్ కరస్పాండెంట్ కమటం రఘు



నవతెలంగాణ-ముషీరాబాద్

విద్యార్థులు అన్ని విషయాలలో స్నేహపూర్వకంగా ఉంటూ కలిసిమెలిసి ఉండాలని రెడ్ కాన్వెంట్ హై స్కూల్ కరస్పాండెంట్ కమటం రఘు అన్నారు. గురువారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాంనగర్ రెడ్ కాన్వెంట్ హై స్కూల్ పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు పార్టీ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలలో విద్యార్థులు తమ ఆటపాటలతో ఎంతో ఆహ్లాదకరంగా అలరించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ రఘు మాటాడుతూ విద్యార్థులు స్నేహపూర్వకంగా ఉంటూ చదువులో రాణించాలని కోరారు. ఉన్నత విద్యను అభ్యసిస్తూ తల్లిదండ్రులకు గురువులకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ కమటం సౌజన్య, టీచర్‌లు అరుణ, కవిత, రాజేశ్వరి, అనిత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


ఆల్ ఇండియా గంగపుత్ర సంఘం వైస్ ప్రెసిడెంట్‌గా పూస గోరఖ్నాథ్

నవతెలంగాణ-ముషీరాబాద్



ఆల్ ఇండియా గంగపుత్ర సంఘం వైస్ ప్రెసిడెంట్‌గా మూడోసారి బీఆర్ఎస్ నాయకులు పూస గోరఖ్నాథ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ గోరఖ్నాథ్‌ను అభినందించి సన్మానించారు. తనను మూడోసారి వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకోవడంపై ఆల్ ఇండియా గంగపుత్ర సం ఘం అధ్యక్ష, కార్యవర్గానికి ధన్యవాదాలు తెలియజేశారు.

ఘనంగా మహా శివరాత్రి జాగరణ మహోత్సవం



నవతెలంగాణ-ధూల్‌పేట్

మహాశివరాత్రి సందర్భంగా బుధవారం కాగజ్ గూడా శంకర జీ హనుమాంజి కల్యాణ మండపంలో శ్రీ శివ మహా జాగరణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మహా శివరాత్రి జాగరణ సేవాసమితి అధ్యక్షులు మాడిశెట్టి సదానందం గుప్తా ఆధ్వర్యంలో జాగరణ కార్యక్రమం జోరుగా కొనసాగింది. రాత్రి ప్రత్యేక పూజల అనంతరం భజనలు, ప్రముఖ గాయకులు సి.రాజన్ కుమార్, హీరో ఓం మిశ్రా నిహారిక గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో సినీ నటుడు అమిత్, రాష్ట్ర ప్రచార కమిటీ కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, కార్పొరేటర్‌లు శంకర్ యాదవ్, శశికళ కృష్ణ, లాల్ సింగ్, భీస్మా, గోవింద్ రాటీ, భాగవంత్ రావు, సేవా సమితి ప్రధాన కార్యదర్శి సి.రాజన్ కుమార్, ఆర్గనైసింగ్ కార్యక్రమం పి.రంజిత్ కుమార్, సహా కాశాధికారి సచిన్ రాజ్ సింగ్, తోట శ్రవణ్ తదితరులున్నారు.

నవతెలంగాణ-అంబర్‌పేట



మహాశివరాత్రి పురస్కరించుకొని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అంబర్‌పేట కార్పొరేటర్ ఇ.విజయ కుమార్ గౌడ్ దంపతులు

మహాకుంభమేళాలో 45రోజుల పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించాం



- లక్షమందికి ఉచిత వసతి కల్పించాం
- అఖిల భారత ధర్మాచార్య పీఠం నేషనల్ జనరల్ సెక్రటరీ పెరిక సురేష్

నవతెలంగాణ-అంబర్‌పేట

మహాకుంభమేళాలో 45రోజుల పాటు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు అఖిల భారత ధర్మాచార్య పీఠం నేషనల్ జనరల్ సెక్రటరీ పెరిక సురేష్ వెల్లడించారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమంలో మహా కుంభమేళా ఆరంభం నుంచి మహాశివరాత్రి వరకు నిత్యాన్నదానాలు, వసతి, వైద్యసేవలు, స్వామిజీలతో భాగవత గోష్టిలు నిర్వహించామని తెలిపారు. తన నేతృత్వంలో 270 కుటీరాలు ఏర్పాటు చేసి లక్ష మందికి పైగా ఉచిత వసతి కల్పించామన్నారు. తెలంగాణ నుంచి అత్యధికంగా నల్గొండ నుంచి 20వేల మందికి వసతి కల్పించామని తెలిపారు. ప్రతీ రోజుకు 2వేల మందికి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ప్రముఖ స్వామీజీ శ్రీరాం భద్రాచార్యులతో పాటు, వీరేంద్ర శాస్త్రీ, జగద్గురు శంకరాచార్య అనంత శ్రీభూషీత్ శంకరాచర్య స్వామీజీల, స్వామి విమల్‌దేవ్ లతో ఆధ్యాత్మిక కార్యక్రమాలు, అఖండ దీపోత్సవాలు, శివపూరణ, నిత్యాభిషేకాలు వంటి దైవ కార్యక్రమాలు నిర్వహించినట్లు సురేష్ వివరించారు. గతంలో అయోధ్యలో 11రోజుల పాటు యాగంలో పాల్గొన్న స్ఫూర్తితో ఈ 45రోజుల పాటు మహాశివుని సన్నిధిలో గడపడం తన పూర్వజన్మసుకృతమని పెరిక సురేష్ పేర్కొన్నారు.

'చంద్రశేఖర్ ఆజాద్ పోరాట స్ఫూర్తిని యువత పుణికిపుచ్చుకోవాలి'



- ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా 94వ వర్ధంతి

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

చంద్రశేఖర్ ఆజాద్ పోరాట స్ఫూర్తిని నేటి యువత పుణికిపుచ్చుకోవాలని ఏఐవైఎఫ్ సూచించింది. ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో గురువారం హిమాయత్‌నగర్‌లోని కామ్రేడ్ ఎస్.సత్యనారాయణరెడ్డి భవన్‌లో చంద్రశేఖర్ ఆజాద్ 94వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్ మాట్లాడుతూ దేశం కోసం తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా బ్రిటీష్ ముష్కరుల బానిస సంకెళ్ల నుండి మాతృదేశ విముక్తి కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అతి చిన్న వయస్సులోనే దేశభక్తిని పెంపొందించుకొని, విప్లవ వీర యోధుల వారసత్వాన్ని పుణికిపుచ్చుకొని విప్లవం వర్ధిల్లాలి అంటూ నినాదం అందించిన గొప్ప విప్లవకారుడు చంద్రశేఖర్ ఆజాద్ అని వారు కొనియాడారు. నేడు దేశంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న యువజన వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని సూచించారు. దేశంలో జరుగుతున్న విధ్వంసకర పాలనకు వ్యతిరేకంగా చంద్రశేఖర్ ఆజాద్ పోరాట స్ఫూర్తిని దేశభక్తిని నేటి యువత పుణికిపుచ్చుకొని ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.సత్య ప్రసాద్, హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, ఖైరతాబాద్ నియోజకవర్గ అధ్యక్షులు కళ్యాణ్, నేతలు అనిల్ కుమార్, వంశీ, బాలు, విజయ్, అరుణ్, లక్ష్మణ్, శరత్, ఏఐటీయూసీ నేత చెట్టుకింది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఐసీఏఐ హైదరాబాద్ నూతన కార్యవర్గం ఏర్పాటు

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



ది ఇన్స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా సదరన్ రీజనల్ కౌన్సిల్, హైదరాబాద్ బ్రాంచ్ నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేయటం చేశారు. సభ్యులు తమ ప్రతినిధులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెడ్ హిల్స్‌లోని సంస్థ ఆఫీసులో జరిగిన మేనేజింగ్ కమిటీ సమావేశం 20 25-26 సంవత్సరానికి చైర్మెన్‌గా సీఏ చిన్న సీతారామిరెడ్డి అన్నపురెడ్డి, వైస్ చైర్మెన్‌గా సీఏ గింధారి లాల్ తోష్నివార్, సెక్రటరీగా సీఏ కారుమంచి రామారావు, కోశాధికారిగా సీఏ నాగ హర్షవర్ధన్ రెడ్డి శీలం, సి.ఏ ముక్కర సాయి చరణ్‌రెడ్డి సీకాస చైర్మెన్‌గా సీఏ గోనుగుంట మురళి, సికాస కో చైర్మెన్ గాను ఎన్నుకున్నారు. సీఏ ఉప్పలపాటి శరణ్ కుమార్, సి.ఏకుమార్ పాల్ టాటెడ్, సి.ఏ శైలేష్ ఖండేల్ వాల్ మిగిలిన కార్యవర్గ సభ్యులుగా ఉన్నారు. ఈ సమావేశానికి ఐసీఏఐ సెంట్రల్ కౌన్సిల్ సభ్యులు సీఏ దయచివాస్ శర్మ , సీఏ ముప్పాళ్ల శ్రీధర్, రీజినల్ కౌన్సిల్ సభ్యులు సీఏ భాను నారాయణ రావు, సీఏ చెంగల్‌రెడ్డి, సీఏ సునీల్ కుమార్ మండవ, సీఏ యర్రా తిరుపతయ్య, సీఏ దీపక్ లడ్డా తదితరులు పాల్గొన్నారు. గత కమిటీ సభ్యులు సంస్థకు అందించిన విశిష్ట సేవలను కొనియాడారు. అనంతరం వారిని ఘనంగా సత్కరించి గౌరవించారు.

తెలంగాణ సారస్వత పరిషత్తు రాష్ట్రస్థాయి ఉత్తమ గ్రంథ పురస్కారాలు..

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

తెలంగాణ సారస్వత పరిషత్తు 2025 సంవత్సరానికి తెలంగాణ రాష్ట్రస్థాయి ఉత్తమ గ్రంథ పురస్కారాలకు సూచనలు, గ్రంథాలు ఆహ్వానించింది. 2023-24 సం వత్సరాల్లో తొలిసారి ముద్రణ పొందిన పుస్తకాలను మూడు ప్రతుల చొప్పున పంపాలి. పద్య/గేయ కవిత్వం, వచన కవిత్వం, కథ, నవల, బాల సాహిత్యం, సాహిత్య విమర్శ, ఇతర ప్రక్రియలు అనే ఏడు విభాగాల్లో పురస్కారాలు అంద జేయనున్నట్లు పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా. జె.చెన్నయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కవిత్వం 60 పుట లకు, మిగితా ప్రక్రియల్లో పుస్తకాలు 100 పుటలకు తక్కువ ఉండరాదు. ప్రత్యేకంగా పిల్లలకోసం అన్ని ప్రక్రియలలో చేసిన రచనలు బాల సాహిత్యంలోకి వస్తాయి. బాల సాహి త్య రచనలకు పుటల పరిమితి లేదు. పోటీకి గ్రంథాలు పంపేవారు జన్మతః తెలంగాణ వారై ఉండాలని, ఇతర ప్రాంతాల వారు అర్హులు కారని ఆ ప్రకటనలో పేర్కొ న్నారు. రచయితలు తమ పుస్తకాలను మూడు ప్రతుల చొప్పున తెలంగాణ సారస్వత పరిషత్తు, తిలకోడ్, అబిడ్స్, హైదరాబాద్ 1 చిరునామాకు మార్చి 25 లోగా పంపాలి. తమకు నచ్చిన పుస్తకాలను పాఠకులు పురస్కారానికి పరి శీలించామని కోరవచ్చు. పుస్తకం వివరాలను తెలియజే స్తూ.. telangana saraswathaparishath@gmail.com కు లేఖ పంపాలి. మిగితా వివరాల కోసం 9603727234 నెంబర్‌కు సంప్రదించవచ్చునని కోరారు.

శ్రీ దరిశి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓ.యస్. 167/2023

అశెళ్ళ సువర్చల ... వాది

మరియు

గాదిరాజు వెంకటక్రిష్ణం రాజు ... ప్రతివాది

తండ్రి కిష్టం రాజు ప్లాట్ నెం.205, మహాలక్ష్మీ ఎస్టేట్, నియర్ వెర్‌టెక్స్ ప్రివిలెజ్ ఎంట్రెన్స్ అర్బి. హైటెన్షన్ రోడ్డు, నిజాంపేట్, హైదరాబాద్, తెలంగాణ-500090

To

Rs గాదిరాజు వెంకటక్రిష్ణం రాజు తండ్రి కిష్టం రాజు ప్లాట్ నెం.205, మహాలక్ష్మీ ఎస్టేట్,నియర్ వెర్‌టెక్స్ ప్రివిలెజ్ ఎంట్రెన్స్ అర్బి,హైటెన్షన్ రోడ్డు, నిజాంపేట్, హైదరాబాద్, తెలంగాణ-500090

పై నెంబరు వాది దావ పరిహారము కోరి మీపై దావ దాఖలు చేసి ఉన్నది. కనుక మీకు ఏవిధమైన ఆక్షేపణలు ఉన్నచో తేది.19-03-2025 ఉదయం:గం.10:30 ని.లకు పైకోర్టువారి ఎదుట హాజరై తెలుపుకొనవలెను. లెకున్న మీకు పరోక్షముగా తీర్మాణం కాలదును.

వాయిద 19-03-2025

వడ్డమాని శ్రీనివాసశాస్త్రీ
దరిశి అడ్వకేట్
తేది: 25-02-2025 సెల్: 9440109385

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE SURYAPET DISTRICT, AT: SURYAPET
LA. NO. 351 OF 2023
IN
O.S.NO. 64 OF 2018

BETWEEN:
SMT. P. SUDHA & 2 Others ...Petitoiners/Petitioners/Plaintiffs
AND
M. NARAYANA REDDY & 2 Others ...Respondents/Respondents/Defendants
SRI R. VITTAL REDDY, & 2 OTHERS ...Respondents/Respondents/Proposoed Defendants No.4 to 6

TO
1) **SRI R. VITTAL REDDY,** S/o R. Durga Reddy, aged about 65 years, Occ: business, R/o H.No.16-2-753/33, Flat No.203, Swati Heaven Appts. Revenue Board Colony. P&T Colony, Gaddiannaram, Hyderabad, 500008. ...Respondand No.4
2). **SAMA UPENDER REDDY,** S/o. S.Ama Chandra Reddy, Age: 42 Years, Occ: Business, Athmakur, Midhanapally, Lingampally, Nalgonda District. ...Respondant No.6

Sir,
Whereas the above named Petitioners/Plaintiff filed the above suit seeking specific performance against the defendant. The above IA is filed to Implead you as defendants. The Hon'ble Court posted the matter on 13-03-2025 at 10.30 a.m. for your appearance.
Therefore, you are requested to appear before this Hon'ble Senior Civil Judge, Suryapet district, at Suryapet, on 13-03-2025 at 10-30 a.m. either in person or through Counsel duly instructed. Otherwise the matter will be heard and decided exparte in your absence.

(BY ORDER OF THE COURT)
Sd/- V.RANGA REDDY, Advocate
Plot No.33 & 34, Vikasnagar, Saroornagar, Hyd-35. Ph:24055849 / 9848079418
(COUNSEL FOR THE PETITIONERS/PLAINTIFFS)

IN THE COURT OF HON'BLE IX JUNIOR CIVIL JUDGE, CITY CIVL COURT, AT: HYDERABAD
O.S.No.769 OF 2025
BETWEEN:
1)Smt.V.Rajya laxmi W/o Late V.Sudhakar @ V.Sudhakar Verma aged about 46yrs, Occ:Housewife,
2)Kum.Virouthu.Sravani D/o Late V.Sudhakar @ V.Sudhakar Verma, aged about 24 years, Occ:student
3)Kum. Virouthu. Rahul D/o Late V.Sudhakar @ V.Sudhakar Verma, aged about 23 yrs, Occ: Student
All are R/o.H.No.13-2-947, Kagaziguda, Puranapool, Asif Nagar Mandal, Hyderabad. ....PLAINTIFFS
AND
(1)The Mandal Revenue Officer/ Tahsiladar Asif NagarMandal, Vijay Nagar Colony.
(2) All Concerned. ...DEFENDANTS

TO,
ALL THE CONCERNED
Take Notice that the Petitioners herein have filed the above OS for Declaration of legal heirs of Deceased Late V.Sudhakar @ V. Sudhakar Verma, against the MRO and all the concerned. That the above case is posted on 25.03.2025 for your appearance before the Hon'ble court. If any person or persons have any objection for declaring legal heir of petitioners, then they may appear in person or through their counsel on the above referred date at 10:30 A.M, before the IX Junior Civil Judge, City Civil Court, At Hyderabad and put forth their objection if any, failing which order will be passed in their absence.

(BY THE ORDER OF THE COURT)
Smt.R.PINKESHWARI, Advocate
H.No. 14-10-707, SATYGULAB RESIDENCY, Dhoolpet, Hyderabad-06 Cell: 8639915407.

ORDER 39 RULE (1) & (2) RCPC NOTICE

శ్రీ దరిశి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A. No. 1018/2023, O.S: 167/2023

అశెళ్ళ సువర్చల ... వాది

మరియు

గాదిరాజు వెంకటక్రిష్ణం రాజు ... ప్రతివాది

తండ్రి కిష్టం రాజు ప్లాట్ నెం.205, మహాలక్ష్మీ ఎస్టేట్, నియర్ వెర్‌టెక్స్ ప్రివిలెజ్ ఎంట్రెన్స్ అర్బి. హైటెన్షన్ రోడ్డు, నిజాంపేట్, హైదరాబాద్, తెలంగాణ-500090

To

Rs గాదిరాజు వెంకటక్రిష్ణం రాజు తండ్రి కిష్టం రాజు ప్లాట్ నెం.205, మహాలక్ష్మీ ఎస్టేట్,నియర్ వెర్‌టెక్స్ ప్రివిలెజ్ ఎంట్రెన్స్ అర్బి,హైటెన్షన్ రోడ్డు, నిజాంపేట్, హైదరాబాద్, తెలంగాణ-500090

పై నెంబరు పిటీషన్ పరిహారము కోరి పిటీషనర్ దాఖలు చేసి ఉన్నది. కావున మీకు ఆక్షేపణలు ఉన్న యెడల పైకోర్టువారి ఎదుట తేది.19-03-2025 ఉదయం :గం.10:30 ని.లకు హాజరై తెలుపుకొనవలెను. లెకున్న మీకు పరోక్షముగా తీర్మాణం కాలదును.

వాయిద 19-03-2025

వడ్డమాని శ్రీనివాసశాస్త్రీ
దరిశి అడ్వకేట్
తేది: 25-02-2025 సెల్: 9440109385

IN THE COURT OF THE HON'BLE I ADDL. CHIEF JUDGE, CITY CIVIL COURT, AT: SECUNDERABAD
A.S.No. 28 OF 2024
Between:
P. Surender Rao ...Appellant
A N D
Smt. Sabera Begum and others ... Respondents

To,
1. **Smt. Sabera Begum,** W/o. Mohd. Moulana, Aged 52 years, Occ: Business, R/o. H.No. 1-3-1039, Kavadiguda, Secunderabad. **...Respondent No.1**
3. **Mohammed Ali,** S/o. Mohd. Shahabuddin, Aged: 50 yrs, Occ: Business, **...Respondent No.3**
4. **Ahmed Ali,** S/o. Mohd. Shahabuddin, Aged: 48 yrs, Occ: Business, **...Respondent No.4**
5. **Imam Ali,** S/o. Mohd. Shahabuddin, Aged: 50 yrs, Occ: Business, **...Respondent No.5**
6. **Ibrahim Ali,** S/o. Late Mohd. Shahabuddin, Aged: 44 yrs, Occ: Business, **...Respondent No.6**
All are R/o. H.No. 1-3-1039, Kavadiguda, Secunderabad.
7. **Smt. Bismilla Begum,** W/o. Chota Shahbuddin, Aged: 52 yrs, Occ: Housewife, R/o. H.No. 1-3-513, Kavadiguda, Secunderabad. **...Respondent No.7**
8. **Smt. Hazira Begum,** W/o. Jahangir, Aged 40 years, Occ: Housewife, R/o. Opp. Kala Engg. Works, Warisguda, Secunderabad. **...Respondent No.8**
9. **Smt. Sakina Bee,** W/o. Late Shahbuddin, Aged 60 years, Occ: Household, R/o. H.No. 1-3-1039, Kavadiguda, Secunderabad. **...Respondent No.9**
10. **Smt. P. Hymavathi,** W/o. Late Sitarama Raju, Aged 51 years, Occ: Household, **...Respondent No.10.**
11. **Smt. K. Madhavi,** W/o. K.S.S.V. Kamaraju, Occ: Household, R/o. H.No. 107, N.C.L. Enclave, North Avenue, Kompally Village, R.R.Dist. **...Respondent No.11**
12. **P. Murali Krishna,** S/o. Late Sitarama Raju, Occ: Business, R/o. H.No. H.No. 18, N.C.L. Colony, Petbasherabad Village, Secunderabad. Rep. by their Agreement of Sale-Cum GPA Petitioner No. 4 herein. **...Respondent No.12**
13. **Sri Balaji Real Estates,** Partnership Firm, having its office at Plot No. 322, Phase-III, Kamalapuri Colony, Hyderabad-073. Rep. by its Managing Partners Petitioners 5 &6 **...Respondent No.13**
16. **R. Vinitha,** W/o. R. Anil Kumar, Aged 45 years, Occ: Housewife, Rep. by her GPA R. Madhava Rao, S/o. Purushotham Rao, Aged 76years, Occ: Retd. Employee, Both are R/o. H.No. 3-4-9A, Barkathpura, Hyderabad. **...Respondent No.16**

Sir/Madam,
Please take notice that the above Appeal No. 28/2024 is posted to **17/03/2025** for your appearance against orders passed in I.A.No. 57/2017 in O.S.No. 243/1994. As per the orders of this Hon'ble Court you all concerned are hereby directed to appear before the Hon'ble Court on **17/03/2025 at 10.30 AM.** If you fail to appear before this Hon'ble Corut on the above said date and time, the matter will be decided in your absence.

(BY ORDER OF THE COURT)
Sd/- P. RAJKIRAN, Advocate,
Secunderabad. **Cell: 83097 63717**

IN THE COURT OF THE HON'BLE I ADDL. CHIEF JUDGE, CITY CIVIL COURT, AT: SECUNDERABAD
I.A.No. 1689 OF 2024 IN
A.S.No. 28 OF 2024
Between:
P. Surender Rao ...Appellant
A N D
Smt. Sabera Begum and others ... Respondents

To,
1. **Smt. Sabera Begum,** W/o. Mohd. Moulana, Aged 52 years, Occ: Business, R/o. H.No. 1-3-1039, Kavadiguda, Secunderabad. **...Respondent No.1**
3. **Mohammed Ali,** S/o. Mohd. Shahabuddin, Aged: 50 yrs, Occ: Business, **...Respondent No.3**
4. **Ahmed Ali,** S/o. Mohd. Shahabuddin, Aged: 48 yrs, Occ: Business, **...Respondent No.4**
5. **Imam Ali,** S/o. Mohd. Shahabuddin, Aged: 50 yrs, Occ: Business, **...Respondent No.5**
6. **Ibrahim Ali,** S/o. Late Mohd. Shahabuddin, Aged: 44 yrs, Occ: Business, **...Respondent No.6**
All are R/o. H.No. 1-3-1039, Kavadiguda, Secunderabad.
7. **Smt. Bismilla Begum,** W/o. Chota Shahbuddin, Aged: 52 yrs, Occ: Housewife, R/o. H.No. 1-3-513, Kavadiguda, Secunderabad. **...Respondent No.7**
8. **Smt. Hazira Begum,** W/o. Jahangir, Aged 40 years, Occ: Housewife, R/o. Opp. Kala Engg. Works, Warisguda, Secunderabad. **...Respondent No.8**
9. **Smt. Sakina Bee,** W/o. Late Shahbuddin, Aged 60 years, Occ: Household, R/o. H.No. 1-3-1039, Kavadiguda, Secunderabad. **...Respondent No.9**
10. **Smt. P. Hymavathi,** W/o. Late Sitarama Raju, Aged 51 years, Occ: Household, **...Respondent No.10.**
11. **Smt. K. Madhavi,** W/o. K.S.S.V. Kamaraju, Occ: Household, R/o. H.No. 107, N.C.L. Enclave, North Avenue, Kompally Village, R.R.Dist. **...Respondent No.11**
12. **P. Murali Krishna,** S/o. Late Sitarama Raju, Occ: Business, R/o. H.No. H.No. 18, N.C.L. Colony, Petbasherabad Village, Secunderabad. Rep. by their Agreement of Sale-Cum GPA Petitioner No. 4 herein. **...Respondent No.12**
13. **Sri Balaji Real Estates,** Partnership Firm, having its office at Plot No. 322, Phase-III, Kamalapuri Colony, Hyderabad-073. Rep. by its Managing Partners Petitioners 5 &6 **...Respondent No.13**
16. **R. Vinitha,** W/o. R. Anil Kumar, Aged 45 years, Occ: Housewife, Rep. by her GPA R. Madhava Rao, S/o. Purushotham Rao, Aged 76years, Occ: Retd. Employee, Both are R/o. H.No. 3-4-9A, Barkathpura, Hyderabad. **...Respondent No.16**

Sir/Madam,
Please take notice that the above I.A. No. 1689 /2024 in Appeal No. 28/2024 is posted to **17/03/2025** for your appearance against orders passed in I.A.No. 57/2017 in O.S.No. 243/1994. As per the orders of this Hon'ble Court you all concerned are hereby directed to appear before the Hon'ble Court on **17/03/2025 at 10.30 AM.** If you fail to appear before this Hon'ble Corut on the above said date and time, the matter will be decided in your absence.

(BY ORDER OF THE COURT)
Sd/- P. RAJKIRAN, Advocate,
Secunderabad. **Cell: 83097 63717**

IN THE COURT OF THE HON'BLE III AJCJ CUM III AJM OF FIRST CLASS, R.R. DIST., AT LB NAGAR
O.S. No. 116 OF 2025
Between:
1. **Smt. GIDLA VIJAYA SHANTHI RANI,** W/o. Late. VALLAPUDASU JOSEPH, Aged about 59 years, Occ:Working, Aadhar Card : 6959 6342 7849, R/o. Door no.2, 111, Irukupalem Gramam, Muppalla Mandala, Madala Guntur, A.P
2. **Kum. Vijetha Grace Vallapudas,** D/o. Late. VALLAPUDASU JOSEPH, Aged about 24 years, Occ: Student , Aadhar Card : 9997 7680 1164
3. **Kum. Vallapudas Suraksha Grace,** D/o. Late. VALLAPUDASU JOSEPH, Aged about 23 years, Occ: Working, Aadhar Card : 5975 2082 5855, Plaintiffs 2 & 3 are R/o. Plot no. 364, Road No. 12, Nandi Hills Meerpet, Hyderabad-500097. ...PLAINTIFFS
AND
1. **The Tahsildar,** Balapur Mandal, Ranga Reddy Dist.
2. **The Branch Manager,** LIFE INSURANCE OF INDIA, Lic-Cb-2, Basheerbagh, Hyderabad
3. **ALL CONCERNED** ..DEFENDANTS

To,
The Defendant No-3
ALL Concerned
Sir/Madam,
Please take notice that the Plaintiffs herein has filed the above Suit for Declaration of Plaintiff's as Legal Heirs of the deceased **Late Vallapudasu Joseph expired on 12-05-2021** at District Hospital, Tenali **and his First wife Late ACHASH GRACE also expired on 21-02-2004 at** Hyderabad, for their legal status purpose only. The above said case is posted to **20-03-2025** at 10.30 am in the above Court. If anybody is having any claim or objection may approach this Hon'ble Court with valid documents failing which the case will be heard and decided on merits in your absence.

(By order of the Hon'ble Court)
Sd/- **GANJI SAI KUMAR, ADVOCATE,**
Off. #12-1-1640/1,Shanthinagar, North Lalaguda, Secunderabad-500017 Telangana State.
Cell No: 9666288080
Email: ganjiassociates@gmail.com

IN THE COURT OF THE HON'BLE FAMILY JUDGE, MEDCHAL MALKAJGIRI DISTRICT : AT : MALKAJGIRI
M.C.NO. 3 OF 2020
Between:
Smt. B.Kavitha & another .... Petitioners
AND
B.Bikshapati ... Respondent
To,
B.Bikshapati S/o. B.Anjaiah Aged about 45 years, Occ : Carpenter R/o. H.No.8-85, Dabilpur Village, Madchal Mandal, Madchal-Malkajgiri District .... Respondent

NOTICE

That the above named Petitioners have filed the above said MC for claiming Maintenance against you before Hon'ble Family Judge, at Malkajgiri and the said matter is posted on 19-03-2025 for your appearance before the Hon'ble Family Judge, at Malkajgiri. Therefore you have to appear before the above said Hon'ble Court on **19-03-2025** at 10.30 a.m. either in person or through the counsel, failing which the matter will be decided in your absence as per law.

// BY ORDER OF THE HON'BLE COURT //
D.RAMULU Advocate
O/o. H.No.13-117, P & T Colony, Dilsukhnagar, Hyderabad – 060.
Mobile No.96761 41361

వ్యక్తి అదృశ్యం



నవతెలంగాణ-హయత్‌నగర్

ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్ హయత్ నగర్‌కు చెందిన పెరుమాళ్ళ కమలాకర్.. ఈ నెల 23న బయటికి వెళ్లాడు. కానీ ఇంటికి తిరిగి రాకపోవడంతో అతనికి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. వెంటనే అతని భార్య చుట్టుపక్కల వారి దగ్గర, బంధువులను ఆరా తీయగా అతని గురించి ఎలాంటి ఆచూకీ లభించలేదు. దీంతో అతని భార్య పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో మెకానిక్ ఆత్మహత్య



నవతెలంగాణ-హయత్‌నగర్

ఆర్థిక ఇబ్బందులతో జేసీబీ మెకానిక్ ఆత్మహత్య చేసుకున్న ఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్‌కు చెందిన దుకాణ్ కుమార్(26)..6 నెలల కిందట బతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చాడు. పెద్ద అంబర్పేట్‌లోని జేసీబీ జంక్షన్ దగ్గర జై హనుమాన్‌లో జేసీబీ మెకానిక్‌గా పని చేస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు. అతనితోపాటు మరి కొంతమంది కూడా కలిసి ఉంటున్నారు. ఈ నెల 26న దుకాణ్ కుమార్ అతను ఉంటున్న గది ముందు భాగంలో తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తోటి వారు లేచి చూసేసరికి అతను తాడుకు వేలాడుతూ ఉండడంతో వెంటనే 100కు ఫోన్ చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా హాస్పిటల్‌కు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

అందరి సహకారంతో సేవా కార్యక్రమాలు



- డాక్టర్ ముజీబ్
- ఎంఎన్‌జేలో 800 మంది రోగుల సహాయకులకు అన్నదానం

నవతెలంగాణ-సిటీబ్యూరో

అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ సయ్యద్ మాజీదుల్లా హుస్సేని(ముజీబ్) ఆధ్వర్యంలో ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి ఆవరణలో సుమారు 800 నిరుపేద రోగుల సహాయకులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కేంద్ర సంఘం అధ్యక్షులు మారం జగదీశ్వర్, అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకట్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మారం జగదీశ్వర్ మాట్లాడుతూ తన తల్లిదండ్రుల పేరు మీద వివిధ కార్యక్రమాలు చేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందని, ముజీబ్ కుటుంబ సభ్యులు, మిత్రులు, తోటి ప్రభుత్వ ఉద్యోగుల ప్రోత్సహంతో ఎన్నో కార్యక్రమాలు విజయవంతంగా చేస్తున్నందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. డాక్టర్ ముజీబ్ మాట్లాడుతూ తాను భగవంతునికి సదా రుణపడి ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ కె.ఆర్.రాజ్ కుమార్, ఏపీఆర్వో మొహమ్మద్ వహీద్, మహమ్మద్ హబీబ్ చావుష్, మొహమ్మద్ అబ్దుల్ ముస్తఫా, మాజీ సభ్యులు జగదీష్, ఎంఎన్‌జే చంద్రశేఖర్, మిత్రులు ఉస్మాన్ ఆలి ఉస్మాని పాల్గొన్నారు.

ఘనంగా చేవెళ్ల ఎంపీ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ - మీర్‌పేట్

చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకలను మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బీజేపీ అధ్యక్షులు పసునూరి బిక్షపతి చారి, ముఖేష్ కుమార్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జస్టిస్ కొండా మాధవ రెడ్డి ఫౌండేషన్ సహకారంతో కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడ కమల నెహ్రూ నగర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పలకలు, బుక్స్ అందజేశారు. తర్వాత జిల్లెలగూడ ప్రభుత్వ పాఠశాలలో గత సంవత్సరం 10వ తరగతిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఫ్లోర్ లీడర్ కీసర గోవర్ధన్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు సోమేశ్వర్, నాయకులు అమర్నాథ్ రెడ్డి, గాజుల మధు, గోపీనాథ్, కాశీరాం, జగన్ ముదిరాజ్, వేణుగోపాల్ రెడ్డి, మిరియాల శ్రీనివాస్, గన్నోజు చంద్రశేఖర్ చారి, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అమావాస్య అన్నప్రసాద వితరణలో ఉప్పల



నవతెలంగాణ-నాగోల్

అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ సికింద్రాబాద్ జోన్ ఏవీఎస్ ఆడిట్ బుద్ధ నగర్ వారి ఆధ్వర్యంలో అమావాస్య అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త హాజరై అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాల కన్నా అన్నదానం ఎంతో గొప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో కటకం శ్రీనివాస్, ఐవీఎఫ్ సికింద్రాబాద్ జోన్ అధ్యక్షుడు బెల్దే రవి కుమార్ గుప్త, ప్రధాన కార్యదర్శి పబ్బా చంద్రశేఖర్, బొద్దనగర్ శాఖ కార్యదర్శి బుషెట్టి శ్రీనివాస్ గుప్త, కోశాధికారి గూడ శ్రీనివాస్ గుప్త, ప్రాజెక్ట్ చైర్మెన్ వెంకటేశ్వర్ రావు, సుధాకర్ గుప్త, బాబు గుప్త శ్రీకాంత్ గుప్త, ఐవీఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జానపద నేపథ్యంలో
మనుష్యుల వ్యక్తిత్వం ఆవిష్కరణ



నవతెలంగాణ-కల్చరల్

ప్రతి మనిషిలోనూ మంచి చెడు ఉంటాయని సందర్భానుసారం ఆ గుణాలు బయట పడతాయని తెలిపేది చరణ దాసు నాటకం. జానపద కథ నేపథ్యంలో ఆంగ్ల కథ రాబిన్ హుడ్‌లా చరణ దాసు ఒక మంచి దొంగ.. ఉన్నవారి నుంచి దోచుకొని లేనివారికి పంచే గుణము. హబీబ్ తన్వీర్ రచించిన చరణ దాసు నాటకం రవీంద్ర భారతి ప్రధాన వేదికపై ఉదయ భాను దర్శకత్వంలో ప్రదర్శించారు భూమిక థియేటర్స్ గ్రూప్ నిర్వహణలో బబ్లూ కళ్యాణ్, జ్ఞానేస్వర్, వినోద్ మణి తదితర యువతరం ఈ నాటకంలో పాత్రలు ధరించారు. ప్రతి నెలా టికెట్‌పై నాటకంపై నాటకం ఉద్యమం లా గత మూడున్నర దశాబ్దాలగా కొనసాగిస్తున్న రస రంజని నాటక సంస్థ ఆధ్వర్యంలో ప్రదర్శించారు.

నేడు డయల్ యువర్ డీఎం

నవతెలంగాణ- హయత్‌నగర్

హయత్‌నగర్ 1, 2 డిపోలలో నేడు (శుక్రవారం) డయల్ యువర్ డీఎంను నిర్వహిస్తున్నట్టు డిపో మేనేజర్లు విజయ్, శ్రీనివాస్‌లు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్టీసీ ప్రయాణికులు హయత్‌నగర్ 1, 2 డిపోలలో నిర్వహించే డయల్ యువర్ డీఎంలలో ఏమైనా సమస్యలు ఉంటే సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. డయల్ యువర్ డీఎం కార్యక్రమం సాయంత్రం 4గంటల నుండి 5గంటల వరకు ఉందని, 9959226138, 9959226419 ఈ నెంబర్లకు ఫోన్ చేసి, సమాచారం ఇవ్వాలని ప్రయాణికులకు సూచించారు.

భవనాల మంజూరు
ఇక నుంచి వేగవంతం

- నిర్మాణ అనుమతుల ప్రక్రియకు సింగిల్ ప్లాట్ ఫాం
- 10న ముఖ్యమంత్రి చేతులమీదుగా ప్రారంభించే అవకాశం





అప్లోడ్ చేసే విధానంపై పలువురికి శిక్షణ
జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, సీసీపీ శ్రీనివాస్

'ఆర్టిఫీషియల్ ఇంటలీజెన్స్ టెక్నాలజీ' సాంకేతికతతో రూపొందించిన 'ఫాస్ట్ డ్రాయింగ్ స్క్రూటిని సిస్టం' ద్వారా నిర్మాణ అనుమతుల ప్రక్రియ సులభతరం అవుతాయని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, సీసీపీ శ్రీనివాస్ తెలిపారు. గురువారం జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్‌లో రాష్ట్ర ప్రభుత్వం 'ఆర్టిఫీషియల్ ఇంటలీజెన్స్ టెక్నాలజీ' రూపొందించిన బిల్డ్ నౌపై జోనల్, డిప్యూటీ కమిషనర్‌లకు ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిల్డ్ నౌ అప్లికేషన్ అప్లోడ్ చేసే విధానంపై పలువురికి శిక్షణ కల్పించినట్లు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని మార్చి 9 వరకు నిర్వహించి, మార్చి 10న బిల్డ్ నౌ అప్లికేషన్ ప్రారంభించే అవకాశం ఉందన్నారు. జీహెచ్ఎంసీ జోనల్, డిప్యూటీ కమిషనర్‌లకు బిల్డ్ నౌ అప్లికేషన్‌పై అవగాహన కల్పించేందుకు ఓరియంటేషన్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్లు అనురాగ్ జయంత్, హేమంత్ కేశవ్ పాటిల్, ఎపూర్వ్ చౌహాన్, రవి కిరణ్, వెంకన్న, అడిషనల్ సీసీపీ గంగాధర్, ప్రదీప్ వీరన్న టౌన్ ప్లానింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైడ్రా వచ్చిన తర్వాత నిర్మాణ రంగంలో ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ స్థలాలు, పార్కులు, చెరువులు, నాలాలేకాదు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లపై ప్రజల్లో అవగాహన పెరిగింది.. ఎక్కడైనా భూములు, ఫ్లాట్, ప్లాట్ కొనాలన్నా అన్ని పర్మిషన్లు ఉన్నాయా లేవా అనే విషయంలో కొనుగోలు దారులు ఒకటికి పదిసార్లు ఆలోచిస్తున్నారు. ఇందులో భాగంగా జీహెచ్ఎంసీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. కొనుగోలు దారులు ఎలాంటి భయాందోళనకు గురికాకుండా 'ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ టెక్నాలజీ(ఏఐ) అందుబాటులోకి తీసుకొస్తున్నారు. 'ఏఐ' సాంకేతికతతో రూపొందించిన ఫాస్ట్ డ్రాయింగ్ స్క్రూటిని సిస్టం ద్వారా నిర్మాణ అనుమతుల ప్రక్రియ సులభతరం, వేగవంతం కానున్నాయి.

నగర పౌరులు ఆన్ లైన్ లోనే తమ నిర్మాణ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. దాంతో నిర్ణీత కాల వ్యవధిలో అన్ని అనుమతులు సింగిల్ విండో సిస్టం ద్వారా పొందవచ్చు. ఈ విధానం పారదర్శకతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. నగర పౌరులకు, సంబంధిత అధికారులకు, ఆర్కిటెక్ట్‌లకు, ఇంజనీర్లకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. నిర్మాణాలకు సంబంధించి పలు సమస్యలు వేగవంతంగా పరిష్కారం లభిస్తుంది. ఈ అప్లికేషన్‌ను ముఖ్యమంత్రి ఈనెల 10న అధికారికంగా ప్రారంభించనున్నారు.

అత్యంతం సమగ్రమైన సేవలు

ఈ అప్లికేషన్ నిర్మాణ అనుమతుల ప్రక్రియకు వన్ సింగిల్ ప్లాట్ ఫాంగా పనిచేస్తుంది. అప్లికేషన్స్, అనుమతుల ప్రక్రియ పారదర్శకంగా, సులువుగా పొందవచ్చు. ఒక సర్వే నంబర్‌లో, మరొక సర్వే నెంబర్, ఒకచోట బిల్డింగ్ పర్మిషన్‌తో, మరో చోటా చేపట్టే నిర్మాణాల అడ్డుకట్ట వేయడంతోపాటు అధికారులు సులువుగా గుర్తించే విధంగా ఈ యాప్ ఉపయోగపడుతుంది. రియాల్టర్లు, బిల్డర్లకు, కొనుగోలు దారులకు అత్యంత సమగ్రమైన సేవలు అందించే దిశగా జీహెచ్ఎంసీ 'ఏఐ' అప్లికేషన్‌ను అందుబాటులోకి తీసుకొస్తోంది. ఈ యాప్‌తో అధికారులు బాధ్యతాయుతమై సేవలను అందించడంతోపాటు నగరవాసులకు మెరుగైన సేవలు అందించే వీలుంది.

ప్లాన్‌లో అప్లోడ్ చేసే సమయంలో...

ఈ అప్లికేషన్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భవన నిర్మాణాల అనుమతులు వేగవంతంగా జరగనున్నాయి. 'ఆర్టిఫీషియల్ ఇంటలీజెన్స్ టెక్నాలజీ'తో రూపొందించిన నేపథ్యంలో ప్లాన్‌లో అప్లోడ్ చేసే సమయంలో అందులో ఉన్న లోపాలను గుర్తిస్తుంది. మొత్తం ప్లాన్ మొదటి నుండి పరిశీలించాల్సిన అవసరం ఉండదు. తప్పులను గుర్తించిన అంశాన్నే సవరించి అప్లోడ్ చేసే వెసులుబాటు ఉంటుంది. అప్లికేషన్ పరిశీలన చేసే సందర్భంలో ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ప్లాన్, చెరువు పక్కన ఎంత దూరంలో ఉంది, కోర్టు కేసులు ఉన్నాయా అనే తదితర అంశాలు అప్లికేషన్‌లోనే పొందపర్చవచ్చు. అప్లికేషన్స్‌ను పరిశీలించి తొందరగా పర్మిషన్ ఇచ్చే అవకాశం ఉంటుంది. అప్లయ్ చేసే వారు చివరగా కోర్టు కేసులు గాని, ఇతర ఎలాంటి కేసులు లేవని చెపుతుంది. ఇలా సమగ్రమైన సమాచారంతో ఇటు కోనుగోలు దారులు, అటు బిల్డర్లు, రియాల్టర్లకు ఎంతో ఉపసమనం లభిస్తుంది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నవతెలంగాణ-హయత్‌నగర్

వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ముందస్తుగా విద్యుత్ మరమ్మత్తుల కారణంగా నేడు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని సరూర్‌నగర్ విద్యుత్ డీఈ రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 11 కెవి చిత్రాలు లేఅవుట్ ఫీడర్.. చిత్రా లే అవుట్, సిరి నగర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 10:30 నుండి 11:30 నిమిషాల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. 11 కెవి హరిపూరి కాలనీ ఫీడర్.. సరోజినీ నగర్ న్యూ హరిపురి కాలనీ, హరిపూరి కాలనీ, జనప్రియ గార్డెన్‌లో మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటిగంట వరకు, 11 కెవి జైన్ మందిర్ ఫీడర్.. జైన్ మందిర్, న్యూ మారుతి నగర్, బాబు కాంప్లెక్స్, పోస్ట్ ఆఫీస్ పరిసర ప్రాంతాల్లో, 11 కెవి కమలానగర్ ఫీడర్.. సరస్వతి నగర్, సిండికేట్ బ్యాంక్ కాలనీ, కమలానగర్, వివేకనంద నగర్ పరిసర ప్రాంతాల్లో, 11 కెవి శారదానగర్ ఫీడర్.. బాపునగర్, కోదండరాం నగర్, శారద నగర్, రెడ్డి బ్రదర్స్, శారద థియేటర్, ఉదయ్‌నగర్, ఓల్డ్ సరూర్‌నగర్, త్యాగరాయ నగర్, తిరుమల్ నగర్, పరిసర ప్రాంతాల్లో, 11 కెవి ఆర్కేపురం ఫీడర్.. ఇందిరానగర్, సౌభాగ్యపురం, ఆర్కేపురం, టెలిఫోన్ కాలనీ పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని విద్యుత్ అధికారులు వివరించారు.

గంజాయి పట్టివేత



నవతెలంగాణ-చంపాపేట్

మలక్‌పేట్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని యాకత్‌పురా నియోజకవర్గం తలాబ్ కట్ట ప్రాంతంలో ఎక్సైజ్ ఎస్టీఎఫ్ఏ టీం దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక ప్రాంతానికి చెందిన మహమ్మద్ ముగ్దుమ్ అనే వ్యక్తి గంజాయి అమ్ముతున్నాడని విశ్వసనీయ సమాచారం వచ్చిందన్నారు. వెంటనే ఘటనాస్థలానికి చేరుకొని అతని వద్ద నుంచి రూ. 70వేలు విలువ చేసే 1.4కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

రేణుక ఎల్లమ్మ తల్లి
కల్యాణంలో ఉప్పల శ్రీనివాస్ గుప్త

నవతెలంగాణ- నాగోల్

నాగోల్ బండ్లగూడలో నాగోలు డివిజన్ యాదవ సంఘం నాయకులు చింతల కిరణ్ కుమార్ యాదవ్ నిర్వహించిన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి రేణుక ఎల్లమ్మ తల్లి కల్యాణోత్సవానికి టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్, అంతర్జాతీయ అర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త హాజరయ్యారు. తర్వాత ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం దేవాలయాలకు ప్రత్యేక నిధులు కేటాయించి.. ఆలయాల అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మెన్ చింతల ఆగ మలయ్య యాదవ్, చింతల కిరణ్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



బీఎస్ఎన్ఎల్ టవర్స్‌ను ఏర్పాటు చేయాలి



- టెలికాం అడ్వైజరి కమిటీ సమావేశంలో రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి

నవతెలంగాణ-బడంగ్‌పేట్

ప్రభుత్వ భవనాలపై బిఎస్ఎన్ఎల్ టవర్స్‌ను ఏర్పాటు చేయాలని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షులు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి అన్నారు. హైదరాబాదులో చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన టెలికాం అడ్వైజరీ కమిటీ సమావేశానికి హైదరాబాద్ అడ్వైజరీ కమిటీ సభ్యులు, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షులు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి హాజరయ్యారు.

ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ అధీనంలో ఉన్న బిఎస్ఎన్ఎల్ గొప్ప సంస్థగా ఎదగడానికి కావాల్సిన ప్రణాళికలో భాగంగా తమ సూచనలను కమిటీ ముందు తెలిపారు. బిఎస్ఎన్ఎల్ టవర్స్‌ను ప్రభుత్వ భవనాలపై ఏర్పాటు చేసినట్లయితే సిగ్నల్స్ ఇబ్బందులు లేకుండా ప్రజలకు బిఎస్ఎన్ఎల్ సంస్థ మంచి నెట్వర్క్ అందించిన సంస్థగా ఉంటుందన్నారు.

అలాగే ప్రజలు కూడా బిఎస్ఎన్ఎల్ నెట్వర్క్ సేవలను ఆదరిస్తారని, తద్వారా బిఎస్ఎన్ఎల్ సంస్థ లాభాల బాటలో నడుస్తుందన్నారు. స్పందించిన పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఈటల రాజేందర్..వెంటనే ప్రభుత్వ భవనాల వివరాలు సేకరించి, అనుకూలమైన భవనాలపై టవర్లు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



- చైర్మెన్ మహ్మద్ షుజావుద్దీన్




నవతెలంగాణ-బడంగ్‌పేట్

నేటి సమాజంలో విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించాలని గ్రాండ్ సక్సెస్ స్టార్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మెన్ మహ్మద్ షుజావుద్దీన్ సూచించారు. మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న కొత్తపేట్‌లోని సక్సెస్ స్టార్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఆధ్వర్యంలో గ్రేస్ ఫంక్షన్ హాల్లో వార్షిక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర మైనారిటీ కమీషన్ టిజీఎస్ ఎంసీ చైర్మెన్ జనాబ్ తారెక్ అన్సారీ హాజరై మాట్లాడారు. మంచి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులను తీర్చిదిద్దడం, వాటి ప్రాముఖ్యతను మార్గనిర్దేశం చేశారు. మీర్ మొహతేషామ్ అలీ ఖాన్, బహుళ జాతీయ అంతర్జాతీయ టైటిల్స్‌తో ప్రఖ్యాత ప్రో బాడీ బిల్డర్, విద్య ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో గోల్కొండలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల గెజిటెడ్ లైబ్రేరియన్ మహమ్మద్ గులాం జహంగీర్, ఎంకేబిటి డైరెక్టర్ రిజ్వాన్ బేగ్, గ్రేస్ మోడల్ స్కూల్ డైరెక్టర్, మెంటార్ ఇర్ఫాన్ బేగ్, బచ్‌పన్ స్టార్ స్కూల్ నుండి అస్లాం బేగ్, అక్రమ్ బేగ్ బావుమ్, డైరెక్టర్ మెంటర్, మహ్మద్ షుజావుద్దీన్, వ్యవస్థాపక చైర్‌పర్సన్, ప్రిన్సిపాల్ కరస్పాండెంట్, అతియా ఫాతిమా, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మ్యాజిక్ చేస్తున్న నీడిల్స్

హీనా పటేల్... తన వ్యక్తిగత జీవితంలో అనుభవించిన మానసిక వేదనకు అల్లికల్లో ఓదార్పు వెదుక్కున్నారు. తర్వాత కాలంలో అదే ఓ వ్యాపారంగా అవతరించింది. మహిళలకు కొత్త భవిష్యత్తు కల్పించేందుకు మ్యాజిక్ నీడిల్స్ స్థాపించారు. చేతితో తయారు చేసిన అల్లికలు, కుట్టు ఉత్పత్తులను వివిధ రకాలుగా తయారు చేస్తూ మూడు వందల మంది మహిళలకు స్థిరమైన జీవనోపాధిని కల్పిస్తున్న ఆమె పరిచయం నేటి మానవిలో...



హీనా పటేల్ 2011లో తన వ్యక్తిగత జీవితంలో ఎంతో మానసిక వేధనకు గురయ్యారు. మూర్ఛ వ్యాధి కారణంగా తన ఆరేండ్ల కూతురిని కోల్పోయారు. ఈ సంఘటన తర్వాత ఆమె తీవ్ర నిరాశలోకి వెళ్లిపోయారు. ఐవీఎఫ్ ద్వారా మళ్ళీ గర్భం దాల్చడానికి ప్రయత్నించారు. ఫుల్లెర్టన్, ఐసీఐసీఐ బ్యాంకులలో అద్భుతమైన పనితీరు ప్రదర్శించిన హీనా తన గర్భంలో కవలపిల్లలు ఉన్నారని తెలిసిన తర్వాత ఉద్యోగం నుండి విరామం తీసుకున్నారు. ఆ సమయంలో ఆమె అల్లికలపై దృష్టి పెట్టారు. ఆమె టీనేజ్‌లో నేర్చుకున్న నైపుణ్యం ఇది.

అల్లికలతో ఓదార్పు

'ఒక లాక్‌లో నేను కొన్ని సూదులు, నూలును ఆర్డర్ చేసాను. కుట్లు గురించి కొంత అవగాహన ఉండడంతో స్వెటర్ అల్లాను. దీన్నే కొనసాగించాను. అల్లికలు నాకు ఓదార్పును ఇచ్చాయి. నా కవలలకు రెండున్నర ఏండ్లు వచ్చిన తర్వాత ప్లేగ్రూప్ ప్రారంభించాను. కొంతకాలం తర్వాత మళ్ళీ అల్లికలపై దృష్టి పెట్టాను. యూట్యూబ్ వీడియోల ద్వారా కుట్టు పని నేర్చుకోవడం ప్రారంభించాను' అని ఆమె హెర్‌స్టోరీ అనే వెబ్‌సైట్‌తో పంచుకున్నారు. హీనా జీవితంలోని చీకటి కాలంలో ఆమెకు వైద్యం చేసే అభిరుచిగా ప్రారంభమైన ఆ పని మ్యాజిక్ నీడిల్స్‌గా ఎదిగింది. నేడు భారతదేశం అంతటా వందలాది మంది మహిళలను ఉద్ధరించే సంస్థగా రూపొందింది.



ఫేస్‌బుక్ ద్వారా

రోజుకు ఒక ఉత్పత్తిని సృష్టించాలనే సంకల్పంతో ఆమె మొదట్లో హెడ్‌బ్యాండ్‌లు, క్యాప్‌లను తయారు చేయడం ప్రారంభించారు. కొంత విరామం తర్వాత స్నేహితుల వాట్సాప్ గ్రూప్‌లో చేరి నైపుణ్యంతో తన కవలల చిత్రాలను పంచుకుంది. స్నేహితులు వాటిని ఫేస్‌బుక్‌లో షేర్ చేయాలని పట్టుబట్టారు. ఆమె భర్త కల్పేష్ ఆమె కోసం ఒక పేజీని ఏర్పాటు చేశాడు. విపరీతమైన స్పందన వచ్చింది. 'నేను చాలా కాలంగా ఫేస్‌బుక్‌కు దూరంగా ఉన్నాను. కొన్ని క్యాప్‌ల చిత్రాలను పోస్ట్ చేసిన రోజు 800 స్పందనలు వచ్చాయి' అంటూ ఆమె ఆనందంగా చెప్పారు. అదే ఏడాది ఆమె పోస్టులను బేబీ అండ్ మామ్ కేర్ బ్రాండ్ ఫస్ట్‌క్రై గమనించి వాటిని ప్లాట్‌ఫామ్‌లో ప్రదర్శించమని ఆహ్వానించింది. ఇది మ్యాజిక్ నీడిల్స్ పుట్టుకకు మొదటి మెట్టు.



మహిళలను శక్తివంతం చేయడం

ఉత్పత్తులకు డిమాండ్ పెరగడంతో హీనా, కల్పేష్ కలిసి వెనుకబడిన నేపథ్యాల నుండి వచ్చిన మహిళలకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. హీనా బృందంలో చేరిన మొదటి మహిళలలో ఒకరు గతంలో తన ఇంట్లో సాయంగా ఉన్న ప్రియ. ఆమె గర్భవతి కావడంతో తన ఉద్యోగాన్ని వదిలివేసింది. 'ఆమె తిరిగి వచ్చినప్పుడు నేను ఆమెకు ఇంటి పని లేదని చెప్పాను. కానీ ఆమెను నా వ్యాపారంలో చేరమని అడిగాను' అని హీనా పంచుకుంది. మొదట సంకోచించిన ప్రియ త్వరలోనే ఈ కళను నేర్చుకుంది. ఆమె నైపుణ్యం హీనాకు ఆమెను అత్యంత విశ్వసనీయ కళాకారులలో ఒకరిగా చేసింది. చాలా మందికి శిక్షణ ఇవ్వడంలో సహాయపడింది.



మొదట ఏమీ తెలియదు

ప్రియా తన పనితో ఎక్కువ మందికి చేరువవుతుండగా, హీనా ముంబై శివారు ప్రాంతమైన విక్రోలిలోని తన ఇంటికి సమీపంలోని మురికివాడలో నివసించే మహిళల నైపుణ్యాలను ఉపయోగించుకుంది. మ్యాజిక్ నీడిల్స్ మొదటి ఉద్యోగులలో ఒకరైన ప్రియా మాట్లాడుతూ 'నాకు అల్లడం, కుట్టుపని గురించి ఏమీ తెలియదు. మేడమ్ నాకు మొదటి నుండి ప్రతిదీ నేర్పించారు. ఇంటి నుండే పని చేయడం ప్రారంభించాను. మహమ్మారి తర్వాత గిడ్డంగి కార్యకలాపాలను చూసుకోవడం మొదలుపెట్టాను. ఇప్పుడు ఐదుగురు వ్యక్తుల బృందానికి నాయకత్వం వహిస్తున్నాను. నేను ఆర్థికంగా సురక్షితంగా ఉన్నాను. కంప్యూటర్లు నేర్చుకోవడానికి, కంపెనీలో ఎదగడానికి ప్రయత్నిస్తున్నాను' అని చెప్పింది.

సమతుల్యం చేసుకుంటూ...

ప్రస్తుతం మ్యాజిక్ నీడిల్స్ 300 మంది మహిళలను నియమించింది. వీరిలో 150 మంది ముంబై నుండి, 50 మంది హిమాచల్ ప్రదేశ్ నుండి, 50 మంది కోల్‌కతా నుండి, మిగిలిన వారు భారతదేశంలోని మిగిలిన ప్రాంతాల నుండి పనిచేస్తున్నారు. వీరు 1,400 కంటే ఎక్కువ ఉత్పత్తులను ఉత్పత్తి చేస్తారు. ఈ కంపెనీ వికేంద్రీకృత నమూనాను అనుసరిస్తుంది. చేతివృత్తులవారు ఇంటి నుండి పని చేస్తారు. ఇంటి బాధ్యతలను సమతుల్యం చేసుకుంటూనే ఆదాయం పొందుతున్నారు. మ్యాజిక్ నీడిల్స్‌లో చేరడానికి ఆసక్తి ఉన్న మహిళలు స్థానిక కమ్యూనిటీ గ్రూపులు, భాగస్వామి ఎన్‌జీఓల ద్వారా లేదా ప్రస్తుత చేతివృత్తులవారి నుండి సిఫార్సు ద్వారా వస్తారు. 'ఈ 300 మంది మహిళలకు 20-25 మంది నాయకత్వం వహిస్తున్నారు. వారిని మేము అప్పుడప్పుడు కలుస్తాము. వీడియోల ద్వారా శిక్షణ పొందుతాము. తర్వాత వారు ఇతర మహిళలకు శిక్షణ ఇస్తారు' అని హీనా చెప్పారు.

దిగుమతిపై ఆధారపడకుండా...

శిక్షణ పొందిన తర్వాత ఈ మహిళలు తమ పని ప్రారంభిస్తారు. బేబీ ఉత్పత్తుల నుండి మొదలైన మ్యాజిక్ నీడిల్స్ ఇప్పుడు టీన్, వయోజనుల వరకు చేరువవుతున్నాయి. 'మేము ఒక మార్కెట్ నుండి మరొక మార్కెట్‌కు ఎదిగాము. ఇప్పుడు అమెజాన్, మింత్రా, నైకా ఫ్యాషన్‌లలో అందుబాటులో ఉన్నాము' అని హీనా అంటున్నారు. మ్యాజిక్ నీడిల్స్ అభివృద్ధి చెందుతున్నప్పుడు ఆమె మార్కెట్‌లో మరొక అంతరాన్ని గుర్తించారు. భారతదేశంలో నాణ్యమైన నూలు లేకపోవడం. కంపెనీ ప్రారంభం నుండి వారు టర్కిష్ నూలుపై ఆధారపడకుండా, వారు ధైర్యంగా తమ ప్రీమియం నూలు బ్రాండ్, హాబీ స్టోర్‌ను ప్రారంభించారు. 'భారతీయ చేతివృత్తులవారు దిగుమతిపై ఎందుకు ఆధారపడాలి? భారతదేశంలోనే సరసమైన ధరలకు ప్రపంచ స్థాయి నూలును సృష్టించాలని మేము నిర్ణయించుకున్నాము' అని కల్పేష్ చెప్పారు.

విస్తరణలో సవాళ్లు

ఆగస్టు 2022లో ప్రారంభించబడిన హాబీ స్టోర్, కాంట్రాక్ట్ తయారీదారులచే భారతదేశంలో తయారు చేయబడిన వివిధ రకాలలో ప్రీమియం-నాణ్యత నూలును అందిస్తుంది. 'కస్టమర్లు మా దుకాణంలోకి వచ్చినప్పుడు, వారు కేవలం నూలును కొనుగోలు చేయరు. వారు అవకాశాల ప్రపంచాన్ని అనుభవిస్తారు' అని హీనా అంటున్నారు. బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాల్లో ఫ్రాంచైజీ మోడల్ ద్వారా దీనిని పునరావృతం చేయాలని ఆ జంట ఆశిస్తుంది. స్కేలింగ్ 'చాలా మంది చేతితో తయారు చేసిన పని విలువను అర్థం చేసుకోరు. యంత్రంతో తయారు చేసిన ఉత్పత్తులతో పోల్చి ధరను ప్రశ్నిస్తారు. చేతి వృత్తులకు శ్రమ ఎక్కువ కనుక ధర కూడా ఎక్కువే. కానీ ఇవి ఎంతో నాణ్యమైనవిగా ఉంటాయి. చేతివృత్తులవారికి శిక్షణ ఇవ్వడం మరొక సవాలు. చాలా మంది మహిళలు ఇంటికే పరిమితమై ఉంటారు. అలాంటి వారికి హస్తకళలో విశ్వాసాన్ని కలిగించడం, స్థిరత్వాన్ని కొనసాగించడానికి ఓపిక, నిర్మాణాత్మక మార్గదర్శకత్వం అవసరం' అంటూ హీనా తన మాటలు ముగించారు.

ప్రపంచంతోనే పోటీ

(మొదటిపేజీ తరువాయి)

ఒకటైన బయో ఆసియా సదస్సు నిర్వహణ, గ్లోబల్ కంపెనీ హెచ్‌సీఎల్ టెక్ రాక రాష్ట్రానికే కాక దేశానికే గర్వకారణంగా నిలిచాయని ముఖ్యమంత్రి హర్షం వ్యక్తం చేశారు. హెచ్ సీఎల్ 2.2 లక్షల మందికిపైగా ఉద్యోగులతో 60 దేశాల్లో పని చేస్తోందనీ, డిజిటల్, ఇంజినీరింగ్, క్లౌడ్, ఏఐ రంగాల్లో వరల్డ్ క్లాస్ ఆఫరింగ్స్ క్రియేట్ చేస్తోందని చెప్పారు. 2007లో హైదరాబాద్‌కు వచ్చినప్పటి నుంచి హెచ్‌సీఎల్ అంచలంచెలుగా ఎదిగిందని గుర్తుచేశారు. ప్రతి రోజు బహుళ జాతి కంపెనీలతో కొత్త అవగాహనా ఒప్పందాలు, పెద్ద సంస్థలు తెలంగాణకు రావడం, గతం సంవత్సరం చేసుకున్న ఒప్పందాల మేరకు కొత్త సౌకర్యాల ప్రారంభం జరుగుతోందన్నారు. రాష్ట్రంలో అత్యధిక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అత్యల్ప ద్రవ్యోల్బణం ఉన్నాయని తెలిపారు.

కొత్తగా ఐదు వేల ఉద్యోగాలు : మంత్రి శ్రీధర్ బాబు

(మొదటిపేజీ తరువాయి)

క్వాంటం, కంప్యూటింగ్ తదితర ఎమర్జింగ్ టెక్నాలజీస్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసానిచ్చారు. త్వరలోనే క్వాంటం కంప్యూటింగ్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభించబోతున్నట్టు వెల్లడించారు. దీని కోసం ఇప్పటికే స్విట్జర్లాండ్‌కి చెందిన దిగ్గజ సంస్థతో ఒప్పందం చేసుకున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ హయాంలోనే ఐటీ రంగానికి 1992లోనే పునాది పడిందని తెలిపారు. ఆ స్ఫూర్తితో హైదరాబాద్ ను ఐటీ రంగంలో మరింత ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. హైదరాబాద్ నూతన ఆవిష్కరణలకు హబ్‌గా మారిందనీ, ఇటీవలి కాలంలో ఇక్కడి నుంచి 15 పేటెంట్స్ రావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

ఎమ్మార్ ప్రాపర్టీస్ వివాదాలను పరిష్కరించండి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వివిధ కేసులతో పెండింగ్‌లో ఉన్న ఎమ్మార్ ప్రాపర్టీస్ వివాదాలను పరిష్కరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆ సంస్థ ప్రతినిధులు సీఎంతో పాటు ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కలిసి గత కొన్నేండ్లుగా తాము ఎదుర్కొంటున్న న్యాయపరమైన సమస్యలను వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో దుబాయికి చెందిన తమ కంపెనీ 2021లో హైదరాబాద్‌లో కన్వెన్షన్ సెంటర్, హెూటల్, గోల్ఫ్‌కోర్స్, విల్లాలు తదితర ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టిందని తెలిపారు. ఏపీఐఐసీతో చేసుకున్న ఒప్పందాల్లో అక్రమాలు జరిగాయని అప్పట్లో సీబీఐ, ఈడీ కేసులు నమోదయ్యాయని వివరించారు. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత 2015 అక్టోబర్‌లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం తమ సంస్థకు సంబంధించిన వివాదాలను పరిష్కరించడానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సారధ్యంలో ఐదుగురు సెక్రెటరీల కమిటీని ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. అయితే ఇప్పటి వరకు సమస్య పరిష్కారం కాలేదని సంస్థ ప్రతినిధులు సీఎంకు వివరించారు. వివిధ దర్యాప్తు ఏజెన్సీల కేసులు, చార్జ్‌షీట్లు, న్యాయపరమైన అంశాలతో ముడిపడి ఉన్నందున ఎమ్మార్ ఒప్పందాల డాక్యుమెంట్లు, కోర్టు కేసుల వివరాలతో పాటు కేంద్ర ప్రభుత్వ సూచనలను పరిశీలించాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. సీఎస్ నేతృత్వంలో ఏర్పాటైన కమిటీకి అదనంగా న్యాయ నిపుణులతో కూడిన కమిటీ ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. న్యాయ వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించడానికి యూఏఈ ప్రభుత్వ ఆమోదంతో లీగల్ ఏజెన్సీని ఏర్పాటు చేస్తామని సంస్థ ప్రతినిధులు ప్రతిపాదించగా, ముఖ్యమంత్రి ఆమోదించారు. ఈ సమావేశంలో ఎమ్మార్ వ్యవస్థాపకులు మహమ్మద్ అలబ్బర్, భారత్‌లో యూఏఈ మాజీ రాయబారి డాక్టర్ అహ్మద్ అల్ బన్నా, ఎంఆర్ గ్రూప్ సీఈవో అమిత్ జైన్. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పదేండ్లు..రూ.11,812.98 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

ఓ నివేదికను రూపొందించారు.

వ్యక్తులే అధికం

2024 ఫిబ్రవరిలో సుప్రీంకోర్టు ఎన్నికల బాండ్లను రద్దు చేసిన విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు ఆదేశానుసారం...ఆ బాండ్ల ద్వారా వివిధ రాజకీయ పార్టీలకు అందిన విరాళాలు, వాటిని అందించిన వ్యక్తులు లేదా సంస్థలు, వాటిని అందుకున్న పార్టీల సమాచారం యావత్తూ ఎన్నికల కమిషన్ తన వెబ్‌సైటులో ఉంచింది. రాజకీయ పార్టీలకు విరాళాలు అందించిన వారు 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.2,275.85 కోట్ల పన్ను మినహాయింపు కోరారు. కార్పొరేట్ సంస్థలు రూ.514.4 కోట్లు, సంస్థలు లేదా సంఘాలు రూ.115.71 కోట్ల మేరకు మాత్రమే మినహాయింపులు కోరాయి. 2023-24లో కూడా ఇదే ధోరణి కొనసాగిందని తెలుస్తోంది. ఆ ఆర్థిక సంవత్సరంలో కోరిన పన్ను మినహాయింపుల్లో ఒక్క వ్యక్తుల వాటాయే 78.3 శాతం వరకూ ఉండవచ్చునని అంచనా.

మతలబు ఏమిటో ?

2015-16, 2023-24 మధ్యకాలంలో వ్యక్తులు, హెచ్‌యూఎఫ్‌లు కోరిన మినహాయింపులు రూ.66.1 కోట్ల నుంచి రూ.2,275.85 కోట్లకు పెరిగాయి. అంటే 3,446 శాతం పెరిగాయన్న మాట. మరోవైపు కార్పొరేట్ సంస్థల విరాళాల్లో హెచ్చుతగ్గులు కన్పించాయి. లోక్‌సభ ఎన్నికలు జరిగిన 2019-20లో మాత్రమే రూ.1,159.91 కోట్ల మేర మినహాయింపులు కోరాయి. 2015-16లో 43 పార్టీలకు రూ.714 కోట్ల విరాళాలు అందగా 2023-24లో 27 పార్టీలకు రూ.7,203 కోట్ల విరాళాలు సమకూరాయి. అయినప్పటికీ తొమ్మిది సంవత్సరాల కాలంలో అందిన మొత్తం విరాళాలు రూ.28,287 కోట్లలో కేవలం 41.76 శాతానికి మాత్రమే పన్ను మినహాయింపులు కోరారు. దీంతో మిగిలిన 58 శాతం విరాళాలు ప్రశ్నార్థకమయ్యాయి. 'రాజకీయ పార్టీలకు ఇచ్చే విరాళాలకు 100 శాతం పన్ను మినహాయింపు ఉంటుంది. అయినప్పటికీ మెజారిటీ దాతలు...ముఖ్యంగా కార్పొరేట్ సంస్థలు వాటిని కోరడం లేదు. పన్ను మినహాయింపులు లేకుండా విరాళాలు ఇవ్వడానికి వారిని పురిగొల్పుతున్న ప్రోత్సాహకాలు ఏమిటి? ఈ విషయంలో పారదర్శకత లోపించింది' అని నాయక్ చెప్పారు.

ఇక్కడ గమనించాల్సిన ముఖ్య విషయమేమంటే 2022-23లో తమకు విరాళాల రూపంలో రూ.3,912 కోట్లు అందాయని ఇరవై ఐదు రాజకీయ పార్టీలు ప్రకటించాయి. కానీ వాటిని అందించిన వారు ఆ మొత్తంలో 74.27 శాతం విరాళాలకు మాత్రమే మినహాయింపులు కోరారు. 2024లో కేంద్రం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో పన్ను మినహాయింపులకు సంబంధించిన సమాచారం ఇవ్వలేదు. దీంతో పరిశోధకులు అంచనాలపై ఆధారపడాల్సి వస్తోంది. ఎన్నికల కమిషన్‌కు విధిగా అందజేయాల్సిన ఆడిట్ నివేదికలను దేశంలోని 40కి పైగా రాజకీయ పార్టీలు ఇవ్వలేదు. దాతల వివరాల కోసం నాయక్ పదే పదే ఆర్‌టిఐ ద్వారా కోరినప్పటికీ ఆదాయపన్ను శాఖ అందుకు నిరాకరించింది.

ఆడాళ్లూ..మీకు జోహార్లు

(మొదటిపేజీ తరువాయి)

కేటాయిస్తున్నారు. అలాగే, ఇంటి పనులకు కేటాయించే సమయం కాస్త తగ్గినా.. పురుషులతో పోలిస్తే అది చాలా ఎక్కువగానే ఉన్నది. గతేడాదికి సంబంధించి 15-59 ఏండ్ల వయస్కుల్లో జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) జరిపిన 'టైమ్ యూజ్ సర్వే'లో ఈ విషయాలు వెల్లడయ్యాయి.

సర్వేలో 4.54 లక్షల మంది

వివిధ పనులపై వ్యక్తులు వెచ్చించిన సమయాన్ని ఈ సర్వే వివరించింది. ఇది 1,39,487 ఇండ్లను కవర్ చేసింది. ఇందులో గ్రామీణ ప్రాంతాల నుంచి 83,247 ఇండ్లు, పట్టణ ప్రాంతాల నుంచి 56,240 గృహాలు ఉన్నాయి. ఆరేండ్ల వయస్సు పైబడినవారు 4,54,192 మంది సర్వేలో పాల్గొన్నారు. ఇందులో గ్రామీణ ప్రాంతాల నుంచి 2.85 లక్షల మందికి పైగా, పట్టణ ప్రాంతాల నుంచి 1.68 లక్షల మందికి పైగా ఉన్నారు.

ఇంటి పనులకు రోజుకు 305 నిమిషాలు

ఈ సర్వే సమాచారం ప్రకారం.. ఉద్యోగ, ఉపాధి సంబంధిత పనుల్లో మహిళల భాగస్వామ్యం పెరిగింది. 2019లో ఇది 21.8 శాతంగా ఉంటే.. 2024 నాటికి అది 25 శాతానికి చేరింది. పురుషుల విషయంలో 2019లో 70.9 శాతంగా ఉన్న భాగస్వామ్యం.. గతేడాది 75 శాతానికి పెరిగింది. చెల్లింపులకు నోచుకోని గృహ సేవలకు మహిళలు వెచ్చించిన సమయం 2019లో రోజుకు 315 నిమిషాలు ఉండగా.. అది గతేడాదికి 305 నిమిషాలకు తగ్గింది. పురుషులతో పోలిస్తే ఇది చాలా ఎక్కువే అని చెప్పొచ్చు. ఇది.. మహిళలు ఇలాంటి గృహ సేవల నుంచి చెల్లింపులకు నోచుకునే ఉద్యోగ, ఉపాధి కార్యకలాపాల వైపునకు మళ్లారని తెలియజేస్తున్నదని మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్ అండ్ ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ తెలిపింది.

ఉద్యోగ సంబంధిత పనులకు 341 నిమిషాలు

ఇంటి పనులతో పాటు ఉద్యోగ, ఉపాధి సంబంధిత పనులకూ మహిళలు ప్రాధాన్యతనిస్తున్నారు. 2024లో ప్రజలు ఇందుకు రోజుకు 440 నిమిషాలు వెచ్చించారు. పురుషుల విషయంలో ఇది 473 నిమిషాలుగా ఉండగా.. మహిళలది 341 నిమిషాలుగా ఉన్నది. మహిళలు ఇంట్లో వారి కోసం గృహ సేవల్లో రోజుకు 289 నిమిషాలు పని చేశారు. ఇది పురుషుల విషయంలో 88 నిమిషాలే కావటం గమనార్హం.

కుటుంబ సంరక్షణలో ఆమెనే ముందు

కుటుంబం విషయంలో మహిళ ప్రాధాన్యత ఈ సర్వేలో వెల్లడైంది. ఇంట్లోవారి సంరక్షణ విషయంలో మహిళల భాగస్వామ్యంతో పాటు వారు వెచ్చించే సమయం కూడా పురుషులతో పోలిస్తే దాదాపు రెండు రెట్లు ఎక్కువగా ఉన్నది. కుటుంబీకుల సంరక్షణ కోసం మహిళలు 137 నిమిషాలు, పురుషులు 75 నిమిషాలు వెచ్చించారు. 15 ఏండ్లకు పైబడిన దాదాపు 41 శాతం మంది మహిళలు వారి కుటుంబీకుల సంరక్షణలో పాలు పంచుకున్నారు. ఇది పురుషుల విషయంలో 21.4 శాతంగానే ఉండటం గమనార్హం. సంరక్షణ కార్యకలాపాలకు మహిళలు రోజుకు 140 నిమిషాలు కేటాయిస్తే.. పురుషులు మాత్రం 74 నిమిషాలకే పరిమితమయ్యారు. కుటుంబీకుల సంరక్షణను చూసే బాధ్యతను మహిళలే చూసుకుంటున్నారన్న దృగ్విషయాన్ని ఇది తెలియజేస్తున్నదని సంబంధిత మంత్రిత్వ శాఖ తెలిపింది.

నేర్చుకోవటానికి 413 నిమిషాలు

సర్వేలో పాల్గొన్నవారిలో దాదాపు 16.8 శాతం మంది తమ తుది ఉపయోగం కోసం వస్తువులను ఉత్పత్తి చేయటంలో పాలు పంచుకున్నారు. ఇందుకు రోజులో 116 నిమిషాలు వెచ్చించారు. ఆరు నుంచి 14 ఏండ్ల మధ్య వయస్సున్న చిన్నారులు రోజుకు 413 నిమిషాలు నేర్చుకోవటానికి సంబంధించిన పనులపై వెచ్చించారు. ఆరేండ్లు, అంత కంటే ఎక్కువ వయసున్నవారు రోజుకు 171 నిమిషాలు సంస్కృతి, విశ్రాంతి, మాస్ మీడియా ఉపయోగంపై గడిపారు. ఈ అంశాలపై పురుషులు 177 నిమిషాలు, మహిళలు 164 నిమిషాలు వెచ్చించారు.

విదేశీ టూర్లకు రూపాయి పోటు

20 శాతం అదనపు వ్యయం

ఫారిన్ చదువులపైనా భారం



న్యూఢిల్లీ : సరదాగా విదేశాలను చుట్టిరావాలనకుంటున్న ఎగువ మధ్యతరగతి, ధనవంతుల ఆశలపై రూపాయి పతనం ప్రభావం చూపుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో వరుసగా పడిపోతున్న రూపాయి విలువతో భారతీయుల విదేశీ పర్యటనలపై భారం పడుతోంది. రూపాయి బక్కచిక్కడం, అంతర్జాతీయంగా డాలర్‌కు డిమాండ్ పెరగడంతో ఈ ఏడాది వేసవిలో భారతీయుల అంతర్జాతీయ సెలవులను మరింత ఖరీదైనవిగా మార్చుతున్నాయని పర్యాటక పరిశ్రమ వర్గాలు తెలిపాయి. టూర్ ఆపరేటర్లు ధరల పెంపును ప్రయాణికులకు బదిలీ చేస్తున్నారు. దీంతో ఈ ఏడాది ఏప్రిల్-జూన్ కాలానికి గత సంవత్సరంతో పోల్చితే 15-20 శాతం విదేశీ పర్యటనలు భారం అవుతున్నాయి. ముఖ్యంగా యూరోపియన్ గమ్యస్థానాలకు, ఆగ్నేయాసియా దేశాలకు దీని ప్రభావం ఎక్కువగా ఉందని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్ (ఐఏటీఓ) ప్రెసిడెంట్ రాజీవ్ మెహ్రా పేర్కొన్నారు. ప్రస్తుతం 15-20 శాతం వ్యయాలు పెరగొచ్చన్నారు. అంతర్జాతీయ ప్యాకేజీల్లో 2017-2018, 2018-19లోనూ రూపాయి పతనంతో ఇదే తరహాలో వ్యయాలు పెరిగాయన్నారు. "డాలర్ ఖరీదైనందున టూర్ ప్యాకేజీల ధర పెరిగింది. అంతేకాకుండా భారత్‌లోని హిల్ స్టేషన్లలో భారీ రద్దీ దేశీయ విమాన ప్రయాణాలను, హోటళ్ల చార్జీలను భారంగా మారుస్తుంది. దేశీయంగా అధిక ధరలు ఉండటంతో ప్రజలు విదేశీ గమ్యస్థానాల వైపు చూస్తున్నారు," అని రాజీవ్ పేర్కొన్నారు. భారతీయ పర్యాటకులను ఆకర్షించేందుకు అనేక దేశాలు ఉచిత ఈ-వీసాల ప్రకటనలు జారీ చేసి ఆసక్తిని పెంచుతున్నాయన్నారు. మంగళవారం సెషన్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ ఏకంగా 51 పైసలు క్షీణించి 87.2కు పడిపోయింది. ఫిబ్రవరి 10న ఏకంగా 87.95 పతనమై.. ఆల్‌టైం కనిష్ట స్థాయిని చవి చూసింది. దీంతో సరుకుల దిగుమతులు భారం కావడంతో.. భారత విదేశీ అప్పు చెల్లింపులు భారం అవుతున్నాయి. విదేశాల్లోని విద్యార్థుల చదువులకు అధికంగా చెల్లింపులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

తాగునీటికే తొలి ప్రాధాన్యం

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రాలకు సూచించింది. తాగునీటికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించింది. అలాగే ఉన్న పంటలను దృష్టిలో పెట్టుకుని మిగులు జలాలను ప్రణాళికాబద్ధంగా వాడుకోవాలని తెలిపింది. 15 రోజులకు ఒకసారి పరిస్థితులను సమీక్షించుకుంటూ ముందుకెళ్లాలని తెలుగు రాష్ట్రాలకు సూచించింది. తాజా నిర్ణయాల్లో భాగంగా తెలంగాణకు 40 టీఎంసీలు, ఏపీకి 20 టీఎంసీలు కేఆర్ఎంబీ కేటాయించింది. అలాగే ఉన్న నీటిలో సాగర్ నుంచి 515 ఎమ్‌డీడీఎల్, శ్రీశైలం నుంచి 820 ఎమ్‌డీడీఎల్ వరకు వాడుకోవచ్చని సూచించింది. ఈ మేరకు కేఆర్ఎంబీ ఉత్తర్వులు జారీ చేసింది.

స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలి

నవతెలంగాణ-మియాపూర్

పెండింగ్‌లో ఉన్న టీఎస్ ఈ-పాస్ స్కాలర్‌షిప్‌లను వెంటనే పంపిణీ చేయాలని ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) కమిటీ డిమాండ్ చేసింది. విద్యారంగానికి ప్రాధాన్యత ఇవ్వడానికి, బడ్జెట్ కేటాయింపుల ను సమీక్షించి, అధిక నిధులు కేటాయించాలని కోరింది. గురువారం రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ఎదుట స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఎస్ఎఫ్ఐ నాయకులను అరెస్టు చేసి, స్థానిక పీఎస్‌కు తరలించారు.

ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు లెనిన్, ఫంకజ్ మాట్లాడుతూ.. స్కాలర్‌షిప్‌లను విడుదల చేయడంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఇదే విషయంపై గతంలో కూడా తాము రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించినట్టు తెలిపారు. ఇప్పుడు కూడా మళ్లీ ఈ విషయా న్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ స్పందించడం లేదన్నా రు. 'విద్యార్థుల క్రూసేడర్లు' అని చెప్పుకునే నేషనల్ స్టూడెంట్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్‌యూఐ), స్కాలర్‌షిప్‌ల ను సకాలంలో పంపిణీ చేయడానికి ఎటువంటి సమిష్టి ప్రయత్నాలు చేయడం లేదన్నారు. మూడేండ్లుగా విద్యార్థుల కు స్కాలర్‌షిప్‌లు అందడం లేదన్నారు. ఫలితంగా విద్యార్థులు తమ మెస్ ఫీజులు చెల్లించడానికి ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.

అవుట్‌గోయింగ్ విద్యార్థులు తమ సర్టిఫికెట్లు పొందడానికి. తమ బకాయిలను క్లియర్ చేయకపోవడంపై ఆందోళన చెందుతున్నారని తెలిపారు. విద్యారంగం పట్ల ప్రభుత్వ వైఖరిని ఖండించారు. ఇప్పటికైనా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను విడుదల చేయడం కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ సంఘం నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మిర్చి మద్దతు ధరపై కేంద్రం మీనమేషాలు

క్వింటాలుకు రూ.15 వేలు ఇస్తామన్న కాంగ్రెస్ హామీ ఏమైంది?

- ఎకరాకు రూ.2 లక్షల ఖర్చు.. చీడపీడలతో పంట నష్టం
- మార్కెట్‌లో దళారుల మోసం
- నష్టపోతున్న మిర్చి రైతులు





నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మిర్చి పంటను సాగు చేయడం రైతుకు కత్తిమీద సాములా మారుతోంది. అన్నింటికీ తట్టుకుని సాగు చేస్తున్నా ఆ పంటకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించకుండా మీనమేషాలు లెక్కిస్తున్నది. దీంతో దళారులే ధరను నిర్ణయిస్తున్నారు. వారు చెప్పిందే ధర... ఇచ్చిందే డబ్బు... అంతకు మించి అడగడానికి వీలులేని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో మిర్చి పంట ప్రాధాన్యతను కేంద్ర ప్రభుత్వం గుర్తించటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మిర్చి పంట సాగులో రైతు ఎదుర్కొనే ఇబ్బందులను మోడీ సర్కారు పట్టించుకోవడం లేదు. భారతదేశంలో నాలుగైదు రాష్ట్రాల్లో పండుతున్న అరుదైన పంట ఇది. ఆ పంటను పండిస్తున్న రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వం... వారిని గాలికొదిలేసింది. కేంద్ర ప్రభుత్వం మిర్చి మద్దతు ధర గురించి పట్టించుకోకపోయినా, తాము అధికారంలోకి వస్తే క్వింటాకు రూ.15వేలు నిర్ణయించి అమలు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 14 నెలలు గడిచినా దీనిపై ఇప్పటికీ అతీగతీ లేదు.

స్థిరమైన ధర లేకపోవటంతో దళారులదే పైచేయి

స్థిరమైన ధర లేకపోవటంతో వ్యాపారులదే పైచేయి అవుతున్నది. మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలని రైతు సంఘాలు కోరుతున్నా... కేంద్రం పట్టించుకోవడం లేదు. మిర్చికి మద్దతు ధర కన్నా బహిరంగ మార్కెట్లోనే ఎక్కువ ధర పలుకుతున్నది. కాబట్టి దానికి మద్దతు ధర నిర్ణయించడంతో ప్రయోజనం లేదని కేంద్ర మంత్రులు అంటున్నారు. రైతు సంఘాల లెక్కల ప్రకారం ఎకరా మిర్చి పంట సాగుకు రూ. రెండు లక్షలు ఖర్చు అవుతున్నది. ఎకరాకు 20 లేదా 30 క్వింటాల్ వస్తేగానీ రైతుకు గిట్టుబాటు కాదు. కానీ సగటున పది క్వింటాళ్లకు మించి దిగుబడి రావడం లేదు. క్వింటాకు ధర రూ. 6000 నుంచి రూ. 13వేల మధ్య ధర పలుకుతున్నది. ఈ లెక్క ప్రకారం రైతు దాదాపు రూ. 50వేలు నష్టపోతున్నట్టే. దీంతోపాటు దళారుల దోపిడీతో రైతులు నష్టాలను భరించలేక సాగును తగ్గించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో గతేడాది కంటే ఈయేడాది 3శాతం సాగు తగ్గింది.

విత్తనం నుంచి కోత వరకు

విత్తనం నుంచి కోత వరకు మిర్చి పంటను రైతు కంటికి రెప్పలా కాపాడుకోవాల్సి ఉంటుంది. ఏ మాత్రం తేడా వచ్చిన పంట చేతికందే పరిస్థితి ఉండదు. నాణ్యమైన విత్తనం లేకపోతే మొదటికే మోసం వస్తుంది. మిర్చి పంటపై చీడపీడల తాకిడి అధికంగా ఉంటుంది. కొన్ని సార్లు వాటిపై పురుగు మందులు కూడా పని చేయడం లేదని రైతులు వాపోతున్నారు. వాతావరణంలో కొద్ది మార్పులు తలెత్తినా కాత, పూత రాలిపోతుంది. ఆకుముడత, తెల్లదోమ, నల్ల తామర, మచ్చ తెగుళ్లు, కాయకుళ్లు వంటి తెగుళ్లు సోకి పంట దెబ్బతింటుంది. దీంతోపాటు అధిక వర్షాలు, తుపాన్లు, వర్షాభావం పరిస్థితులు కూడా మిర్చి పంటను తీవ్రంగా దెబ్బతీస్తాయి. పంట ముగింపు దశలో ధరలు పతనమవుతున్నాయి. దేశంలో 24 లక్షల ఎకరాల్లో మిర్చి సాగవుతున్నది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్నాటక, ఒడిశా, యూపీ, గుజరాత్ రాష్ట్రాల్లో పండుతున్నది. అందులో ఏపీ మొదటి వరుసలో ఉండగా, రెండో స్థానంలో మధ్యప్రదేశ్ ఉన్నది. తెలంగాణ మూడో స్థానాన్ని ఆక్రమించింది. రాష్ట్రం(2023-24)లో 3.92 లక్షల ఎకరాల్లో మిర్చి పంట సాగవుతుండగా, 7.94 లక్షల టన్నుల దిగుబడి వచ్చింది. ఖమ్మం, మహబూబాబాద్, గద్వాల్, సూర్యాపేట్, వరంగల్ తదితర ప్రాంతాల్లో మిర్చి విరివిగా పండిస్తారు. అయినా గిట్టుబాటు ధర రాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

మిర్చి క్వింటాకు రూ.25వేలు ఇవ్వాలి

మిర్చి పంట క్వింటాకు రూ. 25వేలు ఇస్తేనే రైతు గిట్టుబాటు అవుతుంది. మద్దతు ధర నిర్ణయించడంలో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. పంటకు తెగుళ్లు, వర్షాభావ పరిస్థితులు, చీడపీడలు సోకి పంట దెబ్బతింటుంది. పెట్టుబడి కూడా రాకపోగా తీవ్రమైన నష్టాలు వస్తున్నాయి. రైతులను ఆదుకునేందుకు ఖమ్మంలో మిర్చిబోర్డు ఏర్పాటు చేయాలి.

- టి.సాగర్, ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రైతు సంఘం

తెలంగాణలోనే నన్ను కొనసాగించండి

- 'క్యాట్'లో అభిలాశ బిస్త్ అప్పీల్
- స్టే ఇవ్వటానికి నిరాకరణ

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి :

తనను తెలంగాణ రాష్ట్ర క్యాడర్‌లోనే కొనసాగించాలని కోరుతూ డీజీపీ, రాష్ట్ర పోలీసు అకాడమీ డైరెక్టర్ జనరల్ అభిలాశ బిస్త్ కేంద్ర పరిపాలనా ట్రిబ్యునల్ (క్యాట్)లో గురువారం అప్పీల్ చేసుకున్నారు. ఇటీవలనే కేంద్రం.. ఏపీ క్యాడర్‌కు చెందిన అభిలాశ బిస్త్‌తో పాటు మరో డీజీపీ స్థాయి అధికారి, రోడ్స్ సేఫ్టీ అథారిటీ చైర్మెన్ అంజనీ కుమార్, కరీంనగర్ పోలీసు కమిషనర్ అభిషేక్ మహంతిలను ఏపీకి వెళ్లి రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం సైతం మూడ్రోజుల క్రితం అంజనీకుమార్, అభిలాశ బిస్త్‌లను రాష్ట్ర సర్వీసుల నుంచి రిలీవ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. అభిషేక్ మహంతిని ఎమ్మెల్సీ ఎన్నికల తర్వాత రిలీవ్ చేస్తామని ఏపీకి సమాచారమిచ్చింది.అంజనీకుమార్ ఏపీకి వెళ్లి అక్కడి ప్రభుత్వానికి రిపోర్ట్ చేశారు. అయితే, అభిలాశ బిస్త్ మాత్రం తాను తెలంగాణలోనే ఉండేలా ఆదేశాలివ్వాలని క్యాట్‌ను ఆశ్రయించారు. అందుకు అవసరమైన స్టేను ఇవ్వటానికి నిరాకరించిన క్యాట్.. మరోవైపు ఆమె చేసుకున్న అపీల్‌పై కౌంటర్ దాఖలు చేయాలంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. దీంతో క్యాట్‌లో స్టే లభించకపోవటంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి అభిలాశ బిస్త్ రిపోర్ట్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నీరా కేఫ్‌ను టాడీ కార్పొరేషన్‌కు అప్పగించాలి

- కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎంవీ రమణ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్‌లోగల నీరా కేఫ్‌ను టాడీ కార్పొరేషన్‌కు అప్పగించాలని కల్లుగీత కార్మిక సంఘం(కేజీకేఎస్) రాష్ట్ర అధ్యక్షులు ఎంవీ రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ కేఫ్‌ను ఎత్తేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో ఆధునిక హంగులతో దాన్ని తీర్చిదిద్దారని గుర్తు చేశారు. దీని నిర్వహణ టాడీ కార్పొరేషన్‌కు అప్పగించకుండా టూరిజం శాఖకు అప్పగించారనీ, ఇది సరైంది కాదనీ ఆనాడే చెప్పామని గుర్తు చేశారు. బీఆర్ఎస్ కాలంలోనే వేలం వేసేందుకు ప్రయత్నాలు జరిగాయనీ, గీత కార్మిక సంఘాల విజ్ఞప్తితో తాత్కాలికంగా వేలం పాటను నిలిపేశారని తెలిపారు.



పుంజుకున్న కేరళ

విదర్భతో రంజీ ట్రోఫీ ఫైనల్

నాగ్‌పూర్ (మహారాష్ట్ర) : రంజీ ట్రోఫీ ఫైనల్లో కేరళ బలంగా పుంజుకుంది. తొలి రోజు ఆటలో డానిశ్ మలేవార్ (153), కరుణ్ నాయర్ (86) భాగస్వామ్యంతో వికెట్ల వేటలో వెనుకంజ వేసిన కేరళ.. రెండో రోజు వేగంగానే ఆరు వికెట్లు పడగొట్టింది. డానిశ్ మలేవార్ 150 పరుగుల మార్క్‌తో మెరువగా.. లోయర్ ఆర్డర్‌లో అక్షయ్(23), భూటె (32) రాణించారు. 123.1 ఓవర్లలో 379 పరుగులకు విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో ఆలౌటైంది. కేరళ బౌలర్లలో నిదేశ్ (3/61), ఈడెన్ టామ్ (3/102), బసిల్ (2/60) రాణించారు. కేరళ తొలి ఇన్నింగ్స్‌లో దీటుగా స్పందిస్తోంది. 39 ఓవర్లలో 131/3 పరుగులు చేసింది. ఓపెనర్లు అక్షయ్ చంద్రన్ (14), రోహన్ (0) నిరాశపరిచారు. ఆదిత్య (66 నాటౌట్, 120 బంతుల్లో 10 ఫోర్లు), అహ్మద్ ఇమ్రాన్ (37, 83 బంతుల్లో 3 ఫోర్లు) మూడో వికెట్‌కు కీలక భాగస్వామ్యం నిర్మించారు. కెప్టెన్ సచిన్ బేబి (7 నాటౌట్), ఆదిత్య అజేయంగా ఆడుతున్నారు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి కేరళ తొలి ఇన్నింగ్స్‌లో మరో 248 పరుగుల వెనుకంజలో నిలిచింది. విదర్భ బౌలర్లలో దర్శన్ (2/23), యశ్ ఠాకూర్ (1/45) రాణించారు.

క్యాపిటల్స్ మెంటార్‌గా పీటర్సన్



న్యూఢిల్లీ : ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ కెవిన్ పీటర్సన్ ఐపీఎల్ 2025 సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు మెంటార్‌గా వ్యవహరించనున్నాడు. 44 ఏండ్ల పీటర్సన్.. చీఫ్ కోచ్ హేమాంగ్ బదాని, సహాయక కోచ్ మాథ్యూ మాట్, బౌలింగ్ కోచ్ మునాఫ్ పటేల్, డైరెక్టర్ ఆఫ్ క్రికెట్ వేణుగోపాల్ రావుతో కలిసి క్యాపిటల్స్‌కు పని చేయనున్నాడు. ఐపీఎల్‌లో పీటర్సన్‌కు కోచ్‌గా ఇదే తొలి అవకాశం. చివరగా 2016లో పీటర్సన్ ఐపీఎల్‌లో ఆడాడు. ఢిల్లీ క్యాపిటల్స్ కొత్త కెప్టెన్‌ను ఎంచుకోవాల్సి ఉంది.

వరుణుడి ఖాతాలో.. మరో మ్యాచ్

పాకిస్థాన్, బంగ్లాదేశ్ మ్యాచ్ వర్షార్పణం

ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ 2025



రావల్పిండి (పాకిస్థాన్) : మూడు దశాబ్దాల నిరీక్షణ ఓ మ్యాచ్ ముచ్చటగానే నిలిచింది. సొంతగడ్డపై రెండో మ్యాచ్ సైతం ఆడే అవకాశం లేకుండానే ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ నుంచి పాకిస్థాన్ నిష్క్రమించింది. గ్రూప్-బిలో రావల్పిండి వేదికగా జరగాల్సిన పాకిస్థాన్, బంగ్లాదేశ్ వర్షం కారణంగా రద్దుగా ముగిసింది. టోర్నమెంట్ ఆరంభ మ్యాచ్‌లో న్యూజిలాండ్ చేతిలో ఓటమి, దుబాయ్‌లో భారత్ చేతిలో పరాజయంతో పాకిస్థాన్ సెమీఫైనల్ ఆశలు ఆవిరైన సంగతి తెలిసిందే. సొంతగడ్డపై అభిమానులకు ఊరట అందించేందుకు బంగ్లాదేశ్‌పై భారీ విజయంపై కన్నేసిన పాకిస్థాన్‌కు వరుణుడు షాక్ ఇచ్చాడు. ఎడతెరపి లేకుండా భారీ వర్షం కురవటంతో కనీసం టాస్ సాధ్యపడలేదు. మధ్యాహ్నం 3.30 గంటలకు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్టు అంపైర్లు ప్రకటించారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్ చెరో పాయింట్ పంచుకున్నాయి. నెట్‌రన్‌రేట్‌లో మెరుగ్గా ఉన్న బంగ్లాదేశ్ (-0.443) గ్రూప్-బిలో మూడో స్థానంలో నిలువగా.. పాకిస్థాన్ (-1.087) అట్టడుగు స్థానంతో సరిపెట్టుకుంది. డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన పాకిస్థాన్ అసలు గెలుపు రుచి చూడకుండానే టోర్నీ నుంచి నిష్క్రమించింది. గ్రూప్-బిలో టాప్ పొజిషన్ కోసం భారత్, న్యూజిలాండ్ ఆదివారం దుబాయ్‌లో ఢీకొట్టనున్నాయి.

అఫ్గాన్, ఆసీస్ ఢీ నేడు :

చాంపియన్స్ ట్రోఫీలో మరో ఆసక్తికర సమరానికి రంగం సిద్ధమైంది. ఇంగ్లాండ్‌పై మెరుపు విజయం సాధించి సెమీస్ రేసులో నిలిచిన అఫ్గనిస్థాన్ నేడు అగ్రజట్టు ఆస్ట్రేలియాతో తలపడనుంది. 2023 ఐసీసీ వన్డే వరల్డ్‌కప్‌లో ఆసీస్‌పై ఎదురులేని విజయం సాధించే స్థితి నుంచి గ్లెన్ మాక్స్‌వెల్ అసమాన ఇన్నింగ్స్‌తో వెనుకంజ వేసిన అఫ్గనిస్థాన్ నేడు మరోసారి కంగారూలతో కయ్యానికి కాలుదువ్వుతోంది. ఆసీస్, అఫ్గాన్ మ్యాచ్‌కు సైతం వర్షం ముప్పు పొంచి ఉంది. మ్యాచ్ రద్దుగా ముగిస్తే అఫ్గాన్ ఇంటిముఖం పట్టనుండగా.. ఆసీస్ సెమీస్ బెర్త్ ఖాయం చేసుకోనుంది. శనివారం జరుగనున్న గ్రూప్-ఏ చివరి మ్యాచ్‌లో ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా తలపడనున్నాయి.

'వన్ లాస్ట్ టైమ్'

ధోనీ ఐపీఎల్ వీడ్కోలుపై నెట్టింట చర్చ



చెన్నై : చెన్నై సూపర్ కింగ్స్ దిగ్గజం, మాజీ కెప్టెన్ ఎం.ఎస్ ధోని రిటైర్మెంట్‌పై గత కొన్ని సీజన్లుగా చర్చ నడుస్తూనే ఉంది. ఇదే ఆఖరు సీజన్ అంటూ.. ఎం.ఎస్ ధోని వరుస సీజన్లుగా అభిమానులను అలరిస్తూనే ఉన్నాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2025 మార్చి 22న ఆరంభం కానుండగా.. సీజన్ సన్నాహక శిక్షణ శిబిరం కోసం ధోని గురువారం చెన్నైకి చేరుకున్నాడు. సూపర్ కింగ్స్ అకాడమీలో పది రోజుల పాటు నిర్వహించనున్న క్యాంప్‌కు కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్, ఇతర ఆటగాళ్లతో పాటు ధోని హాజరు కానున్నాడు. చెన్నై విమానాశ్రయంలో భద్రతా సిబ్బంది నడుమ బయటకి వచ్చిన ధోని నలుపు రంగు దుస్తుల్లో మెరిసిపోయాడు. అయితే, టీ షర్ట్‌పై మాత్రం డాట్స్, డాషెస్ ఉన్నాయి. మోర్స్ కోడ్ భాషలో ఆ అక్షరాల అర్థం 'వన్ లాస్ట్ టైమ్'. దీంతో ధోనికి ఇదే ఆఖరు సీజన్ అంటూ సోషల్ మీడియాలో వైరల్ అయిపోయింది. మహి పరోక్షంగా అభిమానులకు సంకేతం ఇచ్చాడని సోషల్ మీడియా వేదికగా పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎన్నోసార్లు ఇదే ఆఖరు మారు అంటూ వచ్చిన మహి.. మరి ఈ సీజన్‌లో ఏం చేస్తాడో చూడాలి.

నవచిత్రం

పవర్‌ఫుల్ కథతో 'కన్నప్ప'



మంచు విష్ణు, అక్షయ్‌కుమార్

ముంబైలో జరిగిన ప్రత్యేక ఈవెంట్‌లో 'కన్నప్ప' టీజర్‌ను ఆవిష్కరించారు. బాలీవుడ్ సూపర్ స్టార్ అక్షయ్ కుమార్, నటుడు, నిర్మాత విష్ణు మంచు, దర్శకుడు ముఖేష్ కుమార్ సింగ్ ఈ కార్యక్రమంలో సందడి చేశారు. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ శ్రీ వినయ్ మహేశ్వరి ఆధ్వర్యంలో ఈ ఈవెంట్ గ్రాండ్ సక్సెస్ అయింది.

శివుడి పాత్రలో నటించిన అక్షయ్ కుమార్ మాట్లాడుతూ,'మొదటగా 'కన్నప్ప' ఆఫర్ నా వద్దకు వచ్చినప్పుడు రెండు సార్లు తిరస్కరించాను. కానీ భారతీయ సినిమా ప్రపంచంలో శివుడిగా నేను బాగుంటాను అని విష్ణు పెట్టుకున్న నమ్మకమే నన్ను ఈ సినిమా ఒప్పుకునేలా చేసింది. 'కన్నప్ప' కథ చాలా శక్తివంతమైంది. ఎంతో లోతైన ఎమోషన్స్ ఉంటాయి. విజువల్ వండర్‌గా ఉండబోతోంది. ఈ అద్భుతమైన ప్రయాణంలో భాగమైనందుకు నేను గౌరవంగా భావిస్తున్నాను' అని అన్నారు. "కన్నప్ప' కేవలం నాకు ఓ ప్రాజెక్ట్.. ఓ సినిమా కాదు.. ఇది నా జీవిత ప్రయాణం. 'కన్నప్ప' కథతో నాకు ఆధ్యాత్మిక బంధం ఏర్పడింది. ఇది అచంచలమైన విశ్వాసం, త్యాగానికి సంబంధించిన కథ. భక్తి, దైవిక శక్తితో నిండిన ఈ కథ ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతి వ్యక్తికి చేరుతుందని మేము నమ్ముతున్నాం. ఇది సరిహద్దులను దాటి మానవాళి హృదయంతో మాట్లాడే చిత్రం కానుంది. ఈ ప్రయాణంలో అక్షయ్‌కుమార్, మోహన్‌లాల్, ప్రభాస్ వంటి దిగ్గజాలతో పని చేయటాన్ని చాలా గర్వంగా ఫీల్ అవుతున్నాను' అని విష్ణు మంచు చెప్పారు. దర్శకుడు ముఖేష్ కుమార్ సింగ్ మాట్లాడుతూ, 'అక్షయ్, మోహన్‌లాల్, ప్రభాస్ వంటి వారి పాత్రలు తెరపై అద్భుతం చేయబోతోన్నాయి. ఈ చిత్రం పట్ల విష్ణుకి ఉన్న ప్యాషన్ గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది' అని తెలిపారు.

కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో అందర్నీ అలరించిన ఈ చిత్ర టీజర్ మార్చి 1న అందరి ముందుకు రాబోతోంది. ఏప్రిల్ 25న ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

టైమ్ లూప్ హర్రర్ కాన్సెప్ట్..




ప్రజ్వల్ దేవరాజ్

ప్రజ్వల్ దేవరాజ్ హీరోగా నటించిన చిత్రం 'రాక్షస'. లోహిత్ హెచ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం టైమ్ లూప్ హర్రర్ కాన్సెప్ట్‌తో తెరకెక్కింది. నేడు (శుక్రవారం) విడుదల విడుదల కావలసిన ఈ చిత్రాన్ని కొన్ని అనివార్య కారణాలతో వారం రోజులపాటు వాయిదా వేశారు. ఫైనల్‌గా మార్చి 7న ఒరిజినల్ వెర్షన్ కన్నడతో పాటు తెలుగులోనూ వరల్డ్ వైడ్‌గా ఈ సినిమా ప్రేక్షకులకు ముందుకు రానుంది.

గతంలో శివరాజ్ కుమార్ నటించిన 'వేద' చిత్రాన్ని విడుదల చేసిన ఎంవీఆర్ కృష్ణ ఈ చిత్ర ట్రైలర్ నచ్చి, తెలుగు రైట్స్‌ను దక్కించుకున్నారు. కంచి కామాక్షి కోల్‌కతా కాళీ క్రియేషన్స్ బ్యానర్ పై రెండు తెలుగు రాష్ట్రాల్లో భారీ విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాత ఎంవిఆర్ కృష్ణ మాట్లాడుతూ, 'బెటర్ అవుట్‌పుట్ కోసం మా చిత్రాన్ని వారం రోజులు పాటు వాయిదా వేశాం. మార్చి 7న విడుదలకు అన్ని సన్నాహాలు చేస్తున్నాం.ఇప్పటికే విడుదల చేసిన హీరో ఫస్ట్‌లుక్ పోస్టర్, టీజర్, ట్రైలర్ సినిమాపై అంచనాలు పెంచాయి. ఇందులో ప్రజ్వల్ దేవరాజ్ డిఫరెంట్ లుక్‌లో కనిపిస్తూ, అలరించబోతున్నారు. ఈ చిత్రం ప్రేక్షకులకు థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తుంది. మంచి కంటెంట్ ఉన్న చిత్రాలను తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారు. ఈ చిత్రానికి కూడా ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ దక్కుతుందని నమ్మకం ఉంది' అని చెప్పారు.

అరుణ్ రాథోడ్, శ్రీధర్, గౌతమ్, సోమశేఖర్, విహాన్ కృష్ణ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం : నోబిన్ పాల్, సినిమాటోగ్రఫీ : జైబిన్ పి జాకబ్, నిర్మాత : ఎం వి ఆర్ కృష్ణ, దర్శకుడు : లోహిత్ హెచ్.



నాగార్జున, జిమ్ సర్ఫ్, ధనుష్

'కుబేర' రిలీజ్ ఎప్పుడంటే?

ధనుష్, నాగార్జున, రష్మిక మందన్న, డైరెక్టర్ శేఖర్ కమ్ముల కాంబినేషన్‌లో రూపొందుతున్న పాన్-ఇండియన్ మూవీ 'కుబేర'. ఈ చిత్ర రిలీజ్ డేట్‌ను మేకర్స్ లాక్ చేశారు. జూన్ 20న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా థియేటర్లలో విడుదల కానుంది.

'ధనుష్, నాగార్జున, రష్మిక మందన్న, జిమ్ సర్భ్‌లతో కూడిన అద్భుతమైన తారాగణంతో 'కుబేర' భారతీయ సినిమాలో గేమ్-ఛేంజర్‌గా నిలుస్తుందనే నమ్మకాన్ని మేకర్స్ వ్యక్తం చేశారు.

క్యారెక్టర్ బేస్డ్ నెరేటివ్స్‌తో అదరగొట్టే శేఖర్ కమ్ముల ఈ చిత్రాన్ని నెవర్ బిఫోర్‌గా తీర్చిదిద్దారు. ఇది ఈ సంవత్సరంలో అత్యంత ఆసక్తిగా ఎదురు చూస్తున్న చిత్రాలలో ఒకటిగా నిలిచింది. రిలీజ్ డేట్ పోస్టర్ నాగార్జున, ధనుష్‌లను ఇంటెన్స్ ఎక్స్‌ప్రెషన్స్‌తో అద్భుతంగా ప్రజెంట్ చేసింది. జిమ్ సర్భ్ బ్యాక్‌డ్రాప్‌లో నిలబడి ఉండడం ఆసక్తికరంగా ఉంది. సినిమాలోని నాలుగు ప్రధాన పాత్రలను పరిచయం చేసిన ఈ సినిమా ఫస్ట్ గ్లింప్స్ అద్భుతమైన స్పందనతో అంచనాలను పెంచింది. ముఖ్యంగా ఇందులో ధనుష్, నాగార్జున, రష్మిక, జిమ్ సర్భ్‌ల పాత్రలు చాలా వైవిధ్యంగా ఉంటాయి. అంతేకాదు ఈపాత్రల తీరుతెన్నులు ప్రేక్షకుల్ని సర్‌ప్రైజ్ చేస్తాయి. ఇన్నేండ్ల కెరీర్‌లో అటు ధనుష్, ఇటు నాగార్జున ఈ తరహా పాత్రల్ని పోషించలేదు. దీంతో ఈ సినిమా కోసం ఈ ఇద్దరు హీరోల అభిమానులు ఎంతగానో ఎదురు చూస్తున్నారు. 'పుష్ప'సిరీస్, 'ఛావా' చిత్రాలతో దేశవ్యాప్తంగా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కథానాయిక రష్మిక పాత్ర అందర్నీ మెస్మరైజ్ చేస్తుంది. సినిమాలో ఎంతో కీలకంగా ఉన్న ఈమె పాత్రను దర్శకుడు శేఖర్ కమ్ముల తెరకెక్కించిన విధానం సూపర్బ్‌గా ఉంటుంది. ఈ సినిమాతో ఆమె మరో స్థాయికి వెళ్తుందనే నమ్మకం ఉంది. తన సినిమాల్లో భావోద్వేగాలకు పెద్ద పీట వేసే దర్శకుడు శేఖర్ కమ్ముల ఈ సినిమాలోనూ తనదైన మార్క్ ఎమోషన్స్‌ని పండించబోతున్నారు. శేఖర్ కమ్ముల అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి ఎస్‌విసీ ఎల్ఎల్‌పి పతాకంపై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్ రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం తమిళం, తెలుగు, హిందీ, కన్నడ, మలయాళ భాషలలో విడుదల కానుంది.

'అందమా.. అందమా..'



అనంతిక సనీల్‌కుమార్, ఫణీంద్ర నర్సెట్టి

మోస్ట్ సక్సెస్ ఫుల్ పాన్ ఇండియా ప్రొడక్షన్ హౌస్ మైత్రీ మూవీ మేకర్స్ బిగ్ స్టార్లతో హై-బడ్జెట్ ఎంటర్‌టైనర్‌లను నిర్మించడమే కాకుండా కంటెంట్-రీచ్ మూవీలను సైతం రూపొందిస్తోంది. ఇంటర్నేషనల్ అవార్డులు గెలుచుకుని విమర్శకుల ప్రశంసలు పొంది 'మను'తో దర్శకుడిగా డెబ్యూ చేసి దర్శకుడు ఫణీంద్ర నర్సెట్టితో కాన్సెప్ట్ బేస్డ్ మూవీ '8 వసంతాలు'ను నిర్మిస్తున్నారు.

'మ్యాడ్' ఫేమ్ అనంతిక సనీల్‌కుమార్ ఈ మూవీలో హీరోయిన్. ఇందులో ఆమె శుద్ధి అయోధ్య పాత్రలో కనిపించనుంది. ఈ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్, గ్లింప్స్, టీజర్ ఇప్పటికే మంచి బజ్ క్రియేట్ చేసింది.

మేకర్స్ మ్యూజిక్ ప్రమోషన్స్‌ని కిక్ స్టార్ట్ చేస్తున్నారు. ఈ సినిమాలోని ఫస్ట్ సింగిల్ 'అందమా అందమా..'ని మార్చి 3న విడుదల చేయబోతున్నారు. స్టార్ కంపోజర్ హేషమ్ అబ్దుల్ వహాబ్ ఈ పాట కోసం బ్లాక్‌బస్టర్ ట్యూన్‌ని కంపోజ్ చేశారు. వనమాలి రాసిన ఈ పాటని హేషమ్ అబ్దుల్ వహాబ్, ఆవని మల్హార్ పాడారు. సాంగ్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో లీడ్ పెయిర్ కెమిస్ట్రీ బ్యూటీఫుల్‌గా ఉంది. నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా హార్ట్ వార్మింగ్ మూవీగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

అందర్నీ మెప్పించే 'గార్డ్'



విరాజ్ రెడ్డి చీలం

అను ప్రొడక్షన్స్‌లో విరాజ్ రెడ్డి చీలం కథానాయకుడిగా రూపొందిన చిత్రం 'గార్డ్'. రివేంజ్ ఫర్ లవ్ అనే ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ చిత్రం నేడు (శుక్రవారం) విడుదల అవుతోంది. ఈ సినిమాలో మిమీ లియోనార్డ్, శిల్పా బాలకృష్ణ కథానాయికలుగా నటించారు. జగ పెద్ది దర్శకత్వంలో అనసూయ రెడ్డి ఈ సినిమాను నిర్మించారు. సినిమా రిలీజ్ నేపథ్యంలో హీరో విరాజ్ రెడ్డి చీలం మీడియాతో ముచ్చటించారు.

- మాది నిజామాబాద్. ఉన్నత చదువుల కోసం ఆస్ట్రేలియాకు వెళ్లి, సెటిల్ అయ్యాను. చిన్నప్పటి నుంచీ నాకు సినిమాలంటే ఇష్టం. అక్కడే యాక్టింగ్ స్కూల్‌కు వెళ్లాను. ఈ మూవీ మొత్తాన్ని కూడా ఆస్ట్రేలియాలోనే షూట్ చేశాం. కరోనా తరువాత ఈ మూవీని చేశాం. కొత్త వాళ్లే అయినా కూడా అంతా ట్రైనింగ్ తీసుకున్న యాక్టర్లతోనే ముందుకు వెళ్లాం.
- ఆస్ట్రేలియాలో సినిమా తీసినా, స్టోరీ మాత్రం మనదే. తెలుగు వాళ్ల వైబ్ ఎలా ఉంటుందో, సినిమా కూడా అలానే ఉంటుంది. కాకపోతే ఆస్ట్రేలియా ఫ్లేవర్ ఉంటుంది. అక్కడి ఓ సెక్యూరిటీ గార్డ్ లైఫ్ ఎలా ఉంటుందో చూపించాను. ఇక్కడ సెక్యూరిటీ గార్డ్ లైఫ్ వేరేలా ఉంటుంది. కానీ ఆస్ట్రేలియాలో సెక్యూరిటీ గార్డ్ అయినప్పటికీ బీఎండబ్ల్యూ కూడా ఉంటుంది.
- హర్రర్, యాక్షన్, కామెడీ, రివేంజ్ ఇలా అన్ని అంశాలతో ఈ మూవీని తీశాం. ఈ కథలో అన్ని రకాల అంశాలుంటాయి. పూర్తిగా హీరోయిజం చూపించే పాత్ర కాదు. కథకు తగ్గట్టుగా అన్ని రకాల ఎమోషన్స్‌ను చూపించాల్సి ఉంటుంది. ఓ కొత్త హీరోకి ఇంత కంటే మంచి డెబ్యూ దొరకదు. టీజర్, ట్రైలర్ చూసిన వారంతా మెచ్చుకున్నారు. డైరెక్టర్ జగ నాకు ముందు నుంచీ తెలుసు. హర్రర్ జోనర్ అయితే కొత్త వాళ్లు అయినా కూడా జనాలకు ఎక్కువగా దగ్గర అయ్యే ఛాన్స్ ఉంటుంది.
- మా నాన్న రైతు. అందుకే ఫార్మర్‌తో టీజర్‌ను లాంచ్ చేయించాం. టీజర్, ట్రైలర్ ఈవెంట్లు గ్రాండ్ సక్సెస్ అయ్యాయి. వాటికి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఫైట్స్ కూడా చైనీస్ స్టయిల్‌లో ఉంటాయి. అలాగే సౌండింగ్, మ్యూజిక్ అన్నీ కూడా ఇండియన్ స్టయిల్‌లో ఉంటాయి. కథ మీద నమ్మకంతో ఈ సినిమాని నేనే సొంతంగా రిలీజ్ చేస్తున్నాను. నేను నటించిన మరో మూవీ కూడా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

అమెరికాకు రష్యా క్షిపణి ఫోబియా

ఎఫ్-400 విశిష్టతలపై భయాందోళనలు

న్యూఢిల్లీ : భారత వైమానిక దళానికి ఎఫ్-35 యుద్ధ విమానాలను విక్రయించేందుకు అమెరికా ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే. ఇటీవల ప్రధాని నరేంద్ర మోడీ అమెరికాలో పర్యటించినసందర్భంగా ఆ దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దీనిపై ఓ ప్రకటన చేశారు. భారత్‌పై అమెరికాకు ఇంత ప్రేమ ఏమిటని ఆరా తీస్తే ఆ దేశానికి పట్టుకున్న 'ఎస్-400' ఫోబియాయే కారణమని స్పష్టమవుతోంది. రష్యాకు చెందిన అల్మాజ్-అంటే ఎస్-400 క్షిపణులను భారత్ కొనుగోలు చేస్తోంది. ఇవి ఉపరితలం నుండి గగనతలంలోకి ప్రయోగించే మొబైల్ దీర్ఘ శ్రేణి, బాలిస్టిక్ నిరోధక వ్యవస్థకు సంబంధించిన క్షిపణులు. వీటిలో ఇప్పటికే మూడు క్షిపణులను వైమానిక దళం మోహరించింది. మరో రెండు క్షిపణులు ఈ ఏడాది చివరి నాటికి రష్యా నుంచి మన దేశానికి చేరతాయి.

ఎస్-400 విశేషాలు

అమెరికాకు సంబంధించినంత వరకూ ఎస్-400 క్షిపణులు ఎఫ్-35 యుద్ధ విమానాలకు నిజమైన, విశ్వసనీయమైన సవాలు విసురుతున్నాయి. ఎందుకంటే ఎస్-400 క్షిపణులకు ఎన్నో విశిష్టతలు ఉన్నాయి. ఇవి యుద్ధ విమానాలు, డ్రోన్లు, బాలిస్టిక్ క్షిపణులు, క్రూయిజ్ క్షిపణులను గుర్తించి నాశనం చేస్తాయి. వీటి పరిధి 400 కిలోమీటర్ల వరకూ ఉంటుంది. 10-30 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదిస్తాయి. ఒకేసారి 80 లక్ష్యాల వరకూ గుర్తించి వాటిలో 36 లక్ష్యాలకు గురి పెడతాయి. ఈ లక్ష్యాలలో ఎఫ్-35 యుద్ధ విమానాలు కూడా ఉన్నాయి. ఎఫ్-400 క్షిపణిలోని అత్యాధునిక రాడార్ వ్యవస్థలు ముందస్తు హెచ్చరికలు జారీ చేస్తాయి. ఈ క్షిపణులు ఇతర గగనతల రక్షణ వ్యవస్థలతో కూడా కలిసి పనిచేయగలవు.

అందుకే ఆందోళన

ప్రపంచంలోని గగనతల రక్షణ క్షిపణి వ్యవస్థల్లో ఇది ఒకటి. ఇన్ని విశేషాలు, విశిష్టతలు ఉన్న ఎస్-400 క్షిపణుల పేరు వింటేనే అమెరికా భయపడి పోతోంది. ఆ భయం ఏ స్థాయిలో ఉన్నదంటే 2019 జులైలో తన ఎఫ్-35 కార్యక్రమం నుండి నాటో భాగస్వామి టర్కీని తొలగించింది. రష్యా నుంచి టర్కీ రెండు క్షిపణులను మోహరించడంతో ఐదవ తరానికి చెందిన వంద యుద్ధ విమానాల కొనుగోలుకు ఇచ్చిన ఆర్డర్‌ను అమెరికా రద్దు చేసుకుంది. ఎఫ్-35లోని రాడార్‌కు సంబంధించిన సమాచారాన్ని ఎస్-400 క్షిపణి సేకరిస్తుందని, దాని సాయంతో గగనతల రక్షణ వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచుకొని లక్ష్యాలను మరింత సమర్థవంతంగా ఢీకొంటుందని కూడా అమెరికా కలవరపడుతోంది.



టర్కీపై ఆంక్షలు

ఎఫ్-35 యుద్ధ విమానాల భద్రతకు ఎస్-400 క్షిపణులు విఘాతం కలిగిస్తాయని అమెరికా ఆందోళన చెందుతోంది. రష్యా నుంచి క్షిపణులను కొనుగోలు చేసిందన్న అక్కసుతో గతంలో టర్కీపై అమెరికా పలు ఆంక్షలు విధించింది. ఈ ఆంక్షలు నాటో దేశాల మధ్య రక్షణ కొనుగోళ్లు, ద్వైపాక్షిక వాణిజ్యానికి ఇబ్బందిగా ఉన్నందున వాటిని తొలగించాలని టర్కీ అధ్యక్షుడు తయ్యిప్ ఎర్డోగన్ గత సంవత్సరం చివరలో అభ్యర్థించినప్పటికీ అమెరికా పట్టించుకోలేదు.

ఒత్తిడే కారణమా?

ఇటీవల బెంగళూరులో జరిగిన ఏరో ఇండియాలో ఎఫ్-35 యుద్ధ విమానాలను కూడా ప్రదర్శించారు. అదే సమయంలో ప్రధాని మోడీ అమెరికా పర్యటనలో ఉన్నారు. ఇది కాకతాళీయమే అయినా ఎఫ్-35 విమానాలను భారత్‌కు విక్రయించేందుకు అమెరికా చూపుతున్న ఆసక్తిని బయటపెడుతోంది. అయితే ఈ విమానాల కొనుగోలుకు సంబంధించి నిర్దిష్ట ప్రతిపాదన ఏదీ ఇప్పటి వరకూ రాలేదని అధికారులు చెబుతున్నారు. కానీ వీటిని కొనుగోలు చేయాల్సిందిగా భారత్‌పై తీవ్రమైన ఒత్తిడి వస్తోందని ప్రైవేటు సంభాషణల్లో అంగీకరిస్తున్నారు.

ఈసీ సాయంతోనే ఓటర్ల జాబితాలో బీజేపీ వకతవకలు

కోల్‌కతా : ఎన్నికల కమిషన్ (ఈసీ)సాయంతోనే బీజేపీ ఓటర్ల జాబితాలో అవకతవకలకు పాల్పడుతోందని పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆగ్రహం వ్యక్తం చేశారు. హర్యానా, గుజరాత్ రాష్ట్రాలకు చెందిన వారిని నకిలీ ఓటర్లుగా చేరుస్తున్నారని అన్నారు. ఓటర్ల జాబితాల్లో అవకతవకలను పరిశీలించేందుకు జిల్లాల వారీగా కమిటీని నియమిస్తున్నట్టు గురువారం మీడియాకు తెలిపారు. మహారాష్ట్ర, ఢిల్లీ ఎన్నికలను తారుమారు చేసేందుకు బీజేపీ ఓటర్ల జాబితాలో నకిలీ ఓటర్లను చేర్చిందని, ఇప్పుడు పశ్చిమ బెంగాల్‌లో సైతం అదే వ్యూహాన్ని ప్రయోగించేందుకు యత్నిస్తోందని మండిపడ్డారు. ఈసీ కార్యాలయం లోనే కూర్చుని ఆన్‌లైన్‌లో నకిలీ ఓటర్ల జాబితాను రూపొందిస్తున్నా రని, ఆ వ్యూహంతోనే ఢిల్లీ, మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించిందని అన్నారు. మహారాష్ట్ర ప్రతిపక్షాలు ఈ విషయాన్ని గుర్తించలేకపోయాయని ఎద్దేవా చేశారు. ఆ వ్యూహం తమ రాష్ట్రంలో పనిచేయదని, బీజేపీ విజయం సాధించలేదని అన్నారు. ఎన్నార్సీ, సీఏఏ పేరుతో బెంగాల్ ప్రజల పేర్లను తొలగించేందుకు యత్నిస్తోందని అన్నారు.



ఢిల్లీ అసెంబ్లీ ఎదుట ఆప్ ఎమ్మెల్యేల నిరసన

న్యూఢిల్లీ : ప్రతిపక్ష నేత అతిశీతో సహా సస్పెండ్ చేయబడిన ఆప్ ఎమ్మెల్యేలను గురువారం ఢిల్లీ అసెంబ్లీ ఎదుట నిరసనకు దిగారు. తమను అసెంబ్లీలోకి ప్రవేశించకుండా భద్రతాబలగాలు అడ్డుకున్నాయని అన్నారు. బారికేడ్లతో ప్రధాన ప్రవేశద్వారాని మూసివేశారని అన్నారు. ఢిల్లీలో అధికారం చేపట్టిన బీజేపీ ప్రభుత్వ నియంతృత్వం హద్దులు దాటిపోయిందని అతిశీ మండిపడ్డారు. తమను అసెంబ్లీలోకి ప్రవేశించకుండా ఎందుకు అడ్డుకున్నారని ప్రశ్నించారు. జై భీమ్ నినాదాలు చేసినందుకే తమను మూడు రోజుల పాటు సభ నుంచి సస్పెండ్ చేశారని అన్నారు. ఆప్ ఎమ్మెల్యేలను అసెంబ్లీ ఆవరణలోకి కూడా అనుమతించడం లేదని, ఢిల్లీ అసెంబ్లీ చరిత్రలో ఎప్పుడూ ఇలా జరగలేదని అన్నారు. సస్పెన్షన్‌కు గురయ్యారంటూ ఎన్నికైన సభ్యులను అసెంబ్లీ ఆవరణలోకి కూడా అనుమతించలేదని ఆప్ ఎమ్మెల్యే సంజీవ్ ఝా ఆగ్రహం వ్యక్తం చేశారు.

యూరియా కొరత రాకుండా చూడాలి

- ఎరువుల కొనుగోలు కేంద్రాలను తెరవాలి : వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని రైతులకు యూరియా కొరత రాకుండా చూడాలని వ్యవసాయ అధికారులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, సంచాలకులు గోపి, అడిషనల్ డైరెక్టర్, ఎరువుల విభాగాన్ని పర్యవేక్షించే అధికారులు ఏజెన్సీ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. సరఫరాలో, పంపిణీపై పూర్తిస్థాయిలో సమీక్ష నిర్వహించారు. యాసంగి 2024-25 సీజన్‌లో ఇప్పటి వరకు 10.36 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు అందుబాటులో ఉంచామని తెలిపారు. ఇప్పటి వరకు రైతులు 9.21 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఎరువులను పంట అవసరాలకు కొనుగోలు చేశారని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గురువారం వరకు 1.08 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిలువలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. రాష్ట్రానికి కావాల్సిన ఎరువులను ఎప్పటికప్పుడు రైతులకు సరఫరా చేసేందుకు కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు చేస్తున్నామని తెలిపారు. వివిధ కంపెనీలకు చెందిన సుమారు 41 వేల మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి రానుందని పేర్కొన్నారు. అదికాక త్వరితగతిన మరో 30 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరాకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఎరువుల కొనుగోలు కేంద్రాలను తెరిచి రైతులకు అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు.

మార్క్‌ఫెడ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులను ఎరువుల లభ్యతపై సమీక్ష జరుపుతూ రైతులకు కావాల్సిన యూరియాను ఇకముందు కూడా ముందస్తుగా తెప్పించి అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఈ క్రమంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందొద్దని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకొంటూ, పంటకాలం కంటే ముందే మార్క్‌ఫెడ్ దగ్గర ప్రారంభనిల్వలు ఉంచుకొని, రోజు వారీ నివేదికల ఆధారంగా కట్టుదిట్టంగా అన్ని జిల్లాలకు రానున్న పదిరోజులకు సరిపడా యూరియాను ముందుగానే సరఫరా చేశామని తెలిపారు. పంపిణీలో నిరంతరం పర్యవేక్షించినప్పటికీ, కొంతమంది స్వప్రయోజనాల కోసం కొన్ని వేదికలను ఆధారంగా చేసుకొని రైతాంగాన్ని ఆందోళన పరిచే ప్రయత్నం చేశారని ఆరోపించారు. అలాంటి వారికి చిన్న అవకాశం ఇవ్వకుండా జాగ్రత్తగా ఉండాలని కోరారు. ఈ ప్రభుత్వానికి రైతుల ప్రయోజనాలే మొట్టమొదటి ప్రాధాన్యమని తెలిపారు. ఇకముందు ఇలాంటి కట్టు కథల్ని ప్రారంభంలోనే కొట్టేసే విధంగా సమాచారం ప్రతి ఒక్కరి దగ్గర అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

కోమాలో భారతీయ విద్యార్థిని

కుటుంబం అభ్యర్థనపై స్పందించిన కేంద్రం



ముంబయి : అమెరికాలో కోమాలో ఉన్న భారతీయ విద్యార్థిని కుటుంబానికి వీసా జారీ చేయడాన్ని అమెరికా ప్రభుత్వం పరిశీలిస్తున్నట్టు సంబంధిత వర్గాలు గురువారం తెలిపాయి. అత్యవసర వీసా జారీ చేయాలంటూ విద్యార్థిని కుటుంబం కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్థించిన సంగతి తెలిసిందే. విదేశాంగ మంత్రిత్వ శాఖకి చెందిన అమెరికా విభాగం ఈ సమస్యను అధికారికంగా లేవనెత్తడానికి, సహాయం కోరడానికి అమెరికా చేరుకున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. మెడికల్ ఎమర్జెన్సీల కోసం వీసా త్వరగా జారీ చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నాయి.

ఫిబ్రవరి 14న కాలిఫోర్నియాలో జరిగిన ప్రమాదంలో నీలం షిండే (35)కు తీవ్రంగా గాయపడ్డారు. కారు ఢీకొనడంతో ఆమె తలపై, ఛాతీపై గాయాలయ్యాయి. ప్రస్తుతం ఆమె కోమాలో ఉన్నట్లు సమాచారం. ఘటన జరిగిన రెండు రోజుల తర్వాత ఆమె కుటుంబానికి ప్రమాదం గురించి తెలిసింది. నీలం షిండే కుటుంబం మహారాష్ట్రలోని సతారాలో నివాసముంటోంది. ఫిబ్రవరి 16న ప్రమాదం గురించి తెలిసిందని, అప్పటి నుండి వీసా కోసం ప్రయత్నిస్తున్నామని విద్యార్థిని తండ్రి తానాజీ షిండే తెలిపారు. వీసా కోసం దరఖాస్తు చేసుకున్నా.. ఇంకా పెండింగ్‌లో ఉందని అన్నారు.

భారతీయ విద్యార్థిని కుటుంబానికి మద్దతుగా ఎన్‌సీపీ (ఎస్‌పీ) ఎంపీ సుప్రియా సూలే సోషల్ మీడియా ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఆమె తండ్రికి త్వరగా వీసా అందేలా విదేశాంగ మంత్రి ఎస్.జయశంకర్ సహాయం చేయాల్సిందిగా అభ్యర్థించారు. ఇది ఆందోళనకరమైన సమస్యఅని, మనమందరం కలిసి పరిష్కరించడంలో సహకారం అందించాలని అన్నారు.

ఢిల్లీలో హిందూత్వ ఎజెండా

ముస్లిం పేర్లను మార్చాలన్న బీజేపీ ఎమ్మెల్యేలు



న్యూఢిల్లీ : ప్రధాని మోడీ ప్రభుత్వం హిందూత్వ ఎజెండాను దూకుడుగా ముందుకు తీసుకువెళుతోంది. ఇప్పటికే అధికారంలోకి వచ్చిన ప్రతి రాష్ట్రంలోనూ నగరాలు, వీధులకు ఉన్న ముస్లిం పేర్లను తొలగిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా తమ నియోజకవర్గాల్లో ఉన్న ముస్లిం పేర్లను మార్చాలంటూ గురువారం బీజేపీ ఎమ్మెల్యేలు ప్రతిపాదనలు ప్రవేశపెట్టారు. 'నజాఫ్‌గఢ్' పేరును 'నహర్‌ఘర్'గా మార్చాలని బీజేపీ ఎమ్మెల్యే నీలం పహల్వాన్ తన ప్రతిపాదనలలో పేర్కొన్నారు. మొఘల్ పాలకుడు ఔరంగజేబు నియోజకవర్గం పేరును మార్చారని, అసలు పేరును పునరుద్ధరించాలని ప్రతిపాదనలో పేర్కొన్నారు.

ఆర్‌కెపురం నియోజకవర్గంలోని మహ్మద్‌పూర్ పేరును మాధవపూర్‌గా మార్చాలంటూ ఆర్‌కెపురం ఎమ్మెల్యే అనిల్ శర్మ సైతం అసెంబ్లీలో ప్రతిపాదన సమర్పించారు. తన నియోజకవర్గం ఢిల్లీ గ్రామీణ ప్రాంతానికి చెందినదని, హర్యానాలోని మూడు ప్రాంతాలకు సరిహద్దుగా ఉందని నీలం పహల్వాన్ అసెంబ్లీకి తెలిపారు. మొఘల్ పాలకుడు, చక్రవర్తి షాఆలం-2 నజఫ్‌గఢ్‌ను స్వాధీనం చేసుకున్నప్పుడు ఈ ప్రాంతంలో చాలా అణచివేత జరిగిందని అన్నారు. అనంతరం 1857 తిరుగుబాటు సమయంలో.. రాజానహర్ సింగ్ పోరాడి తిరిగి ఈ ప్రాంతాన్ని ఢిల్లీ ప్రావిన్స్‌లోకి తీసుకువచ్చారని అన్నారు. అప్పటి నుండి ఎంపీ పర్వేష్ వర్మతో సహా తాము నజాఫ్‌గఢ్ పేరును నహర్‌ఘర్‌గామార్చేందుకు యత్నిస్తున్నామని అన్నారు. ఈమారు చాలా ముఖ్యమని, ముస్లింల హయాంలో ప్రజలు తీవ్ర అణచివేతకు గురయ్యారని, ఈ ప్రాంత రాజులు వారి ఉనికి కోసం పోరాడారని అన్నారు.



నలుగురు బందీల మృత దేహాలను అప్పగించిన హమాస్

వందలాదిమంది పాలస్తీనా ఖైదీలు విడుదల

గాజా : తమ చెరలో వున్న నలుగురు బందీల మృతదేహాలను హమాస్, గురువారం తెల్లవారు జామునే రెడ్‌క్రాస్‌కు అప్పగించింది. మరోవైపు ఇజ్రాయిల్ జైళ్ళ నుంచి వందలాదిమంది పాలస్తీనా ఖైదీలు విడుదలయ్యారు. మరికొద్ది రోజుల్లో కాల్పుల విరమణ ఒప్పందం ముగియనుంది. మొదటి దఫా కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా ఇరు పక్షాలు నిబంధనలకు అనుగుణంగా తమ విధులను నిర్వర్తించాల్సి వుంది. ఇప్పటివరకు హమాస్ 33మంది బందీలను అప్పగించగా, వీటిలో 8 మృత దేహాలు వున్నాయి. కాగా ఇజ్రాయిల్ దాదాపు 2వేల మంది పాలస్తీనా ఖైదీలను విడుదల చేసింది. కాగా మృతదేహాల గుర్తింపు ప్రక్రియను కూడా పూర్తి చేసినట్లు ఇజ్రాయిల్ అధికారులు వెల్లడించారు. ఇజ్రాయల్ జైళ్ళ నుంచి 456మంది పాలస్తీనియన్లు విడుదల కాగా, వారిలో 97మందిని ఈజిప్ట్‌కు తరలించారు. 37మంది వెస్ట్ బ్యాంక్ చేరుకున్నారు. మరో ఐదుగురు ఆక్రమిత తూర్పు జెరూసలేం వెళ్ళారు. 24మంది చిన్నారులతో సహా మరికొంతమంది ఇంకా విడుదల కావాల్సి వుందని వారి విడుదల ప్రక్రియలో ఇజ్రాయిల్ కావాలనే జాప్యం చేస్తోందని హమాస్ విమర్శించింది.

కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో వున్నప్పటికీ గత 48గంటల్లో గాజా ఆస్పత్రులకు 17 మృతదేహాలు వచ్చాయి. 19మంది గాయపడినవారు చికిత్స పొందారని పాలస్తీనా ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి.

రెండో దఫా కాల్పుల విరమణ చర్చల కోసం కైరోకు వెళ్ళాల్సిందిగా ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు తమ ప్రతినిధి బృందాన్ని ఆదేశించారని ప్రధాని కార్యాలయం తెలిపింది. ఈ వారాంతానికి మొదటి దఫా ఒప్పందం ముగియనుంది. దాంతో రెండో విడత ఒప్పందంపై చర్చలు ముమ్మరమయ్యాయి. కాగా, రెండో దశ ఒప్పందం కుదుర్చుకునే విషయంలో ఇజ్రాయిల్ చిత్త శుద్ధితో వ్యవహరించడం లేదని హమాస్ పొలిట్‌బ్యూరో సభ్యులు బసీమ్ నయీమ్ విమర్శించారు. బదులుగా సైనిక దాడులను ముమ్మరం చేయాలని భావిస్తోందన్నారు. గాజాకు ఈజిప్ట్‌తో గల సరిహద్దు పొడవునా గల ఫిలడెల్ఫి కారిడార్ నుండి ఇజ్రాయిల్ మిలటరీ వైదొలగేది లేదని ఇజ్రాయిల్ మీడియా వర్గాలు తెలిపాయి.

హరీశ్ పిటిషన్‌పై తీర్పు వాయిదా

నవతెలంగాణ-హైదరాబాద్

పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో రియలెస్టేట్ వ్యాపారి చక్రధర్‌గౌడ్ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు మాజీ మంత్రి హరీష్‌రావు, మాజీ పోలీస్ అధికారి రాధాకిషన్‌రావు ఇతరులపై నమోదు చేసిన ఫోన్ ట్యాపింగ్ కేసును సవాల్ చేస్తూ హరీష్‌రావు వేసిన పిటిషన్‌పై హైకోర్టు తీర్పు వాయిదా వేసింది. గురువారం ఇరు పక్షాల వాదనలు పూర్తి కావటంతో తీర్పును వాయిదా వేస్తున్నట్టు జస్టిస్ లక్ష్మణ్ ప్రకటించారు. తీర్పు వచ్చే వరకు హరీష్‌ను అరెస్టు చేయొద్దని గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు అమల్లో ఉంటాయన్నారు. ఇప్పటికే పోలీసులు కేసు దర్యాప్తును చేయరాదని స్టే ఆదేశాలను కూడా జారీ చేశారు. కాంగ్రెస్ నాయకుడు చక్రధర్‌గౌడ్ ఫిర్యాదు మేరకు నమోదైన ఫోన్ ట్యాపింగ్ కేసును కొట్టివేయాలని హరీష్ సీనియర్ లాయర్ శేషాద్రి నాయుడు వాదించారు. రాజకీయ కక్షతో చక్రధర్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పీఎస్‌లో తనపై ఫిర్యాదు చేశారన్నారు. ఇతర నిందితులను హింసించి హరీశ్‌కు వ్యతిరేకంగా వాంగ్మూలం చెప్పించారన్నారు పోలీసులు వేధిస్తున్నారన్నారు. హరీష్‌ను అరెస్టు చేయాలని కుట్ర జరుగుతున్నందన్నారు. పోలీసుల తరపున పీపీ, ప్రభుత్వ తరపున సీనియర్ లాయర్ లూద్రా వాదించారు. పిటిషన్‌ను కొట్టేయాలని కోరారు. వాదనలు పూర్తి కావటంతో తీర్పు రిజర్వు చేస్తున్నట్టు న్యాయమూర్తి లక్ష్మణ్ ఉత్తర్వులు జారీ చేశారు. రెండో నిందితుడు రాధాకిషన్‌రావు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌లో వాదనలు శుక్రవారం చేస్తామన్నారు. ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ రాధాకిషన్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌లో వాదనలను వచ్చే నెల ఆరుకు వాయిదా వేశారు.

మెట్రో కొత్త ప్రాజెక్టుపై పిల్

ఎంజీబీఎస్ (మహాత్మాగాంధీ బస్ స్టేషన్) నుంచి శంషాబాద్ వరకు నిర్మాణం చేయబోయే మెట్రో రైల్ ప్రాజెక్టు పనుల్ని స్టే చేయాలంటూ దాఖలైన పిటిషన్‌లో ప్రభుత్వం మూడు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు నోటీసులిచ్చింది. విచారణ ఏప్రిల్ మూడుకు వాయిదా వేసింది. ప్రభుత్వ కౌంటర్ పిటిషన్‌పై అభ్యంతరాలు ఉంటే వాటిని పిటిషనర్ కూడా నివేదించాలంది. ఎంజీబీఎస్ నుంచి శంషాబాద్ వరకు మెట్రో రైలు విస్తరణ పనులను నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ యాక్ట్ పబ్లిక్ వెల్ఫేర్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ మహ్మద్ రహీం ఖాన్ వేసిన పిల్‌ను యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక యారా డివిజన్ బెంచ్ గురువారం చార్మినార్, ఫలక్‌నుమా, దారుల్‌షిఫా వంటి కట్టడాలకు ప్రమాదం ఏర్పడుతుందని, చారిత్రాత్మక కట్టడాల రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని పిల్‌లో పేర్కొన్నారు.



బార్ అసోసియేషన్ల ఎన్నికలపై స్టేటస్‌కో

రాష్ట్రంలోని బార్ అసోసియేషన్ల ఎలక్షన్లపై హైకోర్టు స్టేటస్‌కో ఆర్డర్ ఇచ్చింది. బార్ అసోసియేషన్ పాలకవర్గం పదవీ కాలాన్ని రెండేళ్లపాటు పొడిగించాలన్న అభ్యర్థనను రాష్ట్ర బార్ కౌన్సిల్, రంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ సహా 25 అసోసియేషన్లు హైకోర్టులో సవాలు చేశాయి. జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి గురువారం విచారించారు. సమగ్ర విచారణ నిమిత్తం మార్చి 4కి వాయిదా వేశారు. అప్పటి వరకు స్టేటస్‌కో ఆర్డర్ అమల్లో ఉంటుందని చెప్పారు.

దక్షిణాది రాష్ట్రాలను అణచివేసే ఉద్దేశపూర్వక యత్నం



బెంగళూరు : నియోజకవర్గాల పునర్విభజనపై అమిత్‌షా ఇచ్చిన దక్షిణాది రాష్ట్రాలను అణచివేసే ఉద్దేశపూర్వకయత్నమని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేర్కొన్నారు. అమిత్‌షా ప్రకటన అవిశ్వాసనీయమైనది, తప్పు దారి పట్టించేదిగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పునర్విభజన ప్రభావం వల్ల దక్షిణాది రాష్ట్రాలు ఒక్క లోక్‌సభ స్థానాన్ని కూడా కోల్పోవని అమిత్‌షా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ ప్రకటన మరింత ఆందోళనకరం కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మరియు కేరళ రాష్ట్రాలను అణచివేసే ఉద్దేశపూర్వక యత్నమని సిద్ధరామయ్య మండిపడ్డారు. గతంలో పునర్విభజన ప్రక్రియ 1971 జన గణనను దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి యత్నాలను గుర్తించడానికి, న్యాయబద్ధతను నిర్ధారించేందుకు వినియోగించేవారని అన్నారు. ప్రస్తుత పునర్విభజన ప్రక్రియ ప్రాతిపదిక ఏమిటని ప్రశ్నించారు. నియోజకవర్గాలపై యథాతథ స్థితిని కొనసాగించాలని కేంద్రాన్ని కోరారు.

ఒకవేళ 2021 లేదా 2031 జన గణనను ప్రాతిపదికగా తీసుకుంటే .. ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల లోక్‌సభ స్థానాల్లో వచ్చే మార్పులను ముఖ్యమంత్రి కార్యాలయం విడుదల చేసింది.

లోక్‌సభ స్థానాలు తగ్గుతాయనిఅంచనా..

కర్ణాటక	:	28 నుండి 26
ఆంధ్రప్రదేశ్	:	42 నుండి 34
కేరళ	:	20 నుండి 12
తమిళనాడు	:	39 నుండి 31

ఉత్తరాది రాష్ట్రాలకు లోక్‌సభ స్థానాలు పెరుగుతాయని అంచనా..

ఉత్తరప్రదేశ్	:	80 నుండి 91
బీహార్	:	40 నుండి 50
మధ్యప్రదేశ్	:	29 నుండి 33

బిజెపి ఆధిపత్యాన్ని వ్యతిరేకించిన దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రభావాన్ని బలహీన పరిచే సాధనంగా డీలిమిటేషన్‌ను వినియోగించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోందని సిద్ధరామయ్య అన్నారు. దక్షిణాది రాష్ట్రాల మధ్య ఐక్య కూటమి ఏర్పాటుపై ఇప్పటికేచర్చలు జరుగుతున్నాయని, అనైతికమైన డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తూ త్వరలో సంయుక్తంగా ఉద్యమం చేపడతామని అన్నారు. 1952, 1963, 1973, 2002లో ఇప్పటికే నాలుగు సార్లు డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటైంది. 1981,1991 జనగణన తర్వాత డీలిమిటేషన్ జరగలేదు. 2001 జనగణన తర్వాత డీలిమిటేషన్ జరిగినా సీట్ల సంఖ్య పెరగలేదు.

ఆర్థికాభివృద్ధిలో మైనింగ్ రంగం పాత్ర కీలకం

- ప్రయివేటు సంస్థలనూ భాగస్వామ్యం చేయబోతున్నాం
- బ్లూ ఎకానమీకి ప్రోత్సాహకం కోసం చట్టసవరణలు తీసుకొచ్చాం
- ఎక్స్‌ప్లోరేషన్ ప్రక్రియను వేగవంతం చేశాం : కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దేశ ఆర్థికాభివృద్ధిలో మైనింగ్ రంగం పాత్ర కీలకంగా మారబోతున్నదని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి చెప్పారు. ఖనిజరంగంలో ప్రయివేటు సెక్టార్‌ను కూడా భాగస్వామ్యం చేస్తున్నామన్నారు. బ్లూ ఎకానమీకి ప్రోత్సాహం కల్పించేందుకు ఎమ్ఎమ్‌డీఆర్ యాక్టు-2023, ఆఫ్‌షోర్ మినరల్ యాక్టు-2022లకు చట్టసవరణలు తీసుకొచ్చామని తెలిపారు. గురువారం ఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బొగ్గు, గనుల శాఖలో జరుగుతున్న



అభివృద్ధి కార్యక్రమాలను ఆయన వివరించారు. ఖనిజ రంగంలో తీసుకొచ్చిన సంస్కరణల కారణంగా ఎక్స్‌ప్లోరేషన్ ప్రక్రియను కూడా వేగవంతం చేశామని తెలిపారు. మైనింగ్ సెక్టార్‌లో ఆత్మనిర్భరత సాధించేందుకు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నామన్నారు. క్రిటికల్ మినరల్స్ యావరేజ్ సేల్ ప్రైస్‌ను క్యాలుక్యులేట్ చేసేందుకు ప్రత్యేక మెథాలజీ రూపకల్పనమైన దృష్టి సారించామని చెప్పారు. ఆఫ్ షోర్ మినరల్ బ్లాక్స్ కు తొలిసారిగా వేలం వేసే ప్రక్రియను వేగవంతం చేశామని తెలిపారు. 12 క్రిటికల్ మినరల్స్, ఆఫ్ షోర్ మినరల్స్.. లైమ్‌స్టోన్, డోలమైట్, పాలీమెటాలిక్ నాడ్యూల్స్ మొదలైన మినరల్స్ రాయల్టీ ధరలను రేషనలైజ్ చేశామని వివరించారు. వివిధ రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడి.. మైనింగ్ పూర్తయిన ప్రాంతాల్లో మైనింగ్ వేస్ట్ డంపింగ్ కోసం వినియోగించుకునేలా చర్యలు చేపట్టామన్నారు. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఈ ఏడాది 448 ఎక్స్ ప్లోరేషన్ ప్రాజెక్టులను దక్కించుకున్నదన్నారు. అందులో 195 క్రిటికల్ మినరల్స్ ప్రాజెక్టులున్నాయన్నారు. మినరల్ ఎక్స్‌ప్లోరేషన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ కూడా ఈ ఏడాది ఎక్స్‌ప్లోరేషన్స్ కా డ్రిల్లింగ్ యాక్టివిటీలో 35 శాతం పురోగతి కనబరిచిందని తెలిపారు. ఈ ఏడాది 12 నోటిఫైడ్ ప్రయివేటు ఎక్స్‌ప్లోరేషన్ ఏజెన్సీలను నోటిఫై చేశామనీ, దీంతో మొత్తంగా 28 ప్రయివేటు ఏజెన్సీలు పనిచేస్తున్నాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి 335 మినరల్ బ్లాక్స్ వేలానికి సిద్ధం చేశాయనీ, అందులో 106 బ్లాకుల వేలం పూర్తయిందని చెప్పారు. 27 బ్లాకులకు లీజ్ ఒప్పంద పత్రాలు ఇచ్చేమనీ, ఎనిమిదింట్లో ఉత్పత్తి కూడా ప్రారంభమైందని వివరించారు. మినరల్ ఆక్షన్ మ్యాప్‌లో మొత్తం 14 రాష్ట్రాలు భాగస్వామ్యమయ్యాయనీ, త్వరలో జమ్మూకాశ్మీర్, కేరళ కూడా భాగస్వామ్యం కాబోతున్నాయని చెప్పారు.

'ఫైట్ ఫర్ రైట్స్' షార్ట్ ఫిలింకు ఎన్‌హెచ్‌ఆర్‌సీ రెండో బహుమతి

- తెలంగాణకు చెందిన అక్షరాభ్యాసం, ఏపీకి చెందిన 'లైఫ్ ఆఫ్ సీత, బీ ఏ హ్యూమన్‌కు ప్రత్యేక బహుమతులు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 'ఫైట్ ఫర్ రైట్స్' షార్ట్ ఫిలింకు జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) రెండో బహుమతి వరించింది. మానవ హక్కులు అంశంపై తీసిన షార్ట్ ఫిలమ్స్ (చిన్న చిత్రాల)కు 2024 సంవత్సరానికి ప్రతిష్టాత్మక పదో వార్షిక పోటీని ఎన్‌హెచ్‌ఆర్‌సీ నిర్వహించింది. ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్‌పర్సన్ జస్టిస్ వి. రామసుబ్రమణియన్ అధ్యక్షత ఉన్న కమిషన్ జ్యూరీలో సభ్యులుగా జస్టిస్ బిద్యుత్ రంజన్ సారంగి, విజయ భారతి సయానీ, సెక్రెటరీ జనరల్ భరత్ లాల్, డీజీఐ ఆర్. ప్రసాద్ మీనాలతో పాటు రిజిస్ట్రార్ (లా) జోగిందర్ సింగ్ ఉన్నారు. మానవ హక్కులను పరిరక్షించడంతోపాటు మానవ హక్కులకు సంబంధించిన చైతన్యాన్ని వ్యాప్తి చేసే దిశగా ప్రజలు సినిమా మాధ్యమంతో స ృజనాత్మక దిశగా వారిని ప్రోత్సహించడానికి ఎన్‌హెచ్‌ఆర్‌సీ 2015లో షార్ట్ ఫిలిం పోటీలను ప్రవేశపెట్టింది. 2024లో ఈ పోటీ పదో సంచిక కోసం పెట్టిన గడువు లోపల వచ్చిన భారతీయ భాషలకు చెందిన 303 షార్ట్ ఫిలింలను పరిశీలించిన తరువాత, 243 ఎంట్రీలు పురస్కారాల కోసం బరిలో నిలిచాయి. పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని త్వరలో నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో రూ.2 లక్షల మొదటి బహుమతికి 'దూద్ గంగా- వ్యాలీస్ డైయింగ్ లైఫ్‌లైన్'ను ఎంపిక చేశారు. ఈ డాక్యుమెంటరీ ఫిలింను జమ్మూ కాశ్మీర్‌కు చెందిన ఇంజినీరు అబ్దుల్ రషీద్ భట్ తీశారు. దూద్ గంగ నదిలోని స్వచ్ఛ జలాల్లోకి అనేక రకాలైన వ్యర్థాలను యథేచ్ఛగా వదిలివేయడంతో నది నీరు ఎలా కలుషితమైపోతోందన్న ఆవేదనకు చిత్రరూపాన్ని కల్పిస్తూ, లోయలోని ప్రజల మేలు కోసం నదిని ప్రక్షాళన చేయాల్సిన అవసరాన్ని ప్రధానంగా చాటింది. ఆంగ్లం, హిందీ, ఉర్దూ భాషలలో రూపొందించిన ఈ చిత్రానికి సబ్ టైటిల్స్‌ను ఆంగ్లంలో కూర్చారు.'ఫైట్ ఫర్ రైట్స్'ను రూ.1.5 లక్షల రెండో బహుమతి కోసం ఎంపిక చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కడారప్ప రాజు ఈ చిత్రాన్ని రూపొందించారు. ఈ చిత్రం.. చిన్నతనంలోనే పెండ్లి చేయడం, విద్య అనే అంశాన్ని చర్చిస్తుంది. ఇది తెలుగు భాషలో ఉన్న ఈ చిత్రానికి ఆంగ్లంలో సబ్ టైటిల్స్‌ను సమకూర్చారు. 'గాడ్' చిత్రాన్ని రూ.లక్ష మూడో బహుమతి కోసం ఎంపిక చేశారు. దీనిని తమిళ నాడుకు చెందిన ఆర్. రవిచంద్రన్ రూపొందించారు. తాగడానికి అనువైన నీటికి ఉండే ప్రాధాన్యాన్ని గురించి ఈ మూకీ చిత్రం వివరించింది. రూ.50 వేల చొప్పున నాలుగు చిత్రాలకు బహుమతులు ఇవ్వాలని కమిషన్ నిర్ణయించింది. 'ప్రత్యేక ప్రస్తావన కేటగిరీలో చిత్రాలను ఎంపిక చేశారు. 1. 'అక్షరాభ్యాసం' -దీనిని తెలంగాణకు చెందిన హనీశ్ ఉండ్రమాట్ల రూపొందించారు. ఈ మూకీ చిత్రం బాలల విద్య ప్రాముఖ్యాన్ని చెబుతుంది. 2. 'విలయిల్ల పట్టధారి' - విలువ లేని గ్రాడ్యుయేట్ అని దీనికి అర్థం. దీనిని తమిళనాడుకు చెందిన ఆర్. సెల్వమ్ తీశారు. ఇంగ్లీషు సబ్‌టైటిల్స్ ఉన్నాయి. ఈ చిత్రం వయోవృద్ధుల కలిగే ఆందోళనలను, వారి హక్కులను గురించి చర్చిస్తుంది. 3. 'లైఫ్ ఆఫ్ సీత' - దీనిని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మడక వెంకట సత్యనారాయణ రూపొందించారు. ఇది తెలుగు చిత్రం. దీనికి ఇంగ్లీషు సబ్‌టైటిల్స్ ఉన్నాయి. ఈ చిత్రంలో ధార్మిక సంప్రదాయాల కారణాలతో బాలలు వారి హక్కులను కోల్పోతున్న తీరు, ఈ స్థితిలో సంస్కరణను తీసుకురావాల్సిన అవసరాన్ని ప్రధానంగా చూపెట్టారు. 4. 'బీ ఏ హ్యూమన్' - దీనిని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన లోట్ల నవీన్ రూపొందించారు. ఈ చిత్రం హిందీలో ఉంది. దీనికి ఇంగ్లీషులో సబ్‌టైటిల్స్‌ను ఇచ్చారు.

యువత.. జాగ్రత్త

- ఇయర్‌ఫోన్స్, హెడ్‌ఫోన్స్‌పై కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ హెచ్చరిక
- అధికంగా వాడితే వినికిడి లోపం
- అవగాహన కల్పించాలంటూ రాష్ట్రాలు, మెడికల్ కాలేజీలకు ఆదేశాలు



న్యూఢిల్లీ : సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా మార్కెట్‌లోకి అధునాతన పరికరాలు అందుబాటులోకి వస్తున్నాయి. అందులో ఇయర్‌ఫోన్స్, హెడ్‌ఫోన్స్‌వి కీలక స్థానమనే చెప్పాలి. ప్రత్యేకించి యువత వీటి వాడకానికి ఎక్కువగా అలవాటుపడుతున్నది. మంచి బేస్‌తో పాటలు లేదా తమకు నచ్చిన కంటెంట్‌ను వింటూ వారు సమయాన్ని గడపుతున్నారు. ఇది ఒక పరిమితి వరకు అయితే ఎలాంటి నష్టమూ ఉండదు. అయితే, అదే పనిగా వీటిని అతిగా వినియోగిస్తే(ప్రత్యేకించి యువత) తిరిగి పూడ్చలేని వినికిడి లోపానికి దారి తీసే ప్రమాదమున్నదని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ హెచ్చరిస్తున్నది. ఇయర్‌ఫోన్స్, హెడ్‌ఫోన్స్‌ను సుదీర్ఘ సమయం వాడితే వినికిడి లోపానికి దారి తీస్తుందన్న విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలని రాష్ట్రాలు, మెడికల్ కాలేజీలను కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ కోరింది.

'చిన్నారులలో స్క్రీన్ టైమ్ పరిమితం చేయాలి'

చిన్నారులలో స్క్రీన్ టైమ్‌ను పరిమితం చేసే అవసరాన్ని డైరెక్టర్ జనరల్ హెల్త్ సర్వీసెస్ (డీజీహెచ్‌ఎస్) ప్రొఫెసర్ డాక్టర్ అతుల్ గోయెల్ లేఖలో నొక్కి చెప్పారు. తరచూ స్క్రీన్ చూడటంతో పిల్లల్లో మెదడు అభివృద్ధి, సోషల్ ఇంటరాక్షన్, కమ్యూనికేషన్‌పై ప్రభావం చూపుతుందని వివరించారు. చిన్నారుల ఆన్‌లైన్ గేమింగ్‌కు సంబంధించి రాష్ట్రాలు అవగాహన కల్పించాలని డీజీహెచ్‌ఎస్ కోరింది. అలాగే, వారిలో సోషల్ మీడియా వినియోగాన్ని తగ్గించాలని వివరించింది.

50 డెసిబెల్స్.. రెండు గంటలు

శబ్ద తీవ్రత 50 డెసిబెల్స్‌కు మించకుండా ఆడియో పరికరాలను ఉపయోగించాలని గోయెల్ సూచించారు. అది కూడా రోజుకు రెండు గంటలకు మించి ఉండొద్దని వివరించారు. విరామాలు ఇస్తూ వినాలని పేర్కొన్నారు. పబ్లిక్ ఈవెంట్లలో సగటు గరిష్ట శబ్దస్థాయి వంద డెసిబెల్స్‌కు మించకుండా చూడాలని రాష్ట్రాలకు సూచించారు. ఫిబ్రవరి 20న డీజీహెచ్‌ఎస్ రాసిన లేఖ వినికిడి లోపం గురించి వివరించారు. "చాలా ముఖ్యం, కాని పట్టించుకొని ఆరోగ్య సమస్య ఏమిటంటే.. ఇయర్‌ఫోన్స్, హెడ్‌ఫోన్స్ వాడకం వల్ల కలిగే వినికిడి లోపం. ప్రత్యేకించి యువ వయస్కులను ప్రభావితం చేస్తున్నది. లౌడ్ మ్యూజిక్, ఇతర ఆడియో పరికరాల ద్వారా ఇతర ధ్వనులను సుదీర్ఘంగా, అతిగా వింటే కోలుకోలేని వినికిడిలోపానికి దారి తీస్తుందని ఇటీవలి అధ్యయనాలు చెప్తున్నాయి" అని వివరించారు.

శాశ్వతంగా వినికిడి శక్తిని కోల్పోతే అంతే ఇక

వినికిడి శక్తి లోపాన్ని ముందుగానే గుర్తించి, తగిన చికిత్స తీసుకునేలా చెకప్‌లకు వెళ్లాలని ప్రజలకు సూచించారు. ప్రభుత్వాలు అటువైపుగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఒక్కసారి గనక వినికిడిశక్తి శాశ్వతంగా కోల్పోతే.. హియరింగ్ ఎయిడ్స్ లేదా కోక్లియర్ ఇంప్లాంట్స్ ద్వారా సాధారణ వినికిడి ఎన్నటికీ పునరుద్ధరింపబడదని ఆయన హెచ్చరించారు.

ఏపీలో అధికార అక్రమాలు

ఎంఎల్‌సి ఎన్నికల్లో పలుచోట్ల దౌర్జన్యాలు, పిడిఎఫ్ కార్యకర్తలపై దాడులు
పోలింగ్ కేంద్రాల్లో ఎమ్మెల్యేల హల్‌చల్ • మంగళగిరిలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు కారుపై దాడి
అడ్డుకోబోయిన ఆయన కుమారునిపై, డ్రైవర్‌పైనా జులుం

విజయవాడ : ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార తెలుగుదేశం కూటమి అక్రమాలకు తెగబడింది. పిడిఎఫ్‌కు సానుకూల వాతావరణం నెలకొందన్న వార్తల నేపథ్యంలో ఓటమి భయంతో అడ్డదార్లు తొక్కింది. ఓటర్లను ప్రలోభపెట్టడానికి శక్తిమేర ప్రయత్నించింది. కుదరనిచోట్ల దౌర్జన్యాలు, దాడులకు దిగింది. భయోత్పాతం కలిగించడమే లక్ష్యంగా కొన్ని చోట్ల పిడిఎఫ్ కార్యకర్తలపై దాడులు చేసింది. టిడిపి కూటమి చర్యలతో ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎన్నికల్లో పలు చోట్ల ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నియోజకవర్గంలో మంత్రులు, ఎంఎల్‌ఏల సమక్షంలోనే పెద్దఎత్తున అక్రమాలు, దాడులు చోటుచేసుకున్నాయి. సిట్టింగ్ ఎంఎల్‌సి, ప్రస్తుత పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావును కొన్ని చోట్ల కూటమి శ్రేణులు లక్ష్యంగా చేసుకున్నాయి. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గంలోని పిఠాపురంలో ఓటర్లకు డబ్బులు పంచుతూ ఆ పార్టీ నాయకులు మీడియాకు దొరికారు. పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలిలో మంత్రి నిమ్మల రామానాయుడు, ఉత్తరాంధ్ర టీచర్స్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిం చారు. ఒకవైపు దాడుల పర్వం కొనసాగుతున్నా పెద్ద సంఖ్యలో ఓటర్లు పోలింగ్ స్టేషన్లకు తరలివచ్చారు.

కృష్ణా- గుంటూరు జిల్లాలో...

ఉమ్మడి కృష్ణా -గుంటూరు జిల్లాలో టిడిపి ఎమ్మెల్యేలు దగ్గరుండి తమ అనుయాయులను పోలింగ్ కేంద్రాలకు పంపారు. వారు. మాచర్ల, దుర్గి, కారంపూడి, వెల్దుర్తి, నరసరావుపేట, యడ్లపాడు, చిలకలూరిపేట, పెదకూరపాడు, అమరావతి, బెల్లంకొండ, దుగ్గిరాల, తెనాలి, కొల్లిపర, మంగళగిరి, తాడేపల్లి తదితర ప్రాంతాల్లో భారీగా దొంగ ఓట్లు పోల్‌అయినట్లు సమాచారం.మంగళగిరిలో



పోలింగ్ సరళి పరిశీలనకు వచ్చిన పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి కె.ఎస్ లక్ష్మణరావు కారుపై టిడిపి కూటమి శ్రేణులు దాడులకు దిగాయి. అడ్డుకోబోయిన ఆయన డ్రైవర్ శ్రీనివాస్, లక్ష్మణరావు కుమారుడు అలిస్‌లపైనా దాడి చేసి కొట్టారు. బాపట్లలో దొంగ ఓట్లు అడ్డుకోవడానికి ప్రయత్నించి పిడిఎఫ్ కార్యకర్త ఎస్.అనిల్‌పై దాడిచేశారు దుగ్గిరాలలో 286, 288 కేంద్రాల్లో పిడిఎఫ్ ఏజెంట్లుగా ఉన్న తమను టిడిపి నాయకులు దౌర్జన్యంగా బయటకు లాగేసి దొంగ ఓట్లు వేయించారనిఎం.నరసింహారావు, జి.శ్రీనివాసరావు ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. గుంటూరులోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఎమ్మెల్యేలు బి.రామాంజనేయులు, నశీర్ అహ్మద్ హల్‌చల్ చేశారు. నరసరావుపేటలో పట్టణంలో దొంగ ఓట్లు వేసేందుకు టిడిపి నాయకులు యత్నించగా కొన్ని పోలింగ్ కేంద్రాల్లో పిడిఎఫ్ ఏజెంట్లు అడ్డుకున్నారు. భరంపేట 375వ పోలింగ్ కేంద్రంలోపిడిఎఫ్ ఏజెంట్లకు బయటకు వెళ్లాలని టిడిపి నేతలు హుకుం జారీ చేశారు. ఇందుకు పిడిఎఫ్ ఏజెంట్లు ససేమిరా అనడంతో ప్రజాసంఘాల నాయకులు కొమ్ముల నాగేశ్వరరావుపై దాడికి పాల్పడ్డారు. మరో పిడిఎఫ్ ఏజెంట్‌ను దుర్భాషలాడారు. వెల్దుర్తి, దుర్గిలో పిడిఎఫ్ ఎజెంట్లను టిడిపి వారు బయటకు లాగేశారు. బెల్లంకొండలో పిడిఎఫ్ ఏజెంటుపై దౌర్జన్యం చేశారు. అయితే, పోలీసులు అధికార పార్టీ ఒత్తిడికి తలొగ్గి పిడిఎఫ్ ఏజెంటుపై తప్పు కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. మాచర్ల పట్టణం, వెల్దుర్తి, విజయపురిసౌత్ పోలింగ్ కేంద్రాల్లో పిడిఎఫ్ అభ్యర్థి ఏజెంట్లను మధ్యాహ్నం రెండు గంటలకే దౌర్జన్యంగా బయటకు పంపేశారు. వెల్దుర్తిలో పిడిఎఫ్ ఏజెంటును అనుమతించలేదు. గుంటూరు చలమయ్య కళాశాలలో పిడిఎఫ్ ఏజెంటు కార్తిక్‌పై జనసేన కార్యకర్తలు దౌర్జన్యం చేశారు. విజయవాడ గాంధీజీ మున్సిపల్ హైస్కూలు, భవాని పురంలోని పలు పోలింగ్ బూత్‌లలోకి టిడిపి పశ్చిమ నియోజకవర్గ నేత బుద్దా వెంకన్న దౌర్జన్యంగా ప్రవేశించారు.

పోలింగ్ వివరాలు			
నియోజకవర్గం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	శాతం
కృష్ణ-గుంటూరు (గ్రాడ్యుయేట్)	3,47,116	2,41,502	69.57
ఉమ్మడి గోదావరి జిల్లాల (గ్రాడ్యుయేట్)	3,14,984	2,18,902	69.50
ఉత్తరాంధ్ర జిల్లాలు (ఉపాధ్యాయ)	22,493	20,783	92.40

పిఠాపురంలో ఓటర్లకు డబ్బులు పంపిణీ -వీడియో వైరల్



డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలోని పిఠాపురం పట్టణంలో టిడిపి నాయకులు డబ్బులు పంచుతూ మీడియాకు చిక్కారు. ఆర్‌ఆర్‌బిహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 96, 97, 93 పోలింగ్ బూత్‌లకు అతి సమీపంలోని మున్సిపల్ కల్యాణ మండపంలో టిడిపి పిఠాపురం మండల అధ్యక్షుడు ఎస్.గంగాధర్ ఓటర్లకు స్వయంగా డబ్బులు పంపిణీ చేశారు. బెంగళూరు, హైదరాబాదు, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం తదితర ప్రాంతాల నుంచి ఓటు వేసేందుకు వచ్చిన వారికి నగదు పంపిణీ చేస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో, తహశీల్దార్ పి.గోపాలకృష్ణ, పిఠాపురం సిఐ జి.శ్రీనివాస్ అక్కడికి చేరుకోవడంతో టిడిపి నాయకులు అక్కడి నుంచి జారుకున్నారు. ఈ ఘటనపై తహశీల్దార్ మాట్లాడుతూ తాము వెళ్లేసరికి డబ్బులు పంచుతూ ఎవరూ కనిపించలేదని, అక్కడి వారిని పోలీసులు చెదరగొట్టి కల్యాణ మండపానికి తాళాలు వేశారని తెలిపారు.

యలమంచిలిలో పోలింగ్ బూత్‌ల్లోకి అనుచరులతో మంత్రి నిమ్మల

మంత్రి నిమ్మల రామానాయుడు పశ్చిమగోదావరి జిల్లాలోని యలమంచిలి మండల కేంద్రంలోని 432 పోలింగ్ కేంద్రంలోకి పదుల సంఖ్యలో తన అనుచరులతో వెళ్లి నిబంధనలు ఉల్లంఘించారు. అయినా, పోలీసులుగానీ, ఎన్నికల అధికారులుగానీ అడ్డు చెప్పలేదు.

విశాఖలో పోలింగ్ బూత్‌లో గంటా హల్‌చల్

భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తన అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని చంద్రంపాలెం హైస్కూల్ పోలింగ్ బూత్ నెంబర్ 120లోకి టిడిపికి చెందిన తన అనుచరులతో వెళ్లి హల్‌చల్ చేశారు. అధికార పార్టీ ఎమ్మెల్యే ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి లోపలకు ప్రవేశిస్తున్నా పోలీసులు, అధికారులు ప్రేక్షక పాత్ర పోషించారు.

దాడిని ఖండించిన ఎస్‌ఎఫ్‌ఐ

పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ కార్యకర్తలపై టిడిపి కూటమి కార్యకర్తలు దాడి చేయడాన్ని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. దాడి చేసిన వారిపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆ సంఘం అధ్యక్ష కార్యదర్శులు కె ప్రసన్నకుమార్, ఎ అశోక్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

ఏపీలో టీడీపీ దౌర్జన్యాలపై ఈసీకి ఫిర్యాదు

- పీడీఎఫ్ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావు



గుంటూరు : పట్టభద్రుల ఎన్నికల్లో కూడా దౌర్జన్యం చేయడం ద్వారా ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించే రీతిలో టిడిపి నాయకులు వ్యవహరించారని పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కెఎస్.లక్ష్మణరావు విమర్శించారు. గుంటూరులోని యుటిఎఫ్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో తమ ఏజెంట్లపై దౌర్జన్యం చేశారని, దాడి చేసి కొట్టారని, పల్నాడు జిల్లా వెల్దుర్తిలో పిడిఎఫ్ ఏజెంటును అనుమతించలేదని మాచర్ల, దుగ్గిరాల, దుర్గి ప్రాంతాల్లో తమ ఏజెంట్లను బయటకు పంపి టిడిపి వారు దొంగ ఓట్లువేసుకున్నారని తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లాల్లో ఎమ్మెల్యేలు నేరుగా పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లి దొంగ ఓట్లు వేయించడం వంటి దారుణాలకు తెగబడ్డారని విమర్శించారు. ప్రణాళికాబద్ధంగా దొంగ ఓట్లు వేశారని, మంగళగిరి, తెనాలి తదితర ప్రాంతాల్లో అధికార పార్టీ దౌర్జన్యంగా వ్యవహరించిందని తెలిపారు. సాధారణంగా పట్టభద్రుల ఎన్నికల్లో 60 నుంచి 65 శాతం పోలింగ్ జరుగుతుందని, ఈసారి 70 వరకు జరిగిందని చెప్పారు. అంతేగాక పల్నాడులో కొన్ని ప్రాంతాల్లో 80కిపైగా పోలింగ్ జరిగిందన్నారు. చిలకలూరిపేట ఆర్‌విఎస్ పాఠశాలలో పిడిఎఫ్ ఏజెంటుగా ఉన్న రైతు సంఘం నాయకులు రాధాకృష్ణను బలవంతంగా బయటకు పంపారని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఎవరికి ఓటు వేయాలో ఓటర్లు నిర్ణయించుకుంటారని, ఓటర్లు రాకపోయినా వేరే వారితో దొంగ ఓట్లు వేయించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. టిడిపి అక్రమాలు, దౌర్జన్యాలపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తానని చెప్పారు. కెఎస్.లక్ష్మణరావు చీఫ్ ఎలక్షన్ ఏజెంటు రమేష్ మాట్లాడుతూ బుధవారం నుంచి దౌర్జన్యాలు జరుగుతున్నాయని, ఏజెంట్లుగా కూర్చోనివ్వకుండా పల్నాడులో టిడిపి వారు దౌర్జన్యాలు చేశారని తెలిపారు. మాచర్ల, చిలకలూరిపేట, బాపట్ల తదితర ప్రాంతాల్లో టిడిపి వారు రిగ్గింగ్‌కు పాల్పడ్డారని విమర్శించారు.

తెలియదు.. గుర్తులేదు.. అవునా?

- పోలీసుల విచారణలో పోసాని
- ఓబులవారిపల్లె పోలీసు స్టేషన్‌లోనే పోసానికి వైద్య పరీక్షలు



అన్నమయ్య : వైసిపి నేత, సినీ నటుడు పోసాని కృష్ణమురళిని పోలీసులు అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె పోలీసుస్టేషన్‌కు గురువారం తీసుకొచ్చారు. హైదరాబాద్‌లోని రాయదుర్గంలో మై హోమ్ భూజా అపార్ట్‌మెంట్‌లో మంగళవారం ఆయనను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. పోసానికి వైద్య పరీక్షల అనంతరం ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు, రైల్వేకోడూరు సిఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విచారించారు. పోలీసులు ఏ ప్రశ్న అడిగినా తెలియదు, గుర్తులేదు, అవునా? అంటూ సమాధానాలు దాటవేశారని తెలిసింది. రైల్వేకోడూరు కోర్టులో హాజరుపరిస్తే పోసాని తరపున వాదనలు వినిపించేందుకు సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి రైల్వేకోడూరులోనే ఉన్నారు. పోలీసుస్టేషన్‌లో పోసానిని కలుస్తామని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు, పార్టీ శ్రేణులు పట్టుపట్టడంతో పోలీసులు అడ్డుకున్నారు. పోసాని తరపున వచ్చిన న్యాయవాదులను సైతం అనుమతించలేదు. పోసానిని కలిసేందుకు అనుమతి ఇవ్వకుండా పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆయన తరపు న్యాయవాదులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై హైకోర్టులో రిట్ పిటిషన్ వేస్తామని తెలిపారు. పోలీసు స్టేషన్‌లోనే ప్రభుత్వ వైద్యుడు గురుమహేశ్ ఆధ్వర్యంలో పోసానికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయనకు ఎలాంటి ఆరోగ్య సమస్యలూ లేవని నిర్ధారించారు. కాగా, ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై పోసాని అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ జనసేన నేత జోగినేని మణి రెండు రోజుల క్రితం ఇచ్చిన ఫిర్యాదుపై ఓబులవారిపల్లె పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. గ్రూపుల మధ్య విభేదాలు రెచ్చగొట్టడం, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడం, వ్యవస్థీకృత నేరానికి పాల్పడడం వంటి అభియోగాలపై బిఎన్‌ఎస్‌లోని 196, 353(2), 111 రెడ్‌విత్ 3(5) సెక్షన్ల కేసు నమోదైంది.

పోసాని సతీమణికి జగన్ పరామర్శ

సినీనటుడు, వైసిపి నాయకుడు పోసాని కృష్ణమురళీ అరెస్టును మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఖండించారు. పోసాని భార్య కుసుమలతను ఫోన్‌లో పరామర్శించారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. రాష్ట్రంలో టిడిపి కూటమి పాలన నిరంకుశంగా సాగుతోందని అన్నారు. జరుగుతున్న వ్యవహారాలను ప్రజలు చూస్తున్నారని, కష్టసమయంలో ధైర్యంగా ఉండాలని పేర్కొన్నారు. పార్టీ తరుఫున న్యాయపరంగా సాయం అందిస్తామని, ఇప్పటికే పార్టీకి సంబంధించిన సీనియర్ న్యాయవాదులకు ఈ వ్యవహారాన్ని అప్పగించామని వివరించారు.



బిజినెస్

పీఎంఓకు ఇన్ఫోసిస్ ట్రైనీ ఉద్యోగుల ఫిర్యాదు..!

బెంగళూరు : దేశంలోనే రెండో అతిపెద్ద టెక్ కంపెనీ ఇన్ఫోసిస్ ఇటీవల శిక్షణ పొందుతున్న 400 మంది ట్రైనీలను అనూహ్యంగా తొలగించడంపై వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమను అన్యాయంగా తొలగించారని ట్రైనీ ఉద్యోగులు ప్రధాన మంత్రి కార్యాలయం (పీఎంఓ)కు ఫిర్యాదు చేశారని రిపోర్టులు వస్తోన్నాయి. కర్నాటకలోని మైసూరు క్యాంపస్‌లో శిక్షణ పొందుతున్న ట్రైనీలకు ఉద్వాసన పలకగా.. అందులో దాదాపు 100 మంది పైగా పీఎంఓ కు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించింది. ఈ అంశంలో జోక్యం చేసుకొని తమ ఉద్యోగాలు తిరిగి ఇప్పించాలంటూ ట్రైనీలు కోరినట్లు తెలిసింది. భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా ఆ సంస్థపై తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారని సమాచారం. ఫిబ్రవరి 7వ ట్రైనీలను 50 మందితో కూడిన బ్యాచ్‌లుగా పిలిచి వారితో మ్యూచువల్ సెపరేషన్ లెటర్లపై సంతకాలు చేయించుకుంది. సాయంత్రం 6 గంటల్లోపు 400 ట్రైనీలంతా క్యాంపస్‌ను వీడాలని ఆదేశాలు జారీ చేసింది. ఏకంగా పలువురిని బౌన్సర్లను ఉపయోగించి బయట నెట్టించారనే ఆరోపణలు వచ్చాయి.

గూగుల్ క్లౌడ్‌లో ఉద్యోగులపై వేటు

వాషింగ్టన్ : గూగుల్ తాజాగా తన క్లౌడ్ డివిజన్‌లో పలువురు ఉద్యోగులకు ఉద్వాసన పలికింది. అయితే ఎంతమంది ఉద్యోగులను తొలగించారనేది వెల్లడి కాలేదు. "సంస్థ దీర్ఘకాలిక విజయాల కోసం కంపెనీ కీలకమైన కొన్ని రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని యోచిస్తోంది. ఈ సమయంలో కొన్ని సర్దుబాట్లు చేయాల్సిన అవసరం ఉంది. ఈ కారణంగానే.. కొంతమంది ఉద్యోగులను తొలగించాల్సి వచ్చింది. కస్టమర్ల అవసరాలకు అనుగుణంగా రానున్న రోజుల్లో అవకాశాల్ని అందిపుచ్చుకొనేందుకు అనేక సర్దుబాట్లు చేశాము' అని గూగుల్ ప్రతినిధి వెల్లడించారు. ఇటీవల త్రైమాసిక ఫలితాల్లో గూగుల్ తన క్లౌడ్ వ్యాపారంలో ఆదాయ అంచనాలను అందుకోలేకపోయింది.

చిన్న వ్యాపారాల్లో 27 శాతం మంది మహిళలు

- గోడాడీ వెల్లడి



న్యూఢిల్లీ : దేశంలోని చిన్న వ్యాపారలల్లో పావు వంతు లేదా 27 శాతం కంటే ఎక్కువ మంది మహిళలు ప్రధాన పాత్ర పోశిస్తున్నారని ప్రముఖ డొమైన్ కల్పన సంస్థ గోడాడీ ఓ రిపోర్ట్‌లో పేర్కొంది. ఇందులో 74 శాతం మంది గడిచిన ఐదేండ్లలోనే వ్యాపారాన్ని ప్రారంభించినట్లు తెలిపింది. గోడాడీ 2025 గ్లోబల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సర్వే ప్రకారం.. 90 శాతం మంది మహిళలు తమ సామర్థ్యంపై విశ్వాసం వ్యక్తం చేశారు. పెద్ద కంపెనీలతో పోటీపడాలంటే ఎఐ సహాయపడుతుందని అభిప్రాయపడ్డారు. వచ్చే 3-5 ఏళ్లలో తమ వ్యాపార వృద్ధిపై 81 శాతం మంది ఆశాభావం వ్యక్తం చేశారు.

విత్తయేతర కంపెనీల ఆదాయాల్లో వృద్ధి : ఆర్బీఐ

ముంబయి : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికంలో ప్రయివేటు రంగంలోని ఆర్థికేతర లిస్టెడ్ కంపెనల ఆదాయాల్లో 8 శాతం వృద్ధి చోటు చేసుకుందని ఆర్బీఐ తెలిపింది. ఇంతక్రితం ఏడాది ఇదే సమయంలో 5.5 శాతం పెరుగుదల మాత్రమే ఉన్నట్టు పేర్కొంది. 2024 జులై-సెప్టెంబర్ త్రైమాసికంలో 5.4 శాతం వృద్ధి చోటు చేసుకుందని వెల్లడించింది. గడిచిన డిసెంబర్ త్రైమాసికంలో ప్రయివేటు కార్పొరేట్ రంగం పనితీరుపై 2,924 ఆర్థికేతర లిస్టెడ్ కంపెనీల సంక్షిప్త త్రైమాసిక ఆర్థిక ఫలితాల ఆధారంగా ఆర్బీఐ నివేదిక రూపొందించింది. ఆటోమొబైల్స్, రసాయనాలు, ఆహార ఉత్పత్తులు, విద్యుత్ యంత్రాల పరిశ్రమలలో అధిక అమ్మకాల వల్ల కారణంగా 1,675 లిస్టెడ్ ప్రయివేటు తయారీ కంపెనీల ఆదాయాల్లో 7.7 శాతం పెరుగుదల ఉంది.

మార్చి కల్లా 4వేల ఉద్యోగులను తీసుకుంటాము : ఎస్ఐఎల్‌ఏ

ముంబయి : రియల్ ఎస్టేట్ వేదిక ఎస్ఐఎల్‌ఏ దేశ వ్యాప్తంగా కొత్తగా 50పైగా క్లయింట్లను పొందినట్టు ఓ ప్రకటనలో తెలిపింది. ఇందుకోసం 2025 మార్చి ముగింపు నాటికి కొత్తగా 4000 ఉద్యోగులను నియమించుకోనున్నట్టు ఎస్ఐఎల్‌ఏ డైరెక్టర్ రాఘవ్ కపూర్ తెలిపారు. ప్రస్తుతం 25వేల పైగా ఉద్యోగులను కలిగి ఉన్నామన్నారు. గత 45 రోజుల్లో అనేక కంపెనీలు తమ సేవల కోసం ఆశ్రయించాయన్నారు. దేశ వ్యాప్తంగా 20 కోట్ల చదరపు అడుగుల ప్రాపర్టీలను నిర్వహిస్తోన్నామన్నారు.

తెలంగాణలోకి డిప్లోస్ మాక్స్ ఈ-స్కూటర్ విడుదల

- తెలుగు రాష్ట్రాల్లో 40 డీలర్‌షిప్‌లు
- న్యూమెరస్ మోటార్స్ వెల్లడి

నవ తెలంగాణ - బిజినెస్ బ్యూరో

న్యూమెరస్ మోటార్స్ తన విక్రయాలను తెలుగు రాష్ట్రాలకు విస్తరించింది. ఈ విద్యుత్ ద్విచక్ర వాహనాల తయారీ కంపెనీ తమ మల్టీయుటిలిటీ ఈ-స్కూటర్, డిప్లోస్ మాక్స్‌ను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మార్కెట్లోకి విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. గురువారం హైదరాబాద్‌లో దీన్ని న్యూమెరస్ ఇండియా ఇంజినీరింగ్ వైస్ ప్రెసిడెంట్ సౌందరరాజన్ ఆవిష్కరించారు. 2026 మార్చి ముగింపు నాటికి తెలుగు రాష్ట్రాల్లో 40 డీలర్‌షిప్‌లకు విస్తరించనున్నట్టు సౌందరరాజన్ మీడియాతో వెల్లడించారు. ప్రస్తుతం తెలంగాణ, ఏపీలో మూడు అవుట్‌లెట్‌లు ఉన్నాయన్నారు. దేశ వ్యాప్తంగా 40 డీలర్‌షిప్‌లను కలిగి ఉన్నామని.. వచ్చే ఏడాది మార్చి నాటికి 170 అవుట్‌లెట్‌లకు విస్తరించనున్నామని చెప్పారు. నాలుగేండ్ల నుంచి పలు పరీక్షల



తర్వాత డిప్లోస్ మ్యాక్స్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. వచ్చే జూన్‌లో మరో క్రాస్‌ఓవర్‌ను విడుదల చేయడానికి కసరత్తు జరుగుతోందన్నారు. 2027లో ఇవి త్రిచక్ర వాహనాన్ని అందుబాటులోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. డిప్లోస్ మాక్స్ హైదరాబాద్ ఎక్స్‌షోరూం ధరను రూ.1,12,199గా నిర్ణయించామన్నారు. ఇందులో రెండు బ్యాటరీలను ఉపయోగించామన్నారు. ఒక్క సారి చార్జింగ్‌తో 140 కిలోమీటర్ల మేర ప్రయాణించవచ్చన్నారు.